ఈనాడు

కరీంనగర్ 12-8-2017 శనివారం సిటీ సంపుటి 44 సంచిక 3

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 20+16

www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi




ON SALE
ఎలెక్ట్రానిక్స్
Apple iPhone 7 (32GB)
₹56,200 ₹43,999
OnePlus 5 (64GB, 6GB RAM)
₹32,999
LG Q6
New
₹14,990
BPL 101 cm (40) Full HD LED TV
₹29,990 ₹21,990
Whirlpool 245 Ltrs Frost-Free Refrigerator
Save ₹3,810
No Cost EMI starting ₹1500**
Skullcandy Earphones
₹1,999 ₹1,299
7th Gen i5 Laptops
Starting at ₹40,990 ₹38,990
JBL GO Wireless Bluetooth Speaker
₹3,490 ₹1,899
SanDisk 16GB Pen Drive
₹540 ₹349
Intex Power Banks
MIN 50% OFF
amazon.in
ఫ్యాషన్
క్లాథింగ్
MIN 50% OFF
LEVI'S
GAP
JACK & JONES
MARKS & SPENCER
షూస్
MIN 50% OFF
REDTAPE
Reebok
FILA
lotto
Clarks
హ్యాండ్ బ్యాగ్స్ మరియు సన్‌గ్లాసెస్
40-80% OFF
MTV
LAVIE
Baggit
CAPRESE
fastrack
బ్యూటీ
MIN 20% OFF
L'ORÉAL PARIS
LAKMÉ
MAYBELLINE NEW YORK
మరిన్ని ఆఫర్లు
Livpure Glo 7-Litre RO + UV + Mineralizer Water Purifier
₹15,490 ₹9,699
Philips 2100-Watt Induction Cooktop
₹4,695 ₹2,299
Cello H2O Unbreakable Bottle (1 Ltr, Set of 3)
₹435 ₹295
Orpat Iron
₹680 ₹359
బెడ్ షీట్స్
MIN 40% OFF
Bombay Dyeing
Raymond Home
SPACES
SWAYAM
డైపర్స్
MIN 30% OFF
MamyPoko pants
Pampers pants
HUGGIES
Wall Stickers
₹99
Cello Stainless Steel Flask (1 Ltr)
₹991 ₹640
Solimo Comforters
MIN 50% OFF
Ganesh Chopper & Cutter
₹610 ₹215
Princeware Plastic Bowl Container Set (5 pc)
₹301 ₹101
Optimum Nutrition
₹7,699 ₹5775
Car Fragrances & Accessories
MIN 20% OFF
amazon.in
10 గంటలు వాలెట్ క్యాష్‌బ్యాక్
అందజేసిన వారు GOOMO
NO-COST EMI**
Buy now, pay later in installments
అదనపు క్యాష్‌బ్యాక్*
15% యాప్ పై | 10% సైట్ పై
SBI Debit Card
SBI Card Make life simple
AMAZON APP ని ఇప్పుడే డౌన్‌లోడ్ చేసుకోండి.
ప్రతిరోజు రాత్రి 9గంటలకు గోల్డెన్ అవర్ డీల్స్
amazon.in



ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 12-8-2017 శనివారం సిటీ సంపుటి 44 సంచిక 3

రూ. 5-00. పేజీలు 20+16

www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



పేదల గొంతు వినిపించాలి

- సామాన్యుల ఆకాంక్షలను నెరవేర్చడమే మన ప్రథమ లక్ష్యం
- సద్వినియోగం చేసుకుంటే సమయానికి కొదవ లేదు
- నేను ఇప్పుడు అందరి వ్యక్తిని
- పార్టీ రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తా
- రాజ్యసభాధ్యక్షుడిగా వెంకయ్యనాయుడు తొలి ప్రసంగం

ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం

- దర్బారు హాలులో కార్యక్రమం
- పాల్గొన్న అతిరథ మహారథులు
- వెంకయ్య సామర్థ్యాన్ని కొనియాడిన వక్తలు

పూర్తి వివరాలు 14, 15 పేజీల్లో



శుక్రవారం ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం రాజ్యసభ అధ్యక్ష స్థానంలో కూర్చొని సభను నిర్వహిస్తున్న వెంకయ్యనాయుడు

‘1998లో తొలిసారి ఈ సభలో ప్రవేశించినప్పుడు ఈ సభకు నేను నేతృత్వం వహించే రోజు వస్తుందని ఊహించలేదు. ఇదే మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య గొప్పతనం. నామీద విశ్వాసం ఉంచి ఇంత గురుతర బాధ్యతలు అప్పగించిన అందరికీ ధన్యవాదాలు. ఇక మీదట నేను అన్ని పార్టీల వ్యక్తిని. నిష్పక్షపాతంగా పనిచేస్తా. భారత్ ముందుకెళ్తోంది. ప్రభుత్వ కార్యకలాపాలను యువతరం నిశితంగా పరిశీలిస్తోంది. వారి ఆకాంక్షలను నెరవేర్చేలా మన పనితీరు ఉండాలి’

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

అత్యున్నత పదవుల్లో అత్యంత సామాన్యులు

వెంకయ్య పదవికి వన్నెతెస్తారు: ప్రధాని



పసిప్రాణాలను చిదిమేశారు

- బకాయిలు చెల్లించలేదని ఆసుపత్రిలో ఆక్సిజన్ సరఫరా ఆపేసిన సంస్థ
- యూపీలో 30 మంది చిన్నారుల మృతి • గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో దారుణం



ఆ ఇంటి దీపాలు ఆరిపోయాయి.. అత్యవసర వైద్యానికి ఆసుపత్రికి వెళ్లిన పసి ప్రాణాలు ఓ అమానవీయ చర్యకు అమాయకంగా బలయిపోయాయి. వైద్యశాలకు ఆక్సిజన్ సరఫరా చేస్తున్న సంస్థ తమ బకాయిల వసూలు కోసం ఆక్సిజన్ నిలిపివేయడంతో మెదడువాపు వ్యాధికి అత్యవసర చికిత్స పొందుతున్న 30 మంది చిన్నారులు చనిపోయారు. బిడ్డలను వైద్యం కోసం తీసుకొచ్చిన తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చిన ఈ ఘటన యూపీలోని గోరఖ్‌పూర్‌లో జరిగింది. 9వ తేదీ అర్ధరాత్రి దాటినప్పటి నుంచి పిల్లలు ఒక్కొక్కరుగా నేలరాలిపోయారు.

-18లో



రుణ మాఫీతో అనర్థాలు

- ధరలు పతనమవుతాయి • డిమాండు తగ్గుతుంది
- వ్యవసాయ సమస్యలపై దృష్టిసారించాలి
- ఈ ఏడాది 7.5 శాతం వృద్ధిరేటు కష్టమే
- విద్య, ఆరోగ్య రంగాలకు మరిన్ని నిధులు అవసరం
- మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి • నొక్కిచెప్పిన ఆర్థిక సర్వే

-5లో



LOWE LINTAS... SAATCHI & SAATCHI

TG



HDFC BANK
PRESENTS
BIG BAZAAR
5 రోజుల మహా పొదుపు
12-16 ఆగస్టు
₹2000 మరియు ఆపైన షాపింగ్ చెయ్యండి
ఫ్యూచర్ పే వ్యాలెట్‌లో ₹500 ల నగదు పొందండి
+
HDFC బ్యాంక్స్ కార్డ్స్ ఇన్‌స్టంట్ డిస్కౌంట్ 7%
ఆహార వస్తువుల పైన మహా పొదుపు
₹989 ₹1990 అగ్రి ప్యూర్ సోనా మసూరి ఎకానమీ బియ్యం (25 కిలోలు)
₹777 ₹1035
₹62 ₹73 (1 కిలో)
పర్సనల్ కేర్ పైన మహా పొదుపు
₹340 ₹450 రిన్ అడ్వాన్స్‌డ్ డిటర్జెంట్ పౌడర్ (6 కిలోలు)
TOILET
₹85 ₹360 బూస్ట్ (750 గ్రా.)
₹25 ₹67
35% తగ్గింపు ₹930-₹1049
₹150 తగ్గింపు ₹360-₹485
₹1699 ₹3410 Prestige
గృహ అవసరాలు పైన మహా పొదుపు
₹3999* ₹4999 ₹11830
లగేజ్ మరియు బొమ్మల పైన మహా పొదుపు
60% తగ్గింపు ₹4998
₹1399 ₹2695 Larah
₹799 ₹1999
₹299 MILTON ₹490
ఎలక్ట్రానిక్స్ పైన మహా పొదుపు
₹1249
₹7490* ₹8990 ₹15000 KORYO
₹11490* ₹12990 ₹19990 KORYO 32 (80 సెం.మీ) HD LED టీవీ 2 HDMI, 2 USB
గృహ అలంకరణ పైన మహా పొదుపు
50% తగ్గింపు ₹799
60% తగ్గింపు ₹1199/₹1299 DREAMLINE
₹888 ₹3090 dreamline
ఫుట్‌వేర్ పైన మహా పొదుపు
₹899 ₹1299/₹1899 umbro
NEVER BEFORE
fbb INDIA'S FASHION HUB
ఫ్లాట్ 50% తగ్గింపు
www.fbbonline.in
ఉదయం 9 గంటలకే గేట్స్ తెరవబడును
7% Additional Discount
HDFC BANK We understand your world
future pay
FOOD BAZAAR
BIG BAZAAR
ఇండియాని చేస్తుంది బ్యూటిఫుల్
/bigbazaar @bigbazaar /big.bazaar
bigbazaar.com 1800 200 2255

ఇదీ సంగతి!



ఆరు జిల్లాల్లో కొత్త కలెక్టరేట్లకు స్థలాలు

- నెలాఖరులోగా ఖరారు
- ముగ్గురు నిపుణులతో కమిటీ
- క్షేత్రస్థాయి పరిశీలనలతో నివేదికలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఆరు జిల్లాలకు కొత్త కలెక్టరేట్ల నిర్మాణానికి స్థలాల ఎంపికను నెలాఖరులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ముగ్గురేసి నిపుణులతో కూడిన ఎంపిక కమిటీని నియమించింది. కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా వరంగల్ గ్రామీణ జిల్లా, రాజన్న సిరిసిల్ల, యాదాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, మహబూబ్‌నగర్‌లకు కొత్త కలెక్టరేట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటికోసం వెంటనే స్థలాలను ఖరారు చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేకపోవడం, భూ వివాదాలు తదితర కారణాల వల్ల అక్కడ ఎంపిక జరగలేదు. వరంగల్ గ్రామీణ జిల్లాకు మూడు స్థలాలను అధికారులు ఎంపిక చేశారు. వీటిపై ప్రజాప్రతినిధుల మధ్య విభేదాలతో తుది నిర్ణయం తీసుకోలేదు. మహబూబాబాద్‌కు జిల్లా కేంద్రంలోని ఒక తండాలో భూమిని ఎంపిక చేయగా, అది అసైన్డ్‌గా తేలింది. మహబూబ్‌నగర్‌లో జాతీయ రహదారికి సమీపంలోని స్థలాన్ని గుర్తించారు. యాదాద్రి కొత్తగూడెం జిల్లాకు స్థానికంగా 60 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. సిరిసిల్లలోనూ బైపాస్ రోడ్డు వద్ద స్థలానికి మంత్రి కేటీఆర్ ఆమోదం తెలిపారు కానీ తుది ఎంపిక జరగలేదు. సూర్యాపేట జిల్లాలో ప్రస్తుత కలెక్టరేట్‌కు సమీపంలో స్థలం ఉంది. దీనిని ఖరారు చేయాల్సి ఉంది.

సీఎం ఆదేశాలతో...: ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల కలెక్టరేట్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఆరు జిల్లాల్లో సమస్యలు తెలిశాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ నెలాఖరు వరకు స్థలాల ఎంపికలు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. దీనికి అనుగుణంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ దీనిపై ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ ఆరు జిల్లాల్లోనూ వివాదాలను పరిష్కరించి, అన్ని విధాలా అర్హత గల స్థలాల్ని ఎంపిక చేయాలని నిర్ణయించారు. స్థలాల ఎంపిక కోసం వాస్తు నిపుణుడు, ఆర్కిటెక్ట్, జియాలజిస్టులతో కూడిన కమిటీని నియమించారు. ఈ కమిటీ ఆరు జిల్లాలను సందర్శించి, కలెక్టర్లు ఎంపిక చేసిన స్థలాలను పరిశీలించి అన్ని అర్హతలుగల వాటిని ఎంపిక చేసి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదిక ఇస్తుంది. దీనిని సీఎస్ సీఎంకు అందజేస్తారు. సీఎస్ ఆరు జిల్లాల కలెక్టర్లతో దూరదృశ్య సమీక్ష నిర్వహించి, యుద్ధప్రాతిపదికన స్థలాల ఎంపిక జరగాలని ఆదేశించారు.

7,119 మందికి డీఈడీ సీట్లు కేటాయింపు

ఈనాడు, హైదరాబాద్: రెండేళ్ల డీఈడీ కోర్సులో ప్రవేశానికి 7,119 మందికి సీట్లు కేటాయించినట్లు కో-కన్వీనర్ శేషకుమారి తెలిపారు. వీరికి ఆగస్టు 18 నుంచి క్లాసులు మొదలవుతాయి.

17 నుంచి సార్వత్రిక విద్య ప్రవేశాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పది, ఇంటర్‌లో ప్రవేశాలు పొందేందుకు ఈనెల 17 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని సంచాలకుడు బాలయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 17న ప్రవేశ ప్రకటన జారీ అవుతుందని, ఆ రోజు నుంచి సెప్టెంబరు 4వరకు రుసుం చెల్లించవచ్చన్నారు. ఆలస్య రుసుంతో సెప్టెంబరు 5 నుంచి 14 వరకు ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవచ్చు. దరఖాస్తులను మీ-సేవ ద్వారా సెప్టెంబరు 21 వరకు సమర్పించవచ్చు. వివరాలకు ఆయా జిల్లాలోని డీఈఓలను సంప్రదించాలని, లేదా www.telanganaopenschool.org వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు.

జీపీఎఫ్, ఇతర పొదుపు ఖాతాలపై వడ్డీ రేటు ఖరారు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో జీపీఎఫ్, ఇతర పొదుపు, బీమా ఖాతాలకు వడ్డీ రేట్లను రాష్ట్ర ఆర్థిక శాఖ ఖరారు చేసింది. 207-18 ఆర్థిక సంవత్సరానికి వర్తించే వడ్డీరేట్లను నిర్ణయిస్తూ రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్.శివశంకర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. జీపీఎఫ్, విద్యుత్‌శాఖ ప్రావిడెంట్ ఫండ్, అత్యవసర, విధిగా పొదుపు ఖాతాలు, ప్రభుత్వ డిస్టిలరీ ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్, తెలంగాణ ప్రభుత్వ జీవిత బీమా నిధి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ నిధికి ఈ ఉత్తర్వులు వర్తిస్తాయన్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్ 1నుంచి నుంచి జూన్ 30వరకు 7.9శాతం, జులై ఒకటి నుంచి సెప్టెంబర్ 30వరకు 7.8శాతం వడ్డీరేటు ఉంటుందని వివరించారు.

డీఎస్సీపై 17న తుది నిర్ణయం!

ఈనాడు, హైదరాబాద్: డీఎస్సీ నిర్వహణపై సందిగ్ధత కొనసాగుతున్న నేపథ్యంలో ఈనెల 17న ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. కొత్త జిల్లాల ప్రకారం 8,792 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీన్ని కొందరు సమర్థిస్తుంటే.. దానివల్ల కొన్ని జిల్లాల్లో పోస్టులు అతి స్వల్పంగానే ఉంటాయని, పాత జిల్లాల ప్రకారమే జరపాలని కొందరు కోరుతున్నారు. దీంతో సాధారణ పరిపాలనశాఖ, న్యాయశాఖ విభాగాల అధికారులతో సంప్రదింపులు జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. విద్యార్హతలకు సంబంధించి జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి మార్గదర్శకాలను పరిశీలించనుంది.

మూడు రోజుల దాకా వర్షాలు తక్కువే

ఈనాడు, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు తెలంగాణ నుంచి ఉత్తరాది రాష్ట్రాల మీదుగా హిమాలయాల వైపు సాగిపోవడంతో ఇక్కడ వర్షాలు బాగా తగ్గుముఖం పట్టాయి. వర్షాకాలంలో ఇలా రుతు పవనాల కదలికలు సహజమే. శనివారం నుంచి సోమవారం దాకా రాష్ట్రంలో పెద్దగా వర్షాలు పడకపోవచ్చని, అక్కడక్కడ జల్లుల నుంచి ఒక మాదిరిగా వర్షం కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు వై.కె.రెడ్డి చెప్పారు. గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో 348 చోట్ల వర్షాలు కురిశాయి. అత్యధికంగా గుండాల(భద్రాద్రి జిల్లా)లో 6సెంటీమీటర్లు, మణుగూరు, ఏన్కూరుల్లో 4 సెం.మీ.ల చొప్పున వర్షం కురిసింది. హైదరాబాద్ గాలిలో సాధారణంకన్నా 12 శాతం వరకు తేమ తక్కువగా ఉంది.

ప్రపంచ స్టాక్‌మార్కెట్లలో రూ.64 లక్షల కోట్లు నష్టం

లండన్: ఉత్తర కొరియా, అమెరికాల మధ్య మాటలయుద్ధంతో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ స్టాక్‌మార్కెట్లలో రూ.64 లక్షల కోట్ల మేర నష్టం వాటిల్లింది. తాజా పరిణామాలతో ఐరోపా షేర్లు మూడోరోజూ పడిపోయాయి. వాల్‌స్ట్రీట్‌లోనూ తిరోగమనం కనిపించింది. ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన తర్వాత మరోసారి మార్కెట్లు పడ్డాయి. సెలవు కారణంగా జపాన్ మార్కెట్లు మూసిఉండగా, యెన్ తన బలాన్ని చాటింది. స్విస్ ఫ్రాంక్ కూడా లాభపడింది. బాండ్ మార్కెట్లో అమెరికా, జర్మనీ ప్రభుత్వ బాండ్లు అత్యధిక ధరలకు ట్రేడయ్యాయి. ఆస్ట్రేలియా షేర్లు 1.3 శాతం నష్టపోగా, చైనా, హాంకాంగ్ బ్లూచిప్స్ 1.6, 1.9 శాతంమేర నష్టపోయాయి.

ఒప్పంద ఉద్యోగుల సేవలను కొనసాగించండి: హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: సమాచార హక్కు(స.హ)చట్ట కమిషన్‌లోని ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సేవల్ని ఈనెల 16 నుంచి కొనసాగించాలని, వారికి 58:42 నిష్పత్తిలో వేతనం చెల్లించాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిల ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీచేసింది. స.హ కమిషన్ ఏర్పాటు చేయలేదన్న కారణంతో ఉద్యోగులను రోడ్డున పడేయడం సరికాదని ఏపీ ప్రభుత్వ న్యాయవాదిని ఉద్దేశించి వ్యాఖ్యానించింది. తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగుల మాదిరే తమనూ కొనసాగించాలని అభ్యర్థిస్తూ స.హ కమిషన్లో సేవలు అందించిన పలువురు హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం ఈ వాజ్యంపై జరిగిన విచారణలో తెలంగాణ అడ్వొకేట్ జనరల్(ఏజీ) డి.ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ పొరుగు సేవలు, ఒప్పంద ఉద్యోగులను విధుల్లోకి తీసుకుంటామన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్నట్లు వారికి 58:42 నిష్పత్తిలో రెండు రాష్ట్రాలు జీతాలు చెల్లించాలన్నారు. ఏపీ సర్కారు తరఫున ప్రభుత్వ న్యాయవాది(జీపీ) వాదనలు వినిపిస్తూ.. ఏపీకి స.హ చట్ట కమిషన్ లేదంటూ పిటిషనర్లను విధుల్లోకి తీసుకోవడానికి అభ్యంతరం చెప్పారు. ఆ వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం.. ఆరు వారాల్లో ప్రధాన సమాచార కమిషనర్, ఇతర కమిషనర్లను నియమించాలని ఇటీవల ఉత్తర్వులు జారీచేశామని గుర్తుచేసింది. కమిషన్ ఏర్పాటు చేయలేదన్న కారణంతో సిబ్బంది సేవలను నిరాకరించడం సరికాదని స్పష్టం చేసింది.

హోం గార్డులను ప్రత్యేక పోలీసు సహాయకులుగా క్రమబద్ధీకరించాలి

- హోంశాఖ ముఖ్య కార్యదర్శికి రాష్ట్ర హోంగార్డుల సంఘం వినతి

ఈనాడు, హైదరాబాద్: హోంగార్డులను ప్రత్యేక పోలీసు సహాయకులుగా క్రమబద్ధీకరించాలని తెలంగాణ హోంగార్డుల సంఘం గౌరవాధ్యక్షుడు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే వి.శ్రీనివాస్‌గౌడ్ హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్‌త్రివేదిని కోరారు. వేతనాల పెంపు, ఉద్యోగభద్రత, ఆరోగ్యభద్రత ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. సంఘాధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, ఇతర నేతలు శుక్రవారం సచివాలయంలో త్రివేదికి వినతిపత్రం సమర్పించారు. 3గంటల పాటు హోంగార్డులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో వేలమంది హోంగార్డుల పరిస్థితి దయనీయంగా ఉందని, వారికి అన్ని విధాలా ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. సీఎం కేసీఆర్ వారి పరిస్థితిపై ఆవేదన వ్యక్తంచేస్తూ క్రమబద్ధీకరణకు హామీ ఇచ్చారన్నారు. దీనికి అనుగుణంగా అధికారులు సహకరించాలన్నారు. రెండు పడక గదుల ఇళ్ల పథకంలో 2శాతం ఇళ్లను కేటాయించాలన్నారు. రాజీవ్‌త్రివేది మాట్లాడుతూ, హోంగార్డుల సమస్యలపై వారంలోగా డీజీపీ నుంచి ప్రతిపాదనలు తెప్పించి, రాజ్యాంగ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కశ్మీర్ 'హోదా' ఉమ్మడి అజెండాలో భాగమే!

- శతశాతం అమలుకు ప్రధాని హామీ : మెహబూబా

దిల్లీ: జమ్మూ-కశ్మీర్‌లో పీడీపీ-భాజపా ప్రభుత్వ ఉమ్మడి అజెండా అమలుకు ప్రధాని మోదీ నూరుశాతం హామీ ఇచ్చినట్లు ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ శుక్రవారం తెలిపారు. స్వతంత్ర ప్రతిపత్తి హోదాను కల్పించే ఆర్టికల్ 370 జోలికి పోమన్నది అజెండాలో భాగమన్నారు. రాజ్యాంగ హోదాపై యథాతథ స్థితిని కొనసాగించేందుకు హామీ ఏమైనా లభించిందా? అన్న ప్రశ్నకు మాత్రం నేరుగా సమాధానం ఇవ్వడానికి ఆమె నిరాకరించారు. కశ్మీర్ ప్రత్యేక హోదాకు వ్యతిరేకంగా ప్రయత్నాలు జరుగుతున్న వేళ.. ప్రధాని సహకారాన్ని ముఖ్యమంత్రి కోరుతున్నట్లు వార్తలొస్తున్న నేపథ్యంలో - ఆమె మోదీతో భేటీ అయ్యారు. 15 నిముషాల పాటు సమావేశం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆర్టికల్ 370ని మార్చడం వంటివేమీ చేయబోమన్న ప్రధాన అంశంపైనే తమ ఉమ్మడి అజెండా తయారైందని.. దీనికి తామెవరం (పీడీపీ, భాజపా) వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. భేటీ సందర్భంగా తాను లేవనెత్తిన అంశాలపై ప్రధాని సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. గత ఏడాది రాష్ట్రంలో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయని.. ఆ గాయాల నుంచి కోలుకుంటున్నతరుణంలో తాజా పరిణామాలు ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలంతా తమ ఉనికి ప్రమాదంలో పడుతుందేమోనని ఆందోళన చెందుతున్నారని. . ప్రత్యేక హోదా కొనసాగుతుందన్న సందేశాన్ని కేంద్రం ఇవ్వాలని ప్రధానిని కోరినట్లు మెహబూబా తెలిపారు.

ఉగ్రవాదంపై పోరులో రోబోలు

- కశ్మీర్‌లో దించనున్న సైన్యం

దిల్లీ: కశ్మీర్‌లో ఉగ్రవాదులతో పోరాడేందుకు భారత సైన్యం.. రోబోలను దించబోతోంది. ఈ మేరకు 544 మరమనుషులు అవసరమంటూ సైన్యం పంపిన ప్రతిపాదనకు రక్షణ మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. స్వదేశీ పరిజ్ఞానంతో ఈ రోబోలను రూపొందిస్తారు. సైనిక మార్గదర్శకాల ప్రకారం.. నిర్దేశిత ప్రాంతానికి మందుగుండు సామాగ్రిని ఇవి చేర్చాల్సి ఉంటుంది. సైనికులు రంగ ప్రవేశం చేయడానికి ముందు.. సదరు ప్రదేశానికి సంబంధించిన పూర్తి వివరాలను అప్పటికప్పుడే అందించగలగాలి. తక్కువ బరువును కలిగి ఉండటంతో పాటు సంక్లిష్ట భూభాగాల్లోనూ సేవలు అందించాలి. వీటిలో నిఘా కెమెరాలు ఉండాలి. ఉగ్రవాద పడగ.. అడవుల నుంచి గ్రామాలకు, పట్టణాలకు విస్తరించిన నేపథ్యంలో ఇలాంటి యంత్రాలు అవసరమని సైన్యం భావిస్తోంది. ప్రస్తుతం.. పేలుడు పదార్థాల పరిశీలనకు సైన్యం 'దక్ష్' అనే యంత్రాన్ని ఉపయోగిస్తోంది.

'గురుబ్రహ్మ'లను తీర్చిదిద్దలేమా?

రేపటి పౌరుల మేలిమి భవితవ్యానికి నాణ్యమైన ప్రాథమిక విద్యే గట్టి పునాది. బడిపిల్లల అభ్యసన సామర్థ్యానికి పదును పెట్టి వారిని వజ్రాల్లా సానపట్టేలా బోధన గరపడం దక్షతగల ఉపాధ్యాయుల గురుతర విధి. పాఠశాలల్లో మేలిమి బోధన సాగాలంటే గురువులు శిక్షణ పొంది తీరాల్సిందేనంటూ విద్యాహక్కు చట్టాన్ని కేంద్రం ఇటీవల సవరించడం తెలిసిందే. ఆ చట్టం స్ఫూర్తికి పట్టం కట్టడంలో భాగంగా రాష్ట్రాలకిప్పుడు నిర్దిష్ట ఆదేశాలు అందాయి. వాటి ప్రకారం- ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రాథమిక తరగతులకు బోధించే ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా డీఈడీ (ప్రాథమిక విద్యాబోధనలో డిప్లొమా) చేసి ఉండాలి. ఇంటర్‌లో కనీసం 50శాతం మార్కులూ వచ్చి ఉండాలి. ఈ 'అర్హతలు' లేకుండానే బోధిస్తున్న సిబ్బంది ఈ సంవత్సరం సెప్టెంబరు 15లోగా డీఈడీ కోర్సుల్లో చేరి, అది పూర్తయ్యేలోగా ఇంటర్ మార్కులూ సాధించి తీరాలి! ప్రాథమిక స్థాయి బోధన సిబ్బంది సుమారు 66 లక్షల్లో దాదాపు 11లక్షల మంది ప్రామాణిక అర్హతలు, శిక్షణ లేని వారేనని రాష్ట్రప్రభుత్వాలు కేంద్రానికి ప్రమాణ పత్రాలు సమర్పించాక మొదలైన దిద్దుబాటు చర్యల్లో తాజా మలుపిది. నిర్దేశిత అర్హతలు సమకూర్చుకున్నట్లు ఉపాధ్యాయులు రుజువులు చూపించినంతనే బోధన ప్రమాణాలు అమాంతం మెరుగుపడిపోతాయనుకునే వీల్లేదు. కొలువు కొనసాగడానికి ఫలానా సర్టిఫికెట్టే కీలకమన్న దశలో- పుంఖానుపుంఖంగా వెలసిన కళాశాలల్లో అవకతవకలు రెచ్చిపోకుండా ఉంటాయా? 2019 మార్చి మాసాంతానికి ఉపాధ్యాయుల్లో ప్రతిఒక్కరూ శిక్షణ పొంది తీరాల్సిందేనంటున్న కేంద్రప్రభుత్వం, అందుకు అవసరమైన వ్యవస్థాగత ఏర్పాట్లనూ ఉరకలెత్తించాలి. మహారాష్ట్ర లాంటిచోట్ల 75 శాతానికిపైగా ప్రాథమిక పాఠశాలల్లో గురువులకు నిర్దేశిత అర్హతలు లేవంటున్నప్పుడు- ఫలానా గడువులోగా అర్హతల సాధనకు విధించే షరతు అవకతవకల బాగోతాలకు అంటుకట్టకుండా వెయ్యికళ్లతో కాచుకోవాలి!

మానవ వనరులపై పెట్టుబడులు పెంచితేనే జాతి ఉత్పాదకత ఇతోధికమవుతుందన్న కేంద్ర ఆర్థిక సర్వే- సుశిక్షిత, వృత్తినైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల ఆవశ్యకత గురించి చెప్పింది ప్రత్యక్షసత్యం. ఆ మేరకు విస్తృత కార్యాచరణను పట్టాలకు ఎక్కించడానికి ప్రభుత్వపరంగా చేయాల్సింది ఎంతో ఉందన్నది యథార్థం! పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బీఈడీ కళాశాల నియంత్రణకు జాతీయస్థాయి ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించాలన్న యోచన ఇటీవల వినవచ్చింది. దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఈ విద్యాసంవత్సరం కొత్తగా బీఈడీ, డీఈడీ కళాశాలలకు అనుమతి ఇవ్వరాదని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ నిర్ణయించింది. దక్షిణాది చాలా కళాశాలలు కేవలం కాగితాలపైనే ఉన్నట్లు, భారీ లంచాల మేతతో అనుమతుల పందేరం జోరుగా సాగినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో, ప్రస్తుతానికి గేట్లు మూసేశామంటున్నారు. ఎంబీఏ, ఎంసీఏ, ఇంజినీరింగ్ కోర్సులు నిర్వహిస్తున్న కళాశాలలకు అనుబంధంగా బోర్డులు పెట్టి తూతూమంత్రంగా ఉపాధ్యాయ శిక్షణ అందిస్తున్న బాగోతాలకు కొదవ లేదు. నూతనంగా అనుమతులివ్వడాన్ని ఆపేసినంత మాత్రాన అవ్యవస్థ దానంతటది తుడిచిపెట్టుకుపోదు. ఉన్న కళాశాలలన్నీ నిబంధనల అనుసారం సకలవిధ ప్రమాణాలతో పరిపుష్టమయ్యేలా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి. ప్రాథమిక తరగతులకు బోధించాలంటే టెట్ (ఉపాధ్యాయ ప్రవేశ పరీక్ష) మొదటి 'పేపర్‌'లో అర్హులై తీరాలన్న విద్యాహక్కు చట్టం నిర్దేశం ప్రైవేటు పాఠశాలల్లో అమలుకు నోచుకోకపోవడం పైనా విధాన నిర్ణేతలు దృష్టి సారించాలి. జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) వచ్చే జనవరి నుంచి తొలి వంద ఉత్తమ సంస్థల్ని ఎంపికచేసి ప్రకటిస్తామంటోంది. కొన్ని అనేముంది- ప్రతి ఉపాధ్యాయ శిక్షణ సంస్థా ఆణిముత్యమైతేనే, ప్రాథమిక విద్యాప్రమాణాల్లో స్థిరవృద్ధి సాధ్యపడుతుంది!

వృత్తినిబద్ధత, చిత్తశుద్ధి కలిగినవారిని బోధన స్థానాల్లో ప్రతిష్ఠించడం ఒకెత్తు, నిరంతర శిక్షణతో వారి ప్రతిభను మెరుగులు దిద్దుతుండటం మరొకెత్తు. ఆ రెండింటా చైనా, హాంకాంగ్, జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్ ప్రభృత దేశాల విశేష కృషి, ప్రత్యేక శ్రద్ధ అమేయ మానవ వనరుల్ని సృజియిస్తున్నాయి. అద్భుత ఫలితాలు రాబడుతున్నాయి. దక్షిణ కొరియా గరిష్ఠ వేతనాలు సమకూరుస్తూ అపార ప్రజ్ఞావంతుల్ని బోధన రంగంలోకి ఆహ్వానిస్తోంది. ఫిన్లాండ్‌లో ఉపాధ్యాయులు బోధనకు వెచ్చించే సమయానికన్నా అధికంగా స్వీయశిక్షణకు కేటాయించగల వెసులుబాటు, ప్రమాణాల ఉన్నతికి దోహదపడుతోంది. దేశీయంగా కొఠారీ కమిషన్, చటోపాధ్యాయ కమిటీ, యశ్‌పాల్ కమిటీ వంటివెన్నో పొందుపరచిన సిఫార్సులకు అనుగుణంగానే ఉపాధ్యాయ విద్యావిధానం రూపుదిద్దుకుంటున్నా- ఎన్నో లొటుపాట్లు వెక్కిరిస్తున్నాయి. ఆకాంక్షిత శ్రద్ధాసక్తులతో బోధించే గురువులు, తగిన మౌలిక వసతులు కొరవడి- 60 శాతం మూడో తరగతి విద్యార్థులు ఒకటో తరగతి పాఠాలూ చదవలేకపోతున్నారు. అయిదో తరగతిలో మూడొంతుల మందికి భాగహారాలు చేతకావడం లేదు. ఇటువంటి దుర్బల పునాదులపై సృజనశక్తి సౌధాల నిర్మాణం కలలోని మాట. తక్షణ కర్తవ్యమేమిటో డెబ్బై ఏడో ఐపీఎస్‌సీ (ఇండియన్ పబ్లిక్ స్కూల్ కాన్ఫరెన్స్) ఇప్పటికే ఉద్బోధించింది. అత్యుత్తమ ఉపాధ్యాయ విద్య అందించేందుకు ఐఐటీలు, ఐఐఎమ్‌ల స్థాయిలో ప్రత్యేక సంస్థనొకదాన్ని అవతరింపజేయాలి. బోధనపై ఆసక్తి కలిగినవారినే ఉపాధ్యాయులుగా ఎంపిక చేయాలి. ప్రాథమిక పునాదులు పటిష్ఠమైతే, దేశవ్యాప్తంగా తొమ్మిదో తరగతి నుంచే నైపుణ్యాభివృద్ధి కోర్సు ప్రవేశపెట్టాలన్న ప్రభుత్వ అజెండా అమలుకు బంగరు బాటలు పడినట్లే. జాతి పురోగతికి తిరుమంత్రం, బడికి దిద్దే కొత్త ఒరవడే!

జనారోగ్యానికి సరికొత్త మందు!

జిల్లా ఆస్పత్రులను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో నడపాలన్న కొత్త ప్రతిపాదనను నీతి ఆయోగ్, కేంద్ర ఆరోగ్య శాఖ, ప్రపంచ బ్యాంకు సంయుక్తంగా ముందుకుతెచ్చాయి. చిన్న పట్టణాల్లో క్యాన్సర్, హృద్రోగాలు, శ్వాసకోశ వ్యాధులు వంటి రోగాల చికిత్సకు పీపీపీ విధానాన్ని పాటించాలని ప్రతిపాదించాయి. ముఖ్యంగా అంటు వ్యాధులు కాని రోగాలకు ఈ విధానాన్ని అనుసరించాలని సూచించాయి. ఈ పద్ధతిలో ప్రపంచ బ్యాంకు సాంకేతిక భాగస్వామిగా వ్యవహరిస్తుంది. ప్రజల చికిత్సావసరాలను ప్రైవేటు వైద్యులు, ఆస్పత్రి యాజమాన్యాలు తీరుస్తాయి. అంబులెన్స్‌లు, రక్తనిధులు, శవాగారాల(మార్చురీల) వంటి సేవలనూ అందిస్తాయి. జిల్లా ఆస్పత్రుల్లో సౌకర్యాలను ఆధునికం చేసి, వాటిని 30 ఏళ్లపాటు నిర్వహించే అవకాశాన్ని ప్రైవేటు వైద్యసంస్థలకు ఇస్తారు. ఈ కొత్త విధానం వల్ల ప్రజలకు మెరుగైన చికిత్సా సౌకర్యాలు లభిస్తాయని ప్రభుత్వం భరోసా ఇస్తోంది. నిజానికి ఇప్పటికే 72 శాతం గ్రామీణ జనాభా, 79 శాతం పట్టణ జనాభా ప్రైవేటు వైద్య సేవలు అందుకున్నారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో చాలినన్ని మౌలిక వసతులు, మానవ వనరులు లేకపోవడం వల్లనే ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ లోపాన్ని అధిగమించడానికి పీపీపీయే శరణ్యమని ప్రభుత్వం చెబుతోంది. ఇది పైకి భేషుగ్గానే అనిపిస్తున్నా, తరచి చూస్తే అసలు పరిస్థితి అవగతమవుతుంది.



తీరని సందేహాలు

ఇప్పటికే 70 శాతానికిపైగా ప్రజలు ప్రైవేటు వైద్యసేవలను ఆశ్రయిస్తున్నప్పుడు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో కొత్తగా ఒరిగేదేముంటుంది? ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, మానవ వనరులు తగినంత లేకనే ప్రజలు ప్రైవేటు వైద్య సేవలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం ఈ లోపాలను సరిదిద్దాల్సిందిపోయి ప్రైవేటు వైద్య సంస్థలను రంగంలోకి దించడమేమిటి? వైద్యులు, నర్సుల కొరతను ప్రైవేటు భాగస్వాములు నిజంగా అధిగమించగలరా? నేడు ప్రభుత్వ, ప్రైవేటు వైద్య విద్యాసంస్థల్లోని సీట్ల సంఖ్య దేశావసరాలను తీర్చగల స్థాయిలో లేదని ఇక్కడ గుర్తుంచుకోవాలి. సరైన నియంత్రణలు లేక వ్యాపారమయమైపోయిన ప్రైవేటు వైద్యచికిత్సా రంగంతో ప్రభుత్వం ఏకంగా 30 ఏళ్ల భాగస్వామ్యం పెట్టుకోవడం అభిలషణీయమేనా? పైగా ఆరోగ్యం రాష్ట్రాల జాబితాలోని అంశం. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం కర్ణాటకలో దారుణంగా విఫలమైన దృష్ట్యా పీపీపీపై రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం లేదు. అలాంటప్పుడు ఈ విధానాన్ని దేశమంతటా అమలు చేయడం సాధ్యమేనా? ఈ ప్రశ్నలకు సమాధానాలను అన్వేషించే ముందు కొన్ని వాస్తవాలను పరిశీలించాలి. ఆదాయాల్లో విపరీత అంతరాలున్న భారత్ వంటి వర్ధమాన దేశంలో అత్యధిక జనాభాకు

వైద్యసేవల్లో 'పీపీపీ' యోచన

నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో లేవు. దీనికి తోడు వారికి సురక్షిత తాగు నీరు లభించడం లేదు. పౌష్టికాహార లోపమూ బాధిస్తోంది. అంటు వ్యాధులు, ఇతర తీవ్ర వ్యాధులు, వాటి నివారణ చర్యల గురించీ వీరికి అవగాహన లేదు. ప్రజారోగ్యానికి ప్రభుత్వ కేటాయింపులు అరకొరగా ఉండటం సమస్యను మరింత తీవ్రం చేస్తోంది. ప్రపంచ జనాభాలో 17 శాతం భారత్‌లోనే నివసిస్తున్నా ఆరోగ్యంపై ప్రపంచ దేశాలు చేస్తున్న వ్యయంలో ఒక శాతంకన్నా తక్కువే ఇక్కడ వెచ్చిస్తున్నారు. మన ప్రభుత్వాలు ఆరోగ్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయనడానికి ఇంతకన్నా నిదర్శనం మరొకటి లేదు. కేంద్ర ఆరోగ్య శాఖ ఇప్పుడిప్పుడే నిర్లక్ష్య ధోరణిని వదిలించుకోవడం కొంత ఊరటనిస్తోంది. 2016-17లో ఆరోగ్యానికి కేటాయించినదానికన్నా 27.76 శాతం ఎక్కువ (రూ.47,353 కోట్ల) నిధులను 2017-18లో కేటాయించింది. ఇది మంచిదేకానీ, ఆ నిధులను ఎలా ఖర్చుపెట్టారన్నదే ముఖ్యం.

చేదు అనుభవాలు

సరైన తనిఖీలు, జాగ్రత్త చర్యలు తీసుకోకపోతే పీపీపీ నమూనా ప్రతికూల ఫలితాలనిస్తుందని కర్ణాటక అనుభవం హెచ్చరిస్తోంది. పీపీపీ నమూనాలో భాగస్వామ్యం తీసుకునే ప్రైవేటు వైద్యసంస్థలు లాభాల కోసం నడిచే సంస్థలే తప్ప దానధర్మ సంస్థలు కావు. సహజంగానే అవి వైద్యాన్ని వ్యాపారంగా భావిస్తాయి. దీనివల్ల పేద ప్రజలు ఎంతగా దెబ్బతిన్నారో కర్ణాటక అనుభవం బట్టి తెలుసుకోవచ్చు. ఇప్పటికే 70 శాతానికి పైగా ప్రజలు ప్రైవేటు వైద్యసేవలు పొందుతున్నారు కాబట్టి మొత్తం వైద్యాన్ని పీపీపీ నమూనాలోకి మార్చాలనడం సరికాదు. ప్రభుత్వం ప్రజా సంక్షేమ బాధ్యతను వదిలించుకోరాదు. ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్సా సౌకర్యాలు అధ్వానంగా ఉన్నాయి. కనుకనే జనం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించక తప్పడంలేదు. ఈ లోపాన్ని సరిదిద్దకుండా పీపీపీ నమూనా అద్భుతాలు సృష్టిస్తుందనుకోవడం వట్టి భ్రమ!

పీపీపీ నమూనా కింద దీర్ఘకాలంపాటు ప్రభుత్వ ఆస్పత్రులను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల కలిగే విపరిణామాల గురించి సర్కారు అధ్యయనం చేసినట్లు లేదు. కర్ణాటకలో అమలైన వాజ్‌పేయీ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఇక్కడ ఒకసారి గుర్తుకుతెచ్చుకోవాలి. దాని కింద రోగులకు వైద్య సేవలు అందించే ప్రైవేటు ఆస్పత్రులకు రాష్ట్రప్రభుత్వం డబ్బు చెల్లించేది. దీనివల్ల లాభపడింది రోగులు కారు- ప్రైవేటు ఆస్పత్రులు! పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రభుత్వం కొన్ని నియంత్రణలు విధించడానికి ప్రయత్నించగా, ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రులు దాన్ని తీవ్రంగా ప్రతిఘటించాయి. వాటి యావ అంతా లాభాలపైనే. ఇక్కడొక ఉదంతాన్ని ఉటంకించాలి. ఇటీవల ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో ఓ రోగికి ఒక్క రోజైనా పూర్తిగా వైద్యం చేయకుండా కళ్లుతిరిగే మొత్తంలో భారీగా రుసుము వడ్డించారు. చివరకు ఆ రోగి మృతదేహాన్ని బంధువులకు వెంటనే అప్పగించడానికీ రూ.350 వసూలు చేశారు. ఆ మొత్తం రోగి భౌతికకాయాన్ని వస్త్రంలో చుట్టి ఇచ్చినందుకు రుసుమట! కాసుల వేటలో కార్పొరేట్ ఆస్పత్రులు ఎంత కర్కశంగా ప్రవర్తిస్తున్నాయో ఈ ఉదంతం చాటుతోంది. నీతి ఆయోగ్ ప్రతిపాదిస్తున్న పీపీపీ నమూనా కర్ణాటక ఆరోగ్యశ్రీ పథకానికి నకలు వంటిది. దాని ఆచరణలోని లొసుగులను తొలగించి కొత్త పీపీపీ విధానాన్ని రూపొందించడానికి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకొనకపోవడం విస్మయకరం. మెరుగైన పీపీపీ నమూనా తీసుకురావలసిందిపోయి నియంత్రించ వీలు కాని, జవాబుదారీ లేని విధానాన్ని ముందుకుతెచ్చింది. దగ్గు, జ్వరాలవంటి సాధారణ రుగ్మతల చికిత్సకు పీపీపీ నమూనా కింద విధివిధానాలను రూపొందించి ఉండవలసింది. అవుట్ పేషంట్లకు ఏయే సేవలు అందించేదీ స్పష్టత లేదు. ఈ రోగుల్లో అత్యధికులు బలహీన వర్గాలవారే. కాబట్టి పీపీపీ విధానంలో రోగుల హక్కులు, ప్రైవేటు వైద్యసంస్థల జవాబుదారీని ఖచ్చితంగా నిర్వచించాలి. వీటిని పాటిస్తున్నదీ లేనిదీ గట్టి నిఘా వేస్తూ, ఉల్లంఘనదారులను వెంటనే శిక్షించాలి.

తీరైన విధానంతోనే సరైన రక్షణ

జవాబుదారీతోపాటు వైద్య సేవల నిర్వహణా అత్యంత కీలకం. ఆరోగ్య సేవల రంగం వైద్యులు, మందుల తయారీదారులు, సరఫరాదారులు, ఆస్పత్రుల సంగమం. వీరంతా చెట్టపట్టాలుగా పనిచేస్తుంటారు. వీరందరిపై ప్రతి అంచెలో పర్యవేక్షణ ఉండాలి. అంటే సమర్థమైన నిర్వహణ యంత్రాంగాన్ని ఏర్పరచుకోవాలి. ఆ తరవాతనే పీపీపీ నమూనాను అమలులోకి తీసుకురావాలి. కానీ, ప్రస్తుత నిర్వహణ-నిఘా యంత్రాంగం అంతా లోపభూయిష్ఠమయం. ప్రభుత్వం వైపు నుంచి సరైన నియంత్రణలు లేక ప్రజారోగ్యం దెబ్బతింటోంది. నేడు వైద్య రంగంలో ఎన్నెన్నో ప్రైవేటు ఆస్పత్రులు, ఎందరో వైద్యులు ఉన్నారు. వారిపై సమర్థ పర్యవేక్షణ ఏర్పాట్లు చేసిన తరవాతనే పీపీపీ నమూనాను చేపట్టాలి. లేదంటే ఈ నమూనాలోని మంచి అంశాలు ప్రజలకు చేరకుండా పోతాయి. కార్పొరేట్ శక్తులు ఈ పథకాన్ని స్వలాభానికి వినియోగించుకుంటాయి. ఈ సందర్భంగా ప్రైవేటు భాగస్వాములు చెప్పుకొనే సమస్యల గురించీ ఆలోచించాల్సిందే. రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన, జాతీయ ఆరోగ్య రక్షణ పథకాలు, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్), వివిధ రాష్ట్రాల బీమా పథకాలు వర్తించని రోగులకు పీపీపీ నమూనా కింద ఎంతెంత రుసుములు వసూలు చేయాలో ప్రభుత్వం నిర్దేశించలేదు. ఇది ప్రైవేటు ఆస్పత్రులను గందరగోళంలోకి నెడుతుంది. సీజీహెచ్ఎస్ కింద వసూలు చేసే రేట్లనే పీపీపీ కింద వసూలు చేయాలని మాత్రం ప్రభుత్వం సూచించింది. కానీ, సీజీహెచ్ఎస్ రేట్లు ప్రైవేటు ఆస్పత్రులకు ఏమాత్రం గిట్టుబాటు కావు. కాబట్టి ఆ పథకం కిందకు వచ్చే రోగుల చికిత్సపై ఆసక్తి చూపవు. ఈ సమస్యకు సరైన పరిష్కారం కనుగొనాలి. ఆస్పత్రులతోపాటు రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలనూ కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలి. ప్రపంచ బ్యాంకు పెట్టుబడిదారీ పథకాలకు కాణాచి అనే ఆందోళన సామాన్య ప్రజల్లో, ఒక వర్గం మేధావుల్లో బలంగా ఉంది. ఇలాంటి అనుమానాలు, ఆందోళనలకు తావివ్వని పీపీపీని రూపొందించి అమలు చేయాలి. చికిత్సా సౌకర్యాలు, వైద్యుల సంఖ్యను పెంచకుండా పీపీపీని అమలు చేయడంవల్ల ఆశించిన ప్రయోజనం లభించదు. పీపీపీ వల్ల ప్రజలకు నిజంగా మేలు జరగాలంటే అన్ని లోపాలను సరిదిద్ది, సకల జాగ్రత్తలు తీసుకుని అమలు చేయాలి.

- డాక్టర్ మహేంద్రబాబు కురువ

క్యూబా ఆదర్శం...



క్యూబా రాజధాని హవానాలోని ఓ ఆస్పత్రి

భారత్‌లో చికిత్సా సదుపాయాలకే కాక, సుశిక్షిత వైద్య సిబ్బందికీ కొరత ఉంది. ప్రపంచంలో వైద్యులు-రోగుల నిష్పత్తి భారతదేశంలోనే బాగా తక్కువ అని గణాంకాలు స్పష్టీకరిస్తున్నాయి. నాణ్యతలో రాజీపడకూడదనే సాకుతో భారత్ చాలా తక్కువమంది వైద్యులను తయారుచేసుకొంటోంది. ఇక్కడ క్యూబా నుంచి నేర్చుకోవలసింది ఎంతో ఉంది. క్యూబా చాలా చిన్న దేశమైనా పెద్దసంఖ్యలో అర్హులైన వైద్యులను తయారుచేసుకొంటోంది. క్యూబాకు సాధ్యమైనది భారతదేశానికి ఎందుకు సాధ్యపడదు? ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధునాతన చికిత్సా సౌకర్యాల కల్పనకు, వైద్య విద్యను ఎక్కువమందికి అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెట్టాల్సిన సమయం వచ్చేసింది. అప్పుడు జనం ప్రభుత్వ ఆస్పత్రులకే వస్తారు. ప్రైవేటు క్లినిక్‌లు, కార్పొరేట్ ఆస్పత్రుల వంక కన్నెత్తి చూడరు.

శాంతి స్థాపన... ప్రగతి సాధన!

'ఇండియా 2025నాటికి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా నిలుస్తుంది. అంతేకాదు- అత్యధిక యువశక్తి గల దేశంగానూ ప్రత్యేకత నిలబెట్టుకుంటుంది' అని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) గతంలోనే భవిష్యత్ దర్శనం చేసింది. పలు రకాల ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో, దేశవ్యాప్తంగా కొనసాగుతున్న సంస్కరణల ప్రక్రియను గతేడాది ఆ సంస్థ సమీక్షించింది. ఉత్పాదక శక్తిని, విపణి సామర్థ్యాన్ని కాలక్రమంలో గణనీయంగా పెంచగలిగితే భారత్‌కు తిరుగే ఉండదన్నది ఐఎంఎఫ్ నిశ్చితాభిప్రాయం. అదే సమయంలో (2016) లండన్ నుంచి కామన్వెల్త్ సచివాలయం వెల్లడించిన విశ్లేషణ ఫలితాలు విభిన్న కోణాన్ని ఆవిష్కరించాయి. ఆర్థికేతర రంగాల్లో (విద్య, ఉపాధి వంటివి) ప్రపంచవ్యాప్తంగా యువతరానికి గల అవకాశాలపై ఆ సంస్థ అధ్యయనం సాగించింది. 'ప్రపంచ యువజన అభివృద్ధి సూచీ' పేరిట వెల్లడించిన ఆ వివరాల ప్రకారం, భారత్ వెనకంజలో ఉంది! ఆ మాటకొస్తే పొరుగుదేశాలైన శ్రీలంక, నేపాల్ వంటివే జాబితాలో మెరుగైన స్థానాల్లో ఉన్నాయి. పెరుగుతున్న యువజనానికి దీటుగా అవకాశాలు పెరిగితే తప్ప భారత్‌లో అభివృద్ధి సాధ్యపడదన్నది విస్పష్టం. ఈ పరిస్థితుల్లో ఎప్పటిమాదిరే ఈ ఏడాదీ వచ్చిన 'అంతర్జాతీయ యువ దినోత్సవం' పలు వాస్తవాల్ని తెరపైకి తెస్తోంది!

ఉపాధి అవకాశాల కల్పన

కొన్ని దేశాల్లో హింసాత్మక వాతావరణంతో పాటు యుద్ధాలు, అంతర్యుద్ధాలు, సైనిక దురాక్రమణలు యువత నుంచి శాంతిని దూరం చేస్తున్నాయి. వీటన్నింటి కారణంగా 'శాంతి స్థాపనలో యువజనుల పాత్ర' అనే ప్రచారాంశంతో ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు నేటి ఉత్సవాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఈ దినోత్సవాల నిర్వహణకు దాదాపు రెండు దశాబ్దాల చరిత్ర ఉంది. యువత ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఆయా ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించాలంటూ ఐరాస సర్వప్రతినిధి సభ 1999లోనే ఓ తీర్మానం ఆమోదించింది. ఆ తరవాతి కాలంలో ఏటా ఈ యువజనోత్సవాల్ని నిర్వహిస్తూ వస్తున్నారు. 2014లో యువత-మానసిక స్వస్థత, 2015లో పౌర కర్తవ్య నిర్వహణ, 2016లో ఉత్పాదక శక్తి సాధన- అంశాలుగా కార్యక్రమాలు కొనసాగాయి. ప్రస్తుత అంశమైన 'శాంతి' అంటే, కేవలం యుద్ధాలకు సంబంధించిందే కాదు. ప్రపంచ యువత కోరుకుంటున్న శాంతిలో అభివృద్ధి ఒక కీలక భాగం. అందుకే శాంతి



నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

UNITED NATIONS INTERNATIONAL YOUTH DAY
Youth Building Peace

స్థాపన, ప్రగతి సాధన వైపు యువశక్తిని మళ్లించేందుకు ఏ ప్రభుత్వమైనా చేయాల్సినవి అనేకం ఉన్నాయి.

విద్య లక్ష్యాల్లో ఒకటైన ఉపాధి సాధనే అభివృద్ధికి కారణమవుతుంది. అదే శాంతియుత వాతావరణం వెల్లివిరిసేందుకు దోహదపడుతుంది. విద్య, శాంతి అనగానే మొదటగా గుర్తుకొచ్చే పేరు- మలాలా. ఆమెకి ఇప్పుడు 20 ఏళ్లు. ఆగస్టు 12న అంతర్జాతీయ యువజన దినోత్సవమైతే, సరిగ్గా నెల ముందు (జులై 12న) మలాలా పుట్టినరోజు. ఆ రోజును ప్రపంచమంతటా శాంతి ఉత్సవంగా నిర్వహించాలని ఐరాస పిలుపివ్వడం మరో విశేషం. నోబెల్ శాంతి పురస్కార విజేతగా, ఆమ్నెస్టీ వంటి విఖ్యాత సంస్థ నుంచి అంతర్జాతీయ బహుమతి స్వీకర్తగా, మానవ హక్కుల పరిరక్షణ కర్తగా మలాలా- యువతకు స్ఫూర్తినిస్తున్నారు. పాకిస్థాన్‌కు చెందిన ఆమె నివసించే ప్రాంతంలో ఛాందసవాద తాలిబన్లు రెచ్చిపోయి, పాఠశాలలకు వెళ్లే విద్యార్థినుల్లో కొందరిని కాల్చి చంపారు. అయిదేళ్లక్రితం ఓ రోజున బడి నుంచి ఇంటికి తిరిగి వెళుతున్న ఆమె పైనా, ఆ తీవ్రవాదులు తూటాల వర్షం కురిపించారు. తల, వెన్నెముకలోకి బుల్లెట్లు దూసుకెళ్లిన ప్రాణాపాయ స్థితిలో మలాలా- బ్రిటన్‌లో శస్త్రచికిత్స తరవాత కెనడాలో ఆశ్రయం పొందారు. ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో చదువుకుంటున్న ఆమె 'చదువు నా హక్కు, ఎక్కడైనా ఉపాధి పొందడం నాకు గల అవకాశం, శాంతి-ప్రగతి సాధనలే నా జీవిత లక్ష్యాలు' అని చాటిచెబుతున్నారు. శాంతిస్థాపన కృషిలో యువతకు స్ఫూర్తిగా ఆమె పేరునే ఐరాస ప్రస్తావించడం వెనక ఆంతర్యం అదే!

టొరంటో వేదికగా రెండేళ్లక్రితం నిర్వహించిన అంతర్జాతీయ యువజన సదస్సు అవకాశాల కల్పనపై విస్తృతంగా చర్చించింది. దేశం బలోపేతం కావాలన్నా, బలహీనపడాలన్నా అది యువత తీరుతెన్నులపైనే ఆధారపడి ఉంటుంది. ఈ వాస్తవాన్ని గ్రహించిన వివిధ దేశాలు అక్కడి విద్యార్థి, యువజన సంఘాల భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు చేపట్టడం ద్వారా యువశక్తిని వినియోగించుకుంటున్నాయి. జాతీయ యువజన మండళ్ల ఏర్పాటు, యువ సంక్షేమ పథకాలు అందులో భాగాలు. యూత్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ అనే లాభాపేక్ష రహిత జాతీయ సంస్థ సేవల్ని చైనా ఎంతగానో వినియోగించుకుంటోంది. విద్య, ఆరోగ్యం, శాస్త్ర సాంకేతిక అంశాలు, వాతావరణ పరిరక్షణ వంటి అంశాలవారీ కార్యాచరణ ప్రణాళికల్ని అక్కడ చేపడుతున్నారు. చదువుతో పాటు ఉపాధి కల్పనకు ఉపకరించే 'ప్రాజెక్ట్ హోప్' వంటివి ఆ దేశంలో సత్ఫలితాలనిస్తున్నాయి.

సమగ్ర ప్రణాళిక-సమర్థ ఆచరణ

సమస్యల తీవ్రతను వీలైనంతగా తగ్గించేందుకు బ్రిటన్, టర్కీ వంటి ప్రభుత్వాలు అనుసరిస్తున్న యువ భాగస్వామ్య విధానాలపై ఇండియా చూపు సారించాలి. క్షేత్రస్థాయి పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించి సమర్థంగా అమలు జరపాలి. ప్రభుత్వేతర, స్వచ్ఛంద సేవాసంస్థల అధ్యయనాల్ని పరిగణనలోకి తీసుకోవడం అన్నింటికంటే ముఖ్యం. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం ఎంత విస్తరిస్తే అంత ఉపయోగం ఉంటుంది. 'యువతకు సాధికారత' అనేది అసాధ్యమేమీ కాదు. ఏ పథకం రూపకల్పన అయినా యువజనుల సార్వత్రిక అవసరాలు తీర్చేలా ఉండాలి. సంకల్పశక్తితో యువతను ముందుకు తీసుకెళ్లే పద్ధతుల్ని 'టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్‌సైన్సెస్ (టిస్)' నిరుడు హైదరాబాద్ వేదికగా నిర్వహించిన సదస్సు ప్రతిపాదించింది. కొద్దిరోజుల్లోనే స్వాతంత్ర్య వేడుకలకు మన దేశం సమాయత్తమవుతోంది. యువత-శాంతి-ప్రగతి అనే త్రిసూత్రాలు జాతికి మరెంతో వన్నె తెస్తాయి. జాతిపిత మహాత్మాగాంధీ ఏనాడో చాటిచెప్పినట్లు 'శాంతి అనేది చదువుతోనే మొదలవుతుంది'. బాల్యంలో మొగ్గగా ఉండి యౌవనంలో వికసించే శాంతిసుమం సుగంధాలు వెదజల్లుతుంది. అది వాతావరణమంతటినీ ఆహ్లాదభరితం చేసినప్పుడే- జాతీయంగానైనా, అంతర్జాతీయంగానైనా యువజనానికి ఉత్సవం, ఉత్సాహం!

- సుధామాధురి


జ్ఞాన వాహిని

మహాత్ముల మేధాజగత్తు నుంచి 'జ్ఞానరాశి' ఆవిర్భవించి అక్షర రూపాన్ని సంతరించుకుంది. అక్షరం- వాగ్దేవి రూపం. వేదోపనిషత్తులు, ఇతిహాస పురాణాదులు, సమస్త శాస్త్రాలూ మానవుణ్ని చీకటి నుంచి వెలుగు వైపు నడిపిస్తాయి. మాధవుడిగా మలుస్తాయి. అక్షరబద్ధమైన ఆ జ్ఞానరాశిని పదిలపరచి భావి తరాలకు అందించాల్సిన కర్తవ్యం ప్రతి ఒక్కరిపైనా ఉంది.

వారసత్వంగా కొనసాగాల్సిన జ్ఞాన ప్రవాహం ఆగిపోకూడదు. అజాగ్రత్త, ఉదాసీనత, నిర్లక్ష్యం వల్ల అది దూరం కారాదు. మహావిష్ణువు మొదటి అవతారమైన మత్స్య రూపం మానవాళికి అందించే సందేశం ఇదే!

సృష్టికర్త అయిన విధాత నిద్రించిన సమయమది. అప్పుడు జలప్రళయం సంభవించింది. సోమకుడు అనే అసురుడు బ్రహ్మ వద్ద గల వేదాల్ని అపహరించాడు. రాక్షసత్వం జ్ఞానప్రపంచాన్ని చెరపట్టినట్లయింది. అంతలో విధాత మేలుకొని, వేదాలు లేవని తెలుసుకొని, శ్రీహరిని ప్రార్థిస్తాడు. ఆ శ్రీమన్నారాయణుడు మత్స్యరూపుడై అవతరించి, సోమకాసురుణ్ని సంహరించి, వేదోద్ధరణ చేస్తాడు.

వేదాలు సకల ధర్మాలకూ ప్రమాణాలు. అవి విశ్వవిజ్ఞానాన్ని వివరిస్తాయి. మానవ జాతి మనుగడకు వేదాలే మూలాధారాలు. సంపూర్ణ జ్ఞానానికి అవి బీజరూపాలు. దేవ వాఙ్మయాల్లో కొన్ని కాలగర్భంలో కలుస్తాయి. మరికొన్ని కొంతమేరకు పునరుద్ధరణ భాగ్యం పొందుతాయి. వాల్మీకిది మూల రామాయణం. అది నిత్య పారాయణ గ్రంథం. భాస్కర, మొల్ల, తులసి, రంగనాథ, కంబ రామాయణాలూ ఉన్నాయి. వాటిని రచించి వారు ధన్యులయ్యారు.



అంతర్యామి

రామచంద్రుడి ప్రాణసమానుడు హనుమంతుడు. ఆయన 'సుందర హనుమద్రామాయణం' పేరిట అరవై వేల శ్లోకాల్ని చంద్రకాంత శిలలపై రచించాడని ప్రతీతి. ఆ రచన గురించి శ్రీరాముడికి వెల్లడించినప్పటికీ మిన్నకుండటంతో, తన ప్రభువుకు ఇష్టం లేదేమోనని భావించి సముద్రజలాల పాల్జేస్తాడు హనుమ. ఆ తరవాత రాముడు అడగటంతో, తాను చేసిన పని వెల్లడిస్తాడు. వాల్మీకి రామాయణం భువిపై నిలవాలని, అది ఆదర్శ గ్రంథంగా ఆరాధన పొందాలని రాముడి అభిమతం. ఆయన మౌనానికి అదే కారణం. వాల్మీకికి విధాత ఇచ్చిన వరమూ అదే!

సూర్యభగవానుడి వద్ద హనుమంతుడు వేదవేదాంగాలు అభ్యసించాడు. ఆయన నవ వ్యాకరణ పండితుడు. శ్రీరాముడికి నమ్మినబంటు. అటువంటి హనుమ అద్వితీయ రచన సముద్రం పాలైంది. యుగాలు గడిచాయి. భోజరాజు, కాళిదాసు ఒకసారి సముద్రతీరంలో విహరిస్తుంటే- ఓ శ్లోకం రాసి ఉన్న చంద్రకాంత శిల అలల తాకిడితో ఒడ్డుకు కొట్టుకొస్తుంది. అది హనుమ రాసిన రామాయణ శ్లోకం. భోజరాజు గజ ఈతగాళ్లను రప్పించి, నీటిలో వెతికించి, సాధ్యమైన మేరకు శిలాఫలకాల్ని వెలికి తీయిస్తాడు. శ్లోకాల్లో 682 మాత్రమే లభ్యమైనట్లు చెబుతారు. భోజరాజు వాటితోనే రామాయణ రచన పూరింపజేశాడంటారు. అదే సుందర హనుమద్రామాయణం!

పరమేశ్వరుడు రాజరాజేశ్వరిని స్తుతిస్తూ 'సౌందర్య లహరి' రచించాడంటారు. ఆదిశంకరులు అపర పరమేశ్వర అవతారం. పరమేశ్వరుడు స్వయంగా ఆ గ్రంథాన్ని ఆదిశంకరులకిచ్చాడని చెబుతారు.

తనకు వ్యాసుడి భాగవతం ప్రాప్తించడం 'పురాకృత సుకృత విశేషం' అని పోతనామాత్యుడు అభివర్ణించాడు. భగవద్గీత సారసంగ్రహం, బ్రహ్మసూత్రాల పరమార్థమే భాగవతం. అది శుకమహర్షి ప్రోక్తం.

కలియుగదైవం శ్రీవేంకటేశ్వరుడిపై 32 వేల సంకీర్తనలు రచించాడు అన్నమయ్య. శ్రీరామచంద్రుడి భక్తిసామ్రాజ్యాన్ని స్తుతిస్తూ 24 వేల కీర్తనలు రచించాడు త్యాగయ్య. వారి రచనలు సగం కన్నా తక్కువ సంఖ్యలోనే నేడు లభ్యమవుతున్నాయి. ఆధ్యాత్మిక, శాస్త్రసంపదలు ఈ జాతికి తరగని నిధులు. భారతీయ శాస్త్రాలు ప్రపంచానికే తలమానికం.

జ్ఞానాన్ని ఆరాధించడమే దేవతారాధన. పంచుకునే కొద్దీ పెరిగేది 'జ్ఞానం' ఒక్కటే! మనసు సైతం ఛేదించలేని చీకటిని జ్ఞానం ఛేదిస్తుంది. జ్ఞానం లేనిదే అనుభవం పండదు. ఆ అనుభవం పండనిదే జీవితం శోభించదు!

- దానం శివప్రసాదరావు

రుణ మాఫీతో అనర్థాలు

దిల్లీ

రాష్ట్రాలు పోటీలు పడి మరీ వ్యవసాయ రుణాలు రద్దుచేయడాన్ని ఆర్థికసర్వే ఆక్షేపించింది. ఇలా అన్ని రాష్ట్రాలూ రుణాల్ని రద్దుచేస్తే ఆ ఆర్థికభారం రూ.2.7 లక్షల కోట్లకు చేరుకోవచ్చునని అంచనావేసింది. అదే జరిగితే ధరలు ఘోరంగా పతనమవుతాయని, ఇంకా పూర్తిస్థాయిలో ఊపందుకోని ఆర్థికవ్యవస్థకు తీరని నష్టం వాటిల్లుతుందని హెచ్చరించింది. వ్యవసాయ సంక్షోభ పరిష్కారాలపై ప్రధానంగా దృష్టిసారించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పింది. 2016-17 ఆర్థిక సంవత్సరపు ఆర్థికసర్వే రెండో భాగాన్ని శుక్రవారం పార్లమెంటులో ప్రవేశపెట్టారు. మొదటి భాగాన్ని ఈ ఏడాది జనవరిలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. సర్వే మొదటి భాగంలో అంచనావేసినట్లుగా.. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 7.5 శాతం వృద్ధిరేటును సాధించడం కష్టమని ఈ సర్వే అభిప్రాయపడింది. ఆర్థిక కార్యకలాపాల్లో సర్వత్రా అలుకుమున్న స్తబ్ధతే దీనికి కారణమని విశ్లేషించింది. ఆర్థిక వ్యవస్థకు జవజీవాలు అందించాలంటే వడ్డీరేట్లలో మరిన్ని కోతలు అవసరమని పేర్కొంది. రూపాయి మారకపు విలువలో తీవ్ర ఒడిదుడుకులు, వ్యవసాయ రుణాల మాఫీ, విద్యుత్తు, టెలికాం తదితర రంగాల ఆస్తి-అప్పుల పట్టీలపై పెరుగుతున్న ఒత్తిడి, వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) అమలులో ఉత్పన్నమవుతున్న సమస్యలు సవాలుగా మారిన విషయాన్ని గుర్తుచేసింది. దేశ ఆర్థిక వ్యవస్థలో చేపట్టిన కొన్ని సంస్థాగత సంస్కరణలు భవిష్యత్తుపై ఆశల్ని రేకెత్తిస్తున్నాయని పేర్కొంది. జీఎస్టీని అమల్లోకి తేవడం, పెద్ద నోట్ల రద్దువల్ల సానుకూల ప్రయోజనాలు, ఎయిరిండియా ప్రైవేటీకరణ, ఇంధన రాయితీల హేతుబద్ధీకరణలాంటి చర్యలు ఈ ఆశావహ దృక్పథానికి ఊతమిస్తున్నాయంది. 2017-18లో ద్రవ్యలోటు జీడీపీలో 3.2 శాతం ఉండొచ్చని విశ్లేషించింది. ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ ఈ సర్వేను రూపొందించారు.


రుణ మాఫీలతో కష్టమే!

వ్యవసాయ రుణాల రద్దు వల్ల ఆర్థికవ్యవస్థకు కలిగే నష్టాల్ని సర్వే ప్రముఖంగా ప్రస్తావించింది. "వాస్తవానికి రుణ మాఫీ వల్ల ధరలు పెరగాలి. కానీ స్వల్పకాల పరిణామాల్ని చూసినట్లయితే ధరల ఘోరంగా పడిపోయేలా ఉన్నాయి. ఈ జాడ్యం(రుణ మాఫీ) ఇతర రాష్ట్రాలకూ పాకే అవకాశం ఉంది" అని సర్వే హెచ్చరించింది. రుణ మాఫీ విషయంలో ఉత్తర్‌ప్రదేశ్ అడుగుజాడల్లో ఇతర రాష్ట్రాలూ నడిచినట్లయితే దేశ వ్యాప్తంగా ఆ మొత్తం రూ.2.7 లక్షల కోట్లకు చేరుకోవచ్చునని సర్వే అంచనాకట్టింది. వివిధ రాష్ట్రాలు ఇప్పటికే ప్రకటించిన రుణమాఫీ మొత్తం రూ.1.25 లక్షల కోట్లున్న విషయాన్ని గుర్తుచేసింది. రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు కూనారిల్లుతున్న దశలో రుణమాఫీ డిమాండ్లు వెల్లువెత్తుతుండడం ప్రమాదకరమంది. రుణమాఫీలకు కేంద్రం బాధ్యత తీసుకోదు కాబట్టి- రాష్ట్రాలు సొంతంగా ఈ భారాన్ని భరించినట్లయితే- సగటు డిమాండు జీడీపీలో 0.7 శాత మేర తగ్గుతుందని, ఆ మొత్తం రూ.1.14 లక్షల కోట్లు ఉండొచ్చని అంచనావేసింది. వ్యవసాయ సంక్షోభం తీవ్రమైన నేపథ్యంలో రుణమాఫీ డిమాండ్లు ఎక్కువయ్యాయంది. వ్యవసాయ రాబడులు తగ్గిపోవడం, తృణధాన్యేతరాల ధరలు పడిపోవడం, పంటలకు తగిన గిట్టుబాటు ధరలు లభించకపోవడం లాంటివి వ్యవసాయ రంగంలో సంక్షోభానికి కారణాలని విశ్లేషించింది.

మహిళలపై పెరుగుతున్న నేరాలు

దేశంలో మహిళలు, బాలికలపై అత్యాచారాలు, అపహరణలు, దాడుల వంటి నేరాల సంఖ్య పెరిగిపోతోంది. వారిలో అభద్రత అధికమవుతోంది. మహిళా సాధికారత, వారికి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించేందుకు న్యాయపరంగా మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. బాధితులకు సత్వర న్యాయం అందించే చర్యలు తీసుకోవాలంది. జాతీయ నేర నమోదు విభాగం సమాచారం ప్రకారం మహిళలపై నేరాలకు పాల్పడిన కేసుల్లో తీర్పులు వెలువడినవి 2015లో 22 శాతం కన్నా తక్కువగా ఉన్నాయి. మహిళలకు ఆస్తి హక్కు కల్పించటం, వరకట్న వేధింపుల నుంచి విముక్తి, ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో వివక్ష లేకుండా చూడటం వంటివి అవసరమని పేర్కొంది.

సాగు సమస్యల్ని తీర్చాలి



పంటలకు తగిన గిట్టుబాటు ధరలు కల్పించడంలో ఎదురవుతున్న అన్ని సమస్యల్నీ పరిష్కరించాల్సి ఉందని సర్వే నొక్కిచెప్పింది. విత్తనాలు వేయడానికి చాలా ముందుగానే... జన్యు మార్పిడి పంటల్ని స్వీకరించడం, వ్యవసాయ వాణిజ్య నిర్ణయాలు తీసుకోవడంలాంటివి చేయాలంది. చిన్న, సన్నకారు రైతులకు అందుబాటు వడ్డీరేట్లలో సంస్థాగత రుణాల్ని సకాలంలో అందివ్వాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. మాగాణిని పెంచడం, మార్కెటింగ్ మౌలిక సదుపాయాల్ని మెరుగుపరచడం, పాడిరంగంలో ఉన్న మహిళలకు నిధులు అందుబాటులో ఉంచడంపై దృష్టిపెట్టాలంది. ఉత్పాదకత, మార్కెటింగ్, ధరల సంబంధ సమస్యల వల్ల వ్యవసాయ రంగంలో ఆదాయాలు అస్థిరంగా మారాయని పేర్కొంది. ఈ సమస్యల్ని పరిష్కరించడానికి తగిన విధానపరమైన నిర్ణయాల్ని చాలా ముందుగానే తీసుకోవాల్సిన అవసరమంది. అదే జరిగితే 2017వ సంవత్సరంలో వ్యవసాయ ఉత్పత్తుల్లో మిగులు ఏర్పడుతుందని అభిప్రాయపడింది.

రహదారుల విస్తరణలో అవరోధాలు



పెరుగుతున్న అవసరాలు, వాహనాల రద్దీ దృష్ట్యా రహదారుల విస్తరణ ప్రాధాన్యాన్ని ప్రభుత్వం గుర్తించింది. జాతీయ రహదారులతో పాటు వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల్లో రహదారుల నిర్మాణానికి ప్రత్యేక ప్రాజెక్టులు చేపట్టింది. ఈ రంగంలో పెట్టుబడులను 2016-17లో రూ.లక్ష కోట్లతో పునర్వ్యవస్థీకరించారు. భారతమాల, సేతు సముద్రం పథకాలకు ఇవి అదనం. అయితే, ఈ ప్రాజెక్టులు భూసేకరణ, భూలభ్యత వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయి. మరోవైపు భూసేకరణ ధర భారీగా పెరిగింది. అభివృద్ధిదారులతో సమస్యలు, జాతీయరహదారుల్లో అవరోధాలు, జీఎస్టీ, రుణభారం పెరుగుదల వంటివి అదనపు సవాళ్లుగా ఆర్థిక సర్వే పేర్కొంది.


విద్య, వైద్యానికి మరిన్ని నిధులు

విద్య, ఆరోగ్య రంగాలపై పెట్టుబడులను మరింత పెంచాల్సి ఉందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. 2014-15లో విద్య కోసం వెచ్చించిన వ్యయం జీడీపీలో 2.8శాతం కాగా 2017 ఆర్థిక సంవత్సరానికి ఇది 3.2శాతానికి పెరిగింది. ఆరోగ్య రంగంలో చేసిన వ్యయం 2014-15లో 1.2శాతం కాగా 2017లో 1.5 శాతం. విద్య, వైద్యంతో పాటు సామాజిక సేవలు, కుటుంబసంక్షేమం, గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సంక్షేమానికి 2015-16లో వెచ్చించిన మొత్తం నిధులు రూ.10,02,591 కోట్లు. ఇవే రంగాల్లో 2016-17లో వెచ్చించిన మొత్తం రూ.11,18,094 కోట్లు. అంటే అంతకు ముందు ఏడాది కన్నా 11.5 శాతం అధికం. సామాజిక రంగంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నిధుల వ్యయ నిష్పత్తి జీడీపీలో 2011-12 నుంచి 2014-15 వరకూ 6 శాతం వద్దే నిలిచి పోయింది. అయితే, 2015-16, 2016-17లలో ఈ నిష్పత్తిలో మరో ఒక శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ రంగంలో వ్యయం 7.4శాతంగా ఉంది.

మౌలిక వసతుల అభివృద్ధి..

మౌలిక వసతుల కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం బహుముఖ వ్యూహాలను అమలు చేస్తోంది. రహదారుల నిర్మాణం, అనుసంధానం, భారతమాల ప్రాజెక్టుల్లో పెట్టుబడుల పెంపునకు కృషితో పాటు జలమార్గాల అభివృద్ధి, రైల్వేలు, వైమానిక రవాణాల విస్తరణకు ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల రవాణా వసతుల్లో మన దేశం ప్రపంచ బ్యాంకు ర్యాంకింగ్‌లో 2014లో ఉన్న 58వ స్థానం నుంచి 2016కి 36వ స్థానానికి చేరకుంది. అయినప్పటికీ మనం చేరుకోవాల్సిన గమ్యం చాలా దూరంగానే ఉందని సర్వే అభిప్రాయపడింది. లాజిస్టిక్ పార్కులు, వలయ రహదారుల నిర్మాణం చేపట్టడంతో పాటు వివిధ ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యాన్ని తగ్గించాలని సూచించింది.

ఉద్గారాల కట్టడికి స్వచ్ఛంద సన్నద్ధత



పర్యావరణానికి హాని కలిగించే ఉద్గారాలను నియంత్రిస్తామన్న స్వీయ ప్రతిన లక్ష్యాన్ని సాధించే దిశగా దేశం అడుగులేస్తోందని ఆర్థిక సర్వే పేర్కొంది. మరో మూడేళ్లలో 2005నాటి కాలుష్యాల తీవ్రత స్థాయిని 20-25 శాతం మేర తగ్గించే కసరత్తును ప్రభుత్వం చేపట్టింది. కేంద్ర విద్యుత్ ప్రాధికారసంస్థ ప్రణాళిక(2016) ప్రకారం బొగ్గు ఆధారిత విద్యుదుత్పాదన కేంద్రాల సామర్థ్య వృద్ధి 2017-22 మధ్య దాదాపు 50 గిగావాట్లు ఉంటుంది. తర్వాత అయిదేళ్ల వరకూ థర్మల్ విద్యుదుత్పాదన స్థాపక సామర్థ్యంలో అదనంగా ఎలాంటి వృద్ధి ఉండదు.

వడ్డీ వలలో తెలుగు రైతులు

- ఉభయ రాష్ట్రాల్లోనూ అనధీకృత రుణాలే 56%
- కేంద్ర ఆర్థిక సర్వేలో వెల్లడి

ఈనాడు – దిల్లీ



వ్యవసాయ రుణాల విషయంలో తెలుగు రాష్ట్రాల్లో వడ్డీ వ్యాపారుల ఆధిపత్యం అధికంగా ఉన్నట్లు కేంద్ర ఆర్థిక సర్వే వెల్లడించింది. శుక్రవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2016-17 ఆర్థిక సర్వే రెండో భాగంలోని అంశాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్‌లలో వ్యవసాయ రుణాలు అధికంగా ఉన్నట్లు సర్వే తెలిపింది. జీఎస్‌డీపీతో పోలిస్తే మాత్రం... అత్యధిక సాగు రుణాలున్న రాష్ట్రాల్లో పంజాబ్, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లు ఉన్నట్లు పేర్కొంది.

- వ్యవసాయ రంగంలో అనధీకృత రుణ కార్యకలాపాలు అత్యధికంగా ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, తెలంగాణల్లో కొనసాగుతున్నాయి. ఈ నాలుగు రాష్ట్రాల్లో వీటి మొత్తం దాదాపు రూ.లక్ష కోట్ల వరకూ ఉన్నాయి. మొత్తం రైతుల అప్పుల్లో ఇది దాదాపు 56%. ప్రభుత్వాలు రుణమాఫీ చేసినా, రైతులు ఇప్పటికీ అప్పుల్లో ఉన్నారు.
- ఆంధ్రప్రదేశ్‌లో చిన్న, సన్నకారు రైతులపై 2016-17 నాటికి రూ.44,599 కోట్ల రుణభారం ఉంది. ఇందులో వ్యవస్థీకృత రంగం నుంచి తీసుకున్నది రూ.18,727 కోట్లు కాగా, అనధీకృత మార్గాల ద్వారా సమకూరింది రూ.25,872 కోట్లు. మధ్యతరగతి రైతులపై రూ.7,388 కోట్లు, పెద్ద రైతులపై రూ.5,542 కోట్ల భారముంది. మొత్తంగా అన్నివర్గాల రైతులపై రూ.57,529 కోట్ల అప్పుంది.
- తెలంగాణలో చిన్న, సన్నకారు రైతులపై రూ.27 వేల కోట్ల రుణభారం ఉంది. ఇందులో అనధీకృత రుణాలు రూ.17,925 కోట్లు. మధ్యతరహా రైతులపై రూ.2,556 కోట్లు, పెద్ద రైతులపై రూ.1,197 కోట్లు కలిపి.. మొత్తంగా అన్నదాతలపై రూ.30,753 కోట్ల రుణభారం ఉంది. ఇందులో అనధీకృత రుణాలు రూ.20,133 కోట్లు.
- ధరల్లేక ఏపీ రైతులు కొబ్బరికాయలు, బంగాళాదుంపలను తక్కువ ధరకే అమ్ముకున్నారు.

తెలంగాణలో 6 శాతాన్ని మించిన ద్రవ్యోల్బణం

2015-16లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో 6 శాతం మేర ద్రవ్యోల్బణం నమోదైంది. 2016-17లో ఒక్క తెలంగాణలోనే 6 శాతానికి మించి ద్రవ్యోల్బణం కనిపించింది.

- పరిపాలన లెక్కల ప్రకారం ఏపీలో 27.20% పట్టణీకరణ జరిగింది.
- తాజా ధరల (2011-12 శ్రేణి) ప్రకారం 2016-17లో ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీలో 13.8% వృద్ధి నమోదైంది. తెలంగాణలో ఇది 13.7%గా ఉంది.
- 2016-17లో ఏపీలో తలసరి స్థూల ఉత్పత్తి రూ.1,22,376 కోట్లు కాగా, తెలంగాణలో అది రూ.1,58,360గా నమోదైంది. తలసరి స్థూల ఉత్పత్తి వృద్ధిరేటు ఏపీలో 13.1%, తెలంగాణలో 12.6% మేర నమోదైంది.
- 2017-18లో తాజా ధరల ప్రకారం ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీ రూ.7.7 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. ఉదయ్ పథకాన్ని మినహాయిస్తే, ఆర్థిక లోటు రూ.23,100 కోట్లకు చేరనుంది. ఇది 14వ ఆర్థిక సంఘం నిర్దేశించిన 3% లోటుకు సమానం. ఈ రాష్ట్రానికి ఇక ఏమాత్రం అదనపు లోటును భరించే శక్తిలేదు.

విద్యుత్ ఛార్జీలు పెంచలేదు

2017-18లో విద్యుత్ టారిఫ్‌ను ఆంధ్రప్రదేశ్ సగటున 3.60% మేర పెంచింది. తెలంగాణ 8% మేర టారిఫ్‌ను పెంచాల్సి ఉన్నా ఇంకా పెంచలేదు.

- 2017-18లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.7.6 లక్షల కోట్లకు చేరనుంది. 'ఉదయ్' మినహాయిస్తే ఆర్థికలోటు రూ.26,100 కోట్లకు చేరనుంది. ఇది 14వ ఆర్థికసంఘం చేసిన సిఫార్సులకు సమానం.



- ఆంధ్రప్రదేశ్ డిస్కంలపై 30.09.15 నాటికి రూ.14,721 కోట్ల భారం ఉండగా, ప్రభుత్వం ఇప్పటి వరకూ ఉదయ్ కింద రూ.8,256 కోట్ల విలువైన బాండ్లు జారీచేసింది. తెలంగాణ డిస్కంలపై రూ.11,244 కోట్ల భారం ఉండగా రూ.8,923 కోట్ల విలువైన బాండ్లను విడుదల చేసింది.
- 2016లో అత్యధికంగా దేశీయ పర్యాటకులు సందర్శించిన రాష్ట్రాల్లో ఏపీకి మూడో స్థానం దక్కింది.

అనగనగా ఓ కోటీశ్వరుడి అజ్ఞాతవాసం

- తండ్రి ఆజ్ఞకు తలవంచి హైదరాబాద్ మురికివాడలో నివాసం
- సాధువు, రిక్షావాలాతో సహచర్యం
- అట్టల కంపెనీలో చిరుద్యోగం
- రోడ్డు పక్కనే భోజనం..
- సినిమాను తలపించిన గుజరాత్ యువకుడి కథ

హైదరాబాద్ – న్యూస్‌టుడే



హైదరాబాద్‌లో హితార్థ్ జీవనయానం.. (వాహనం వెనుక కూర్చొన్న వ్యక్తి)



హితార్థ్‌ను అభినందిస్తున్న ఐపీఎస్ అధికారి రాజీవ్ త్రివేది. చిత్రంలో హితార్థ్ పెదనాన్న, పెద్దమ్మ, సోదరి

అతడు ఆరు వేల కోట్ల రూపాయల వ్యాపారానికి అధిపతి అయిన ఓ నగల వ్యాపారి కొడుకు.. పాతికేళ్ల కుర్రాడు.. అమెరికాలో చదువు.. తండ్రి జేబులోపెట్టింది రూ. 500 మాత్రమే. అడుగుపెట్టింది ఊరుకాని ఊరైన హైదరాబాద్‌లో. నెలరోజులపాటు ఇక్కడే బతకాలి.. తానెవరో.. తన హోదా ఏమిటో ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవ్వరికీ చెప్పకూడదు.. అత్యంత సామాన్యుడిగా నెలరోజులూ ఇక్కడ బతకాలి.. లోకం పోకడ ఏమిటో తెలుసుకోవాలి.

ఈ కథ వినగానే ఇటీవలే విజయవంతమైన 'బిచ్చగాడు' సినిమా కథో లేకపోతే ఆ మధ్యకాలంలో పత్రికల్లో వచ్చిన కథనమో గుర్తొచ్చి ఉంటుంది కదూ!

మీ అంచనా నిజమే.. అప్పట్లో కోటీశ్వరుడైన నగల వ్యాపారి కుమారుడు కూలీగా పనిచేశాడంటూ వచ్చిన వార్తల్లోని వ్యక్తికి స్వయంగా సోదరుడైన వ్యక్తి ఇప్పుడు నెలరోజులపాటు హైదరాబాద్ మురికివాడల్లో గడిపాడు. అతడి పేరు హితార్థ్.

శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐపీఎస్ అధికారి రాజీవ్ త్రివేది, హితార్థ్ సోదరి కృపాలి, పెదనాన్న, పెద్దమ్మ సౌజీబాయిలతో కలిసి ఈ వివరాలు వెల్లడించారు.

భలే సంప్రదాయం

గుజరాత్‌కు చెందిన హరేకృష్ణ ఎక్స్‌పోర్ట్స్‌కు చెందిన ప్రముఖ నగల వ్యాపారి ఘన్‌శ్యాం డోలాకియా. ఆ సంస్థ టర్నోవర్ దాదాపు రూ.6,000 కోట్లు. డోలాకియా కుటుంబానికి చెందిన నలుగురు అన్నదమ్ముల పిల్లలలో వ్యాపారంలోకి అడుగుపెట్టేవారు కచ్చితంగా నెలరోజులపాటు తమకు సంబంధం లేని, పరిచయం లేని ప్రాంతంలో స్వయంకృషితో.. అత్యంత సామాన్యుడిలా జీవించాలి. తన గురించి కాని, కుటుంబం, వ్యాపారం గురించి కాని ఎవరికి తెలియకుండా పనిచేయాలి. కాయకష్టంతో బతకాలి.. గతంలో ఒక వారసుడు ఇలాగే కేరళలోని ఒక ఊరిలో బేకరీలో నెల రోజులపాటు పనిచేసిన విషయం పత్రికల్లో ప్రముఖంగా వచ్చింది.

అదే కుటుంబానికి చెందినవాడు హితార్థ్ ఘన్‌శ్యాం డోలాకియా. పాతికేళ్ల వయసు. అమెరికాలోని న్యూయార్క్‌లో చదువుకున్నాడు. అక్కడే పైలెట్ కోర్సు కూడా చేశారు. వ్యాపార సామ్రాజ్యంలోకి అడుగుపెట్టే ముందు తమ కుటుంబ ఆచారం ప్రకారం అజ్ఞాతవాసానికి సిద్ధమయ్యాడు. తండ్రి ఇచ్చిన రూ. 500 జేబులో పెట్టుకున్నాడు. దాంతోపాటు ఒక కవరు! అందులో ఫ్లైట్ టికెట్ ఉందని తెలుసు. ఎక్కడికో మాత్రం తెలీదు. దానిని తీసుకొని ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. కవర్ తెరిచి చూస్తే అందులో హైదరాబాద్‌కు ఫ్లైట్ టికెట్ కనిపించింది. అప్పటి వరకు హైదరాబాద్ గురించి హితార్థ్‌కు ఏమాత్రం తెలియదు. కాని తప్పదు. ఇంకేమి ఆలోచించకుండా విమానం ఎక్కి కూర్చున్నాడు. అలా హైదరాబాద్ నగరంలోఅడుగుపెట్టాడు.

సికింద్రాబాద్ నుంచి మొదలు..

హైదరాబాద్‌లో విమానం దిగిన తరువాత బస్సులో సికింద్రాబాద్ చేరుకున్నారు. అక్కడే ఓ లాడ్జీలో రూ.100కు ఒక రూమ్ తీసుకుని ఒకరోజు గడిపాడు. ఒక వ్యవసాయదారుడి కుమారుడినని. ఉద్యోగం కోసం వచ్చానని అక్కడున్న వారితో చెప్పాడు. అలా ఉద్యోగ వేటలో చాలామందిని కలిశాడు. ఒక్కొక్కరూ ఒక్కో సలహా ఇచ్చారు. ఉద్యోగం దొరికే ప్రాంతాల గురించి సూచించారు. ఓ బస్సు కండక్టర్ చెప్పినట్లు అమీర్‌పేటలో దిగి లాల్‌బంగ్లా సమీపంలో ఉన్న ఒక టెలీకాలర్ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ ఉద్యోగం గురించి ప్రయత్నించగా ఓ మహిళ హైటెక్‌సిటీలో ఒక ఉద్యోగం గురించి చెప్పడంతో సరేనన్నాడు. రూ.500 చేతిలోపెట్టి.. ముందు భోజనం పెట్టించి తర్వాత అక్కడికి వెళ్లమన్నారు. కాని ఆ ఉద్యోగంలో కదురుకోలేక కొద్దిరోజుల్లోనే మానేసి మెక్‌డీలో చేరాడు. అక్కడ ఒక్కో రోజు ఒక్కో కేంద్రంలో పని చేయాల్సిరావడంతో దాన్నీ వదులుకున్నాడు. అక్కడి నుంచి నైకీ కంపెనీ, తర్వాత అడిడాస్‌లో వారం పని చేశాడు. ఆపై మళ్లీ సికింద్రాబాద్‌కు వచ్చేశాడు హితార్థ్. బన్సీలాల్‌పేటలోని వైట్‌బోర్డు తయారీ కంపెనీలో పని చేరాడు. ఇక్కడున్నంత కాలం చాలా ఇరుకు ప్రాంతాల్లో.. దాదాపు మురికివాడలో ఉండాల్సి వచ్చింది. ఒకసారైతే ఓ రిక్షా కార్మికుడితో కలిసి ఉండాల్సి రాగా, మరి కొన్నాళ్లు ఓ సాధువుతో కలిసి ఓ గదిలో బతకాల్సి వచ్చింది. తర్వాత మరో చిన్న ఉద్యోగంలో చేరినా అక్కడా ఇరుకుగదిలోనే ఉన్నాడు. చాలాసార్లు రోడ్డు పక్కన బండి మీద పెట్టి అమ్మే టిఫిన్లు, అన్నం తినేవాడు. మొత్తం మీద నెల రోజుల పరీక్ష పూర్తయింది.. తాను ఎక్కడ ఉన్నాడో ఇంట్లో వాళ్లకు చెప్పగానే వాళ్లు రెక్కలు కట్టుకుని వచ్చి వాలాడు. నెలరోజులపాటు ఇంటికి, సౌకర్యాలకు, విలాసాలకు దూరంగా ఇలా మురికివాడల్లో గడిపిన హితార్థ్‌ను చూసిన అతని సోదరి, పెద్మమ్మ, పెదనాన్న కన్నీరుపెట్టుకుని ప్రేమతో దగ్గరికి తీసుకొన్నారు. విషయం తెలిసిన సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీవ్ త్రివేది మీడియా సమావేశం ఏర్పాటుచేసి అతడి వివరాలు వెల్లడించారు.

భాగ్యనగరం అక్కున చేర్చుకుంది : హితార్థ్

హైదరాబాద్‌లో నెలరోజుల అజ్ఞాతవాసం గురించి.. తాను ఇక్కడ గడిపిన వినూత్నమైన జీవనం గురించి హితార్థ్ విలేకరులకు వివరించాడు.. "నిజానికి నేను సాధారణ తరగతి యువకుడిలా కనిపించలేకపోయాను. ఉద్యోగం అయితే చేశాను కాని ఈ విషయంలో ఫెయిల్ అయినట్లే చెప్పాలి. ఒక్కవిషయం మాత్రం నిజం. ఈ నెలరోజులు సాధారణ వ్యక్తిగా అందరి ప్రేమను పొందగలిగాను. నేను ఎవరినో తెలియకున్నా భాగ్యనగరం నన్ను అక్కున చేర్చుకుంది. నాకు ఉద్యోగం కావాలని, కష్టాల్లో ఉన్నానని నేనే కట్టుకథే చెప్పినా ఎంతోమంది స్పందించారు. నాకు ఉద్యోగం దొరికే మార్గం చూపారు. అసలు ఇప్పటివరకు వరిఅన్నం తినని నేను ఇక్కడ అది తినడం నేర్చుకున్నాను. ఇప్పుడు నాకు ఉత్తమ అల్పాహారం అంటే ఇడ్లీయే. అది చాలాబాగుంది. మన చుట్టూ ఉన్న వారికి.. మనని నమ్ముకుని బతికేవారికి మనం ఏం చేస్తే సంతోషిస్తారో అది నేను నేర్చుకున్నాను. అమెరికాలో నేర్చుకున్న పాఠాల కంటే జీవితం నేర్పిన ఈ పాఠమే ఎంతో బాగుంది. హైదరాబాద్ నా గుండెలో చెరగని ముద్ర వేసుకుంది. అందమైన ఈ నగరానికి వీడ్కోలు" అంటూ చెప్పి పెద్మమ్మ, పెదనాన్న, సోదరితో కలిసి గుజరాత్ తిరుగు పయనమయ్యాడు హితార్థ్.

తెలంగాణలో 54 సీసీఐ కేంద్రాలు

- సెప్టెంబరులో ధర్మేంద్రప్రధాన్, రాజ్‌నాథ్, హన్సరాజ్‌లు రాక
- భాజపా తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో మరో 54 సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం పచ్చజెండా ఊపిందని తెలంగాణ భాజపా అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్రానికి వరసగా కేంద్రం నుంచి మంత్రులు రానున్నారన్నారు. రాష్ట్రంలో భాజపా ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందని, 2019 ఎన్నికలే లక్ష్యంగా ప్రజలకు చేరువవుతున్నామని తెలిపారు. ఆ దిశగా రోడ్‌మ్యాప్ తయారుచేస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారమిక్కడ పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అనంతరం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర సమన్వయకర్త నూనె బాలరాజ్‌లతో కలిసి లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో పత్తి కొనే దళారులను నివారించాలంటే సీసీఐ కొనుగోలు కేంద్రాలను పెంచాలని కేంద్రమంత్రి స్మృతి ఇరానీకి విజ్ఞప్తి చేయగా.. అదనంగా 54 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆమె చెప్పారన్నారు. మజ్లిస్ అజెండా అమలులో భాగంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని తెరాస ప్రభుత్వం నిర్వహించడం లేదని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. సెప్టెంబరు 17న భారీస్థాయిలో నిర్వహించే సభకు రావాలని రాజ్‌నాథ్, సహాయమంత్రి హన్సరాజ్ ఆహిర్‌లను కోరగా తప్పకుండా వస్తామని చెప్పారన్నారు. సెప్టెంబరు మొదటివారంలో తెలంగాణకు వచ్చి ఉజ్వల పథకం ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారని వివరించారు. పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని వాణిజ్యశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను, ఫారెస్ట్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు నిధులు విడుదల చేయాలని పర్యావరణ మంత్రి హర్షవర్ధన్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. ఫసల్ బీమా యోజన రాష్ట్ర వాటా చెల్లించకపోవడం వల్ల రైతులు నష్టపోయారని వ్యవసాయ మంత్రి రాధామోహన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లగా రాష్ట్రప్రభుత్వానికి లేఖ రాస్తానని తెలిపారన్నారు.

టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్, సభ్యులకు వేతనాల పెంపు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఛైర్మన్, సభ్యులకు తెలంగాణ ప్రభుత్వం వేతనాలు పెంచింది. కేంద్ర ఏడో వేతన సంఘం సిఫార్సులకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. వేతనాల పెంపుదల 2016 జనవరి ఒకటోతేదీ నుంచి అమల్లోకి వస్తుందంది. ఛైర్మన్‌కు నెలసరి వేతనాలు, జీతభత్యాలు రూ.80 వేల నుంచి రూ.2.25 లక్షలకు పెంచింది. సభ్యులకు రూ.79 వేల నుంచి రూ.2.24 లక్షలు చొప్పున పెంచామంది.

గ్రహం అనుగ్రహం 12-8-2017 శనివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ **దక్షిణాయనం; వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం; పంచమి:** రా. 9-32 తదుపరి షష్ఠి; **ఉత్తరాభాద్ర నక్షత్రం:** ఉ. 6-11 తదుపరి రేవతి తె. 5-27; **అమృతఘడియలు:** తె. 3-07 నుంచి 4-40 వరకు; **వర్జ్యం:** సా. 5-49 నుంచి 7-22 వరకు; **దుర్ముహూర్తం:** ఉ. 5-46 నుంచి 7-27 వరకు; **రాహుకాలం:** ఉ. 9-00 నుంచి 10-30 వరకు

సూర్యోదయం: ఉ. 5-45; **సూర్యాస్తమయం:** సా. 6-26

తగ్గనున్న ఎల్‌హెచ్‌బీ బోగీల కొరత

- దక్షిణమధ్యరైల్వే జోన్ పరిధిలో బోగీ ఫ్రేముల కర్మాగారం
- 18న యాద్గిర్‌లో ప్రారంభించనున్న రైల్వేమంత్రి సురేష్‌ప్రభు



బోగీ ఫ్రేముల కర్మాగారంలోని లోపలి భాగం

ఈనాడు, హైదరాబాద్: అధికవేగంతో ప్రయాణం, ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు దోహదం చేసే ఎల్‌హెచ్‌బీ బోగీల కొరత కొంతమేర తగ్గనుంది. వీటి తయారీకి అవసరమైన రైలు బోగీ ఫ్రేముల కర్మాగారం అందుబాటులోకి రావడమే దీనికి కారణం. ఇది దక్షిణమధ్య రైల్వేజోన్ పరిధి కర్ణాటకలోని యాద్గిరి జిల్లాలో ఏర్పాటైంది. దీనిని రైల్వేశాఖ మంత్రి సురేష్‌ప్రభు 18న ప్రారంభిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం వెల్లడించింది. భద్రతను పెంచేందుకు ఎల్‌హెచ్‌బీ (లింక్‌హాఫ్‌మెన్ బుష్) బోగీలను రైల్వేశాఖ అందుబాటులోకి తెస్తోంది. పెరంబూరు, కపుర్తలా, రాయబరేలిలో ఉన్న కోచ్ ఫ్యాక్టరీలన్నింటికి కలిపి ఏటా 2,800 ఎల్‌హెచ్‌బీ బోగీలను తయారుచేసే సామర్థ్యం ఉంది. కాగా ఈ బోగీల తయారీలో కీలకమైన ఫ్రేములను ఉత్పత్తిచేసే యూనిట్ల సామర్థ్యం 1,600 బోగీలకే పరిమితమైంది. గిరాకీ, సరఫరాల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించేందుకు పశ్చిమ్‌బంగా, కర్ణాటక రాష్ట్రాల్లో రెండు బోగీ ఫ్రేముల యూనిట్లను రైల్వేశాఖ మంజూరు చేసింది. యాద్గిరి జిల్లాలో 2014లో రూ.80.92 కోట్లతో చేపట్టిన బోగీ ఫ్రేముల తయారీ కర్మాగారం పూర్తయింది. ఇందులో ఏటా 600 బోగీ ఫ్రేములు తయారవుతాయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. రెండేసి బోగీ ఫ్రేములను కలిపి ఒక ఎల్‌హెచ్‌బీ బోగీగా తయారు చేస్తారు. యాద్గిరి రైల్ బోగీ కర్మాగారంతో ఏటా మరో 300 ఎల్‌హెచ్‌బీ బోగీలు అందుబాటులోకి వస్తాయని రైల్వేవర్గాలు చెబుతున్నాయి.





ప్రాణహిత నీటితో నిండుగా కనిపిస్తున్న త్రివేణి సంగమ ప్రదేశం ★ నీరు లేక వెలవెలబోతున్న గోదావరి నది

ప్రాణహిత గలగల.. గోదావరి వెలవెల

కోటపల్లి, న్యూస్‌టుడే: ఏటా వర్షాకాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సరిహద్దులో ప్రాణహిత, గోదావరి నదులు నిండా నీటితో పోటీ పడి ప్రవహిస్తాయి. ఈసారి మాత్రం పరిస్థితి మారింది. స్థానికంగా వర్షాలు లేకున్నా మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత ఉరకలెత్తి పారుతుండగా, గోదావరి చుక్క నీరు లేక వెలవెలబోతుంది. ఈ సీజన్‌లో ప్రాణహిత రెండోసారి అవతలి, ఇవతలి తీరాలను తాకుతూ ప్రవహించడం విశేషం. గోదావరిలో ఇంతవరకు చిన్నపాయలా కూడా నీటి ప్రవాహం లేకపోవడం ఇక్కడి వర్షాభావ పరిస్థితులకు అద్దం పడుతోంది. శుక్రవారం ఉదయం నుంచి ప్రాణహితకు వరద నీరు పోటెత్తగా మధ్యాహ్నం వరకు కోటపల్లి దేవులవాడ సమీపంలోని సింగరేణి పంపుహౌజ్‌ను తాకింది. క్రమేపీ ప్రవాహం పెరిగి సాయంత్రం వరకు కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు కలిసే ప్రాంతం పూర్తిగా ప్రాణహిత నీటితో నిండిపోయింది.

ఏప్రిల్ 12 నుంచే వేసవి సెలవులు

జూన్ 1న పాఠశాలల పునఃప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థులకు ఈసారి వేసవి సెలవులు ముందుగానే రానున్నాయి. ఏప్రిల్ 11 వరకే పాఠశాలలను నడిపి 12వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. జూన్ 1వ తేదీ నుంచి బడులు పునఃప్రారంభం అవుతాయి. ఏప్రిల్‌లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న నిర్వహించాల్సి ఉంటుంది. అప్పుడు వేసవి సెలవులు కావడంతో పాఠశాలల్లో జరుపుకునేందుకు వీలుకావడం లేదు. అందుకే జూన్ 1న బడులు పునఃప్రారంభించాలని నిర్ణయించారు. దానివల్ల వేసవి సెలవులను కూడా 10 రోజులు ముందుకు జరుపుతున్నారు. దీనిపై ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. త్వరలో దస్త్రంపై ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి సంతకం చేయనున్నట్లు తెలిసింది.

దసరా, దీపావళి సందర్భంగా బిహార్‌కు 78 ప్రత్యేక రైళ్లు

ఈనాడు, హైదరాబాద్: దసరా, దీపావళి పండగలకు వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని బిహార్‌కు 78 ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. సికింద్రాబాద్-దర్భంగ(నెం. 07007, 07008)ల మధ్య 52 సర్వీసులు, హైదరాబాద్-రాక్సల్ (నెం.07005, 07006)ల మధ్య 26 సర్వీసులు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. ఈ రైళ్లు తెలంగాణలో ఖాజీపేట, రామగుండం, మంచిర్యాల, సిర్పూర్‌ఖాగజ్‌నగర్ స్టేషన్లలో ఆగనున్నాయి. సికింద్రాబాద్- దర్భంగకు సెప్టెంబరు 2 నుంచి నవంబరు 28 వరకు, తిరిగి అక్కడినుంచి సికింద్రాబాద్‌కు సెప్టెంబరు 5 నుంచి డిసెంబరు 1వరకు సర్వీసులు రాకపోకలు సాగిస్తాయి. హైదరాబాద్ నుంచి రాక్సల్‌కు సెప్టెంబరు 7 నుంచి నవంబరు 30 వరకు, తిరిగి అక్కడి నుంచి హైదరాబాద్‌కు సెప్టెంబరు 10 నుంచి డిసెంబరు 3 వరకు ప్రత్యేకరైలు సర్వీసులు రాకపోకలు సాగిస్తాయని సీపీఆర్వో ఎం.ఉమాశంకర్‌కుమార్ తెలిపారు.

గణేశ మండపాలకు విద్యుత్తు రుసుములు ఖరారు

ఈనాడు, హైదరాబాద్: గణేశ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాటుచేసే మండపాలకు విద్యుత్తు రుసుములను దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ(టీఎస్ఎస్‌పీడీసీఎల్) శుక్రవారం ప్రకటించింది. ఆగసు 25 నుంచి సెప్టెంబరు 4 వరకూ తాత్కాలిక కనెక్షన్ల పద్ధతిలో విద్యుత్తు సరఫరా చేస్తారు. పందిరికి 250 వాట్లలోపు వినియోగముంటే రూ.500, 500 వాట్లలోపు రూ.వెయ్యి, 500 వాట్లకు మించితే రూ.1500 చెల్లించి కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలి. మీటరు ఏర్పాటుచేయాలని కోరితే ఎల్.టి.కేటగిరీ రుసుములు వసూలు చేస్తారు. దరఖాస్తు చేయకుండా అక్రమ కనెక్షన్ తీసుకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సంస్థ హెచ్చరించింది.

కరీంనగర్ డీసీసీబీకి ఉత్తమ పురస్కారం

ఈనాడు, హైదరాబాద్: కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పనితీరు 2015-16లో మెరుగ్గా ఉన్నందున జాతీయ ఉత్తమ పురస్కారానికి ఎంపికైందని బ్యాంకు ఛైర్మన్ కొండ్రు రవీందర్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ సహకార బ్యాంకుల సమాఖ్య ఆధ్వర్యంలో చెన్నైలో జరిగిన సమావేశంలో తమిళనాడు సహకారశాఖ మంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు పేర్కొన్నారు. ఇది తెలంగాణకు గర్వకారణమన్నారు. కొండ్రు రవీందర్‌రావు తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టీఎస్‌క్యాబ్) ఛైర్మన్‌గానూ పనిచేస్తున్నారు. ఉత్తమ పురస్కారం అందుకున్నందుకు టీఎస్‌క్యాబ్ ఎండీ నేతి మురళీధర్, ఇతర ఉద్యోగులు ఆయనను అభినందించారు.

తెలంగాణ సామాజిక ఆర్థిక విశ్లేషణ తెలుగు ప్రతి విడుదల



తెలుగు ప్రతిని విడుదల చేస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ఎన్.నిరంజన్‌రెడ్డి, ప్రణాళికాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.పి.ఆచార్య

తెలంగాణ రాష్ట్ర సామాజిక ఆర్థిక విశ్లేషణ-2017 తెలుగు ప్రతిని రాష్ట్ర ప్రణాళికా శాఖ అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ఎన్.నిరంజన్‌రెడ్డి శుక్రవారమిక్కడ తెలుగు ప్రతిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రణాళికా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.పి. ఆచార్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఇది బాగా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఖైరతాబాద్‌లోని రాష్ట్ర అర్థగణాంక శాఖ కార్యాలయంలో ఈ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఆ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

మూడు నెలల్లో రైతుల పేరిట మార్పిడి

- వెలిమినేడు అక్రమ రిజిస్ట్రేషన్లపై 'రాంకీ' సంస్థ హామీ
- 'ఈనాడు' కథనానికి స్పందన

వెలిమినేడు(చిట్యాల), న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా వెలిమినేడులో రైతులకు తెలియకుండా తమ సంస్థ పేరిట ఏజెంట్లు రిజిస్ట్రేషన్ చేయించిన భూములను మూడు నెలల్లో సంబంధిత రైతులపేరిట మార్పిడి చేయించి అప్పగిస్తామని రాంకీ మల్టీ ప్రోడక్ట్ ఇండస్ట్రియల్ పార్క్ లిమిటెడ్ ఎండీ మేరెడ్డి గౌతమ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బాధిత రైతులతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. వెలిమినేడు రెవెన్యూ పరిధిలోని కొందరు రైతులకు చెందిన సుమారు 75 ఎకరాల భూమిని వారికి తెలియకుండా రాంకీ సంస్థ పేరిట తమ ఏజెంట్లు నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్టర్ చేయించారన్నారు. ఈ ఏడాది నవంబరు 10లోపు బాధిత రైతుల భూములను వారి పేరిట తమ సొంత ఖర్చులతో పట్టా మార్పిడి చేయించి న్యాయం చేస్తామని తెలిపారు.

వసుంధర

విరిగిన లిప్‌స్టిక్ కొత్తగా...



సౌందర్య ఉత్పత్తులు కొన్నిరోజులు వాడాక పాడి బారి, విరిగిపోతుంటాయి. వాటిని మళ్లీ కొత్తగా మార్చుకుని వాడుకోవాలంటే..

◆ **లిప్‌స్టిక్:** పెదాలకు పూత వేసుకునే లిప్‌స్టిక్ కొన్నిసార్లు తేమకోల్పోయి గట్టిగా అయిపోతుంది. రంగు మారిపోతుంది. దీన్ని వెలిగించిన కొవ్వొత్తి సెగ దగ్గర కాసేపు ఉంచితే చాలు మృదువుగా కావడంతోపాటు మంచి రంగూ కనిపిస్తుంది. ఆపై కాసేపు ఫ్రిజ్‌లో ఉంచితే మళ్లీ కొత్తదానిలా వాడుకోవచ్చు.

◆ **ఐలైనర్- మస్కారా:** సీసా నిండా మస్కారా ఉన్నా అది కొన్నిసార్లు వాడటానికి పనికిరాదు కారణం ఎండిపోవడమే. ఇలాంటప్పుడు ఒక చుక్క బాదం నూనెను వేసి బాగా కలపాలి. ఆ తరవాత వాడుకోవచ్చు.



◆ **గోళ్ల రంగు:** చక్కగా తయారయ్యాక చేతికి గోళ్లరంగు లేకపోతే ఏం బాగుంటుంది చెప్పండి? తీరా వేసుకుందామని చూసేప్పటికి అది ఎండిపోయిందా.... ఇలాంటప్పుడు మూడు నాలుగు చుక్కలు నెయిల్‌పాలిష్ రిమూవర్ కలిపితే చాలు. మళ్లీ వేసుకోవచ్చు.

◆ **కాంపాక్ట్ పౌడర్:** సగం వాడాక ఇది విరిగిపోతుంది. ఇలాంటప్పుడు కాస్త రబ్బింగ్ ఆల్కహాల్‌ని జతచేసి ఆ డబ్బాలో ఉంచితే సరి. కొత్తదానిలా కనిపిస్తుంది.

ఆ ఏకాంతం మీకోసమే!

ఇటీవలి కాలంలో మనం ఎక్కువగా వింటున్న ఆంగ్ల పదం.. 'మీ టైమ్'! గృహిణులైనా, ఉద్యోగినులైనా మనకంటూ మనం కేటాయించుకునే సమయం ఇది. అందరూ దీని గురించి చెబుతున్నారు కానీ.. ఈ సమయంలో మనం ఏం చేయాలి? ఏం చేయకూడదు? దానిపైనా ఓ స్పష్టత రావడం ముఖ్యం. అందుకోసమే ఇవి..

◆ **ఇవి వద్దు :** ఖాళీ సమయం దొరికింది కదాని సామాజిక మాధ్యమాల్లోకి వెళ్లిపోతుంటారు చాలామంది. వాటి ద్వారా జనాలతో ఏదోరకంగా 'కనెక్ట్' కావడం.. వాళ్ల ఊసులూ, ఫొటోలు చూడటం, జవాబివ్వడం ఇదంతా 'మీ టైమ్' అనిపించుకోదు. 'మరి వీటి వల్ల ఆనందం ఉందికదా!' అనొచ్చు. కానీ ఆ ఆనందం ఏరకంగానూ మీ ప్రగతికి ఉపయోగపడదు. 'మీ టైమ్' ఉద్దేశం అది కాదు.



◆ **మరేమిటీ? :** ఇది మీలో మీరు ఏకాంతంగా గడిపే విలువైన సమయం. మీ ఆలోచనలూ, ఉద్వేగాల్ని మీకు మీరు తనిఖీ చేసుకోవడానికి కేటాయించుకునే కాలం. గంటో, అరగంటో కేవలం ఆ దిశగానే ఈ సమయాన్ని వెచ్చించండి. ఈ రోజు, వారం లేదా గతవారం మీ పనుల్ని బేరీజు వేసుకోండి. ఇంతకన్నా చక్కగా చేయడానికి ఏం చేయొచ్చో ఆలోచించండి. మిమ్మల్ని ఇబ్బంది పెట్టే అంశాలని రాయండి! రాత ప్రతి బాధనీ మరిచిపోయేలా చేస్తుందనే విషయం మరవకండి.

◆ **సరదాలే వద్దా? :** నచ్చిన సినిమాలు చూడండి. పుస్తకం చదవండి. కానీ అవి కూడా మీతో మీరు జరిపే సంభాషణలానే ఉండాలి. మీ దృక్పథానికి దగ్గరగా అనిపించాలి. అంతేకాని.. కేవలం వినోదం కోసం కాదు. అందుకోసమైతే.. నలుగురితో కలిసే ఇవన్నీ చేయండి. దానికి 'మీ టైమ్' అక్కర్లేదు.

గతవారం ఓ చిన్న వార్త. 'సీఏ భవానీ దేవి కత్తియుద్ధకళలో ఛాంపియన్. ఐస్‌ల్యాండ్‌లో జరిగిన పోటీల్లో బంగారు పతకం సాధించింది! ఆ ఘనత సాధించిన తొలి భారతీయ అమ్మాయి. ప్రపంచ ర్యాంకింగ్‌లో 82 నుంచి 36కి చేరింది. అసలు ఈ ఆటలో ఇప్పటిదాకా వందలోపు ర్యాంకువాళ్లే మనదగ్గర లేరు..' అని దీని సారాంశం. అంతర్జాలంలో మరికాస్త వెతికితే అసలీ అమ్మాయి పేరు ఒక్కోచోట ఒక్కోలా ఉంది. కొన్నిచోట్ల ఈ అమ్మాయిపేరుని 'చదలవాడ ఆనంద సుందరరామన్' అని కూడా రాశారు!! అలా ఎందుకు రాశారబ్బా.. అని వెతకడం మొదలుపెడితే ఓ గమ్మత్తైన విషయం తెలిసింది. అదేంటంటారా?





ఈ తెలుగమ్మాయి కత్తికి.. ఎదురేలేదు!

సీఏ భవాని అంటే.. చదలవాడ ఆనంద సుందర రామన్ భవాని అని! ఈ అమ్మాయి పుట్టిపెరిగింది చెన్నైలో. అక్కడ తండ్రిపేరులోని తొలి అక్షరాలనే పేరుముందు పొడి అక్షరాలుగా వాడుకుంటారు. కాబట్టి 'చదలవాడ ఆనంద సుందరరామన్' అనే వీళ్ల నాన్న పేరుని 'సీఏ' అనే పొడి అక్షరాలుగా ఆమె పేరు ముందు తగిలించేశారు. కానీ దీన్ని ఉత్తరాది పత్రికలు ఈ పేరుని వేరుగా చూశాయి. వాళ్లకి ఇంటిపేరు చివర్లో ఉండటం ఆనవాయితీ కదా! అందుకని 'చదలవాడ ఆనంద సుందర రామన్ భవాని'లో.. భవానిని ఇంటిపేరుగా భావించాయి. దాన్ని వదిలేసి 'చదలవాడ ఆనంద సుందరరామన్' అనే పేరుతోనే ఆమె వివరాలని రాసేశాయి!! ఏదేమైతేనేం.. భవాని తెలుగమ్మాయనే విషయం అర్థమైంది! ఈ అమ్మాయి విజయం వెనక ఓ సామాన్య మధ్యతరగతి కుటుంబం పడ్డ ఆర్థిక ఇబ్బందులూ, స్ఫూర్తిమంతమైన తెగువా కళ్లముందు నిలిచాయి.

ఖరీదైన కళ.. ఫెన్సింగ్(కత్తియుద్ధం) మనదేశానికి ఓ పదిహేనేళ్లకిందటే ప్రాచుర్యం సంతరించుకోవడం ప్రారంభించింది. అందువల్లనో ఏమో ఈ ఆటకి కావాల్సిన దుస్తుల నుంచి శిక్షణదాకా ప్రతిదీ ఇక్కడ ఖరీదుతో కూడుకున్నదే! వీటికోసం ఈ కుటుంబం ఇప్పటిదాకా 50 లక్షల రూపాయల దాకా ఖర్చుపెట్టింది! అందులో ఎక్కువ భాగం రుణాలే. 'భవాని ఈ క్రీడల్లోకి వెళ్లిన రెండేళ్లలోనే మేమింత ఖర్చు పెట్టలేమని అర్థమైపోయింది. ఒక దశలో మాన్పించేద్దామనీ అనుకున్నాం. కానీ భవాని పెంచుకున్న తపన చూసి ఎంత ఖర్చయినా ఫర్వాలేదనుకున్నాం. ప్రతి కష్టాన్నీ పంటిబిగువున భరించాం. అదే ఇప్పుడు మా అమ్మాయిని ఛాంపియన్‌గా నిలిపింది. కానీ భవాని వెళ్లాల్సిన దూరం ఎంతో ఉంది. దానికోసం ఇంకెన్ని ఆర్థిక ఇబ్బందులు భరించడానికైనా మేం సిద్ధంగా ఉన్నాం..' అని చెప్పుకొచ్చింది భవానీ తల్లి రమణి.

ఐదుగురు పిల్లలు.. చదలవాడ సుందర ఆనందరామన్ పుట్టింది సామర్లకోటలో. ఏడేళ్లప్పుడే తండ్రితోపాటూ చెన్నై వచ్చేశారట. తర్వాత ఓ భవన నిర్మాణ సంస్థలో పర్యవేక్షకుడిగా చేసి ఈ మధ్యే విరమణపొందారు. రమణి.. చెన్నైలో పుట్టిన తెలుగువారు. ఈ దంపతులకి ఐదుగురు పిల్లలు. భవాని చివరమ్మాయి. పెద్దబ్బాయి క్రికెట్‌లో రాష్ట్రస్థాయి ఎంపికదాకా వెళ్లి తిరిగొచ్చాడు. రెండో అబ్బాయి వాలీబాల్ ఆటగాడు. వీళ్లతోపాటూ మరో ఇద్దరమ్మాయిలున్నారు. ఈ నలుగురూ చదువులో దిట్టలే. కానీ భవాని మాత్రం చిన్నప్పుడు పుస్తకమంటే అల్లంతదూరం పారిపోయేది. 'ఐదో తరగతి చదివేటప్పుడు ఓసారి పరీక్షలు జరిగి.. వాటి ఆన్సర్‌షీట్స్ ఇస్తున్నారు. నాకు మార్కులు చాలా తక్కువొస్తాయని తెలుసు. అందరి ముందూ అవమానానికి గురవుతానని అర్థమైంది. ఏం చేద్దాంరా.. దేవుడా! అనుకుంటున్నప్పుడే ఫెన్సింగ్, స్క్వాష్ ఆటల్లో శిక్షణ ఇస్తున్నామంటూ మా పీఈటీ మాస్టర్ వచ్చారు. ఆ రెండు పోటీలని అప్పుడే కొత్తగా చెన్నైలోని స్కూళ్లలో పరిచయం చేస్తున్నారు. మార్గం దొరికిందని ఆయనతోపాటూ గ్రౌండ్‌కి వెళ్లా. అలా మొదలైంది ఫెన్సింగ్‌తో నా పరిచయం..' అంటుంది భవాని. మూడునెలల్లోనే స్క్వాష్‌ని వదిలేసి ఫెన్సింగ్ నేర్చుకుందామె. 2005లో తొలిసారి జాతీయస్థాయి సబ్‌జూనియర్ పోటీల్లో ఎంపికై కాంస్యపతకం అందుకుంది. అదే తొలి పెద్ద విజయం. తర్వాత జూనియర్ స్థాయిలో స్వర్ణపతకం అందుకుంది. అలా ఈ తెలుగమ్మాయి ద్వారా తమిళనాడు రాష్ట్రానికి ఫెన్సింగ్‌లో తొలి బంగారు పతకం వచ్చింది! 2007లో తొలిసారి అంతర్జాతీయ క్రీడల్లోకి ప్రవేశించింది. కానీ ఇక్కడే ఆ తల్లిదండ్రులకి ఆర్థిక ఇబ్బందులూ ఎదురయ్యాయి. ఫెన్సింగ్ క్రీడలో వాడే కత్తీ, దుస్తులూ, ముసుగూ, చేతి తొడుగులూ, కవచాలూ.. చాలా ఖర్చుతో కూడుకున్నవని చెప్పుకున్నాం కదా! జాతీయస్థాయిదాకా ఇందుకోసం ఆ తల్లిదండ్రులు నాసిరకానివే వాడుతూ వచ్చారు! కానీ అంతర్జాతీయ పోటీల్లో ఎక్కువ నాణ్యమైనవి ఉంటే తప్ప ఒప్పుకోరు. పైగా రెండు జతలుండి తీరాలి. ఇందుకోసం కనీసం లక్షన్నర రూపాయలు ఖర్చయ్యేది. అదంతా భరించడానికే ఆ కుటుంబం సిద్ధమైంది.

చదువుల్లోనూ.. 'ఫెన్సింగ్ క్రీడల్లో రాణించడం.. నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. అది చదువుల్లోనూ కనపడింది. ఒకప్పుడు అంతంతమాత్రంగా ఉన్న నేను పదో తరగతిలో 95 శాతం మార్కులు సాధించుకున్నా! అప్పుడే కేరళలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కూడా నాకు ఫెన్సింగ్‌లో శిక్షణ ఇవ్వడానికి ముందుకొచ్చింది. అది నా జీవితాన్ని మార్చేసింది. అక్కడ సాగర్ లాగూ శిక్షణలో సింగపూర్ కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం అందుకుని.. ప్రపంచ ర్యాంకింగ్‌లో 93వ స్థానంలో నిలిచింది. ఓ భారతీయ అమ్మాయి వందలోపు ర్యాంకుకి చేరుకోవడం అదే తొలిసారి. తర్వాత 2012లో ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో వెండి అందుకుంది. 2014లో ఇటలీలో జరిగిన డెస్కనీ పోటీల్లో బంగారుపతకం అందుకుంది. మహిళా ఫెన్సింగ్‌లో మన భారత్ అందుకున్న తొలి స్వర్ణం కూడా అదే! ఈ విజయాలతో పాటూ ఈ కుటుంబం రుణాలూ పెరుగుతూ వచ్చాయి. ఇదిలా ఉంటే, ఓ తీవ్రమైన ఓటమి భవానిని వెక్కిరించింది. 2016 ఒలింపిక్స్ ఎంపికల్లో క్వార్టర్ ఫైనల్ దాకా వెళ్లి వెనుదిరిగింది భవాని. అది ఆమెలో కసి పెంచింది. విదేశాలకి వెళ్లి అంతర్జాతీయస్థాయి శిక్షణ తీసుకోవాలనుకుంది. ఖర్చు లక్షల్లోనే ఉంటుంది! ఆ కుటుంబం భారీగానే రుణాలు తీసుకుంది. గత ఫిబ్రవరి నుంచి జూన్ దాకా పదిహేడులక్షల ఖర్చుపెట్టి ఇటలీకి పంపించారు. అక్కడ నికోలా సనోటి అనే శిక్షకుడి దగ్గర చేరింది. దాని ఫలితమే.. ఆమె తాజాగా ఫిన్‌ల్యాండ్ అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సాధించిన స్వర్ణం!! ఈ విజయంతో భవాని 81వ ర్యాంకు నుంచి 36కి వచ్చింది!! ఇప్పటిదాకా 50లోపు ర్యాంకులు రష్యా, అమెరికా, ఫ్రాన్స్, జపాన్, దక్షిణ కొరియా దేశాలకే పరిమితం. భవాని సోబర్ ఫెన్సింగ్ నైపుణ్యంతో భారత్ తొలిసారి వాటి సరసన నిలిచింది మరి!

ఇన్ని విజయాలూ అమ్మవే.. తండ్రి ఆనందరామన్ క్రీడలకి వ్యతిరేకి కాదుగానీ.. ఆడపిల్ల ఇలా ఒంటరిగా వెళితే ఎలా? అని బాధపడేవారట. కానీ తల్లి రమణే ముందు నుంచీ భవానికి అన్నిరకాలా ధైర్యం నూరిపోస్తూ వస్తోంది. ఆర్థిక ఇబ్బందుల అలజడి భవానిని ఏమాత్రం తాకకుండా చూసుకుంటోంది. 'అమ్మ నాకు ఓ మోటివేటర్ లేని లోటుని పూడ్చింది. అమ్మలో ఆ నిబ్బరమే లేకుంటే.. నేను ఎప్పుడో ఫెన్సింగ్‌ని వదిలేయాల్సి వచ్చేది. అందుకే ఈ విజయాలన్నీ ఆమెకే సొంతమంటాన్నేను. ప్రస్తుతం టోక్యో ఒలింపిక్స్ కోసం సిద్ధమవుతున్నా.. అందులో నేనే పతకం సాధించినా ఆ ఘనత అమ్మదే!' అంటోంది భవాని. అమ్మ ప్రోత్సాహం ఇలా క్రీడలకే పరిమితం కాలేదు. చదువుల్లోనూ భవానిని దూసుకెళ్లేలా చేస్తోంది. అవును.. ఇప్పుడు భవాని ఎంబీఏ కూడా చదువుతోంది!!

– జె. రాజు

బంగళాబంతి భలేగా...



మనోహరమైన వర్ణాల్లో అందమైన పూలతో పరిసరాలను ఆహ్లాదకరంగా మార్చేసే ఏకవార్షికాల్లో జినియాకు ప్రముఖస్థానం ఉంది. దీని శాస్త్రీయనామం జినియా ఎలిగెన్స్. దీన్ని కామన్ జినియా అనీ ఎలిగెంట్ జినియా అనీ, బంగళాబంతి అనీ అంటారు.



మెక్సికోలో పుట్టినా ప్రపంచమంతా చుట్టేసిన అందమైన మొక్క ఇది . ఎంతో కాలంగా తోటల్లోనూ ఇళ్ల ముంగిళ్లలోనూ అందాలు విరజిమ్ముతున్న జినియా అంటే మొక్కల ప్రేమికులందరికీ ఇప్పటికీ ప్రాణమే. జినియాను మనోనిబ్బరానికీ, అజరామరమైన స్నేహానికీ సంకేతంగా భావిస్తారు. దీనిలో అనేక రకాలున్నాయి. జినియా ఎలిగెన్స్ రెండడుగుల ఎత్తు వరకూ పెరుగుతుంది. దీనిని వర్షాకాలంలో పెంచుకుంటారు. దీనికి పూర్తి ఎండ కావాలి. సారవంతమైన నీరు నిలవని మట్టి మిశ్రమం దీనికి అనుకూలం. ప్రోట్రేలలో నారు పోసుకుని నాటుకున్నా, కావలసిన చోట విత్తనాలను చల్లుకున్నా ఫరవాలేదు. నాటిన ఐదు ఆరు రోజుల్లో విత్తనాలు మొలకెత్తుతాయి.

తుంచితే ఎక్కువ పూలు...

జినియాలో ముద్ద రకాలతో పాటు ఒంటిరెక్క రకాలూ ఉన్నాయి. నారు నాటుకునేప్పుడు మరీ చిన్న మొక్కలు నాటుకుంటే ముద్దరకాలు కూడా పెరిగాక ఒంటి రెక్కలుగా మారే ప్రమాదం ఉంది. జినియా తెలుపూ, పసుపూ, గులాబీ, ఊదా, నారింజా, ఎరుపు రంగుల్లో పూస్తుంది. ఇలా ఇన్ని వర్ణాల్లో ఎక్కువ పూలు ఎక్కువ కాలం పాటు పూయడం, అవి కూడా ఎక్కువ రోజులు తాజాగా ఉండటం జినియాకే చెల్లింది. జినియాకు మట్టి మిశ్రమంలో పశువుల ఎరువుగానీ వర్మీకంపోస్టు కానీ బాగా కలుపుకోవాలి. మొక్కలు నాటుకున్న తరవాత నాలుగైదు వారాలకోసారి నీటిలో కరిగే పాలీఫీడ్ వంటి సమగ్ర ఎరువును లీటరు నీటికి మొక్కలు చిన్నగా ఉన్నప్పుడు ఐదుగ్రాముల చొప్పున, పూలు రావడం మొదలయ్యాక పది గ్రాముల వంతున కలిపి పోస్తూ ఉండాలి. లేత మొక్కల తలలు తుంచితే ఎక్కువ కొమ్మలతో గుబురుగా పెరుగుతాయి. ఎండిపోయిన పూలను ఎప్పటికప్పుడు తుంచివేస్తుంటే ఇంకా ఇంకా పూస్తాయి.



సారవంతమైన మట్టిమిశ్రమంతో...

జినియా నీళ్లు పోసేటప్పుడు ఆకుల మీద కాకుండా మొదళ్ల దగ్గర పోసేలా జాగ్రత్త తీసుకోవాలి. అలాగే దీనికి సాయంత్రాలు కాకుండా ఉదయం పూట నీళ్లు పోయడం మంచిది. ఎందుకంటే ఆకులు ఎక్కువ తడిగా ఉంటే బూడిద తెగులు జినియాలో సులువుగా వ్యాపిస్తుంది. మొక్కలు చిన్నగా ఉన్నప్పుడు నేల కొద్దిగా తేమగా ఉండేలా చూసుకోవాలి గానీ మొక్క ముదిరే కొద్దీ నీళ్లు తగ్గించవచ్చు. దీన్ని బోర్డరుగానూ, గుంపుగానూ, ఇతర మొక్కలతో కలిపి నాటడానికీ, పెంచుకోవడానికీ కూడా ఎంచుకోవచ్చు. కుండీల్లోకి పొట్టి రకాలు నప్పుతాయి. జినియా పూలు ఫ్లవర్ వాజుల్లో అలంకరించుకోవడానికి కూడా బాగుంటాయి. బూడిద తెగులుతోపాటు వాడు తెగులూ, ఆకుమచ్చా, రసం పీల్చే పురుగులూ, పిండి పురుగుల కూడా జినియాను ఆశించవచ్చు. మొక్కలకు బాగా గాలి తగిలేలా చూసుకోవాలి. సారవంతమైన మట్టి మిశ్రమాన్ని వాడటంతో పాటు క్రమపద్ధతిలో ఎరువులు వేసి, ఆకు కషాయాలను చల్లాలి. అలాగే ఆకులు పొడిగా ఉండేలా చూస్తే జినియా కూడా మీ తోటను ముచ్చటైన పూలతో నింపేస్తుంది. ఇది తేనెటీగలకూ, సీతాకోక చిలుకలకు కూడా ప్రియనేస్తమే. జినియా విత్తనాలు పూల విత్తనాలు అమ్మే అన్ని షాపుల్లోనూ సులువుగా దొరుకుతాయి.

-బోడెంపూడి శ్రీదేవి, ల్యాండ్‌స్కేప్ కన్సల్టెంట్

నజరానా

చేపలు వేయించే నూనెలో ఒక చెంచా నిమ్మరసం కూడా కలిపితే... ఘాటు వాసన రాకుండా ఉంటుంది.



బంగారం వెండి

10గ్రా॥ల ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	-------	-------	30,100	29,820
ఆర్నమెంట్	-------	-------	28,000	27,700
వెండి (కిలో)	-------	-------	40,500	40,300

	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	30,000	29,800	29,770	29,470
ఆర్నమెంట్	27,810	27,590	27,840	27,560
వెండి (కిలో)	40,400	39,900	39,700	39,200

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	30,200	29,920	-------	-------
ఆర్నమెంట్	27,780	27,530	2,784	2,756 గ్రా
వెండి (కిలో)	40,500	39,900	42.40	41.90 గ్రా

అతిగా తింటున్నారా?

శక్తికావాలంటే ఇంధనం అవసరం. అది మానవశరీరానికి ఆహారం ద్వారా అందుతుంది. జీవక్రియలు సక్రమంగా పనిచేయాలన్నా...రోజువారీ జీవనశైలి హాయిగా గడిచిపోవాలన్నా శక్తి అందాలి. లేదంటే సమస్యలే. అందుకే...




● **అల్పాహారాన్ని మానొద్దు...** ఇప్పటికే మనం ఈ మాట చాలాసార్లు విని ఉంటాం. రోజులో మనకు అవసరమైన కీలకమైన పోషకాలు అల్పాహారం నుంచే అందుతాయట. అలా తీసుకోకపోతే మాత్రం సమస్యలు తప్పవట. అల్పాహారం మానేస్తే మధ్యాహ్నం తీసుకునే ఆహారం, సాయంత్రం స్నాక్స్ వంటివన్నీ మితిమీరి తినే ప్రమాదం ఉంది. దీనివల్ల శరీరంలో చక్కెర్ల శాతం పెరిగిపోతుంది. అధిక బరువుకీ కారణం అవుతుంది.

● **చిన్న ప్లేట్లలో తినండి..** ప్లేటు పెద్దగా.. అందులో ఆహారం ముద్ద చిన్నగా (తక్కువగా) కనిపిస్తే మనం ఎక్కువ తినే ప్రమాదం ఉందట. అందుకే ఇంట్లో అన్నం తింటున్నప్పుడు వీలైనంత చిన్న ప్లేట్లలో పెట్టుకుని తినడానికి ప్రయత్నించండి. ఈ విషయాన్నేదో మామూలుగా చెప్పేయడం లేదండోయ్. ఇప్పటికే పలు అధ్యయనాలు దీన్ని నిరూపించాయి. అంతేకాదు ఎరుపూ, నీలం రంగుల్లోని ప్లేట్లలో ఆహారాన్ని తినడం వల్ల కూడా తక్కువ తినగలుగుతారట.

● **ఆకలిగా ఉన్నప్పుడే తినండి..** కొందరు ఒత్తిడిగా ఉన్నప్పుడో, ఖాళీగా ఉన్నామనో తరచూ ఏదో ఒకటి తింటుంటారు. దీనివల్ల అవసరానికి మించిన ఆహార పదార్థాలు తీసుకుంటారు. అందుకే మీకు నిజంగా ఆకలి వేసినప్పుడు మాత్రమే తినడానికి ప్రయత్నించండి. ఒకేసారి పెద్ద మొత్తంలో తినకుండా కొద్ది కొద్దిగా తినడానికి ప్రయత్నిండి. అంతేకాదు నిజమైన ఆకలి ప్రతినాలుగైదు గంటలకు అవసరం అవుతుంది. ఇలాంటప్పుడు ఓ పండూ, నట్స్ వంటివి తినగలిగితే మేలు.

● **శరీరం హైడ్రేటెడ్‌గా ఉండేలా చూసుకోండి...** తరచూ మెదడు చాలా అయోమయానికి గురవుతూ ఉంటుంది. శరీరం డీహైడ్రేషన్‌కి గురయినప్పుడు చాలామంది ఆకలి అని భావిస్తుంటారు. దీనివల్ల అవసరానికి మించి తింటుంటారు. అందుకే శరీరంలో తగినన్ని నీటినిల్వలు ఉండేలా చూసుకోవాలి. దానివల్ల జీర్ణశక్తి పనితీరూ మెరుగుపడుతుంది. ఆహారం తిన్నవెంటనే కనీసం రెండు గ్లాసులు నీళ్లు తాగాల్సిందే.

ఆలోచనలకు తాళం వేద్దాం



ఎప్పుడైనా గమనించారా! మీరు మీ ఆత్మీయుల కోసం ఎదురు చూస్తుంటారు. వాళ్లు వస్తానన్న సమయం దాటిపోతూ ఉంటుంది. ఫోన్ చేస్తే తీయరు. వెంటనే 'ఎందుకిలా పట్టించుకోరు? నా మీద కోపం వచ్చిందా? అంతగా నేనేం చేశాను?' అంటూ మొదలవుతుంది రొద. చివరికివి 'వచ్చేదారిలో ఏదైనా ప్రమాదం జరిగిందేమో..!' అని అనుకునేంతగా వెళతాయి! ఇలా అతిగా ఆలోచించే ధోరణి మహిళల్లోనే ఎక్కువని చెబుతున్నారు అమెరికా కాలిఫోర్నియాలోని అమెన్ క్లినిక్స్ సంస్థకి చెందిన పరిశోధకులు. ఈ ఆలోచనల జడిని సానుకూల అంశాలవైపూ మళ్లించొచ్చని చెబుతున్నారు. ఎలాగంటే..

◆ **దృష్టి మరల్చండి! :** ఓ చిన్న విషయానికే 'మా అనుబంధానికి ఇంతటితో ఆఖరేమో!' అనుకుని ఆందోళనపడే బదులు వేరే విషయాలపై దృష్టిపెట్టండి. పుస్తకం చదవడమో, పాటలు వినడమో, ఇంకెవరికైనా స్నేహితులకి ఫోన్ చేసి మాట్లాడటమో.. ఇలా ఎందులోనైనా మునిగిపోండి.

◆ **'అయితే కానివ్వండి' :** కొన్ని ప్రతికూల విషయాల్లో తుదికంటా ఆలోచించడం మనకు ఊరటనిస్తుంది. ఉదాహరణకి 'అతనికి మనపై ఇష్టంపోయిందేమో!' అని ఓ చిన్న ఆందోళన మనసులో మొదలైందని అనుకుందాం. 'అయితే కానివ్వు. ఏమవుతుంది? మన చేతిలో లేని విషయానికి ఏం చేస్తాం!' అనే రీతిలో ఆలోచించి చూడండి. మనసుకి ఓ రకమైన నిబ్బరం వస్తుంది. ఊహే అయినా పరిష్కారం దిశగా ఆలోచనలు మొదలవుతాయి! అలా ఆలోచించేలోపే 'అబ్బే! పరిస్థితి అంతదాకా రాలేదు కదా!' అని మనసు కుదుటపడుతుంది. ఆందోళన తగ్గుతుంది. ఈ ఆందోళనంతా మనసువేసే నాటకం అని ఇట్టే తేలిపోతుంది.

◆ **ఆశావాదంతో:** 'సగం నిండిన గ్లాసు' ఉదాహరణ మీకు తెలిసే ఉంటుంది. నిరాశావాదులు సగం గ్లాసు ఖాళీ అని బాధపడితే.. ఆశావాదులు సగమైనా నిండింది కదా అని సంతోషిస్తారట. బుర్రలో ఆందోళనలు ఎక్కువగా ఉన్నప్పుడు ఆశావాదం దాన్ని కట్టిడిచేస్తుంది. 'మంచే జరుగుతుందిలే!' అనే భావన సానుకూల అంశాలవైపు మీరు దృష్టిసారించేలా చేస్తుంది.

అమ్మకు క్యాన్సర్ ఉంది... నాకూ వస్తుందా?



? నా వయసు 32 సంవత్సరాలు. మా అమ్మకు ఈ మధ్యే రొమ్ముక్యాన్సర్ ఉందని తెలిసింది. మా పిన్నికి కూడా ఐదేళ్ల కిందట అండాశయ క్యాన్సర్ వచ్చింది. మా అమ్మని ఆసుపత్రికి తీసుకెళ్లినప్పుడు మాటల్లో.. మా అమ్మ వాళ్ల పిన్ని కూతురుకి కూడా రొమ్ముక్యాన్సర్ ఉందని చెప్పింది. ఇవన్నీ విన్న డాక్టర్లు నన్ను కూడా తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోమని చెబుతున్నారు. రొమ్ముక్యాన్సర్ వంశపారంపర్యంగా వస్తుందా? నాకూ రావచ్చా? అదే నిజమయితే నేను ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

- ఓ సోదరి

✔ సాధారణంగా ఐదు నుంచి పది శాతం వరకూ రొమ్ము, అండాశయ క్యాన్సర్లు వంశపారంపర్యంగా రావడానికి ఆస్కారం ఉంది. ఇక మీ విషయానికి వస్తే మీ రక్త సంబంధీకుల్లో అందులోనూ బాగా దగ్గరి సంబంధీకుల్లో రొమ్ము, అండాశయ క్యాన్సర్లు ఉన్నాయి కనుక మీరు కూడా హైరిస్క్ క్యాటగిరీలో ఉన్నట్టే లెక్క. మీ పరిస్థితిని హెరిడిటరీ బ్రెస్ట్ అండ్ ఓవేరియేన్ క్యాన్సర్ సిండ్రోమ్ అంటారు. క్యాన్సర్ వంశపారంపర్యంగా రావడానికి ఇతర జన్యువులతోపాటూ బ్రాకా1, బ్రాకా 2 అనే జన్యువులే కారణం. మీరు ముందుగా జెనెటిక్ టెస్టింగ్ చేయించుకోవాలి. అంటే రక్తపరీక్ష చేస్తారు. అందులో పాజిటివ్ అని వస్తే... ముందుగా జెనెటిక్ కౌన్సెలింగ్ ఇచ్చి చికిత్స మొదలుపెడతారు. బ్రాకా-1 విషయంలో పాజిటివ్ వస్తే జీవితకాలంలో రొమ్ముక్యాన్సర్ రావడానికి 80 శాతం ఆస్కారం ఉందని అర్థం. అలాగే 60 శాతం అండాశయ క్యాన్సర్ రావచ్చు. ఇక బ్రాకా2 విషయంలో పాజిటివ్ వస్తే రొమ్ము, అండాశయ క్యాన్సర్లతోపాటూ పాంక్రియాటిక్ క్యాన్సర్ కూడా రావచ్చు. రొమ్ము కాన్సర్ వచ్చే ప్రమాదాన్ని అంచనా వేస్తే, ముప్పు మరీ ఎక్కువగా ఉందని తేలినప్పుడు ముందు జాగ్రత్తగా ఏం చేయాలో సూచిస్తారు. దానికి రొమ్ముల్ని తీసేయడం ఒక పరిష్కారం. అలాగే అండాశయ క్యాన్సర్ రావొచ్చని గుర్తిస్తే ముందుగానే కొన్ని ప్రత్యామ్నాయాల్ని సూచిస్తారు. ఇక కీమోప్రివెన్షన్ అనే పద్ధతీ ఉంది. అంటే ముందస్తు జాగ్రత్తగా కొన్ని మాత్రలు ఇస్తారు. అవసరమైతే మామోగ్రఫీ, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోమంటారు. కాబట్టి మీరు వైద్యులు సూచించినట్టే పరీక్షలు చేయించుకోవడం మంచిది.

ఆర్థిక సర్వే II

పర్యాటకంలో భారత్‌కు గొప్ప అవకాశాలు



దేశంలో పర్యాటకానికి గొప్ప అవకాశాలు మిగిలే ఉన్నాయని సర్వే తేల్చిచెప్పింది. ప్రయాణ, పర్యాటక పోటీతత్వ సూచీ-2017లో మొత్తం 136 దేశాల్లో భారత్ 12 స్థానాలు మెరుగుపరచుకుని 40వ స్థానానికి చేరింది. అయినప్పటికీ.. ఇతర దేశాలతో పోలిస్తే ఆరోగ్యం, శుభ్రత, భద్రత, మానవ వనరులు, పర్యాటక సేవల మౌలిక వసతుల విషయంలో వెనకబడి ఉంది. పరిశ్రమ అంచనాల ప్రకారం.. భారత పర్యాటక, ఆతిథ్యరంగ మార్కెట్ పరిమాణం 2014లో 117.7 బిలియన్ డాలర్లు ఉండగా.. 2022 కల్లా 418.9 బిలియన్ డాలర్లకు చేరొచ్చు. అంటే పర్యాటక రంగంలో బంగారం లాంటి అవకాశాలు ఇంకా అందిపుచ్చుకోవాల్సి ఉందని ఈ సర్వే చెబుతోంది.



భారతమా పరుగిడు

సంస్కరణల పథం పట్టిన దేశీయ ఆర్థిక వ్యవస్థ మరింత ముందుకెళ్లడం తథ్యమని ఆర్థిక సర్వే రెండోభాగం (తొలి మధ్యంతర ఆర్థిక సర్వే) చెబుతోంది.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రపంచంలోని అత్యుత్తమ దేశాల్లో మనదీ ఒకటని తేల్చి చెప్పింది.

కొన్ని రంగాల్లో సవాళ్లన్నాయంటూనే, పరిష్కారాలను చూపింది. ఈ ఏడాది కీలక రేట్లు తగ్గొచ్చని ఊరటనిచ్చింది.

ఎయిరిండియా ప్రైవేటీకరణ ఆలోచన మంచిదని చెప్పింది.

అభివృద్ధి చెందిన దేశాలు విధిస్తున్న వీసా నిబంధనల వల్ల, ఐటీ రంగానికి ఇబ్బందేనని అంచనా వేసింది.

నిర్మాణ రంగంలో విదేశీ పెట్టుబడులు తగ్గాయని.. టెలికాం రంగంలో మొండి బకాయిలు పెరిగాయని, వాణిజ్య లోటు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసింది.

ఉక్కు రంగ ఎగుమతులు పెరగడంపై సంతోషం వెలిబుచ్చింది.

కీలక రేట్లు తగ్గొచ్చు

ద్రవ్యోల్బణం తక్కువ స్థాయిల్లో ఉన్న కారణంగా రిజర్వ్ బ్యాంక్ తన కీలక రేట్లను 25-75 బేసిస్ పాయింట్ల మేర తగ్గించే అవకాశం ఉందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. వాస్తవ తటస్థ వడ్డీ రేట్లు 1.25-1.75 శాతం మధ్య చలించొచ్చు. అంటే ద్రవ్యోల్బణ లక్ష్యం 4 శాతం అనుకుంటే రేట్లు 5.25-5.75 శాతం వద్ద ఉండొచ్చు. ప్రస్తుతం రేటు 6 శాతంగా ఉంది. అంటే తటస్థ రేటు కంటే 25-75 బేసిస్ పాయింట్లు ఇది ఎక్కువగా ఉందన్నమాట.

మొండి బకాయిల్లో పెరిగిన టెలికాం వాటా

బ్యాంకింగ్ వ్యవస్థలోని మొండి బకాయిల్లో టెలికాం రంగ వాటా పెరగడంపై సర్వే ఆందోళన వెలిబుచ్చింది. రిలయన్స్ జియో వల్ల పోటీ తీవ్రమై, టెలికాం కంపెనీల ఆదాయాలు క్షీణించడం ఇందుకు నేపథ్యం. జియో రాకతో జనవరి-మార్చి 2017లో ఇతర కంపెనీలు వాయిస్ కాల్స్ ఛార్జీలు, డేటా ఛార్జీలు తగ్గించుకోవాల్సి వచ్చింది. 2015-16లో టెలికాం రంగ ఎన్‌పీఏలు రూ.3465 కోట్లు ఉండగా.. 2016-17లో రూ.2335 కోట్లకు తగ్గినప్పటికీ.. శాతం వారీగా చూస్తే టెలికాం వాటా 5 శాతం నుంచి 8.7 శాతానికి పెరిగింది.

అత్యంత స్వేచ్ఛా విపణి మనదే

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ)ను ఆకర్షించడంలో ప్రపంచంలోని అత్యంత స్వేచ్ఛా విపణుల్లో భారత్ కూడా ఒకటని ఆర్థిక సర్వే పేర్కొంది. పలు సరళీకరణ చర్యల వల్ల ఈ స్థాయికి చేరామని తెలిపింది. 2016-17లో 43.3 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ దేశంలోకి వచ్చింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 8 శాతం ఎక్కువే కాకుండా.. ఇదే గరిష్ఠ స్థాయి కావడం విశేషం. సేవల (ఆర్థిక, బ్యాంకింగ్, బీమా) రంగం అత్యధిక ఎఫ్‌డీఐని రాబడుతోంది. ఆ తర్వాతి స్థానాల్లో టెలికమ్యూనికేషన్లు, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రంగాలున్నాయని సర్వే పేర్కొంది. మారిషస్, సింగపూర్, జపాన్‌ల నుంచి అత్యధికంగా వరుసగా 36.2%, 20%, 10.8 శాతం చొప్పున ఎఫ్‌డీఐలొచ్చాయి.

మన ఐటీకి వీసా కష్టాలు

అమెరికా వంటి దేశాలు ఉద్యోగ వీసాలపై కఠిన ఆంక్షలు విధించడం; తూర్పు ఐరోపాలోని కొత్త కంపెనీల నుంచి పోటీ వస్తుండడం; డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యం ఉన్న మానవ వనరుల కొరత, దేశీయంగా రెండు, మూడో అంచె నగరాల్లో మౌలిక వసతుల కొరత కారణంగా భారత ఐటీ- బీపీఎం రంగానికి సవాళ్లు ఎదురవుతాయని సర్వే తెలిపింది. అంతర్జాతీయ మందగమనం, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో, ఖాతాదారులు నిర్ణయం తీసుకోవడంలో, పెట్టుబడులు పెట్టడంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు.



- **బ్యాంకులు పరపతి విధాన రేట్లను తమ ఖాతాదార్లకు అసంపూర్తిగా బదిలీ చేయడం వల్ల ఆర్థిక వ్యవస్థలో స్తబ్దత నెలకొంది.**
- **తూర్పు ఐరోపా, లాటిన్ అమెరికా దేశాల నుంచి గ్లోబంట్, ఈపీఏఎమ్, లక్సాఫ్ట్ వంటి కొత్త కంపెనీలు రావడంతో మన ఐటీ కంపెనీలకు తీవ్ర పోటీ ఎదురవుతోంది.**
- **ఐటీ సేవల కంపెనీల్లోని సగం మంది వచ్చే 3-4 ఏళ్లలో అప్పటి సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉండకపోవచ్చని మెకిన్సే అండ్ కంపెనీ నివేదిక అంటోంది.**
- **ఐటీ-బీపీఎమ్ ఎగుమతులు 7.6% వృద్ధితో 117 బిలియన్ డాలర్లకు చేరొచ్చని అంచనా. యాంత్రీకరణ వల్ల భారత్‌లో 69% ఉద్యోగాలకు ఇబ్బందులు తలెత్తవచ్చని అంచనా.**
- **మొత్తం అంతర్జాతీయ ప్రయాణికుల్లో ఎయిరిండియా వాటా 11.4 శాతంగా ఉంది. మనకున్న భౌగోళిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని దిగ్గజ నగరాలను గుర్తించాలి.**
- **గత మూడేళ్లలో ఎనిమిది నగరాల్లో గిరాకీ తగ్గడంతో 2016లో అయిదేళ్ల కనిష్ఠ స్థాయికి గృహ విక్రయాలు పడిపోయాయి. కేవలం 2,45,000 ఇళ్లే అమ్ముడుపోయాయి.**
- **27.5 కోట్ల మంది స్మార్ట్‌ఫోన్ వినియోగదార్లతో, ఈ రంగంలో అమెరికాను అధిగమించి రెండో అతిపెద్ద దేశంగా భారత్ అవతరించింది.**
- **భారత కంపెనీలు గత ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ బాండ్ల ద్వారా రూ.6.7 లక్షల కోట్ల నిధులను సమీకరించాయి.**

ఉక్కు ఎగుమతులు రెండింతలు

దేశీయ ఉక్కు రంగాన్ని కాపాడడం కోసం ప్రభుత్వం తీసుకున్న కొన్ని చర్యల కారణంగా 2016-17లో ఉక్కు ఎగుమతులు రెండింతలై 8.2 మిలియన్ టన్నులకు చేరుకున్నాయి. దిగుమతులు మూడో వంతు తగ్గాయి. ముఖ్యంగా చైనా నుంచి వస్తున్న చౌక దిగుమతులకు అడ్డుకట్ట వేయగలిగాం. ఉక్కు రంగ సామర్థ్యం పెరగడం వల్ల కూడా ఎగుమతులు పెరిగాయని సర్వే వివరించింది. దిగుమతులు మాత్రం 36.6% తగ్గి 7.4 మిలియన్ టన్నులకు పరిమితయ్యాయి.

దుస్తుల ఎగుమతులు పెంచాలి

ఉత్పత్తి ఖర్చులు పెరిగినందున, దుస్తులు, తోళ్లు, పాద రక్షల ఎగుమతుల్లో చైనా వాటా అంతర్జాతీయ విపణిలో గణనీయంగా తగ్గిన నేపథ్యంలో.. ఈ రంగాల్లో భారత్ విస్త రించాల్సిన సమయం ఆసన్నమైంది. సరైన పన్నుల విధానం, కార్మిక నిబంధనలు, అధిక రవాణా ఖర్చులకు పరిష్కారం చూపాల్సి ఉంది. తక్కువ మూలధనంతో అధిక ఉద్యోగాలు సృష్టించగల రంగాల్లో తోళ్లు, పాదరక్షల పరిశ్రమ ఒకటి. పోటీ దేశాలైన బంగ్లాదేశ్, వియత్నాంలలో అమెరికా, ఐరోపా సమాఖ్య, జపాన్ వంటి విపణులకు పంపించే ఎగుమతులపై ఎటువంటి సుంకాలు లేవు.

నిర్మాణరంగంలో ఎఫ్‌డీఐలు తగ్గాయ్

గత రెండు మూడేళ్లలో నిబంధనలు సడలించినా, గత ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ) 59 శాతం క్షీణించి సుమారు రూ.12,300 కోట్లకు పరిమితమయ్యాయని సర్వే చెబుతోంది. 2015-16లో సుమారు రూ.29,900 కోట్ల ఎఫ్‌డీఐ వచ్చింది. గత కొన్నేళ్లుగా స్థిరాస్తి రంగంలో గిరాకీ తగ్గుతూ వచ్చింది. గృహ విక్రయాల్లో క్షీణత, ప్రాజెక్టుల పూర్తికి ఆలస్యం, డెవలపర్ల అప్పుల్లో పెరుగుదల, అనుమతుల్లో ఆలస్యం, భూముల రిజిస్ట్రేషన్ వ్యయాలు వంటివి ఇందుకు కారణం.

ఎయిరిండియా ప్రైవేటీకరణ మంచిదే

ఎయిరిండియా ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వం మంచి ఆలోచన చేస్తోందని సర్వే అభివర్ణించింది. ప్రైవేటీకరణ, పెట్టుబడుల ఉపసంహరణ వల్ల ఎయిరిండియా కార్యకలాపాలు, యాజమాన్య సామర్థ్యం పెంచొచ్చు.

అంతర్జాతీయ విమాన రద్దీలో మన వాటా తక్కువే: అంతర్జాతీయ విమాన రద్దీలో మన వాటా తక్కువగా ఉందని సర్వే పేర్కొంది. సిక్స్త్ ఫ్రీడమ్ ఆఫ్ ద ఎయిర్ (ఒక విదేశం నుంచి మరో విదేశానికి వెళ్లే సమయంలో సొంత దేశంలో ఆగడానికి ఇది అనుమతిస్తుంది) వల్ల భారత విమానాల అంతర్జాతీయ రద్దీ 25 శాతం (2011-12) నుంచి 20.5 శాతానికి (2015-16) తగ్గింది. దుబాయ్, సింగపూర్ వంటి అంతర్జాతీయ కేంద్రాల ద్వారా ప్రయాణికులు రాకపోకలు చేయడం వల్ల కూడా మన వాటా తగ్గుతోంది. కనీసం 20 విమానాలున్న దేశీయ సంస్థలే అంతర్జాతీయ కార్యకలాపాలు నిర్వహించాలన్న నిబంధనపై ప్రభుత్వం పునరాలోచించాలి.



వాణిజ్య లోటుపై ఆందోళన

పెరుగుతున్న వాణిజ్య లోటుపై ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. వాణిజ్య పరంగా నిబంధనలు కఠినంగా ఉండడం ఇందుకు నేపథ్యమని తెలిపింది. గత అయిదేళ్లలో అంతర్జాతీయ ఎగుమతుల్లో భారత వాటా 1.7 శాతం వద్ద నిలిచిపోయింది. దిగుమతుల్లో వృద్ధి పెరగడం; ఎగుమతుల్లో వృద్ధి ఓ మోస్తరుగా ఉండడం వల్ల 2017-18 ఏప్రిల్-జూన్‌లో భారత వాణిజ్య లోటు 108.2 శాతం పెరిగింది. కొంత ఊరటనిచ్చే విషయం ఏమిటంటే.. 2014-15 నుంచి వాణిజ్య లోటు తగ్గుతూ 2016-17లో 108 బిలియన్ డాలర్లకు చేరింది.

పారిశ్రామికోత్పత్తి మైనస్‌లోకి

జూన్‌లో -0.1 శాతానికి ఐఐపీ

దిల్లీ: పారిశ్రామికోత్పత్తి వృద్ధి మైనస్ స్థాయిలోకి అడుగుపెట్టింది. తయారీ, భారీ యంత్రపరికరాల రంగాల్లో ఉత్పత్తి క్షీణత కారణంగా జూన్‌లో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) -0.1 శాతానికి దిగివచ్చింది. గనులు, విద్యుదుత్పత్తి, మౌలిక/ నిర్మాణ రంగ వస్తువులు, వినియోగ వస్తువుల రంగాలు కూడా నెమ్మదించాయి. పారిశ్రామికోత్పత్తిని పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ఆధారంగా లెక్కిస్తారు. గతేడాది జూన్‌లో ఇది 8 శాతం వద్ద ఉంది. ఏప్రిల్- జూన్ విషయానికొస్తే పారిశ్రామికోత్పత్తి సూచీ 2 శాతానికి పడిపోయింది. ఏడాదిక్రితం ఇదే సమయంలో సూచీ 7.1 శాతం వద్ద ఉండటం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పారిశ్రామికోత్పత్తి (-)ప్రతికూల వృద్ధి బాట పట్టడం ఇదే మొదటిసారి. ఏప్రిల్‌లో ఐఐపీ 3.4 శాతం వద్ద ఉండగా.. మేలో 2.8 శాతంగా నమోదైంది. పారిశ్రామికోత్పత్తి క్షీణించిన నేపథ్యంలో సంస్కరణలతో పాటు పెట్టుబడులు పెరిగేందుకు, మౌలిక సదుపాయాల వృద్ధికి తక్షణ చర్యలను ప్రభుత్వం తీసుకోవాలని అసోచామ్ సెక్రటరీ జనరల్ డి.ఎస్.రావత్ కోరారు. ఫిక్కీ సెక్రటరీ జనరల్ దిదార్ సింగ్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

- ఐఐపీ సూచీలో 77 శాతం వాటా ఉండే తయారీ రంగ వృద్ధి రేటు జూన్‌లో 0.4 శాతం తగ్గింది. ఏడాదిక్రితం ఇదే నెలలో తయారీ రంగం 7.5 శాతం వృద్ధిని నమోదు చేసింది. గనులు, విద్యుత్ రంగాల ఉత్పత్తి కూడా వరుసగా 0.4%, 2.1% చొప్పున తగ్గాయి.
- భారీ యంత్రపరికరాల రంగ ఉత్పత్తి వృద్ధి ఏడాది క్రితం నమోదైన 14.8 శాతం నుంచి 6.8 శాతానికి తగ్గింది.

ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిజమే

సత్యం కేసులో శాట్

ముంబయి: సత్యం కుంభకోణం కేసులో జరిమానాలకు సంబంధించి తాజా ఉత్తర్వులు జారీ చేయాలని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)ను సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (శాట్) ఆదేశించింది. సత్యం కుంభకోణానికి సంబంధించి రామలింగ రాజు, ఆయన తల్లి బి.అప్పలనరసమ్మ, ఆయన కుమారులు బి.తేజరాజు, బి.రామరాజు, సోదరుడు బి.సూర్యనారాయణరాజుతో పాటు రాజు సోదరులు నిర్వహించే ఎస్‌ఆర్‌ఎస్‌ఆర్ హోల్డింగ్స్‌పై సెబీ గతంలో జరిమానా విధించింది. స్టాక్ మార్కెట్లలో ఏడేళ్లపాటు పాల్గొనకుండా కూడా 2015లో నిషేధించింది. రాజు సోదరులిద్దరు రూ.543.93 కోట్లు చెల్లించాలని 2014 జులైలో సెబీ ఆదేశించిన సంగతి విదితమే. వీరు ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడినట్లు సెబీ ఇచ్చిన తీర్పును అంగీకరిస్తూనే, వారిపై విధించిన జరిమానాలకు సంబంధించి తాజా ఆదేశాలివ్వాలని కోరింది. సెబీ తాజా ఆదేశాలిచ్చేందుకు 4 నెలల గడువు విధించింది. సత్యం రామలింగ రాజు సోదరుడు సూర్యనారాయణ రాజు భార్య ఝాన్సీ రాణి ఇన్‌సైడర్ ట్రేడింగ్ కంటే ఏడాది ముందుగా, 2001లోనే సత్యం షేర్లను విక్రయించినందున, ఆమెకు సంబంధించి సెబీ ఆదేశాలను శాట్ పక్కన పెట్టింది.

ఔషధ ఎగుమతుల్లో 10% వృద్ధి

2017-18పై ఫార్మెగ్జిల్ అంచనా

ఈనాడు, హైదరాబాద్: సమీప భవిష్యత్తులో అనేక ఔషధాల మేధో సంపత్తి హక్కుల గడువు ముగియనుందని, జనరిక్ ఔషధాల ఉత్పత్తికి ఆకర్షణీయ అవకాశాలు లభిస్తాయని భారత ఔషధ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఫార్మెగ్జిల్) ఛైర్మన్ మదన్ మోహన్ రెడ్డి తెలిపారు. దేశీయ పరిశ్రమకు సాంకేతికంగా ఉన్న బలాల కారణంగా పరిశ్రమ ఏడాదికి 15 శాతం పైగా వృద్ధి చెందగలదని చెప్పారు. ఔషధ పరిశ్రమ వినియోగించే పరికరాలు, ఇతర సామగ్రిని ప్రదర్శించడానికి యూబీఎం ఇండియా ఏర్పాటు చేసిన 'ఫార్మాలిటికా'ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో ఔషధ ఎగుమతులు దాదాపు 8 శాతం పెరిగాయని.. 2017-18లో 10 శాతం వృద్ధి చెందడానికి అవకాశం ఉందని మదన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఫార్మాలిటికా ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. దేశీయ ఔషధ పరిశ్రమకు హైదరాబాద్ కేంద్రంగా ఉందని, హైదరాబాద్‌లో రానున్న ఔషధ నగరి ఈ రంగంలోకి భారీగా పెట్టుబడులను తీసుకురాగలదని, ఈ ప్రాజెక్టు పనులు సాగుతున్నాయని జయేశ్ చెప్పారు. దేశంలో ఔషధ ధరలపై ఎక్కువ నియంత్రణ మంచిది కాదని భారత ఔషధ సంఘం (ఐపీఏ) అధ్యక్షుడు రావు.వి.ఎస్.వి. వడ్లమూడి తెలిపారు. వరుసగా నాలుగో ఏడాది హైదరాబాద్‌లో ఫార్మాలిటికా నిర్వహిస్తున్నామని, ఈ సారి అత్యధికంగా 150 మంది కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నాయని యూబీఎం ఇండియా ఎండీ యోగేశ్ ముద్రాస్ తెలిపారు.



ఫార్మాలిటికాను ప్రారంభిస్తున్న ఫార్మెగ్జిల్ డీజీ ఉదయ్ భాస్కర్, భారత ఔషధ సంఘం అధ్యక్షుడు రావు వడ్లమూడి, తెలంగాణ పీఎస్ జయేశ్ రంజన్, యూబీఎం ఇండియా ఎండీ యోగేశ్ ముద్రాస్ తదితరులు

ఆరు సంస్థలపై ఆంక్షల ఎత్తివేత

14 నుంచి ట్రేడింగ్ యథాతథం

ముంబయి: అనుమానిత డొల్ల కంపెనీలుగా పేర్కొన్న ఆరు సంస్థల షేర్ల ట్రేడింగ్‌పై సెబీ విధించిన ఆంక్షలను సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (శాట్) ఎత్తివేసింది. వీటిల్లో పార్శ్వనాథ్ డెవలపర్స్‌తో పాటు కవిత్ ఇండస్ట్రీస్, పిన్‌కాన్ స్పిరిట్, సిగ్నెట్ ఇండస్ట్రీస్, ఎస్‌క్యూఎస్ ఇండియా, బీఎఫ్‌ఎస్‌ఐ, కేకల్వన ఇండస్ట్రీస్ ఉన్నాయి. కంపెనీల వివరణ తెలుసుకొని, దర్యాప్తు నిర్వహించాల్సిందిగా సెబీకి శాట్ సూచించింది. ఈ ఆరు కంపెనీల అప్పీళ్లపై జారీ చేసిన ఆర్డరుకు అనుగుణంగా గురువారం జేకుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్, ప్రకాశ్ ఇండస్ట్రీస్‌కు సంబంధించి ఇచ్చిన ఆదేశాలను మార్పు చేసింది. 'గత మూడేళ్లకు కంపెనీలు సమర్పించిన వార్షిక టర్నోవరు నివేదికలను పరిశీలించాక, అవి సరిగ్గానే ఉన్నాయనే అంచనాకు వచ్చాం. అందువల్ల ఆంక్షల నిలిపివేతను కొనసాగిస్తున్నాం. అలాగే ఎక్స్ఛేంజీలు కూడా సాధ్యమైనంత మేర ఈ కంపెనీల షేర్ల ట్రేడింగ్‌పై విధించిన ఆంక్షలను వెనక్కి తీసుకోవాల'ని ముగ్గురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఆదేశాలిచ్చింది. దీంతో సోమవారం నుంచి ఈ ఆరు కంపెనీల షేర్ల ట్రేడింగ్ యథాతథంగా కొనసాగనుంది.

కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇచ్చిన జాబితా మేరకు 331 అనుమానిత డొల్ల కంపెనీల షేర్ల ట్రేడింగ్‌పై ఆంక్షలు విధించాలని ఎక్స్ఛేంజీలకు సెబీ సూచించిన సంగతి తెలిసిందే. సెబీ ఆదేశాలను సవాలు చేస్తూ కంపెనీలు ఒక్కోటి శాట్‌ను ఆశ్రయిస్తున్నాయి. పీఏసీఎల్‌తో తమకు ఎలాంటి సంబంధాలు లేవని పార్శ్వనాథ్ ఛైర్మన్ ప్రదీప్ జైన్ స్పష్టం చేశారు. ఈ విషయంలో జేకుమార్ ఇన్‌ఫ్రా ఇంకా స్పందించలేదు. నమోదుకాని 107 సంస్థల వివరాలను పరిశీలించి, ఏమైనా అక్రమాలు చోటుచేసుకున్నట్లు తేలితే వీటి షేర్ల ట్రేడింగ్‌పై నిషేధం విధించాలని ఎక్స్ఛేంజీలకు సెబీ సూచించింది.

మాల్యా పిటిషన్ తిరస్కరణ: సెక్యూరిటీస్ మార్కెట్ల నుంచి తనను నిషేధిస్తూ, సెబీ ఆదేశాలివ్వడాన్ని సవాలు చేస్తూ విజయ్ మాల్యా దాఖలు చేసిన పిటిషన్‌ను శాట్ తిరస్కరించింది. 3 వారాల్లోగా సెబీ ముందు వ్యక్తిగతంగా లేదా తన తరఫు న్యాయవాది ద్వారా హాజరుకావాలని సూచించింది.

1.78 లక్షల డొల్ల కంపెనీల గుర్తింపు రద్దు: చాలా ఏళ్లుగా కార్యకలాపాలు నిర్వహించని దాదాపు 1.78 లక్షల కంపెనీల గుర్తింపును ప్రభుత్వం రద్దు చేసిందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు.

కార్పొరేట్ రుణాల్లో ఒక్క రూపాయీ రద్దు చేయలేదు

ఆర్థిక మంత్రి జైట్లీ



దిల్లీ: కార్పొరేట్ సంస్థలకు ఇచ్చిన రుణాల్లో ఒక్క రూపాయిని కూడా కేంద్ర ప్రభుత్వం రద్దు చేయలేదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. కార్పొరేట్ రుణాలను సాంకేతికంగా రద్దు చేయడం (రైట్‌ఆఫ్) అనేది ఆయా బ్యాంకులు వ్యాపారపరంగా తీసుకుంటున్న నిర్ణయమని తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన తమ ప్రభుత్వం, రైతుల రుణ మాఫీకి సంబంధించి ఎటువంటి పథకాన్ని తీసుకురాలేదని గుర్తు చేశారు. రైతుల రుణాలు మాఫీ చేయకుండా కార్పొరేట్ రుణాలను రద్దు చేస్తున్నారని ఆరోపిస్తున్న ప్రతిపక్షాలు, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని జైట్లీ సూచించారు.

కఠిన చర్యలు తీసుకుంటాం: డొల్ల కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని జైట్లీ స్పష్టం చేశారు. అలాగని దూకుడుగా వ్యవహరించబోమని, వ్యాపార అనుకూల వాతావరణాన్ని కాపాడతామని హామీ ఇచ్చారు. డొల్ల కంపెనీలకు సంబంధించి కంపెనీల చట్టంలో ఎటువంటి నిర్వచనం లేదని అయితే నగదును అక్రమంగా తరలించేందుకు వీటిని వినియోగిస్తున్నారని లోక్‌సభకు వెల్లడించారు. ఇటువంటి కంపెనీల వెనుక ఉండే అసలైన వ్యక్తులను వేగంగా గుర్తించి బినామీ, ఆదాయపు పన్ను చట్టాల కింద కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందని తెలిపారు. ఎటువంటి కార్యకలాపాలు చేపట్టని (డార్మాంట్) సంస్థలు, డొల్ల (షెల్) కంపెనీలకు తేడా ఉందన్నారు.

'నోకియా 5'కు బిగ్ సిలో ప్రీ బుకింగ్

హైదరాబాద్ (మాదాపూర్) న్యూస్‌టుడే: నోకియా ఫోన్ల తయారీ సంస్థ హెచ్ఎండీ గ్లోబల్ రూపొందించిన 'నోకియా 5' ని శుక్రవారమిక్కడ ఆవిష్కరించారు. మాదాపూర్‌లోని బిగ్ సి షోరూంలో హెచ్ఎండీ గ్లోబల్ జీఎం టి.ఎస్. శ్రీధర్, బిగ్ సి మొబైల్స్ ఛైర్మన్ ఎం.బాలుచౌదరి ఈ ఫోన్‌ను విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని బిగ్‌సి, లాట్ విక్రయశాలల్లో ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చన్నారు. 5.2 అంగుళాల తెర, 2 జీబీ ర్యామ్, 16 జీబీ అంతర్గత మెమొరీ వంటి ఫీచర్లున్న దీని ధర రూ.12,899. 15 నుంచి కొనుగోలు చేయవచ్చు. ల్యాప్‌టాప్ బ్యాగును ఉచితంగా పొందొచ్చు.



నోకియా-5 స్మార్ట్ ఫోన్‌ను ఆవిష్కరిస్తున్న హెచ్ఎండీ గ్లోబల్ జీఎం టీఎస్ శ్రీధర్, బిగ్-సి మొబైల్స్ ఛైర్మన్ బాలు చౌదరి

సెన్సెక్స్ ▼ 318 **31214**

నిఫ్టీ ▼ 109 **9711**

రూపాయి 64.13 ▼ 05 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

బంగారం 29,210 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 140

వెండి 39,110 ▲ ముంబయిలో కిలో రూ.లలో 115

ముడి చమురు 51.91 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	21,889	+45
నాస్‌డాక్	6,255	+39
నిక్కీ 225 (జపాన్)	19,730	−09
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,280	−44
షాంఘై(చైనా)	3,210	−52
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,309	−80
డాక్స్ (జర్మనీ)	12,014	−01

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.46	67.78
పౌండ్ స్టెర్లింగ్	75.93	88.06
యూరో	68.80	79.78
జపనీస్ యెన్/100	53.66	62.22
ఆస్ట్రేలియా డాలరు	45.87	53.08
సింగపూర్ డాలరు	42.88	50.80
థాయ్ బాత్/100	175.76	210.20
బహ్రెయిన్ దీనార్	158.39	181.41
కువైట్ దీనార్	175.89	219.10
ఒమన్ రియాల్	154.10	177.40
యూఏఈ దిర్హమ్	15.91	18.60
మలేషియా రింగిట్	13.33	16.38
చైనీస్ యువాన్	06.81	11.05

శుక్రవారం నిఫ్టీ కదలికలు



రూ.10,700 కోట్ల పెట్టుబడులు పెడతాం

సహారా యాంబీ వ్యాలీపై మారిషస్ సంస్థ ఆసక్తి

దిల్లీ: కష్టాల్లో కూరుకుపోయిన సహారా గ్రూప్‌నకు సాయం అందించేందుకు విదేశీ సంస్థ ముందుకొచ్చింది. సహారాకు చెందిన యాంబీ వ్యాలీ ప్రాజెక్ట్‌లో 1.67 బిలియన్ డాలర్లు (రూ.10,700 కోట్లకు పైగా) పెట్టుబడులు పెట్టేందుకు మారిషస్‌కు చెందిన రాయల్ పార్ట్‌నర్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ఆసక్తి కనబరిచింది. యాంబీ వ్యాలీ ప్రాజెక్ట్‌ను వేలం వేయకుండా నిలిపివేయాలన్న సహారా అధిపతి రాయ్ విజ్ఞప్తిని సుప్రీం కోర్టు తోసిపుచ్చిన నేపథ్యంలో, ఈ పెట్టుబడుల ప్రతిపాదన రావడం గమనార్హం. ముంబయి-పుణె మధ్యన ఉన్న యాంబీ వ్యాలీ రిసార్ట్ టౌన్ మార్కెట్ విలువ రూ.లక్ష కోట్లకు పైగానే ఉంటుందని సహారా గ్రూప్ పేర్కొంటోంది. మారిషస్‌లో నమోదైన రాయల్ పార్ట్‌నర్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, అంతర్జాతీయంగా కార్యకలాపాలు సాగిస్తోంది. దుబాయ్ కేంద్రంగా పనిచేసే ఆర్‌పీఎంజీ ఇన్వెస్ట్‌మెంట్‌కు ఇది అనుబంధ సంస్థ. పెట్టుబడుల వివరాలు నిజమేనని ఆర్‌పీఎంజీ ఇన్వెస్ట్‌మెంట్ అంగీకరించింది. అయితే మరిన్ని వివరాలు తెలిపేందుకు నిరాకరించింది. ఒప్పందం వివరాలు విశ్వసనీయమైనవని తెలిపింది. తాజా పెట్టుబడులకు సుప్రీం కోర్టు అనుమతి కోరనున్నట్లు సహారా న్యాయవాది గౌతమ్ అశ్వస్థి పేర్కొన్నారు. రూ.1500 కోట్లు డిపాజిట్ చేస్తే.. వేలం ప్రక్రియ ఆగిపోతుందని అన్నారు.

లాభాలపై ఎస్‌బీఐ

• ఏప్రిల్-జూన్‌లో అయిదింతలు • పెరిగిన నిరర్థక ఆస్తులు • కేటాయింపులూ రెట్టింపు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) లాభం బాగా పెరిగింది. 2016-17 ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఏకీకృత నికర లాభం అయిదింతలై రూ.2006.35 కోట్లకు చేరింది. అనుబంధ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంకు(బీఎమ్‌బీ) విలీనం తరవాత ఎస్‌బీఐ ప్రకటించిన తొలి త్రైమాసిక ఫలితాలు ఇవే కావడం విశేషం. కాగా, కిందటేడాది ఏప్రిల్-జూన్‌లో నికర లాభం రూ.374 కోట్లు మాత్రమే.

ఈ గణాంకాలు, నిష్పత్తులు, ఇతర సమాచారాన్ని పోల్చి చూడడం కోసం సిద్ధం చేసినట్లు బ్యాంకు తెలిపింది. ఇందు కోసం ఇటీవలే బ్యాంకులో విలీనమైన అనుబంధ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంకు(బీఎమ్‌బీ)ల సగటు ఆడిటెడ్ ఫలితాలను పరిగణనలోకి తీసుకుంది.

పోల్చి చూడలేని గణాంకాల పద్ధతిలో:

విలీనం వల్ల పోల్చిచూడలేని గణాంకాల విషయానికొస్తే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో ఏకీకృత నికర లాభం మూడింతలై రూ.3,105.35 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే మూడు నెలల కాలంలో రూ.867.32 కోట్లుగా నమోదైంది. ఏకీకృత ఆదాయం (పోల్చి చూడలేని) రూ.69,414.82 కోట్ల నుంచి రూ.70,776.56 కోట్లకు చేరింది. స్టాండలోన్ నికర లాభం (పోల్చిచూడలేని) 20% తగ్గి రూ.2005.53 కోట్లకు పరిమితమైంది. అదే సమయంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.48,928.60 కోట్ల నుంచి రూ.62,911.08 కోట్లకు చేరింది.



- ✦ బ్యాంకు ఆస్తులు మరింత ఒత్తిడికి గురయ్యాయి. స్టాండలోన్ స్థూల నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏలు) జూన్ 30, 2017 నాటికి 9.97 శాతానికి చేరాయి. జూన్, 2016 చివరికి ఇవి 6.94 శాతంగా ఉన్నాయి. రూపాయల్లో చెప్పాలంటే.. రూ.1,37,662 కోట్ల నుంచి రూ.1,88,068 కోట్లకు చేరాయి.
- ✦ నిర్వహణ ఆదాయం 5.17 శాతం తగ్గి రూ.25,612 కోట్లకు చేరింది. బ్యాంకు ఫీజు ఆదాయం రూ.16.21 శాతం పెరిగి రూ.4870 కోట్లకు చేరింది.
- ✦ నికర వడ్డీ ఆదాయం మాత్రం 3.51 శాతం తగ్గి రూ.17,606 కోట్లకు పరిమితమైంది. వడ్డీయేతర ఆదాయం కూడా 8.62% క్షీణించి రూ.8006 కోట్లకు చేరింది.
- ✦ జూన్ 2017 నాటికి డిపాజిట్లు 13.28% పెరిగి రూ.26,02,534 కోట్లకు చేరాయి. స్థూల రుణాలు 1.46% హెచ్చి రూ.18,86,666 కోట్లకు చేరాయి..
- ✦ నికర నిరర్థక ఆస్తులు 4.05 శాతం నుంచి 5.97 శాతానికి చేరాయి.
- ✦ మొండి బకాయిల కోసం చేసిన కేటాయింపులు(స్టాండలోన్) దాదాపు రెట్టింపై రూ.12,125.26 కోట్లకు చేరాయి. క్రితం ఏడాది తొలి త్రైమాసికంలో ఇవి రూ.6339.56 కోట్లు మాత్రమే.
- ✦ ఇక ఏకీకృత పద్ధతిన కేటాయింపులు చూస్తే అవి రూ.11,353.57 కోట్ల నుంచి రూ.12,227.60 కోట్లకు చేరాయి.
- ✦ జూన్ 30, 2017 నాటికి కేటాయింపుల కవరేజీ నిష్పత్తి 60.79 శాతంగా నిలిచింది. బాసెల్-3 మూల ధన కనీస నిష్పత్తి 13.31 శాతంగా నమోదైంది.

ఇవీ అంచనాలు: 2017-18లోని మిగతా తొమ్మిది నెలల్లో నికర వడ్డీ మార్జిన్లు 10-15 బేసిస్ పాయింట్లు పెరగొచ్చని బ్యాంకు అంచనా వేసింది. 'రిటైల్ ఆధ్వర్యంలో జులై-సెప్టెంబరు రుణ వృద్ధి స్థిరపడొచ్చు. రుణ వ్యయాలు 2016-17 నాటి 2.90 శాతంతో పోలిస్తే 2.25 శాతానికి తగ్గొచ్చు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఒత్తిడిలో ఉన్న ఆస్తులు నికరంగా రూ.7500 కోట్లకు పెరగొచ్చు.'

నష్టపోయిన షేరు: లాభాలు బాగున్నప్పటికీ.. నిరర్థక ఆస్తులు, వాటి కేటాయింపులు పెరగడంతో ఎస్‌బీఐ షేరు ఎక్స్ఛేంజీల్లో డీలా పడింది. బీఎస్ఈలో 5.36%(రూ.15.90) నష్టంతో రూ.280.65 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలోనూ 5.58%(రూ.16.55) కోల్పోయి రూ.280.15 వద్ద స్థిరపడింది.

ఆదాయంలో 15% వృద్ధి

- 2017-18పై విశాక ఇండస్ట్రీస్ అంచనా
- తొలి త్రైమాసికం లాభం రూ.23 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: గృహ నిర్మాణ రంగంలో మరిన్ని పర్యావరణ అనుకూల ఉత్పత్తులు విడుదల చేయడం ద్వారా అమ్మకాలు పెంచుకోవాలని హైదరాబాద్‌కు చెందిన విశాక ఇండస్ట్రీస్ భావిస్తోంది. ఇందుకోసం పరిశోధన, అభివృద్ధి కొనసాగుతుందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆదాయం 15 శాతం వృద్ధితో రూ.1,100 కోట్లకు చేరగలదని.. నికర లాభం రూ.48-50 కోట్ల వరకూ ఉండగలదని కంపెనీ పూర్తికాల డైరెక్టర్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌ఓ) వేపా వల్లీనాథ్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో విశాక ఇండస్ట్రీస్ రూ.960 కోట్ల ఆదాయంపై రూ.40 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. దీంతో పోలిస్తే 2017-18కి నికర లాభం 25 శాతం మేరకు పెరగవచ్చన్నది కంపెనీ అంచనా. 2020 నాటికి రూ.1,500 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని చేరాలని భావిస్తున్నామని విశాక ఇండస్ట్రీస్ సంయుక్త మేనేజింగ్ డైరెక్టర్ గడ్డం వంశీ తెలిపారు. 2017-18 తొలి త్రైమాసికానికి కార్యకలాపాల ద్వారా కంపెనీ రూ.340.72 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో ఆదాయం కూడా ఇదే స్థాయిలో రూ.340.10 కోట్లుంది. నికర లాభం మాత్రం 37.64 శాతం వృద్ధితో రూ.16.68 కోట్ల నుంచి రూ.22.96 కోట్లకు చేరింది. వి-నెక్ట్స్ బ్రాండ్‌తో ఫైబర్ సిమెంట్‌తో తయారు చేసిన బోర్డులు, ఇతర ఉత్పత్తులను విశాక ఇండస్ట్రీస్ తయారుచేస్తోంది. వి-నెక్ట్స్ ఉత్పత్తుల కోసం హరియాణలోని జజ్జర్‌లో మూడో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని, వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి అక్కడ ఉత్పత్తి ప్రారంభమవుతుందని వంశీ చెప్పారు. రూఫింగ్, టెక్స్‌టైల్, వాల్ సొల్యూషన్లలో విశాక ఇండస్ట్రీస్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

బీఎస్ఈలో షేరు 4.35 శాతం లాభపడి, రూ.450 వద్ద ముగిసింది.

జీవీకే పవర్ లాభం రూ.7 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లాభాలు ప్రకటించింది. 2017 జూన్‌తో ముగిసిన మూడు నెలలకు రూ.6.77 కోట్ల స్టాండ్ అలోన్ నికర లాభాన్ని ఆర్జించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో కంపెనీ నష్టం రూ.51.04 కోట్లుంది. ఇదే సమయంలో కార్యకలాపాల ద్వారా లభించిన ఆదాయం రూ.6.81 కోట్ల నుంచి రూ.7.14 కోట్లకు చేరింది. ఇతర ఆదాయం 50 శాతానికి పైగా పెరగడంతో మొత్తం ఆదాయంల రూ.16.85 కోట్ల నుంచి రూ.22.42 కోట్లకు పెరిగింది. ఇతర ఆదాయం 2016 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.10.04 కోట్లు ఉండగా.. ఈ ఏడాది ఇదే కాలానికి రూ.15.28 కోట్లుగా నమోదైంది. మొత్తం వ్యయాలు రూ.69.46 కోట్ల నుంచి రూ.11.62 కోట్లకు పరిమితం కావడం లాభానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. 2017 మార్చితో ముగిసిన మూడు నెలలకు రూ.206 కోట్ల నికర నష్టాన్ని జీవీకే చవి చూసింది. గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి నికర నష్టం రూ.271 కోట్ల మేరకు ఉంది.

బీఎస్ఈలో షేరు 1.16 శాతం లాభపడి రూ12.19 వద్ద ముగిసింది.

రూ.50 కోట్లతో అవంతీ ఫీడ్స్ విస్తరణ

ఈనాడు, హైదరాబాద్: రొయ్యల మేతకు పెరుగుతున్న గిరాకీకి అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలని అవంతీ ఫీడ్స్ నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న రొయ్యల మేత ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడానికి బోర్డు ఆమోదం తెలిపిందని కంపెనీ పేర్కొంది. ప్రస్తుతం ఈ ప్లాంట్ సామర్థ్యం 4.2 లక్షల ఎంటీ ఉండగా.. 3.48 లక్షల ఎంటీ సామర్థ్యాన్ని కంపెనీ వినియోగించుకుంటోంది. రూ.50 కోట్లతో అదనంగా 1.75 లక్షల ఎంటీ సామర్థ్యాన్ని కంపెనీ సమకూర్చుకోనుంది. పెట్టుబడులను అంతర్గత నిధుల ద్వారా సమకూర్చుకుంటామని, అదనపు సామర్థ్యం 2017, డిసెంబరు నాటికి అందుబాటులోకి వస్తుందని అవంతీ ఫీడ్స్ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి అవంతీ ఫీడ్స్ రూ.148.84 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.49.03 కోట్లతో పోలిస్తే 200 శాతానికి పైగా పెరిగింది. 2016, జూన్‌తో ముగిసిన మూడు నెలలకు మొత్తం ఆదాయం రూ.726.22 కోట్లు ఉండగా.. ఈ ఏడాది ఇదే త్రైమాసికానికి రూ.1,004.35 కోట్లకు చేరింది.

బీఎస్ఈలో షేరు ధర 4.56 శాతం పెరిగి రూ.1,645.10 వద్ద ముగిసింది.

ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2017–18	నికర లాభం/(నష్టం) 2016–17	మొత్తం ఆదాయం 2017–18	మొత్తం ఆదాయం 2016–17
జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ (కన్సా)	217.18	364.89	2,232	2,450
బీపీసీఎల్	744.56	2,620.50	67,422.95	57,380.65
బ్యాంక్ ఆఫ్ బరోడా	203.39	423.62	12,103.86	11,877.91
సన్‌టీవీ	251.64	233.06	823.38	782.38
రూరల్ ఎలక్ట్రిఫికేషన్	1,301.14	1,420.86	5,662.16	6,050.73
బీఈఎంఎల్	(85.13)	(107.10)	631.66	345.71
క్యాడిలా హెల్త్‌కేర్ (కన్సా)	138.40	398.40	2,228.8	2,333.1
పీటీసీ ఇండియా	65.35	56.45	4,401.77	3,644.33
సిప్లా (కన్సా)	424.92	343.70	3,525.05	3,650.03
హిందాల్కో	289.60	294.27	10,663.37	8,385.55
అలహాబాద్ బ్యాంక్	28.84	(564.96)	4,968.57	5,122.91
గోద్రేజ్ ఇండస్ట్రీస్ (కన్సా)	75.75	111.64	2,272.77	2,126.23
ఇంద్రప్రస్థ గ్యాస్	161	147.72	1,157	995
టీటీకే ప్రెస్టీజ్ (కన్సా)	135.62	21.75	385.64	380.80
ఏరోస్ ఇంటర్నేషనల్ (కన్సా)	47.86	53.46	259.62	410.36
సుజ్లాన్ (కన్సా)	47.84	(263.40)	2,701.12	1,669.66
టీవీఎస్ మోటార్	128.47	121.25	3,799.81	3,184.35
సన్‌ఫార్మా	(424.92)	2,033.71	6,208.79	8,256.26
టాటా గ్లోబల్ బెవరేజెస్	142	120	1718.76	1756
సెయిల్	(801.38)	(535.52)	13,072.77	10,424.95
ఓరియెంటల్ బ్యాంక్	(486.20)	100.69	5,204.45	5,397.92

5 రోజుల్లో.. 1112 పాయింట్లు హాంఫట్

- అమ్మకాలకే మదుపర్ల మొగ్గు
- లోహ, వాహన షేర్లు విలవిల
- 6 వారాల్లో తొలిసారి నష్టాలు

సమీక్ష

తేదీ మారినా.. సూచీల తీరు మారలేదు. వరుసగా అయిదో రోజూ నేలచూపులు చూశాయి. వారం క్రితం వరకు, రోజుకో రికార్డు బద్దలు కొడుతూ కొత్త చరిత్ర సృష్టించిన మార్కెట్లకు.. ఈ వారం పీడకల మిగిల్చింది. అంతర్జాతీయంగా అమెరికా, ఉత్తర కొరియాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు భయపెట్టగా... దేశీయంగా అనుమానిత డొల్ల కంపెనీలపై సెబీ చర్యలు మదుపర్లను బెంబేలెత్తించాయి. 7.5 శాతం వృద్ధిరేటు సాధించడం కష్టతరమేనని ఆర్థిక సర్వే స్పష్టం చేయడం సైతం ఇందుకు తోడైంది. దీంతో ఆరు వారాల్లోనే తొలిసారిగా సూచీలు ఎరుపెక్కాయి. ఈ వారం మొత్తం మీద సెన్సెక్స్ 1,111.82 పాయింట్లు, నిఫ్టీ 355.60 పాయింట్లు చొప్పున నష్టాలు నమోదు చేశాయి. మదుపర్ల సంపద రూ.95,000 కోట్లు తగ్గి రూ.1.27 లక్షల కోట్లకు పరిమితమైంది.

చివరి వరకూ నష్టాల్లోనే: సెన్సెక్స్ ఉదయం 31355.92 పాయింట్ల వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ఆద్యంతం అదే తీరు కొనసాగించిన సూచీ.. ఒకానొకదశలో 31128.02 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 317.74 పాయింట్ల నష్టంతో 31,213.59 దగ్గర స్థిరపడింది. జులై 4 తరవాత సూచీకిదే కనిష్ఠ స్థాయి. నిఫ్టీ సైతం 9700 దిగువకు చేరింది. ఇంట్రాడేలో 9,685.55 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరిన సూచీ.. చివరకు 109.45 పాయింట్లు కోల్పోయి 9,710.80 వద్ద ముగిసింది.

ఇష్యూ ధర రూ.432తో పోలిస్తే, కొచ్చిన్ షిప్‌యార్డ్ షేర్లు, నమోదైన తొలిరోజు 20శాతానికి పైగా లాభపడ్డాయి. ఇంట్రాడేలో గరిష్ఠంగా 22 శాతం వరకు దూసుకెళ్లిన షేరు ధర చివరకు బీఎస్ఈలో 20.83% లాభపడి రూ.522 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 24 డీలాపడ్డాయి. ఎస్‌బీఐ 5.36%, ఎం అండ్ ఎం 3.10%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.37%, ఎల్ అండ్ టీ 2.30%, ఎన్‌టీపీసీ 2.20%, ఓఎన్‌జీసీ 2.14%, సన్‌ఫార్మా 1.92%, టాటా మోటార్స్ 1.71%, మారుతీ సుజుకీ 1.68%, హిందుస్థాన్ యునిలీవర్ 1.58%, టాటా స్టీల్ 1.39%, కోల్ ఇండియా 1.34%, సిప్లా 1.13% చొప్పున నష్టపోయాయి. మరోవైపు డాక్టర్ రెడ్డీస్ షేరు 3.20 శాతం పెరగ్గా.. లుపిన్ 0.71%, విప్రో 0.66%లు రాణించిన వాటిలో ఉన్నాయి.

నేటి బోర్డు సమావేశాలు

★ యునైటెడ్ బ్యాంక్ ★ అదానీ పోర్ట్స్ ★ అదానీ ఎంటర్‌ప్రైజెస్ ★ అవధ్ షుగర్ ★ శ్రీరేణుకా షుగర్స్ ★ జేకే సిమెంట్ ★ శాంకో ఇండస్ట్రీస్ ★ అతుల్ ఆటో ★ పార్శ్వనాథ్ డెవలపర్స్ ★ థైరోకేర్ టెక్నాలజీస్ ★ వివిమెడ్ ల్యాబ్స్ ★ టీవీఎస్ శ్రీచక్ర ★ బిర్లా కార్పొరేషన్ ★ హిందుస్థాన్ కాపర్ ★ ట్రైడెంట్ ★ గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ★ రిలయన్స్ కమ్యూనికేషన్స్ ★ డీఎల్ఎఫ్

డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్



రూ.1925.05 వద్ద ప్రారంభమై రూ.1901.15-2029.95 మధ్య కదలాడి, క్రితం ముగింపు రూ.1944.45తో పోలిస్తే రూ.66.70(3.43%) లాభంతో రూ.2011.15 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 18,57,913.

హిందాల్కో ఇండస్ట్రీస్



రూ.235 వద్ద మొదలై రూ.218-235 మధ్య చలించి, క్రితం ముగింపు రూ.238తో పోలిస్తే రూ.17(7.14%) నష్టంతో రూ.221 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 2,11,26,006.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

అవధ్ షుగర్	710.55
ఎండ్యూరెన్స్ టెక్నాలజీస్	1,004.90
ఇండియన్ నిప్పన్	808.15
బీఎఫ్ యుటిలిటీస్	312.00
బ్లూ బ్లెండ్స్ (ఐ)	38.00
అబాన్ ఆఫ్‌షోర్	161.00

52 వారాల కనిష్ఠం (రూ.లలో)

అమరరాజా బ్యాటరీస్	785.00
అక్షర్‌కెమ్ ఇండియా	648.00
అంజనీ పోర్ట్‌ల్యాండ్ సిమెంట్	191.00
భారతీ డిఫెన్స్	7.25
భాగ్యనగర్ ప్రాపర్టీస్	17.60

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

తేదీ	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	దేశీయ మదుపర్లు (డీఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
11/08	4,120	6,063	−1,943	5,086	3,069	2,017
10/08	4,385	5,556	−1171	4,085	3,263	822
09/08	3,238	4,080	−842	2,886	2,333	553
08/08	6,246	4,706	1,540	3,152	2,353	799
07/08	3,790	3,989	−199	2,572	2,264	308

11వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	338	విశాఖపట్నం	351
చిల్లరగా(ఒక గుడ్డు)	4.00	వరంగల్	340
బెంగళూరు	370	చిత్తూరు	375
12న		చెన్నై	382
విజయవాడ/గోదావరి	346	నమక్కల్	370

ఎన్ఎస్ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1760.55 (1776.70) 401900
ADANI PORT & 382.75 (385.65) 6480493
AMBUJA CEMEN 263.35 (267.45) 1515060
ASIAN PAINTS 1143.90 (1151.10) 843233
AUROBIND PHA 705.00 (685.25) 4630954
AXIS BANK LT 489.70 (485.50) 9261420
BAJAJ AUTO L 2788.20 (2796.20) 321890
BANK OFBAROD 142.25 (148.45) 14474693
BHARTI AIRTE 414.55 (416.25) 2287991
BHARTI INFRA 382.30 (382.45) 2645105
BOSCH LTD 22623.20 (23543.80) 31577
BPCL 484.30 (481.50) 4211969
CIPLA 541.40 (548.20) 4337214
COAL INDIA L 235.90 (238.95) 3335287
DR. REDDYS 2011.15 (1944.45) 1857913
EICHER MOTOR 29627.35 (30111.70) 58991
GAIL 368.95 (365.00) 3833882
HCL TECH 872.30 (882.90) 1692430
HDFC 1695.35 (1709.80) 1987331
HDFC BANK 1749.05 (1760.45) 1589959
HERO MOTOCOR 3840.90 (3889.55) 302935
HINDALCO IND 221.00 (238.00) 21126006
HINDUSTAN UN 1152.80 (1170.70) 861457
ICICI BANK 286.95 (288.75) 17211539
INDIABULLS H 1149.90 (1156.50) 1378960
INDIAN OIL 411.80 (410.30) 3768327
INDUSINDBANK 1625.35 (1629.40) 1142387
INFOSYS LTD 987.70 (981.25) 3272078
ITC 271.50 (273.10) 14409594
KOTAK MAHIND 992.20 (996.80) 1421743
LARSEN & TOU 1131.95 (1157.70) 2001103
LUPIN 940.90 (936.70) 1617852
M&M 1348.05 (1387.05) 1126510
MARUTI SUZIK 7457.40 (7578.75) 676390
NTPC LTD 168.85 (172.65) 5018272
ONGC 159.65 (163.70) 5471462
POWER GRID C 218.90 (217.40) 4984245
RELIANCE IND 1546.25 (1584.35) 3885064
SBI 280.15 (296.70) 67652562
SUN PHARMA 450.00 (460.80) 7851424
TATA CONSULT 2496.05 (2511.45) 697368
TATA MOT DVR 223.20 (221.45) 3666464
TATA MOTORS 374.50 (380.20) 14699477
TATA POWER 76.55 (76.70) 4403984
TATA STEEL L 596.75 (604.35) 8579300
TECH MAHINDR 402.80 (404.00) 2782291
ULTRATECH 3922.55 (3907.60) 252752
VEDANTA LIMI 279.10 (298.80) 18382815
WIPRO 289.70 (288.15) 3549897
YES BANK LTD 1739.40 (1730.10) 3102129
ZEE ENTERTAI 504.90 (520.05) 3637319

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1343.05 (1341.60) 48105
ASHOK LEYLAN 102.65 (103.45) 14750459
BAJAJ FINANC 1695.40 (1635.60) 3505576
BAJAJ FINSER 4992.00 (5024.75) 288737
BEL 171.15 (170.75) 3918191
BHEL 125.00 (126.75) 7072025
BRITANNIA 4101.95 (4119.20) 148713
CADILA HEALT 482.50 (466.15) 5310491
COLGATE PALM 1047.25 (1054.65) 124920
CONTAINER 1157.95 (1145.45) 416998
CUMMINS INDI 892.00 (893.00) 345553
DABUR INDIA 303.40 (306.55) 649998
DIVIS LAB 627.20 (626.10) 1248311
DLF LIMITED 155.55 (164.60) 14677670
EMAMI LIMITE 1075.80 (1091.85) 75801
GLAXOSMI CON 5324.90 (5411.15) 37236
GLAXOSMI PHA 2380.90 (2374.55) 6296
GLENMARK PHA 616.60 (612.75) 1344430
GODREJ CONSU 899.80 (901.75) 1335393
HAVELLS INDI 458.65 (463.65) 1195720
HINDUSTAN ZI 270.50 (280.80) 2262641
HPCL 429.05 (412.45) 9817059
ICICI PRU LI 427.35 (413.80) 1566785
IDEA CELLULR 86.20 (87.95) 7099401
INTERGLOBE A 1242.35 (1273.70) 573129
JSW STEEL LT 223.50 (222.75) 4613140
LIC HOUS.FIN 651.80 (657.65) 1359751
MARICO LIMIT 319.95 (320.55) 1062783
MCDOWELL 2418.80 (2490.80) 565996
MOTHERSON 323.25 (317.45) 4526124
NHPC LTD 30.30 (30.05) 6169917
NMDC LTD 117.65 (121.75) 6190040
OIL INDIA 278.95 (281.95) 711232
ORACLE FIN S 3457.00 (3445.45) 20814
P&G HYG&HEAL 7955.35 (8017.60) 5110
PETRONET LNG 210.95 (208.20) 10620215
PIDILITE IND 790.30 (795.35) 326785
PIRAMAL ENTE 2701.85 (2731.10) 274185
PNB 140.35 (143.15) 14050916
POWER FIN CO 117.65 (124.55) 14095760
RURAL ELEC C 165.20 (163.75) 7096914
SAIL 56.50 (58.85) 5706740
SHREE CEMENT 17524.10 (17336.30) 13059
SHRIRAM TRAN 952.05 (933.75) 826052
SIEMENS 1282.65 (1289.45) 197148
SUN TV LTD 706.90 (680.80) 1691825
TITAN IND 607.00 (610.35) 1482422
TORRENT PHAR 1216.05 (1228.90) 75305
UNITED BREWE 787.60 (824.20) 438643
UPL LIMITED 811.35 (821.50) 1259736

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 162.70 (168.55) 502563
ADANI ENTERP 113.70 (115.85) 5174105
ADANI POWER 27.20 (28.70) 10716095
ALL BANK 64.60 (65.70) 8669668
AMARA RAJA 801.20 (800.25) 719248
ANANT RAJIND 51.50 (52.65) 1205862
ANDHRA BANK 49.50 (50.80) 4171089
APOLLO HOSPI 1217.25 (1213.80) 179177
APOLLO TYRES 257.05 (262.60) 4783508
APTECH 205.50 (204.20) 297968
BAJAJ ELECT. 306.70 (302.30) 142221
BAJAJ HIND 14.50 (14.60) 4214040
BAJAJ HOLDIN 2515.65 (2499.95) 18097
BALAJI TELE 152.80 (153.75) 790980
BALLARPUR IN 14.35 (14.05) 1224614
BALRAMPUR CH 165.15 (160.15) 2188969
BANK OF MAHA 26.05 (26.15) 445101
BANK OFINDIA 143.05 (148.15) 8380224
BATA INDIA 635.50 (632.05) 1317726
BGR ENERGY S 126.55 (128.90) 116815
BHARAT FORGE 1158.90 (1142.85) 1217022
BHUSHAN STEE 63.70 (65.30) 597708
BIOCON LTD 340.55 (331.10) 2566989
BOMBAY DYE 70.60 (69.55) 1833281
CANARA BANK 325.90 (330.70) 2225972
CEAT LIMITED 1693.35 (1699.30) 720053
CENTRAL BANK 73.20 (82.05) 1314714
CHAMBAL FERT 132.95 (124.60) 1429226
CHENNAI PETR 386.70 (381.70) 1505571
CITY UNIBANK 155.20 (156.85) 386822
CORPO BANK 46.65 (46.40) 323836
COX & KINGS 265.70 (269.10) 204907
D B REALTY L 34.70 (34.20) 770110
DELTA CORP L 164.10 (162.45) 2466073
DENA BANK 31.15 (31.75) 881391
DHANALAKBANK 33.00 (33.70) 1525372
EDELWEISS CA 236.90 (232.50) 3516231
EDUCOMP SOLU 7.85 (7.90) 260745
EID PARRY 299.40 (302.55) 154140
EIH 131.35 (131.25) 81833
ESSAR SHIPPI 24.20 (25.00) 23453
ESTER INDUST 31.40 (32.45) 139576
EXIDE INDUST 203.00 (199.95) 2456751
FEDERAL BANK 105.65 (104.70) 15087823
FINOLEX CABL 495.05 (490.25) 204116
G E SHIP LTD 368.25 (375.30) 57205
GAMMON INDIA 8.65 (8.75) 582836
GAMMON INFRA 3.80 (3.70) 3629976
GATI LIMITED 106.00 (109.25) 513368
GAYATRI PROJ 153.50 (153.15) 53208
GITANJALIGEM 55.85 (56.05) 318099
GMR INFRASTR 15.50 (15.90) 33704072
GODREJ IND 559.30 (576.70) 535096
GRASIM IND 1060.75 (1070.75) 1137505
GUJ ALK&CHEM 390.75 (390.25) 52772
HCL INFOSYS 41.00 (41.75) 1372932
HDFC BANK 1760.00 (1810.00) 114000
HEXA TECH 254.50 (253.75) 562405
HIMACHAL FUT 15.45 (15.15) 6745413
HINDU MOTORS 7.35 (7.25) 341082
HOUSING DEV 58.45 (56.20) 42996202
IDBI 52.65 (53.80) 3295406
IDFC 53.60 (54.65) 8753130
IFCI 21.70 (22.80) 15421513
IL&FS TRANS 77.60 (76.10) 450573
IND SWIFTLAB 32.85 (33.90) 31957
INDBULLS REL 224.90 (227.95) 18509810
INDIA CEM 176.45 (174.80) 7658809
INDIAN BANK 279.85 (273.85) 1939289
INDO RAMA SY 27.75 (28.10) 45841
INDRAPRASTHA 1215.50 (1214.20) 763856
IND-SWIFTLTD 7.80 (7.85) 35268
INGERSOLL-R 778.60 (787.55) 15219
IOB 22.50 (23.10) 1998851
IPCA LAB 409.45 (419.85) 235204
IRB INFRA DE 203.05 (200.75) 2645784
J&K BANK 72.25 (75.00) 754448
JAI CORP 69.70 (72.25) 694473
JAIN IRRIGAT 91.70 (92.15) 6983899
JAYPEE INFRA 17.95 (18.85) 1512357
JAYSHREE TEA 96.40 (95.80) 77651
JET AIRWAYS 557.30 (560.30) 2382960
JINDAL SAW 88.55 (89.90) 754239
JINDAL STEEL 127.65 (123.30) 16525936
JK LAKSHMI C 418.30 (417.60) 55058
JK PAPER LIM 89.90 (91.50) 600596
JM FINANCIAL 117.95 (117.40) 817738
JP ASSOCIATS 21.25 (23.30) 216123157
JSW ENERGY L 63.75 (64.90) 13439963
JUBILANT FOO 1296.60 (1317.95) 1223225
JUBILANT ORG 680.90 (642.90) 452476

ఘనం (+)

నిఫ్టీ	11న	మార్పు %
DR. REDDYS LAB	2011.15	3.43
AUROBINDO PHA	705.00	2.88
GAIL	368.95	1.08
AXIS BANK	489.70	0.87
TATA MOTORS DVR	223.20	0.79
POWER GRID CORP.	218.90	0.69
INFOSYS	987.70	0.66

గ్రహణం (-)

నిఫ్టీ	11న	మార్పు %
HINDALCO	221.00	-7.14
VEDANTA	279.10	-6.59
SBI	280.15	-5.58
BANK OF BARODA	142.25	-4.18
BOSCH	22623.20	-3.91
ZEE ENTERTAINMENT	504.90	-2.91
M & M	1348.05	-2.81

JYOTHY LABS 376.10 (381.10) 89001
KARNATA BANK 138.50 (138.05) 3935722
KEC INTL LTD 281.55 (290.15) 519271
KOLTE PATIL 147.10 (144.85) 153550
KPIT CUMMINS 109.80 (108.75) 1835322
L&TFIN.HOLD 163.80 (165.15) 7107628
LAK VIL BANK 169.95 (171.90) 864875
M & M FINANC 411.40 (407.30) 4704952
MANAPPURAM G 85.85 (93.30) 17397014
MMTC LIMITED 54.15 (55.45) 595395
MOSER-BEAR 4.45 (4.35) 472575
MPHASIS LTD 571.45 (572.90) 13312
MRPL 118.60 (119.50) 3552428
MTNL 17.20 (17.75) 1102634
NCC LIMITED 83.05 (83.25) 2945379
NETWORK18 FI 51.05 (51.05) 337912
NEULAND LAB 1239.30 (1226.50) 9702
NIIT LTD 86.00 (85.80) 747725
NIIT TECHNOL 479.60 (475.35) 412974
OMAXE LTD 200.00 (201.30) 449829
ONMOBILE GLO 54.15 (55.10) 332855
ORIENT PAPER 90.40 (89.35) 318425
ORIENTALBANK 118.00 (126.95) 5777982
PATEL ENGG 69.00 (68.30) 226650
PFIZER 1791.95 (1791.50) 13808
POLARIS SOFT 232.70 (230.15) 171940
POWERTRADING 108.60 (108.75) 3909440
PRAJ IND 66.05 (68.35) 460605
PRISM CEMENT 112.05 (114.40) 86992
PROVOGUE (IN 4.00 (4.00) 74343
PUNJ LLOYD 18.95 (19.00) 1501309
PUNJAB & SIN 47.75 (48.20) 98107
PURAVANKARA 67.80 (66.70) 181902
PVP VENTURES 4.70 (4.60) 381789
PVR LIMITED 1285.90 (1332.60) 354851
RADICO KHAIT 139.75 (139.30) 443654
RAJ OIL MILL 1.30 (1.30) 30670
RAJESH EXPOR 709.05 (714.05) 522319
RALLIS INDIA 233.45 (226.70) 139279
RAMCO IND 227.65 (232.55) 128485
RAMCO SYS 345.10 (352.55) 39240
RAMKY INFRA 82.70 (80.60) 141678
RAYMOND 718.15 (723.30) 524109
RELIANCE CAP 748.90 (764.25) 6096465
RELIANCE COM 20.75 (21.20) 17576664
RELIANCE INF 469.20 (474.45) 2364344
RELIANCE POW 38.70 (39.00) 2433410
ROLTA INDIA 51.90 (52.50) 355874
SAGAR CEMENT 815.50 (809.95) 7261
SAREGAMA 371.25 (358.85) 122391
SHANTHI GEAR 131.05 (130.60) 38706
SHIPPNG CORP 82.40 (88.00) 2338176
SHREE RENUKA 16.65 (16.85) 4215724
SINTEX IND 28.50 (27.25) 41607163
SOBHA DEVELO 370.80 (360.15) 215116
SOUTHINDBANK 26.30 (26.25) 14124572
STERLITE TEC 218.60 (212.85) 3402630
SUJANA METAL 1.65 (1.55) 84004
SUN PHARMA 337.55 (341.05) 332409
SUND FASTNER 373.15 (373.60) 102435
SUZLON ENERG 15.25 (15.40) 65653914
SYND. BANK 62.40 (63.80) 2720056
TATA CHEM 578.35 (576.75) 785813
TATA COFFEE 119.15 (119.70) 420755
TATA COMMUN 587.95 (594.25) 904383
TATA GLOBAL 164.20 (156.00) 6027593
TATA METALIK 628.35 (607.45) 268095
TATA TELESER 6.50 (6.60) 2439296
THE INDIAN H 122.40 (124.75) 275579
TORRENT POWE 194.10 (189.30) 1853074
TRIVENI ENGG 85.25 (88.30) 3493788
TTK PRESTIGE 6272.70 (6179.95) 29125
TV TODAY NET 247.70 (216.45) 675639
TV18 BROADCA 35.25 (35.35) 3144192
TVS MOTOR 536.80 (580.75) 4190408
UCO BANK 29.90 (30.50) 813869
UNION BANK 127.30 (134.45) 11096223
UNITECH 7.45 (7.40) 42613657
UNITED BANK 18.45 (18.75) 768144
USHA MARTIN 18.95 (18.90) 912392
VADILAL INDU 852.65 (864.85) 19850
VENKYS 1719.40 (1816.30) 247545
V-GUARD IND 173.40 (173.45) 1252755
VIJAYA BANK 66.35 (67.50) 1104163
VIP 188.55 (183.80) 231268
VOLTAS 517.20 (520.15) 931742
ZEE LEARN LI 39.00 (39.85) 376551
ZUARI GLOBAL 118.65 (120.85) 9992
ZYDUS WELLNE 859.35 (882.10) 10610

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 794.15 (787.15) 4890
AMAR RAJA BA 800.75 (798.85) 826261
ANDHRA BANK 49.75 (50.85) 428201
ANDHRA CEMEN 8.79 (8.81) 37285
ANDHRA PAPER 285.65 (283.25) 7792
ANDHRA PETRO 24.10 (24.90) 46695
ANDHRA SUGAR 325.15 (319.75) 5496
ASTRA MICROW 119.90 (120.65) 42926
AUROBINDO PH 704.80 (683) 396637
AVANTEL SOFT 219.75 (214.30) 3389
AVANTI FEEDS 1645.10 (1573.40) 56193
AVON ORG 5.62 (5.42) 15010
BALAJI AMIN 308.55 (300.80) 5210
BARTRONICS 14.05 (13.65) 34494
BHAGYA NAG 22.20 (21.90) 3892
BN RATHI SEC 29.65 (30.55) 9899
BRILLIANT SE 7.25 (7.59) 1857877
CAMBRIDGE TE 65.95 (67.25) 4625
COMBAT DRUGS 11.71 (11.71) 1085
CONT COFFEE 279.85 (274.20) 14433
COROMAN FERT 407.05 (404.15) 23653
CYIENT LIMIT 493.10 (508.90) 3599
DECCAN CEMEN 1089.65 (1070.90) 552
DIVI'S LAB 626.85 (624.65) 96525
DIVYA GRANIT 97.25 (93.15) 5042
DR REDDY 2011.35 (1948.95) 123041
GATI CORPN 105.95 (109.50) 117310
GAYATRI PROJ 155.15 (151.05) 3928
GMR INFRASTR 15.50 (15.90) 3451571
GOLDST INFRA 107.30 (102.20) 89280
GRANULES (I) 109.35 (107.30) 339741
GVK POWER 12.19 (12.05) 4908544
HBL NIFE POW 43.55 (43.90) 60409
HERITAGE FOO 1217.50 (1230.55) 3935
HYD INDUS 1025.70 (984.70) 6593
IDL INDUSTRS 497.45 (479.85) 4043
ILFS ENGINEE 39.60 (39.75) 13363
INNAREDY COM 2.68 (2.70) 10931
IVRCL INFRAS 5.30 (5.39) 460200
KAKATIYA CEM 319.95 (337.55) 20517
KAVERI SEED 524.55 (531.50) 277526
KCP LTD 97.40 (96.10) 25529
LANCO INDUS 348.40 (346.80) 23264
LAURUS LABS 546.15 (525.65) 17954
LOKESH MACH 77.65 (77.10) 13571
MADHUCON PRO 28.40 (28.65) 46857
MIC ELECTRON 7.06 (7.38) 150393
MOLD-TEK.TEC 49.80 (49) 2688
MOLDTK PLA 271.85 (269.75) 3649
NAGARJAGRICH 31.90 (31.10) 56369
NATCO PHARMA 702.50 (696.65) 212130
NAVA BH VENT 125.30 (121.70) 46485
NCC 82.85 (82.35) 2222712
NCL IND 195.55 (200.40) 24781
NETTLINX 99.95 (110.90) 13530
NEULAND LAB 1241.05 (1228.30) 1918
NIHAR INFO 15.70 (13.65) 601
PANKAJ POLY 11.03 (10.51) 16511
PANYAM CEMEN 57.95 (56.80) 10967
PENNER IND 49.10 (49.40) 170782
PIONEER DIST 220.15 (221.55) 780
PITTI LAMIN 48.60 (47.75) 6415
PRAJAY ENGS 8.17 (8.57) 29508
PRISM CEMENT 112.10 (113.60) 24244
PRUDENTL PHA 3.99 (4.09) 128690
RAIN INDUSTR 115.80 (112) 709203
SAMKRG PIST 250.25 (251.60) 14820
SATVAH. ISPA 36.75 (37.50) 12790
SMS PHARMA 68.85 (69.35) 3919
SPHERE GLOBA 48.45 (48.15) 4875
SREE RAYAL A 26.05 (26) 276606
STEEL EXCHAN 80.25 (84.45) 113479
SUJANA METAL 1.64 (1.50) 26850
SUJANA TOWER 4.09 (3.80) 6412
SUJANA UNIVE 0.96 (0.93) 49954
SURYALAKSH.C 98.65 (100.35) 1691
SUVEN PHARMA 155.95 (160.60) 60546
TAJ GVK HOTE 159 (160.20) 1727
TANLA 30.20 (31.20) 113336
TERA SOFTWAR 65.65 (65.15) 2306
VICEROY HOTE 16.55 (17.20) 81564
VIMTA LABS 134.05 (129.60) 6818
VISAKA IND 440.20 (431.25) 51109
VISTA PHARMA 28.35 (29.15) 23155
VIVIMED LABS 106.45 (109.35) 138573
YBRANT DIGIT 6.59 (6.61) 150496
ZENTECH 49.45 (50.70) 27944

TG

ఈనాడు సినిమా

కథలు ఎదురు చూస్తున్నాయ్!


వెంకటేష్

విరామం లేకుండా సినిమాలు చేసే కథానాయకుల్లో వెంకటేష్ ఒకరు. ఆయన సెట్‌లోకి అడుగుపెట్టారంటే చాలు.. మెరుపు వేగంతో సినిమాలు పూర్తయిపోతుంటాయి. ఒక ఏడాదిలో రెండు మూడు సినిమాలతో ప్రేక్షకుల్ని అలరించిన సందర్భాలు ఆయన కెరీర్‌లో చాలానే. కథానాయకులు ఖాళీగా ఉండకూడదని చెప్పే వెంకీ, ఆచరణ పరంగానూ అలాగే గడుపుతుంటారు. అయితే 'గురు' తర్వాత ఆయన్నుంచి మరో సినిమా రాలేదు. వేసవి కూడా వచ్చేసింది కాబట్టి విరామం తీసుకోబోతున్నానని ఆ సినిమాకి ముందే చెప్పారాయన. వేసవి పూర్తై, ఇప్పుడు వర్షాకాలం నడుస్తోంది. వెంకీ కొత్త సినిమా మొదలుకాలేదు. ఆయన కోసం బోలెడన్ని కొత్త కథలు ఎదురు చూస్తున్నాయి. జంతువుల నేపథ్యంలో సాగే ఓ కథతో పాటు, ఓ మల్టీస్టారర్ స్క్రిప్టు కూడా సిద్ధమవుతున్నట్టు సమాచారం. మరోపక్క పూరి జగన్నాథ్ కూడా వెంకటేష్‌కి ఇదివరకు ఓ కథని వినిపించారు. ఒకొక్కటిగా వెలుగులోకి వస్తున్న ఈ కథల జోరు చూస్తుంటే 'గురు' తర్వాత వచ్చిన విరామానికి దీటుగా తదుపరి సినిమాల కోసం ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. జంతువుల నేపథ్యంలో సాగే ఓ కథని విని వెంకటేష్ ఎప్పుడో పచ్చజెండా ఊపేశారు. అయితే విజువల్ ఎఫెక్ట్స్‌కి ప్రాధాన్యమున్న ఆ కొత్త రకమైన కథని ఎలా తీర్చిదిద్దాలనే విషయంపైనే ఇప్పుడు తర్జనభర్జనలు జరుగుతున్నాయని నిర్మాత డి.సురేష్‌బాబు ఇటీవల విలేకర్లతో చెప్పారు. దాంతో పాటు మరో రీమేక్ కథపై కూడా వెంకటేష్ మక్కువ చూపుతున్నట్లు సమాచారం. అది మల్టీస్టారర్ చిత్రంగా తెరకెక్కబోతున్నట్టు, అందులో రానా కూడా నటిస్తారని ఫిల్మ్‌నగర్ వర్గాలు చెబుతున్నాయి.

పంచ్ డైలాగ్

క్రికెట్‌లో కెప్టెన్ ఒక్కడే బాగా ఆడితే గెలవలేం. మిగిలిన పది మందీ బాగా ఆడితేనే గెలుస్తాం!

చిత్రం: అపరిచితుడు

- పంపినవారు: టి.ఎస్.మూర్తి, మల్కాపురం

చిరునామా: సినిమా డెస్క్,
ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా- 501512
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

గది ముస్తాబవుతోంది


నాగార్జున

రాజుగారి రెండో గది ముస్తాబవుతోంది. ఒకటో గదిలానే అక్టోబరులోనే తెరచుకోనుంది. మధ్యలో చాలా సమయం ఉంది కాబట్టి, ఆలోపు సరికొత్త హంగు రంగులతో గదిని ముస్తాబు చేస్తున్నారు. అందులో నుంచే నాగార్జున కొత్త తరహా వినోదాన్ని పంచబోతున్నారు. హాస్యం పంచడంతో పాటు, థ్రిల్‌కి కూడా గురిచేస్తారు. కొత్త కథల్ని ఎంపిక చేసుకోవడంలోనూ, కొత్త పాత్రల్ని భుజానికెత్తుకోవడంలోనూ ముందుండే నాగార్జున, మరోసారి అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తూ హారర్ కామెడీ కథని ఎంచుకొని 'రాజుగారి గది 2' చేశారు. సమంత, సీరత్ కపూర్ కథానాయికలు. ఓంకార్ దర్శకుడు. పీవీపీ సినిమా, మ్యాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఓక్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. అక్టోబరు 13న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. "నాగార్జున ఓ సరి కొత్త పాత్రలో నటిస్తున్న చిత్రమిది. ఆయన తెరపై కనిపించే విధానం, వినోదాన్ని పంచే తీరు ప్రేక్షకుల్ని థ్రిల్‌కి గురిచేస్తుంది. 'రాజుగారి గది'లానే ఈ చిత్రాన్ని కూడా అక్టోబరులోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామ"ని స్పష్టం చేశాయి చిత్రవర్గాలు. వెన్నెల కిషోర్, అశ్విన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్.


రకుల్‌ప్రీత్ సింగ్

గీతోపదేశం

ఏనుగు పైని నవాబు
పల్లకిలోని షరాబు
గుర్రము మీది జనాబు
గాడిద పైని గరీబు
నడిచే దారుల గమ్యమొక్కటే
నడిపేవానికి అందరొక్కటే

గీతం: ఇంతేరా ఈ జీవితం...

చిత్రం: రంగులరాట్నం
రచన: భుజంగరాయ శర్మ
- పంపినవారు: ఎమ్. సూర్యప్రసాద్

హీరోలపై అభిమానం తగ్గిపోతుంది!


అజయ్‌దేవగన్

ఒకప్పటి ప్రేక్షకులకు అభిమాన హీరో అంటే ఎవరో ఒకరే ఉండేవారు. తమ అభిమాన కథానాయకుణ్ని దేవుడిలా ఆరాధించేవారు. నేటి తరం అలా ఉండటం లేదు అంటున్నారు ప్రముఖ బాలీవుడ్ కథానాయకుడు అజయ్‌దేవగణ్. "ఒకప్పటి తారలకు నమ్మకమైన అభిమానులుండేవారు. నా అదృష్టం కొద్దీ నేను ఆ దశ నుంచే వచ్చాను. 25 ఏళ్లుగా నన్ను అభిమానించే వారు ఉన్నారు. అది నాకు ఎంతో కలిసొచ్చే అంశం. కానీ నేటితరం ప్రేక్షకులు ఎక్కువ శాతం ప్రత్యేకంగా ఎవర్నీ అభిమానించడం లేదు. హీరోలను అభిమానించడం తగ్గిపోతుంది. సినిమాకి వెళ్లడం చూసి రావడం అంతే. అక్కడితో ఆ కథ ముగిసిపోతుంది. స్టార్... వాళ్లకు ఓ అభిమానగణం... ఇది నెమ్మదిగా పోతుంది. నేను ఇన్ని సినిమాలు చేశానంటే నా అభిమానులే. ఇప్పటి నటులకు ఆ పరిస్థితి లేదు. పొరపాటున సామాజిక మాధ్యమాల్లో ఏమాత్రం చురుగ్గా లేకపోయినా అభద్రతా భావం వచ్చేస్తుంది వాళ్లకి. దాంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నార"ని చెప్పారు అజయ్. రోహిత్ శెట్టి దర్శకత్వంలో అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో 'గోల్‌మాల్ 4' తెరకెక్కుతోంది. ఈ సందర్భంగా ముంబయిలో జరిగిన కార్యక్రమంలో అజయ్ మాట్లాడారు.

ఇగో సమస్య లేదు: తన కెరీర్ మొదలైనప్పుడు తోటి నటుల మధ్య ఇగో సమస్యలు చాలా తక్కువ. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయిందని అజయ్ అభిప్రాయపడుతున్నారు. "సల్మాన్, ఆమీర్ లాంటి పెద్ద స్టార్‌లతో పనిచేశాను. కానీ మా మధ్య ఎప్పుడూ ఎలాంటి ఇగో సమస్యలూ రాలేదు. ఇంకో హీరో ఏం చేసేస్తున్నాడో అనే అభద్రతా భావం మాకెప్పుడూ కలగలేదు, అప్పటి హీరోలతో 'గోల్‌మాల్' తరహా వాతావరణం సెట్లో ఉండేది. నేటి కథానాయకుల నుంచి అది ఆశించలేము. బహుశా నేటి తరంలోనే ఆ సమస్య ఉందేమో"అంటున్నాడు అజయ్.

ఏడేళ్లు పడుతుందనుకోలేదు: 'గోల్‌మాల్ 3' వచ్చిన ఏడు సంవత్సరాల తర్వాత 'గోల్‌మాల్ 4' వస్తోంది. "'గోల్‌మాల్ 4' రావడానికి ఏడేళ్లు పడుతుందని గోల్‌మాల్ 3' మొదలైన రోజు అసలు ఊహించనేలేదు. చాలా సమయం గడిచిపోయిందే అని బాధపడాల్సిన అవసరం అసలు లేదు"అని చెప్పాడు అజయ్‌దేవగణ్.

నమ్మే సిద్ధాంతం అదే

ఎంచుకొనే కథల విషయంలో మితిమీరి ఆలోచించడం ఇష్టం ఉండదంటోంది రకుల్‌ప్రీత్ సింగ్. నిర్ణయాలు తీసుకోవడంలో తెలివిగా వ్యవహరించడం ముఖ్యమే కానీ, అన్నిసార్లూ మెదడుకే కాకుండా అప్పుడప్పుడు మనసుతోనూ ఆలోచిస్తుండాలని చెబుతోంది. ఇటీవల విడుదలైన 'జయ జానకి నాయక'లో జానకిగా నటించిన ఆమె త్వరలోనే మహేష్‌తో కలిసి 'స్పైడర్'తో సందడి చేయబోతోంది. "సినిమాలో నా పాత్రే ప్రముఖంగా కనిపించాలి, నాకు మంచి పాత్రే దొరకాలి అంటూ గిరిగీసుకొని ఆలోచించే అలవాటు నాకు ఎప్పుడూ లేదు. చిత్రసీమలో మనం వేసుకొనే లెక్కలు ప్రతిసారీ ఫలితాల్నిస్తాయనుకోవడం పొరపాటు. అందుకే మరీ ఎక్కువగా ఆలోచించకుండా కొన్ని కొన్ని సినిమాల్ని ఒప్పుకొంటుంటా. వాణిజ్య చిత్రాల్లో ఎంతైనా కథానాయకుల పాత్రలకే అగ్రతాంబూలం. అలాగని వాటికి దూరం కాకూడదు. ఆ తరహా సినిమాలు చేయడంలోనూ కొన్ని ప్రయోజనాలుంటాయి. ఇక్కడ ప్రతి అవకాశమూ కీలకమే. చిన్న చిన్న కారణాలతో ఏ అవకాశాన్నీ దూరం చేసుకోకూడదనేది నేను నమ్మే సిద్ధాంతం. చేతిలో ఎన్ని సినిమాలున్నా మరొక మంచి అవకాశం వచ్చిందంటే, వీలైనంత వరకు దాన్ని సద్వినియోగం చేసుకొనేందుకే ప్రయత్నిస్తుంటా" అని చెబుతోంది రకుల్.

అలాంటి వాళ్లు నాతో లేరు!


అనుష్కశర్మ

ఓ సినిమా విడుదలైందంటే చాలు ఆ హీరో.. హీరోయిన్ చుట్టూ ఉండే వ్యక్తులు చేసే హడావిడి అంతా ఇంతా కాదు. మీరు సూపర్ చేశారు బాబు...మీరు అదరగొట్టేశారు మేడమ్ అంటూ ఆకాశానికి ఎత్తేస్తుంటారు. నిజంగా ప్రేక్షకులు ఆ సినిమాని తిప్పికొట్టినా వీళ్లు ఆహా.. ఓహో అంటూ భజన చేస్తుంటారు. అది నిజమనుకొంటే అంతే సంగతులు. చుట్టూ ఉన్నవాళ్లు అబద్ధం చెబుతున్నారని గుర్తించే నటులు అరుదుగా ఉంటారు. వాళ్లలో నేనూ ఉన్నానంటోంది అనుష్కశర్మ. నటిగా వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూనే, నిర్మాతగానూ కొత్త తరహా కథలతో చిత్రాలు నిర్మిస్తోంది. "నాకు నేనే పెద్ద విమర్శకురాల్ని. నా సినిమాలే నాకు అంత తొందరగా నచ్చవు. ఎదుటి వాళ్లు నా గురించి నిజం చెబుతున్నారో, ముఖస్తుతి కోసమే మాట్లాడుతున్నారో ఇట్టే కనిపెట్టేస్తా. అదృష్టవశాత్తూ నా చుట్టూ భజన చేసే వాళ్లు ఎవరూ లేరు. నాకో మంచి టీమ్ ఉంది. గాలి పొగేసి చెప్పడం, ఊరికే ప్రశంసలతో ముంచెత్తి ప్రయోజనం పొందే వ్యక్తిత్వం ఉన్నవాళ్లెవరూ నాతో లేరు"అని చెబుతోంది అనుష్కశర్మ.

అన్నీ నేర్పేది చిత్ర పరిశ్రమే: ఎలాంటి సినిమా నేపథ్యం లేకుండా బాలీవుడ్‌లో స్టార్‌గా ఎదిగింది అనుష్కశర్మ. "చిత్ర పరిశ్రమలోకి వచ్చి ఎక్కువ సంవత్సరాలే అయింది. అయినా ఇక్కడ కొనసాగుతున్నానంటే కారణం పరిశ్రమే. జీవితం గురించి బాలీవుడ్ ఎన్నో నేర్పిస్తుంది. ఇక్కడ ఎదురయ్యే పరిస్థితులు మానసికంగా దృఢంగా మారేలా చేస్తాయ"ని చెప్పింది అనుష్క.

వెంటపెట్టుకు తిరగొద్దు: చిత్ర పరిశ్రమలో విజయం, పరాజయం అనేవి చాలా కీలకమైన అంశాలు. వాటిని బట్టే నటీనటుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. దీని గురించి అనుష్క మాట్లాడుతూ "మన సినిమా జయాపజయాల్ని మరీ ఎక్కువగా వెంట పెట్టుకు తిరగకూడదు. అది అంత మంచి విషయం కాదు. ప్రతి సినిమా కోసం తొలి సినిమాలా కష్టపడితేనే కెరీర్ ఎక్కువకాలం కొనసాగుతుంద"ని చెప్పింది.

వాళ్లే స్ఫూర్తి: 'ఎన్ హెచ్ 10', 'ఫిలౌరి' లాంటి చిత్రాలతో తనలోని కొత్త నటిని ప్రేక్షకులకు పరిచయం చేసింది అనుష్క. "నా తోటి నటులు సాధిస్తున్న విజయాలు, వాళ్లు పోషిస్తున్న వైవిధ్యమైన పాత్రలే నాకు స్ఫూర్తి. వాళ్లందరినీ చూసే అదే దారిలో వెళ్లి కొత్త తరహా పాత్రలు పోషించగలుగుతున్నాను"అని చెప్పింది 'సుల్తాన్' భామ.

మనసైనోడి పాటలు

మనోజ్‌నందం, ప్రియాసింగ్ జంటగా నటించిన చిత్రం 'మనసైనోడు'. సత్యవరపు వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించారు. హసీబుద్దీన్ నిర్మాత. సుభాష్ ఆనంద్ స్వరకర్త. హైదరాబాద్‌లో పాటల విడుదల కార్యక్రమం జరిగింది. తొలి సీడీని గోపీనాథ్ రెడ్డి విడుదల చేశారు. సురేష్ కొండేటి స్వీకరించారు. దర్శకుడు మాట్లాడుతూ పాటు కుటుంబ ప్రేక్షకులకు నచ్చే చిత్రమిది. ప్రేమకథకి దేశభక్తిని జోడించి ఒక సందేశాన్నిచ్చే ప్రయత్నం చేశాం" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "ఈ చిత్రాన్ని దివంగత కవి డా.సి.నారాయణరెడ్డికి అంకితమిస్తున్నాం. సుభాష్ ఆనంద్ స్వరాలు చిత్రానికి బలాన్నిస్తాయి. వచ్చే నెల్లో విడుదల చేస్తామ"న్నారు. మనోజ్‌నందం మాట్లాడుతూ "నా కెరీర్‌లోనే ఒక మంచి కుటుంబ కథా చిత్రమవుతుంద'న్నారు. "తొలిచిత్రంలోనే గుర్తింపొచ్చే పాత్ర దక్కింద"ని చెప్పింది ప్రియాసింగ్. "పాటలన్నీ చక్కగా కుదిరాయి. ఇందులో సి.నా.రె రచించిన దేశభక్తి గీతానికి స్వరాలు అందించడం అదృష్టమ"ని సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కేదార్ శంకర్, దివ్య, బేబి స్వాతిక, మాస్టర్ ప్రేమ్ నిశ్చల్, జబర్దస్త్ బృందం పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: టి. సురేందర్ రెడ్డి, సంగీతం: సుభాష్ ఆనంద్.


ప్రియాసింగ్, మనోజ్‌నందం

వైభవ్ ప్రేమకథ


వైభవ్

వైభవ్ కథానాయకుడిగా తమిళంలో నటించిన 'మేయాధ మాన్' తెలుగులో విడుదల కాబోతోంది. రత్నకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని మరో దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు నిర్మిస్తున్నారు. వైభవ్ సరసన ప్రియా భవానీ శంకర్ కథనాయికగా నటిస్తోంది. వచ్చే నెలలోనే తమిళంతో పాటు, తెలుగులోనూ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'పిజ్జా', 'జిగర్తాండ' చిత్రాల్ని తెరకెక్కించి విజయాల్ని సొంతం చేసుకొన్న కార్తీక్ సుబ్బరాజు మాట్లాడుతూ "మూడేళ్ల క్రితం స్టోన్ బెంచ్ పేరుతో మా నిర్మాణ సంస్థని ప్రారంభించాం. ఇప్పటివరకు మా సంస్థ నుంచి పలు లఘు చిత్రాల్ని విడుదల చేశాం. మంచి కథల కోసం ఎదురు చూస్తున్నప్పుడు రత్నకుమార్ 'మేయాధమాన్' కథ చెప్పాడు. ఆ కథలో ఉన్న హాస్యం, రొమాంటిక్ సన్నివేశాలు చాలా బాగుంటాయి. ఉత్తర మద్రాసు ప్రాంతంలో నివసించే ఓ జంట మధ్య జరిగే కథ ఇది. యువతరాన్ని తప్పకుండా ఆకట్టుకుంటుంది" అన్నారు.

తెలంగాణలో భారీగా పెట్టుబడులు

యూఏఈ ఎక్స్ఛేంజి ఛైర్మన్ బీఆర్‌శెట్టి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఔషధనగరి, వైద్యపరికరాల ఉత్పత్తి పార్కు, ఇతర ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెడతామని యూఏఈకి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, యూఏఈ ఎక్స్ఛేంజి ఛైర్మన్ బీఆర్‌శెట్టి తెలిపారు. శుక్రవారం ఆయన బేగంపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కేటీఆర్‌తో భేటీ అయ్యారు. ఆయనకు తెలంగాణ పారిశ్రామిక విధానం, టీఎస్‌ఐపాస్, సత్వర అనుమతులు ఇతర అంశాలను కేటీఆర్ వివరించారు. తెలంగాణ ఔషధ రాజధానిగా ఉందని, జీవశాస్త్రాలు, వైమానిక రంగాల్లోనూ పురోగమిస్తోందని చెప్పారు. తెలంగాణ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. మంత్రి వినతిపై శెట్టి స్పందిస్తూ వైద్యారోగ్య రంగంలో పెట్టుబడులపై తమకు ఆసక్తి ఉందని, ఔషధనగరి, వైద్యపరికరాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెడతామని చెప్పారు. తెలంగాణ పారిశ్రామిక విధానం బాగుందని కితాబిచ్చారు. రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వచ్చేందుకు తెచ్చేందుకు సహకరిస్తామన్నారు. దుబాయ్, అబుదాబిల్లో పారిశ్రామికవేత్తలతో త్వరలో సమావేశమై పెట్టుబడులను సమీకరిస్తామన్నారు. తెలంగాణలో తమ సంస్థ తరఫున సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు అవకాశమివ్వాలని కోరారు. పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ ఉన్నారు.

శిఖరాగ్ర సదస్సుకు హైదరాబాద్ అనుకూలం

అమెరికా కాన్సుల్ జనరల్ కాథరిన్ హడ్డా, మంత్రి కేటీఆర్

ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు (జీఈఎస్)-2017కి హైదరాబాద్ అన్ని విధాలా అనుకూలమైనదని అమెరికా కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డా, మంత్రి కేటీఆర్‌లు తెలిపారు. జీఈఎస్‌ను హైదరాబాద్‌కు ఎంపిక నిర్ణయం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ శుక్రవారం వారు సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. జీఈఎస్ ప్రపంచం నలుమూలల నుంచి పారిశ్రామికవేత్తలు, వాణిజ్యవేత్తలు హాజరవుతారు, దీనికి హైదరాబాద్‌ను ఎంపిక చేయడం సముచిత నిర్ణయమన్నారు. అమెరికా- భారత్ మధ్య దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యంలో తెలంగాణ చారిత్రక నేపథ్యముందని చెప్పారు. ఈసారి జీఈఎస్‌లో మహిళలకు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రపంచ అభివృద్ధి, అవకాశాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. నీతిఆయోగ్ సీఈవో కాంత్, అమెరికా వ్యవహారాల ప్రతినిధి మేరీ కే కార్ల్‌సన్‌లు హైదరాబాద్‌కు సోమవారం వస్తారని చెప్పారు.

ఎంబీఏ, ఎంసీఏ సీట్లు 97 శాతం భర్తీ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ సీట్లు 97.58 శాతం భర్తీ అయ్యాయి. ఐసెట్ చివరి విడత సీట్లను సాంకేతిక విద్యా శాఖ శుక్రవారం రాత్రి కేటాయించింది. మొత్తం 295 ఎంబీఏ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 22,499 సీట్లు ఉండగా 22,383 సీట్లు భర్తీ అయ్యాయి. 41 ఎంసీఏ కళాశాలల్లో 2077 సీట్లకుగాను 2020 సీట్లను కేటాయించారు. మొత్తం 299 కళాశాలల్లో 100 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఒక కళాశాలలో ఒక్కరూ ప్రవేశం పొందలేదు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 19లోపు చలానా ద్వారా రుసుం చెల్లించాలి. ఈనెల 21లోపు కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి.

స్మార్ట్‌ఫోనే ప్రయోగశాలగా..!



న్యూయార్క్: స్మార్ట్‌ఫోన్‌ను వ్యాధుల నిర్ధారణ ప్రయోగశాలగా మార్చే చిట్టి పరికరాన్ని పరిశోధకులు అభివృద్ధిచేశారు. దీంతో రోగుల రక్తం, మూత్రం, లాలాజలాలను ఇట్టే పరీక్షిస్తే వీలుంది. దీనికి స్మార్ట్ ట్రాన్స్‌మిషన్-రిఫ్లెక్షన్-ఇంటెన్సిటీ (టీఆర్ఐ) విశ్లేష పరికరంగా నామకరణం చేశారు. ఇది స్మార్ట్‌ఫోన్ కెమెరాను శక్తిమంతమైన స్పెక్ట్రోమీటర్‌గా మార్చుతుంది. మొదట రోగుల శరీర ద్రవాలపై టీఐ.. స్మార్ట్‌ఫోన్ ఫ్లాష్ కాంతి పడేలా చేస్తుంది. పరావర్తనం చెందిన కాంతి సమాచారాన్ని సేకరించేందుకు దీనిలో ఆప్టికల్ ఫైబర్లు ఉన్నాయి. ఇవి ఫోన్ కెమెరా ఆధారంగా పనిచేస్తాయి. సమాచార విశ్లేషణ టీఆర్ఐ ఆధునాతన సాంకేతికతను సిద్ధంచేశారు. శరీరక ద్రవాల రంగు మారడం ద్వారా వ్యాధులను నిర్ధారించే ఏ పరీక్షనైనా దీంతో ఇట్టే నిర్వహించొచ్చని అమెరికాలోని ఇల్లినాయిస్ వర్సిటీ పరిశోధకుడు కెన్నీ లాంగ్ తెలిపారు. రూ.35,000 (550 డాలర్లు)కే ఇది అందుబాటులోకి వస్తుందని ఆయన వివరించారు. నవజాత శిశువుల్లో పుట్టుకతోవచ్చే లోపాలను నిర్ధారించే పరీక్షను దీని సాయంతో సమర్థంగా చేపట్టవచ్చని పేర్కొన్నారు.

శోధన

'స్మార్ట్ వస్త్రాలు'!



న్యూయార్క్: గ్రాఫీన్‌తో నూలు వస్త్రాలపై నేరుగా బ్యాటరీలను ముద్రించే సాంకేతికతను శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. స్మార్ట్ ఎలక్ట్రానిక్ వస్త్రాలకు ఈ పరిశోధన బాటలు పరుస్తోంది. (బ్రిటన్‌లోని మాంచెస్టర్ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. ప్రస్తుతం ధరించిలే (వేరబుల్) ఎలక్ట్రానిక్ పరికరాలకు బరువుగా ఉండే బ్యాటరీలను అవరోధంగా మారుతున్నాయి. వీటి స్థానంలో తేలికపాటి బ్యాటరీల అభివృద్ధి లక్ష్యంగా తాజా పరిశోధన సాగింది. విద్యుత్ వాహకత కలిగిన గ్రాఫీన్ ఆక్సైడ్ సిరాను దీనిలో ఉపయోగించారు. దీన్ని నూలు వస్త్రంపై 3డీ పరిజ్ఞానంతో ముద్రిస్తూ.. సూపర్‌కెపాసిటర్లను అభివృద్ధి చేశారు. సెకన్లలోనే పూర్తిగా ఛార్జింగ్ ఎక్కిపోవడం వీటి ప్రత్యేకత. గ్రాఫీన్ సిరా ఉత్పత్తి ధరలో అందుబాటులోకి వస్తుందని, దీంతో వీటి తయారీకయ్యే ఖర్చు తక్కువే అవుతుందని పరిశోధకులు అమీర్ అబ్దెల్ కాదర్ తెలిపారు. వీటిని వేరబుల్ ఎలక్ట్రానిక్ పరికరాలతో అనుసంధానించడంపై ప్రస్తుతం తాము దృష్టి కేంద్రీకరించామని ఆయన వివరించారు.

విటమిన్ చికిత్సతో.. చర్మ క్యాన్సర్‌కు చెక్!



న్యూయార్క్: ప్రాణాంతక చర్మ క్యాన్సర్ (మెలనోమా)ను విటమిన్-బీ3తో సమర్థంగా అడ్డుకోవచ్చని పరిశోధకులు గుర్తించారు. అతి నీలలోహిత కిరణాల ప్రభావంతో డీఎన్ఏ దెబ్బ తినడం, వ్యాధి నిరోధకశక్తి క్షీణత, వాపు లాంటి రుగ్మతలు చుట్టుముడతాయి. ఇవే మెలనోమా ముప్పు పెరిగేందుకు కారణమవుతాయి. ఈ రుగ్మతలకు నికోటినామైడ్ (విటమిన్-బీ3)తో కళ్లెం వేయొచ్చని ఆస్ట్రేలియాలోని సిడ్నీ వర్సిటీ నిపుణులు తాజాగా కనిపెట్టారు. రోజుకు ఓ గ్రాము వరకూ నికోటినామైడ్ తీసుకుంటే మంచిదేనని వారు గుర్తించారు. అత్యధిక ముప్పు పీడిత బాధితులపైనా ఈ చికిత్స పనిచేస్తుందా? లేదా అనే అంశంపై స్పష్టత కోసం ప్రయోగపరీక్షలు చేపడుతున్నామని భారత సంతతికి చెందిన పరిశోధకులు గారీ హాలీడే తెలిపారు.

అధిక ఉష్ణోగ్రతలకు మానవులే మూలం

వాషింగ్టన్: వరుసగా మూడేళ్ల నుంచీ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడానికి మానవ ప్రమేయంతో సంభవించిన వాతావరణ మార్పులే కారణమని తాజా పరిశోధనలో తేలింది. 1880ల్లో మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే 2014లో ఉష్ణోగ్రతలు వీటిని మించిపోయాయి. ఈ పెరుగుదల 2015లోనూ కనిపించింది. 2016లో కూడా ఇదివరకెన్నడూ లేనిరీతిలో భానుడు ప్రతాపం చూపాడని తాజా పరిశోధన ధ్రువీకరించింది. అమెరికాలోని జాతీయ సముద్ర, వాతావరణ విభాగం (ఎన్‌వోఏఏ) నిపుణులు దీన్ని చేపట్టారు. 20వ శతాబ్దపు సగటు ప్రపంచ ఉష్ణోగ్రలు 13.9 డిగ్రీల సెల్సియస్‌తో పోల్చినప్పుడు గత ఏడాది సగటు ఉష్ణోగ్రతలు 0.94 డిగ్రీలు ఎక్కువగా నమోదైనట్లు దీనిలో తేలింది. మానవ ప్రమేయం లేకపోతే ఈ ఉష్ణోగ్రతలు 0.03 డిగ్రీలకు మించి పెరిగేవికాదని వెల్లడైంది. అంతేకాదు 2000 తర్వాత వరుసగా మూడేళ్లపాటు ఇలా భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం 0.7 శాతమేనని బయటపడింది. 60కుపైగా దేశాలకు చెందిన 500 మంది శాస్త్రవేత్తల అంచనాల ఆధారంగా ఈ పరిశోధన చేపట్టారు. భిన్న సంస్థలు సేకరించిన వేలకొద్దీ అంచనాలను విశ్లేషించారు. దీనిలో వివరాల ప్రకారం... గత ఏడాది వాతావరణంలో కార్బన్‌డైఆక్సైడ్‌తోపాటు, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ స్థాయిలు భారీగా పెరిగాయి. కార్బన్‌డాఆక్సైడ్ స్థాయిలు ఇదివరకటి 58 ఏళ్లలో గరిష్ఠం (400 పీపీఎం)ను మించిపోయి.. 402.9 పీపీఎంగా నమోదయ్యాయి. ఇది 2015 కంటే 3.5 పీపీఎంలు ఎక్కువ. మరోవైపు సగటు సముద్ర ఉష్ణోగ్రతలు కూడా విపరీతంగా పెరిగాయి. 1950 నుంచి 2016 మధ్య ఇవి ఒక డిగ్రీ సెల్సియస్ పెరగ్గా.. 2000 నుంచి 2016 మధ్య 1.62 డిగ్రీల పెరుగుదల కనిపించింది. సముద్ర మట్టం కూడా 1993తో పోలిస్తే 3.25 అంగుళాలు పెరిగింది. వరుసగా ఆరేళ్ల నుంచీ సముద్ర మట్టం పెరుగుతూ రావడం గమనార్హం. గత రెండు దశాబ్దాలుగా సగటున ఏడాదికి 0.13 అంగుళాల చొప్పున ఇది పెరుగుతూ వస్తోంది. పశ్చిమ పసిఫిక్, హిందూ మహాసముద్రాల్లో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది.

ఏడెనిమిదేళ్లలో విశ్వనగరం

- సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నాం
- ప్రాజెక్టులతో స్థిరాస్తి రంగానికి ఊతం
- అడ్డగోలు నిర్మాణాలపై చర్యలు తప్పవు
- పాత తేదీలతో అనుమతుల అరాచకం
- బిల్డర్లు స్వీయ నియంత్రణ పాటించాలి
- తెలంగాణ బిల్డర్లతో మంత్రి కేటీఆర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో నగర మేయర్ రామ్మోహన్ తదితరులు

ఈనాడు - హైదరాబాద్

ఖాళీ భూముల్లో అమరావతి కట్టడం తేలికని.. 427 ఏళ్ల క్రితం ముగ్గుపోసుకుని రూపాంతరం చెందిన నగరాన్ని రాత్రికి రాత్రే విశ్వనగరం చేయడం సాధ్యం కాదని.. ఏడెనిమిదేళ్ల సమయం పడుతుందని తెలంగాణ ఐటీ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ గురించి సమగ్రమైన ప్రణాళిక రూపొందించుకున్నామని రాబోయే రెండేళ్లలో ఫలితాలు చూస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ అధికారంలోకి వచ్చేది తామేనని పునరుద్ఘాటించారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ (టీబీఎఫ్) మూడో వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఖాళీ స్థలంలో కావల్సినట్లు ఇల్లు కట్టుకోవచ్చని.. ఇప్పటికే ఉన్న ఇంటిని కావలసినట్లు తీర్చిదిద్దుకోవడం ఎంత కష్టమో తనకన్న బిల్డర్లకే బాగా తెలుసునని చెప్పారు. ఎన్నో అనుమానాలు, అపోహల నడుమ ప్రయాణం మొదలెట్టి మూడేళ్లలో తెలంగాణ గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. పది, పన్నెండురంగాల్లో రాష్ట్రం అగ్రగామిగా ఉందని తెలిపారు. ఆదాయపరంగా మెరుగ్గా ఉన్నామన్నారు.

మూడేళ్లలో సాధ్యమా?

70 ఏళ్లలో చేయలేనిది మూడేళ్లలో సాధ్యం అవుతుందా అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రణాళిక రూపొందించుకుని విశ్వనగరం దిశగా పలు పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక విద్యుత్తు కోతలు లేకుండా చేశామని. . రూ.1600 కోట్లతో శివార్లలో తాగునీరు అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 20 టీఎంసీలు నిల్వ సామర్థ్యం కల్గిన రిజర్వాయరు నిర్మిస్తున్నామన్నారు. నేరాల శాతం తగ్గినట్లుగా పోలీసుల నివేదికలు చెబుతున్నట్లు వెల్లడించారు.

ఇంకా మెరుగుపరచాల్సి ఉంది..

నగరంలో ఇంకా మెరుగు పర్చాల్సిన విషయాలు ఉన్నాయని మంత్రి అంగీకరించారు. చినుకు పడితే పాడవుతున్న రహదారుల్ని బాగు చేయాల్సి ఉందన్నారు. బిల్డర్లు, రాజకీయ నాయకుల పరిస్థితే కాదు నగరం కూడా 'ఊపర్ షెర్వానీ.. అందర్ పరేషానీ' మాదిరే ఉందన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు..

నిర్మాణరంగంలో బిల్డర్ల విజ్ఞప్తుల మేరకు పలు సంస్కరణలు, మార్పులు చేసినట్లు మంత్రి చెప్పారు. ఆన్‌లైన్‌తో అనుమతుల ప్రక్రియ వేగవంతం చేశామన్నారు. అవినీతి పూర్తిగా పోయిందని తాను అనని గణనీయంగా మాత్రం తగ్గిందన్నారు. అనుమతులన్నీ ఏక గవాక్షం (సింగిల్ విండో)లో పొందేలా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. శివార్లలో నిర్మాణాలు చేపడుతున్న బిల్డర్లను స్వీయ నియంత్రణ పాటించాలని కోరారు. బిల్డర్ల లాభాపేక్ష, స్థానిక ప్రజాప్రతినిధుల దురాశతో పార్కింగ్ లేకుండా, సెట్‌బ్యాక్ వదలకుండా అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నారని ఇది మానుకోవాలన్నారు. పాత తేదీల్లో అనుమతులు తీసుకుని ఆరాచకం చేస్తున్నారని ప్రభుత్వానికి ఈ విషయాలన్నీ తెలుసన్నారు. అలాంటివాటిపై చర్యలకు దిగుతామన్నారు. తక్కువ యూనిట్లు కట్టే బిల్డర్లకు ఎవైనా ఇబ్బందులుంటే మినహాయింపులు కోరండని.. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రెండు పడక గదుల ఇళ్లు మాకివ్వండి

రెండు పడకగదుల ఇళ్లలో తక్కువ యూనిట్ల ప్రాజెక్టులను తమ సభ్యులకు అప్పగించాలని తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సి.ప్రభాకరరావు కోరారు. జీఎస్టీతో రాష్ట్రానికి వచ్చే ఆదాయం పెరిగినందున స్టాంప్ డ్యూటీని 2 శాతానికి తగ్గించాలని టీబీఎఫ్ ప్రధాన కార్యదర్శి జె.వెంకట్‌రెడ్డి కోరారు. రెరా కార్యాలయాన్ని త్వరగా ఏర్పాటు చేయాలని.. రెరాతో ఉల్లంఘనలకు ఆస్కారం ఉండదు కాబట్టి అనుమతుల సమయంలో ఇప్పుడున్న 10 శాతం మార్ట్‌గేజ్ విధానాన్ని తొలగించాలని కోరారు. ఈ సమావేశంలో నగర మేయర్ బొంతు రామ్మోహన్, టీబీఎఫ్ ఉపాధ్యక్షుడు టి.నరసింహారావు పలువురు సభ్యులు హాజరయ్యారు.

ఎన్నో ప్రణాళికలు: కేటీఆర్

- రహదారుల మెరుగుకు హైదరాబాద్ రహదారి అభివృద్ధి సంస్థ (హెఆర్‌డీసీ) ఏర్పాటు చేశాం. 9 వేల కి.మీ. రహదారుల్లో ప్రధానమైన 290 కి.మీ. వైట్ టాపింగ్ చేస్తున్నాం.
- విద్యుత్తు, టెలికాం ఇతరత్రా కేబుల్స్ కోసం రహదారి వేశాక తవ్వకుండా ముందే డక్ట్ నిర్మిస్తున్నాం. రహదారి వేసిన గుత్తేదారే 7 ఏళ్ల నిర్వహణ చూడాల్సి ఉంటుంది.. దీంతో వేసేటప్పుడే నాణ్యంగా వేస్తారు.
- వానాకాలం ముగిశాక చేపట్టే ఈ పనులు 12 నుంచి 18 నెలల్లో పూర్తవుతాయి.
- శివారు ప్రాంతాలను ఔటర్‌కు అనుసంధానం చేసే వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్ఆర్‌డీపీ)లో రూ.3,000 కోట్లు ఖర్చు చేస్తున్నాం.
- రూ. 250 కోట్లతో ఛేనంబర్ నుంచి రామంతాపూర్, ఉప్పల్ నుంచి నారపల్లి వరకు రూ. 950 కోట్లతో, జేబీఎస్ నుంచి శామీర్‌పేట, నర్సాపూర్ చౌరస్తా, ప్యారడైజ్ నుంచి కొంపల్లి వరకు ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మిస్తున్నాం.
- బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 45 మీదుగా ఔటర్ రింగ్‌రోడ్డు వకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నాం.
- మెట్రోరైలు నాగోల్, మియాపూర్ కారిడార్లను నవంబరులో ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించబోతున్నాం.
- ఇవన్నీ నిర్మాణరంగానికి ఊతమిస్తాయి. శివార్లలో కొల్లూరు, అహ్మద్‌గూడ వంటి ప్రాంతాల్లో రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణంతో కొత్త పట్టణాలు రూపు దిద్దుకుంటున్నాయి.
- వచ్చే ఆగస్టు నాటికి లక్ష ఇళ్లను కట్టి తీరుతాం.

నోట్ల నాణ్యతలో ప్రపంచస్థాయి ప్రమాణాలు: రిజర్వు బ్యాంకు

ముంబయి: నోట్ల రద్దు తర్వాత కరెన్సీ నోట్ల ముద్రణలో తేడాలు చోటుచేసుకున్నట్లు కాంగ్రెస్ విమర్శలు చేసిన నేపథ్యంలో రిజర్వుబ్యాంకు స్పందించింది. నోట్ల విషయంలో తాము ప్రపంచస్థాయి ప్రమాణాల్ని పాటిస్తున్నామనీ, వాటి నాణ్యత అవసరమైన పరామితులకు లోబడే ఉందని పేర్కొంది. నోట్ల ముద్రణశాలల్లో అధునాతన యంత్రాలు, అర్హులైన సిబ్బంది ఉన్నారనీ, ప్రతి దశలోనూ నాణ్యత ప్రమాణాల్ని పాటిస్తున్నట్లు స్పష్టం చేసింది. భారతీయ నోట్ల ఉత్పత్తి ప్రక్రియ.. ప్రపంచ వ్యాప్తంగా అనుసరిస్తున్న పద్ధతులకు దీటుగా ఉందని, పరామితులకు లోబడి నోట్ల నాణ్యత ప్రమాణాల్ని పాటిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. ఏవైనా తేడాలకు సంబంధించిన ఆరోపణలున్న కేసుల్లో పరిశీలనకు ప్రామాణిక విధివిధానాలున్నాయనీ, అవసరమైతే అలాంటి నోట్లను పరీక్షించి, దిద్దుబాటు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపింది. రూ.500, రూ.2 వేల నోట్ల విశ్వసనీయతపై ఆగస్టు 8న కాంగ్రెస్ పార్టీలు ఆరోపణలు చేసిన నేపథ్యంలో రిజర్వుబ్యాంకు తాజా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

రాష్ట్ర ప్రభుత్వానిది అత్యుత్తమ పారిశ్రామిక విధానం

- టెంట్ డెకరేటర్ల రంగాన్ని పరిశ్రమగా గుర్తిస్తాం
- ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ వెల్లడి

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: రాష్ట్రప్రభుత్వ పారిశ్రామిక విధానం దేశంలోనే అత్యుత్తమమైందని, టెంట్ డెకరేటర్ల రంగాన్ని పరిశ్రమగా గుర్తించేందుకు కృషి చేస్తామని ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ పేర్కొన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో ఏర్పాటుచేసిన ఆలిండియా టెంట్ డెకరేటర్ల సంక్షేమ సంఘం 16వ జాతీయ సదస్సుకు శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ టెంట్ డెకరేటర్లకు పరిశ్రమ స్థాయి కల్పించాల్సిన అవసరముందన్నారు. ఈరంగానికి జీఎస్టీ మినహాయింపు, ఈ-వేబిల్లు రద్దు విషయాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నగరంలో



రామోజీ ఫిల్మ్‌సిటీలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకిస్తున్న ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ. చిత్రంలో టెంట్ డెకరేటర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు

స్థలం కేటాయించేందుకు చర్యలు చేపడతామన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ప్రథమ స్థానంలో కొనసాగుతోందన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీ ఓ అద్భుత కళాఖండమని, రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు అద్భుతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. సంఘం ప్రతినిధులు ఉపముఖ్యమంత్రిని ఘనంగా సత్కరించారు. టెంట్ డెకరేటర్ల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు సాగాలని సంఘం జాతీయ ఛైర్మన్ మదన్‌మోహన్, అధ్యక్షుడు మనోహర్‌లాల్ గులాటీ సూచించారు. సదస్సు రెండోరోజు వారు సంఘ పతాకం, జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఆలిండియా టెంట్ డీలర్ల అసోసియేషన్ పేరును మార్చి ఆలిండియా టెంట్ డెకరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరిట కొనసాగించాలని నిర్ణయించారు. వైస్‌ఛైర్మన్ సూరత్‌సింగ్ మల్హోత్రా, ప్రధాన కార్యదర్శి అలిల్‌రావు, తెలంగాణ ఛైర్మన్ హాజీసేట్, సీనియర్ వైస్‌ఛైర్మన్ రవిజిందాల్, సలహాదారు ఎస్ఎస్ మక్కన్, ప్రతినిధులు పవన్‌సేట్, రాష్ట్రాధ్యక్షుడు తౌఫిఖ్‌ఖాన్, ఆలిండియా మహిళా అధ్యక్షురాలు మధుసేథ్, ప్రతినిధులు సత్‌పాల్, గిరీశ్‌మిటల్, ముల్లాఅజిజ్, తౌఫిఖ్‌ఖాన్ పాల్గొన్నారు.

తట్టు, రుబెల్లా సూదిమందు సురక్షితం

- 9 నెలలు-15 ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా వేయించాలి
- ఈ నెల 17 నుంచి సెప్టెంబరు 25 వరకు విస్తృత కార్యక్రమాలు

ఈనాడు, హైదరాబాద్: తట్టు(మీజిల్స్), రుబెల్లా వ్యాధులను అడ్డుకునేందుకు ఒకే టీకా(ఎంఆర్)ను సార్వత్రిక టీకా జాబితాలో భాగంగా ప్రవేశపెట్టనున్నారు. 9 నెలల చిన్నారుల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలందరికీ దీన్ని ఇవ్వనున్నారు. ఈ నూతన టీకా వేసే క్రతువును తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 17న ప్రారంభించి వచ్చేనెల 25 వరకూ అమలుచేస్తారు. టీకాను వేయించడంలో తల్లిదండ్రులకున్న అపోహలను తొలగించడంలో పత్రికలు, ప్రసార సాధనాలు కీలక పాత్ర పోషించాలని కోరుతూ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారమిక్కడపాత్రికేయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఎంఆర్ టీకా అమలును విజయవంతం చేయడంలో భాగంగా విద్య, శిశు సంక్షేమ శాఖలతో కలిసి ముందుకెళ్తున్నామన్నారు. ప్రభుత్వం కేసీఆర్ కిట్‌తోనూ దీనికి ముడిపెట్టిందన్నారు. శిశువుకు పూర్తిస్థాయి టీకాలు అందిన తర్వాతే తుది విడత నగదు ఖాతాలో జమ చేసేలా పథకాన్ని తీర్చిదిద్దామని తెలిపారు. ఇప్పటికే ఆయా వ్యాధులకు సంబంధించిన టీకాలు వేర్వేరుగా ఇప్పించిన వాళ్లు కూడా ఎంఆర్ టీకాను తప్పనిసరిగా పిల్లలకు ఇప్పించాలని సూచించారు.

ఏమిటీ కొత్త టీకా?: దేశంలో ప్రస్తుతం తట్టు, గవదబిళ్లలు, రుబెల్లా(ఎంఎంఆర్) పేరిట ఈ మూడు జబ్బులకూ ఒకే టీకా ప్రైవేటు వైద్యంలో అమల్లో ఉంది. ప్రభుత్వ వైద్యంలో తట్టు టీకా మాత్రమే అమలవుతుండగా..రుబెల్లా టీకా ఇప్పటివరకూ ప్రవేశపెట్టలేదు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఈఏడాది ఫిబ్రవరిలో కర్ణాటక, తమిళనాడు, గోవా, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లలో ఎంఆర్ టీకాను సార్వత్రిక జాబితాలో చేర్చింది. రెండో విడతలో తెలంగాణ, ఏపీ సహా 12 రాష్ట్రాల్లో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోంది.

టీకా సురక్షితం

టీకాలిచ్చినప్పుడు పిల్లలకు హాని కలుగుతుందని కొందరు తల్లిదండ్రులు భయపడుతున్నారు. నిజానికిది పూర్తిగా అపోహే. ఈ టీకా చాలా సురక్షితం. ప్రభావవంతమైంది కూడా. దీనివల్ల అతి కొందరిలో స్వల్పంగా జ్వరం, దద్దుర్లు, కండరాల నొప్పి ఉంటాయి. ఏ టీకా తీసుకున్నా సూదిమందు ఇచ్చిన దగ్గర నొప్పి, ఎరుపుదనం ఉంటాయి. అంతమాత్రాన భయపడాల్సిన పని లేదు. ఈ టీకాను 12 నెలల సమయంలో తొలిసారి..24 నెలల సమయంలో రెండోసారి ఇప్పించాలి.

– డాక్టర్ రంగనాథ్, పిల్లల వైద్యనిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



ఎంఆర్ టీకాపై అవగాహన కల్పించే గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి, తదితరులు

ఆ సీట్లను తెలుగు రాష్ట్రాల అభ్యర్థులతోనే భర్తీ చేయాలి

- సూపర్ స్పెషాలిటీ కోర్సులపై హైకోర్టులో వ్యాజ్యం
- ప్రవేశాలు తదుపరి ఉత్తర్వులకు లోబడి ఉంటాయన్న ధర్మాసనం

ఈనాడు, హైదరాబాద్: ఎన్టీఆర్, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయాల్లో సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లోని సీట్లను 'జాతీయ స్థాయి కౌన్సెలింగ్' నిర్వహించడం ద్వారా భర్తీ చేయాలంటూ దిల్లీలోని హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ.. శుక్రవారం హైకోర్టులో అత్యవసర వ్యాజ్యం దాఖలైంది. పీజీ వైద్య విద్యార్థి డాక్టర్ బి.సతీష్‌కుమార్‌తో పాటు పలువురు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.రజనితో కూడిన ధర్మాసనం దీనిపై విచారణ జరిపింది. దీనిపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రతివాదులకు స్పష్టం చేసింది. విచారణను ఈనెల 16కు వాయిదా వేసింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు 371(డి) ప్రకారం తెలంగాణలో ఉన్న కాళోజీ వర్సిటీలోని సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో 85% సీట్లను తెలంగాణ, 15% సీట్లను ఏపీ అభ్యర్థులతో భర్తీ చేయాలన్నారు. ఏపీలోని ఎన్టీఆర్ వర్సిటీలో 85% సీట్లను ఏపీ వారికి, 15% తెలంగాణవారికి కేటాయించాలన్నారు. జాతీయస్థాయిలో కౌన్సిలింగ్ నిర్వహించి ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు స్థానం కల్పించడానికి వీల్లేదన్నారు. దీనిపై ప్రతివాదుల స్పందనను తెలుసుకోవాలని ధర్మాసనం కోరగా.. ఇప్పటికే ప్రవేశాలు కల్పిస్తున్నారని న్యాయవాది తెలిపారు. ఈ నేపథ్యంలో ఆప్రవేశాలు తామివ్వబోయే తదుపరి ఉత్తర్వులకు లోబడి ఉంటాయని ధర్మాసనం పేర్కొంది.

పట్టణానికీ పచ్చని హారం..!

- నగరాల్లో ఇంటింటికీ మొక్కలు
- జిల్లా కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: హరితహారంలో భాగంగా ఇక పట్టణ ప్రాంతాల్లోనూ మొక్కలు పంపిణీ చేయబోతున్నారు. ఇంటింటికీ వెళ్లి మొక్కలను అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఒక్కో ఇంటికి కనీసం ఆరుకు తగ్గకుండా పండ్లు, పూల మొక్కలు అందించనున్నారు. పట్టణ ప్రాంతాల్లో మొక్కల పంపిణీకి అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ అన్ని జిల్లాల కలెక్టర్లను శుక్రవారం ఆదేశించారు. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో స్థానిక సంస్థల నిధులు దీనికి వినియోగించాలని, ఆయా ప్రాంతాల్లో పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద, ఇతర పౌరసంస్థల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు.

ఫిర్యాదుల నేపథ్యంలో: గ్రామీణ ప్రాంతాల్లో మొక్కల పంపిణీ హరితహారం ప్రారంభం నుంచే ఉంది. నర్సరీల నుంచి సేకరించిన మొక్కలను గ్రామాలకు తరలించి అవసరమైన వారికి అందించే వారు. పట్టణాలు, నగరాల్లో మాత్రం అవసరమైన వారు నర్సరీలకు వెళ్లి మరీ తెచ్చుకోవాల్సి వస్తోంది. అంతగా శ్రమించినా మొక్కలు దొకరడం లేదన్న ఫిర్యాదులు సీఎం దృష్టికి కూడా వెళ్లాయి. స్పందించిన ప్రభుత్వం పట్టణప్రాంతాల్లోనూ ఇంటింటికి మొక్కలు సరఫరా చేయాలని నిర్ణయించింది.


ఇళ్ల దగ్గరే అందిస్తారు: పట్టణ ప్రాంతాల్లో మొక్కల పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలోని నర్సరీల నుంచి వాహనాల్లో మొక్కలను పట్టణప్రాంతాలకు తరలిస్తారు. ఏయే రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయన్న విషయాన్ని మైకు ద్వారా ప్రకటించి, ప్రజలు కోరిన పూలు, పండ్ల మొక్కలు వారికిచ్చేలా ఏర్పాట్లుచేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. రోజూ కొన్ని కాలనీల చొప్పున తిరుగుతూ.. పట్టణం మొత్తం మొక్కల పంపిణీ జరిగేలా కార్యాచరణ రూపొందించామన్నారు. కళాశాలలు, పాఠశాలల్లోనూ మొక్కలు పంపిణీ చేయడంతోపాటు విద్యార్థులు మొక్కల్ని దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని నిర్ణయించినట్టు చెప్పారు.

భారత సైన్యం సర్వ సన్నద్ధం: జైట్లీ

దిల్లీ: ఎలాంటి పరిణామాన్నైనా ఎదుర్కొనేందుకు భారత సాయుధ దళాలు సర్వసన్నద్ధంగా ఉన్నట్లు రక్షణశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ శుక్రవారం లోక్‌సభలో తెలిపారు. డోక్లాంలో భారత, చైనా సైన్యం మధ్య చోటుచేసుకున్న ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. టిబెట్‌లో చైనా సైన్యం కదలికలకు సంబంధించి వచ్చిన వార్తలను ప్రస్తావిస్తూ అడిగిన ప్రశ్నకు జైట్లీ స్పందిస్తూ మన రక్షణదళాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయంటూ డోక్లాం పేరును ప్రస్తావించకుండా పునరుద్ఘాటించారు. భారత్ వద్ద తగినంత మందుగుండు సామగ్రికి కొరత ఉందంటూ వచ్చిన వార్తలను జైట్లీ తీవ్రంగా ఖండించారు. యుద్ధమంటూ వస్తే. ..మన సైన్యం వద్ద ఉన్న మందుగుండు కేవలం 20 రోజులు మాత్రమే వస్తుందన్న 'కాగ్' నివేదిక గురించి ఈ రోజు లోక్‌సభలో ప్రస్తావించారు. దీనికి అరుణ్‌జైట్లీ స్పందిస్తూ.... ఇదే ప్రశ్నను ఇది వరకు కూడా లేవనెత్తారనీ...ఇప్పుడు కూడా తాను ఆరోజు చెప్పిన సమాధానాన్నే పునరుద్ఘాటిస్తున్నానన్నారు.

దొరికిన 'ముత్తూట్' దోపిడీయత్నం సూత్రధారి

- ఉస్మానాబాద్‌లో అరెస్ట్.. రెండు తుపాకులు స్వాధీనం
- తప్పించుకునేందుకు పోలీసులపై దాడికి యత్నం
- తూటాలు పోలీస్‌శాఖకు చెందినవిగా అనుమానం



వివరాలు వెల్లడిస్తున్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్‌శాండిల్య. చిత్రంలో దోపిడీ యత్నం సూత్రధారి షరీఫ్

ఈనాడు, హైదరాబాద్: మైలార్‌దేవ్‌పల్లి ముత్తూట్ ఫైనాన్స్ దోపిడీ విఫలయత్నం సూత్రధారి మహ్మద్ షరీఫ్ అబ్దుల్ ఖాదర్ ఖాద్రీ అలియాస్ షరీఫ్‌ను సైబరాబాద్ పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. గత నెల 4న జరిగిన దోపిడీ యత్నం కేసులో మొత్తం 8 మంది నిందితులు కాగా.. పోలీసులు ఇప్పటికే నలుగురిని అరెస్ట్ చేశారు. తాజాగా మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌లో షరీఫ్.. ప్రియురాలితో కలిసి ఉంటున్నాడనే సమాచారంతో పోలీస్ బృందం శుక్రవారం తెల్లవారుజామున దాడి చేసి అతనిని పట్టుకుంది. అతని వద్ద నుంచి 9ఎంఎం, 7.15 ఎంఎం తుపాకులను, 15 తూటాలను స్వాధీనం చేసుకుంది. ఘటన పూర్వాపరాలను సైబరాబాద్ సంయుక్త కమిషనర్ షానవాజ్ ఖాసిం, క్రైమ్స్ డీసీపీ జానకి షర్మిలతో కలిసి కమిషనర్ సందీప్‌శాండిల్య శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరించారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన షరీఫ్ 23 ఏళ్ల క్రితమే ముంబయికి మకాం మార్చాడు. ఓ చోరీయత్నం కేసులో జైలుకెళ్లిన క్రమంలో పరిచయమైన నేరగాళ్ల సావాసంతో దోపిడీల కోసం ముఠాలు కట్టాడు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన షేరూఖాన్ వద్ద నుంచి ఆయుధాలు కొనుగోలు చేశాడు. 2015లో గుజరాత్‌లోని వాల్సద్‌లో ఓ టవేరాను అపహరించాడు. ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు బంగారం భారీగా దొరుకుతుందనే ఉద్దేశంతో గుజరాత్, మహారాష్ట్రతోపాటు హైదరాబాద్‌లోని ఆ సంస్థ కార్యాలయాల వద్ద రెక్కీ నిర్వహించారు. చాంద్రాయణగుట్టకు చెందిన పండ్ల వ్యాపారి మహ్మద్ దస్తగిర్ ఇచ్చిన సమాచారంతో మైలార్‌దేవ్‌పల్లి కార్యాలయాన్ని ఎంచుకున్నారు. గత నెల 4న అదే వాహనంలో ముఠా సభ్యులు అర్షద్ ఫులుముద్దీన్‌ఖాన్, షఫీ, ఫరూఖ్ అలియాస్ జీషన్, సంతోష్ దశరథ్, రాజేశ్ అలియాస్ అన్నాతో కలిసి మైలార్‌దేవ్‌పల్లికి చేరుకున్నాడు. ముత్తూట్ ఫైనాన్స్‌లో దోపిడీకి యత్నించిన క్రమంలో సిబ్బంది గట్టిగా అరవడంతో పరారయ్యారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు అదే నెల 21న నలుగురిని అరెస్ట్ చేయగా.. షరీఫ్‌తోపాటు అన్నా, షేరూ, ఫరూఖ్ జాడ చిక్కలేదు. తాజాగా అందిన సమాచారంతో ప్రత్యేక బృందం షరీఫ్‌ను అరెస్ట్ చేసింది. పోలీసులు వెళ్లిన సమయంలో వారిపై దాడికి యత్నించిన షరీఫ్.. వాహనంలో హైదరాబాద్‌కు తీసుకొస్తున్న సమయంలోనూ దూకి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతని వద్ద దొరికిన తూటాలు పోలీస్‌శాఖకు చెందినవనే అనుమానంతో దర్యాప్తు చేస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఆయుధాలు విక్రయించిన షేరూ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

30 ఏళ్ల ముందుచూపు...

పదేళ్లు లక్ష్యంగా అభివృద్ధి ప్రణాళికలు!

- దిల్లీ తరహాలో పచ్చదనం
- జలాశయాలు కలుషితం కాకుండా చర్యలు
- మూసీనదిపై రహదారి, వంతెనలు
- హైదరాబాద్ నగరాభివృద్ధిపై ముఖ్యమంత్రి కేసీఆర్

ఈనాడు, హైదరాబాద్: రాజధాని మహా నగరంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. 30 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని... తక్షణావసరాల మేరకు పదేళ్ల ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. నగరంలో జరిగే ప్రతి అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలో భాగంగా ఉండాలని స్పష్టం చేశారు. తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు.. మురుగు, వరద కాలువలు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం, రవాణా సదుపాయాలు, మార్కెట్లు, మరుగుదొడ్లు, పచ్చదనం పెంపు వంటి అంశాల్లో నగరం ఎలా ఉండాలన్న విషయమై ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ నగరాభివృద్ధిపై మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. తెలంగాణ నగరాలు, పట్టణాల్లో జనాభా విపరీతంగా పెరుగుతోందనీ, హైదరాబాద్‌లో కోటి జనాభా ఉన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. కాంక్రీటు జంగిల్‌గా మారిపోతున్న హైదరాబాద్‌లో పచ్చదనాన్ని పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. నగరం చుట్టూ ఉన్న వేలాది ఎకరాల అటవీ భూముల్లో చెట్లను విరివిగా పెంచాలన్నారు. దిల్లీ తరహాలో ఇక్కడా పచ్చదనం ఉండాలని సీఎం స్పష్టం చేశారు. నగరంలో పచ్చదనం పెంపు, పర్యవేక్షణకు పురపాలక మంత్రి పేషీలో ప్రత్యేకంగా ఐఎఫ్ఎస్ అధికారిని నియమించాలన్నారు. నగరాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలనీ, ఇందు కోసం బస్తీ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి డివిజన్‌కు పది కమిటీలు ఉండాలని, 15 రోజుల్లో వీటి నియామకాలు పూర్తికావాలన్నారు. పచ్చదనం పెంపు, పరిశుభ్రత కోసం ఈ కమిటీలు పనిచేస్తాయన్నారు. గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాలు, శామీర్‌పేట సహా నగరం చుట్టూ ఉన్న చెరువుల్లోకి పారిశ్రామిక వ్యర్థాలు కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. భవన నిర్మాణాల్లో కచ్చితంగా నిబంధనలను పాటించాలని, అనుమతుల్లో తప్పులుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సబర్మతి నది తరహాలో మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, దీనికి రెండు వైపులా ఉద్యానవనాలను నిర్మించాలన్నారు. మూసీ మీదుగా ఓఆర్ఆర్ నుంచి ఓఆర్ఆర్ వరకూ రహదారిని నిర్మించాలని, నది దాటడానికి వీలుగా పలు చోట్ల వంతెనలను నిర్మించాలన్నారు. నగరంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలని, ఇళ్లపై ఉండే విద్యుత్ తీగలను తొలగించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా రహదారులను నిర్మించాలని, ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నచోట ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అండర్‌పాస్‌లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సమావేశంలో మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసీయుద్దీన్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, కార్యదర్శి నవీన్‌మిట్టల్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ కమిషనర్లు జనార్దనరెడ్డి, చిరంజీవులు, వాటర్‌వర్క్స్ ఎండీ దానకిషోర్, పీసీసీఎఫ్ పి.కె.ఝా, సీఎం ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం శంషాబాద్‌లోని కేఎల్‌సీసీ కన్వెన్షన్‌లో జరిగిన శాసనసభాపతి మధుసూదనాచారి కుమారుడు క్రాంత్ కుమార్, నవ్యల వివాహానికి హాజరైన ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి తదితరులు

జూన్‌లోగా ఎల్లంపల్లికి నీటి మళ్లింపు

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా... మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నీటిని మళ్లించే పనులను వచ్చే ఏడాది జూన్‌లోగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఇందుకు తగ్గట్టుగా ఆకృతుల పరిశీలన, ఆమోద ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, లిఫ్టు పనుల పురోగతిపై సీఎం శుక్రవారం సమీక్షించారు. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఇంజినీర్-ఇన్-చీఫ్ మురళీధర్, కేంద్ర ఆకృతుల సంస్థ చీఫ్ ఇంజినీర్ నరేందరరెడ్డి, కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, ప్రధాన గుత్తేదారు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇప్పటివరకు జరిగిన పనులు, ఆకృతుల ఆమోదం తదితర అంశాల గురించి సీఎం వివరంగా చర్చించారు. డిజైన్ల కారణంగా పనుల్లో జాప్యం జరగనీయవద్దని ఆయన అధికారులకు సూచించారు. ఈ బ్యారేజీల్లో నిర్మిస్తున్న రేడియల్ గేట్లు దేశంలోనే పెద్దవనీ, అన్ని జాగ్రత్తలూ తీసుకొని డిజైన్లను ఖరారు చేస్తున్నామని, త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తిచేస్తామని అధికారులు వివరించినట్లు తెలిసింది. వచ్చే జూన్ నాటికి పనులను పూర్తిచేయాలని సీఎం వారిని ఆదేశించారు.

హైదరాబాద్ తాగునీటికి శాశ్వతంగా...: రాజధాని తాగునీటికి శాశ్వత పరిష్కారంగా 10-15 టీఎంసీల సామర్థ్యంతో రెండు జలాశయాలను నిర్మించే అంశంపై ముఖ్యమంత్రి చర్చించారు. 'హైదరాబాద్ తాగునీటి సరఫరాకు శాశ్వత ప్రాతిపదికన రెండు రిజర్వాయర్లను చేపట్టాలి. కాళేశ్వరం ద్వారా మళ్లించే గోదావరి నీటి కోసం ఒకటి.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా మళ్లించే కృష్ణా నీటి కోసం మరొకటి నిర్మించాలి. సాంకేతిక అంశాలను పరిశీలించి పనులను ప్రారంభించాలి' అని అధికారులకు సూచించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించే కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి.. శామీర్‌పేట మండలం బొమ్మరాజ్‌పేట ప్రాంతంలో 15 టీఎంసీల సామర్థ్యముండే జలాశయ నిర్మాణంపై నివేదికను తయారుచేసే బాధ్యతను కన్సల్టెన్సీ సంస్థ వాప్కోస్‌కు అప్పగించినట్లు తెలిసింది.

350 జూనియర్ కళాశాలలకు అనుమతుల్లేవ్

- మంత్రి కడియం శ్రీహరి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో మొత్తం 350 జూనియర్ కళాశాలలకు ఇంటర్ బోర్డు అనుమతి దక్కలేదు. తుది గడువు ఈనెల 10లోగా నిబంధనల ప్రకారం పత్రాలు సమర్పించకపోవడంతో అనుబంధ గుర్తింపును నిరాకరించారు. ఇప్పటికే వాటిల్లో వేలాది మంది విద్యార్థులున్నందున వార్షిక పరీక్ష రుసుము చెల్లించే నాటివరకూ లోపాలను సరిదిద్దుకొని దరఖాస్తు చేసుకుంటే అనుమతివ్వాలని అధికారులు నిర్ణయించారు. ఈ పరిస్థితిపై విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి శుక్రవారం ఇంటర్‌బోర్డు అధికారులతో సచివాలయంలో సమీక్షించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల రుసుము చెల్లించే నాటికి యాజమాన్యాలు అనుమతి పొందకుంటే విద్యార్థులు మరో కళాశాల నుంచి ఫీజు చెల్లించేందుకు అవకాశం ఇస్తామన్నారు. ఆ సమయంలో ఏ కళాశాలలకు అనుమతి ఉంది? వేటికి లేదో? స్పష్టంగా వెబ్‌సైట్లో ఉంచుతామన్నారు. దానిపై ప్రచారం చేసి విద్యార్థులను అప్రమత్తం చేస్తామన్నారు. గత రెండేళ్ల నుంచి ప్రభుత్వ కళాశాలల్లో 50 వేల మంది విద్యార్థులు పెరిగారని చెప్పారు.

హవాలా సూత్రధారి పవన్ అగర్వాల్

- పాత్రధారులు.. నేతలు, వ్యాపారులు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న హవాలా వ్యాపారానికి ప్రధాన సూత్రధారి హాంకాంగ్‌కు చెందిన పవన్ అగర్వాల్‌గా అధికారులు తేల్చారు. దేశంలోని అనేకమంది రాజకీయ నాయకులు, వ్యాపారస్తులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న పవన్ అగర్వాల్ వారి అక్రమార్జనను సరిహద్దులు దాటించడానికి పెద్ద వ్యవస్థనే ఏర్పాటు చేసుకున్నట్లు భావిస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్ నుంచి తరలుతున్న నల్లధనమంతా హాంకాంగ్, చైనా, సింగపూర్, దుబాయ్, మాల్దీవులు తదితర దేశాలకు చేరుతున్నట్లు గుర్తించారు. ఈ దందాలో దేశవ్యాప్తంగా అనేక నకిలీ సంస్థలు, బ్యాంకు ఖాతాల ప్రమేయం ఉండటంతో దర్యాప్తు కూడా సంక్లిష్టంగా మారింది. మరోపక్క విదేశీ ఖాతాల వివరాలు తెలుసుకోవడం కూడా ఇబ్బందిగా మారడంతో దర్యాప్తు నెమ్మదిగా సాగుతోంది. విదేశాలకు నిధులు తరలింపు వ్యవహారం కావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు కూడా రంగంలోకి దిగారు. తొలుత సాదాసీదా కేసుగా భావించినా తీవ్రత బయటపడేసరికి అధికారులు హతాశులయ్యారు. దేశవ్యాప్తంగా అనేక నకిలీ సంస్థల నుంచి కుంభకోణం సూత్రధారులు మహేంద్రఖత్రి, వినోద్ ఓజ, ఆనంద్‌కుమార్ బిద్రకర్‌లు తమ ఖాతాల్లోకి నిధులు మళ్లించుకొని వాటి నుంచి విదేశాలకు తరలిస్తున్న వైనం బయటపడింది. గత కొన్నేళ్లుగా సాగుతున్న ఈ వ్యాపారంలో దేశంలోని అనేక ప్రాంతాల్లోని పలు ప్రైవేటు సంస్థలు, బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు తేలడంతో వాటన్నింటి పూర్వాపరాలపై ఆరా తీస్తున్నారు. దాదాపు ఇవన్నీ బోగస్ సంస్థలుగానే భావిస్తున్నారు. హాంకాంగ్‌కు చెందిన పవన్ అగర్వాల్ అనే వ్యక్తి ఈ మొత్తం వ్యవహారానికి సూత్రధారిగా భావిస్తున్నారు. ఈ పేరును చందానగర్ పోలీసుల విచారణలో మహేంద్రఖత్రి బయటపెట్టారు. హాంకాంగ్‌లో అంతర్జాతీయ ద్రవ్యమారకం వ్యాపారంతోపాటు పలు హోటళ్లు కలిగి ఉన్న పవన్ అగర్వాల్ రాజకీయ నాయకులు, వ్యాపారులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. యూపీఏ హయాంలో ఒక కేంద్రమంత్రితో కలిసి వ్యాపారాలు నిర్వహించిన పవన్ ఇప్పుడు ప్రధానంగా నిధుల మళ్లింపు వ్యాపారంపైనే ఎక్కువగా దృష్టిపెట్టినట్లు సమాచారం. పవన్ అగర్వాల్ ఉదంతం వెలుగులోకి రావడంతో హైదరాబాద్ నుంచి తరలుతున్న డబ్బంతా ఎవరిదన్నది ప్రశ్నార్థకంగా మారింది. డబ్బు విదేశాలకు తరలిస్తున్న విషయాన్ని అంగీకరించిన ఖత్రి మురా ఎవరిదన్నది చెప్పేందుకు మాత్రం నిరాకరిస్తోందని అధికారులు చెబుతున్నారు.



కామారెడ్డి జిల్లా భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో మాట్లాడుతున్న కోదండరాం

అంతిమ విజయం మాదే: కోదండరాం

ఈనాడు – కామారెడ్డి, హైదరాబాద్: శాంతియుతంగా నిర్వహిస్తున్న అమరుల స్ఫూర్తి యాత్రను అడ్డుకోవడం అప్రజాస్వామికమనీ.. ప్రభుత్వం తన బలహీనతను బయటపెట్టుకుందని తెలంగాణ ఐకాస ఛైర్మన్ ఆచార్య కోదండరాం అన్నారు. న్యాయం తమ వైపే ఉందనీ, అంతిమ విజయం కూడా తమదేనని స్పష్టంచేశారు. రకరకాల శక్తులను అడ్డుకోవాలని పోచంపాడు సభలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యల ఫలితంగానే శుక్రవారం తమ యాత్రపై తెరాస శ్రేణులు దాడులకు తెగబడ్డాయని దుయ్యబట్టారు. నిజామాబాద్‌లో బహిరంగసభకు అన్ని రకాల అనుమతులు పొందామనీ.. ఎన్ని అడ్డంకులు ఎదురైనా అనుకున్న విధంగా అమరుల స్ఫూర్తియాత్రను కొనసాగిస్తామన్నారు. శనివారం ఉదయం సికింద్రాబాద్ నుంచి బయలుదేరి వెళ్తామనీ.. మళ్లీ అడ్డుకుంటే మళ్లీ ప్రారంభిస్తామనీ, ఈ సారి కఠిన కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. కామారెడ్డి జిల్లాలో అమరుల స్ఫూర్తి యాత్రకు ఆటంకాలు ఎదురైన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం సికింద్రాబాద్‌లోని తన నివాసంలో కోదండరాం విలేకరులతో మాట్లాడారు. "తెలంగాణ ఉద్యమకాలంలో దాడులు చేసినవాళ్లే ఇప్పుడు తెరాసలో చేరి మళ్లీ ఉద్యమకారులపై దాడులు చేస్తున్నారు. ఉద్యమ ద్రోహులకు తెరాస ఉపయోగపడుతోంది. సమావేశాలు నిర్వహించుకునే హక్కు అందరికీ ఉంది. దాన్ని అడ్డుకోవడం తెలంగాణ ఉద్యమస్ఫూర్తికే వ్యతిరేకం. ఉద్యమ సమయంలో సభలు, సమావేశాలు పెట్టుకునే అవకాశం లేకపోతే ప్రత్యేక రాష్ట్రం వచ్చేదే కాదు. అధికార పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. అలా జరగని పక్షంలో గట్టిగా నిలదీసే హక్కు ప్రజలకుంది. ఆ దిశగా ప్రజలను చైతన్యపరిచే ప్రయత్నాలు చేస్తాం. రాళ్లుపడినా, రక్తం కారినా శాంతియుతంగానే యాత్ర చేస్తాం" అని కోదండరాం వెల్లడించారు. అధికార పార్టీ నాయకులు ఇసుక దందాలు, భూదందాలు, కాంట్రాక్టులు చేస్తున్నారనీ.. మంజీర ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్న వారిలో స్వయంగా ఒక మంత్రి, ఆయన ఇద్దరు కుమారుల పాత్ర ఉందని కోదండరాం ఆరోపించారు. నేరెళ్ల ఘటనలో బాధ్యులైన ఉన్నతాధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రీరాంసాగర్ పునరుజ్జీవన ప్రాజెక్టుపై ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. శుక్రవారం ఉదయం సికింద్రాబాద్ క్లాక్‌టవర్ వద్ద ఆయన అమరుల స్ఫూర్తి యాత్రను ప్రారంభించారు.

యాత్రకు అడుగడుగునా ఆటంకాలు

తెలంగాణ ఐకాస చేపట్టిన నాలుగో విడత అమరుల స్ఫూర్తి యాత్రకు శుక్రవారం కామారెడ్డి జిల్లాలో అడుగడుగునా ఆటంకాలు ఎదురయ్యాయి. జిల్లా సరిహద్దు బస్వాపూర్‌లో యాత్ర ప్రవేశించగానే తెరాస మద్దతుదారులు, రైతులు.. యాత్ర వాహనాలకు ఎదురుగా రోడ్డుపై బైఠాయించి అడ్డుకున్నారు. అభివృద్ధికి అడ్డుపడుతున్నారంటూ గంటసేపు వాహనాలను కదలనివ్వలేదు. మరోవైపు ప్రజలకు వాస్తవాలు చెబుతున్నామనే తమను తెరాస శ్రేణులు అడ్డుకుంటున్నాయని ఐకాస ప్రతినిధులు విమర్శించారు. అనంతరం యాత్రను అడ్డుకునేందుకు తెరాస మద్దతుదారులు, రైతులు భారీ సంఖ్యలో కామారెడ్డిలోని ఐకాస సభాస్థలి వద్దకు చేరుకున్నారు. ఐకాస ప్రతినిధులు ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ ప్రసంగించడంతో కోపోద్రిక్తులైన తెరాస మద్దతుదారులు సభాస్థలి వద్ద ఉన్న షామియానాను కూల్చివేశారు. ఐకాస, విద్యార్థి సంఘాల నాయకులు... తెరాస మద్దతుదారులు పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడుల్లో నలుగురు విద్యార్థి సంఘాల నాయకులకు గాయాలయ్యాయి. భిక్కనూరులో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయన్న కారణంతో కోదండరాంతోపాటు ఐకాస నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. దాదాపు నాలుగు గంటలపాటు ఠాణాలో ఉంచి అనంతరం నాటకీయ పరిణామాల మధ్య రాజధానికి తరలించారు.

పోలీసులపై కేసులు నమోదు చేయాలి

- నేరెళ్ల ఘటనపై స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలి
- డీజీపీని కలసిన అఖిలపక్షనేతలు

ఈనాడు – హైదరాబాద్

నేరెళ్ల దళితులపై అమానుష దాడికి కారణమైన ఎస్పీ సహా పోలీసులపై ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నేతలు రాష్ట్ర డీజీపీని కోరారు. ఈ ఘటనపై స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి రక్షణ కల్పించాలన్నారు. శుక్రవారం టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టివిక్రమార్క, తెలంగాణ తెదేపా కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడవెంకటరెడ్డి ఇతర నేతలతో కూడిన అఖిలపక్ష బృందం రాష్ట్ర డీజీపీ అనురాగ్‌శర్మను కలసి వినతిపత్రం ఇచ్చింది. నేరెళ్లలో దళితులపై పోలీసుల దారుణ హింసకు సంబంధించి ఇంతవరకు ఎలాంటి విచారణ చేయకపోగా ఎవరిపైనా కేసులను నమోదు చేయలేదన్నారు. ఇసుకలారీల వల్ల చనిపోయిన ఘటనలకు సంబంధించి గుత్తేదారులపై కేసులు నమోదు చేయలేదని వివరించారు. డీజీపీకి వినతిపత్రం అందజేసిన అనంతరం భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడుతూ..బాధ్యులైన పోలీసులు, పోలీసు అధికారులపై కేసులు నమోదు చేయకపోవడాన్ని అడిగామన్నారు. జిల్లా ఎస్పీపై చర్యలు తీసుకోవాలన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..జిల్లా ఎస్పీపై బాధితులు ఫిర్యాదు చేశారని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరామన్నారు. పోలీసులతో సంబంధం లేకుండా మంత్రి కేటీఆర్ ఎస్సైని సస్పెండ్ చేసినట్లు ఎలా చెబుతారని ప్రశ్నించారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ నియోజకవర్గంలో దళితులకు రక్షణ లేదన్నారు.



నేరెళ్ల ఘటనపై శుక్రవారం డీజీపీ అనురాగ్‌శర్మతో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భట్టి విక్రమార్క. చిత్రంలో అఖిలపక్ష నేతలు ఆరేపల్లి మోహన్, రేవంత్‌రెడ్డి, చాడ వెంకటరెడ్డి తదితరులు

ఎస్పీని సస్పెండ్ చేయండి

- నేరెళ్ల బాధితుల డిమాండ్

వేములవాడ, న్యూస్‌టుడే: తమను ఇష్టారాజ్యంగా కొట్టి, చిత్రహింసలు పెట్టిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ విశ్వజిత్ కంపాటిని సస్పెండ్ చేయాలని నేరెళ్ల బాధితులు డిమాండ్ చేశారు. 8 రోజులుగా వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు పశుల ఈశ్వర్‌కుమార్, గంధం గోపాల్, పెంట బానయ్య, చెప్యాల బాలరాజు, కోల హరీష్, బత్తుల మహేష్‌లు శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీసులు కొట్టిన దెబ్బలకు ఇప్పటికీ నడవలేకపోతున్నామన్నారు. విచక్షణా రహితంగా కొట్టిన ఎస్పీతో పాటు పోలీసులను సస్పెండ్ చేయాలన్నారు. ఘటన జరిగి 40 రోజులు అవుతున్నా ప్రభుత్వం స్పందించలేదన్నారు. కేవలం ఎస్ఐ రవీందర్‌ను సస్పెండ్ చేశారని, మిగతా వారినీ సస్పెండ్ చేయాలన్నారు. మంత్రి కేటీఆర్ తమను పరామర్శించినప్పుడు ఇసుక రవాణాను ఆపుతామని, ఎస్పీని సస్పెండ్ చేస్తామని హామీ ఇచ్చారని, మెరుగైన వైద్యం అందించి పునరావాసం కల్పిస్తామని చెప్పారని పేర్కొన్నారు. ఇంటికో ఉద్యోగం కూడా ఇప్పిస్తామన్నారు. వాటి అమలు ఊసే లేదని, మంత్రి హామీలను మరిచిపోయారని తెలిపారు. మంత్రి కేటీఆర్ తమతో మాట్లాడిన మాటలు వేరని, బయట విలేకరుల సమావేశంలో చెప్పిన విషయాలు వేరేనన్నారు. ఎంజీఎం వైద్యులు కూడా తమ గాయాలను చూసి మీకు అప్పటికే ఏమైనా గాయాలు ఉన్నాయా? ఇప్పటివేనా అని హేళన చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని, సరైన వైద్యం అందించి కేసులను మాఫీ చేయాలని కోరారు. ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. న్యాయం జరగకుంటే దళిత సంఘాలు, ప్రతిపక్షాలతో కలిసి దిల్లీలో నిరసన చేపడతామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న నేరెళ్ల బాధితులు

తెలంగాణ డీజీపీకి జాతీయ మానవ హక్కుల సంఘం నోటీసు

- నేరెళ్ల ఘటనపై 4వారాల్లో విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశం

ఈనాడు, దిల్లీ: జాతీయ మానవహక్కుల సంఘం తెలంగాణ డీజీపీకి నోటీసులు జారీచేసింది. సిరిసిల్ల రాజన్న జిల్లాలోని నేరెళ్లలో దళితులు, బలహీనవర్గాలకు చెందిన వ్యక్తులను అక్రమంగా నిర్బంధించి తీవ్ర చిత్రహింసలకు గురిచేసినట్లు అందిన ఫిర్యాదులు, పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా నోటీసులు జారీచేసినట్లు మానవహక్కుల సంఘం ఓ ప్రకటనలో వెల్లడించింది. బాధితులు చేసిన ఆరోపణలు, ఫిర్యాదులపై నిష్పాక్షికంగా, స్వతంత్రంగా దర్యాప్తు జరిపించి 4 వారాల్లో నివేదిక సమర్పించాలని తెలంగాణ డీజీపీని ఆదేశించింది. ఇసుక గుత్తేదారులు నడుపుతున్న లారీల కారణంగా గ్రామంలో చాలా మరణాలు సంభవిస్తున్నాయని ప్రజలు ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నట్లు పేర్కొంది. లారీల సామర్థ్యానికి మించి ఇసుక నింపి గ్రామస్థుల భద్రతను పట్టించుకోకుండా వేగంగా వాహనాలను నడుపుతున్నారని తమ దృష్టికి వచ్చినట్లు తెలిపింది.

ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలి

- అందరినీ ఏకం చేసేందుకు ఆత్మగౌరవ యాత్ర చేస్తా
- టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భట్టి విక్రమార్క


ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని ప్రజాస్వామ్యవాదులు ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఆత్మగౌరవం కోసం సాధించుకున్న రాష్ట్రంలో అది దక్కడం లేదన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక సమస్యలున్నాయని పేర్కొంటూ, వీటి పరిష్కారం కోసం అందరినీ ఏకం చేయడానికి ఆత్మగౌరవ యాత్ర చేస్తానన్నారు. పార్టీ అధిష్ఠానంతో చర్చించి, రాష్ట్ర పార్టీ నేతల సమ్మతితో యాత్ర చేపడతానన్నారు. ఎస్సారెస్పీని పూర్తి చేసింది కాంగ్రెస్ పార్టీయే అని గుర్తుంచుకోవాలన్నారు. గతంలో పనులు చేసినవారి పేర్లు లేకుండా చేయడానికి ఇది కేసీఆర్ చేస్తున్న రాజకీయ కుట్రని ఆరోపించారు. ఆకృతులతోనే ముఖ్యమంత్రి నీటిని పారిస్తున్నారని ఎద్దేవా చేశారు. నేరెళ్ల ఘటనలో చనిపోయిన వారికి 20 లక్షల పరిహారం, గాయపడినవారికి రూ.ఐదు లక్షలు అందజేయాలని మాజీ ఎంపీ వి.హన్మంతరావు డిమాండ్ చేశారు. దళితులను చిత్రహింసలకు గురిచేసిన పోలీసులపై కేసులు నమోదు చేయాలన్నారు.

తెరాసలోనే కొనసాగుతా: డీఎస్

ఈనాడు, హైదరాబాద్: తాను తెలంగాణ రాష్ట్ర సమితిలోనే కొనసాగుతానని, మళ్లీ కాంగ్రెస్‌లో చేరే ఉద్దేశం ఏ మాత్రం లేదని రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తనకు వ్యక్తిత్వం ఉందని, తనపై ఇష్టానుసారం దుష్ప్రచారం చేయడం తగదని అన్నారు. తానెవరినీ కలవలేదని, తన ప్రతిష్ఠను దెబ్బతీయడానికి కొంత మంది ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తనతో విభేదాలున్న వారే ఈ కుట్రలు చేస్తున్నారని భావిస్తున్నట్లు డీఎస్ చెప్పారు.

జగన్‌కు రాజకీయాల్లో ఉండే హక్కు లేదు

తెదేపా తెలంగాణ అధ్యక్షుడు రమణ



ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగానికి, ప్రజల తీర్పునకు విలువ లేకుండా మాట్లాడుతున్న వైకాపా అధ్యక్షుడు జగన్‌కు రాజకీయాల్లో ఉండే హక్కు లేదని తెదేపా తెలంగాణ అధ్యక్షుడు రమణ ధ్వజమెత్తారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు, తెలుగు మహిళా అధ్యక్షురాలు బండ్రు శోభారాణి, లంకల దీపక్‌రెడ్డిలతో కలసి శుక్రవారం ఆయన ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఏపీలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేరీతిలో జగన్ ప్రసంగాలు చేస్తున్నారని రమణ ఆరోపించారు. గతంలో జగన్ తండ్రి వైఎస్.. అధికారం కోసం పాతబస్తీలో మతకల్లోలాలు సృష్టించారని, కాంగ్రెస్‌లోనే ఉంటూ అప్పటి కాంగ్రెస్ సీఎంపై చెప్పులేయించారని అన్నారు. వైకాపా జాతీయ పార్టీ అంటూ తెలంగాణలోనూ పోటీచేశారని, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులను హింసిస్తుంటే జగన్ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. అపరిష్కృతంగా ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేయకుండా ఎస్సారెస్పీ పునరుజ్జీవం పేరుతో రూ.2 వేల కోట్లు ఖర్చు పెట్టడం. పాత గోడలకు కొత్త రంగు వేసినట్లుగా కేసీఆర్ శైలి ఉందన్నారు. మోత్కుపల్లి మాట్లాడుతూ.. తెలంగాణలోదళితులపై జరుగుతున్నదాడులను చూస్తుంటే 30 ఏళ్లుగా ప్రజాజీవితంలో ఉన్న తనకే ఏడుపొస్తోందన్నారు. నేరెళ్ల బాధితులను పరామర్శించేందుకు కేసీఆర్ ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు.

ప్రాజెక్టులు కట్టిందెవరో సీఎం చెప్పాలి: మధుయాష్కీ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులకు కాంగ్రెస్ నాయకులు అడ్డుపడుతున్నారని పదే పదే చెబుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ తాను సభ పెట్టిన పోచంపాడులోని ఎస్సారెస్పీ, వరదకాలువ, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు ఎవరు నిర్మించారో చెబితే బాగుంటుందని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎంపీ మధుయాష్కీ అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో మాజీ ఎమ్మెల్యే అనిల్‌తో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టులు కట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేయకుండా పక్కన పడేశారని అన్నారు.

'ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి'

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై మహారాష్ట్రతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుని, ఆ రాష్ట్రంలోని 1,800 ఎకరాల భూముల సాధన కోసం ప్రధానమంత్రి వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేస్తూ తెతెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శుక్రవారం సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. ప్రాజెక్టుల పునరాకృతి పేరుతో అంచనాల పెంపును నిలిపివేయాలని, పాలమూరు జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న ప్రాజెక్టులకు తక్షణం రూ.వెయ్యికోట్లు విడుదలచేయాలని ఆయన కోరారు. గుత్తేదారులకు మేలు చేసేలా చర్యలు తీసుకుంటే ప్రజాందోళన చేపడతామన్నారు.

భూసేకరణ ప్రణాళికను వెంటనే సిద్ధం చేయాలి

- జాతీయ రహదారుల సంస్థ తీరుపై మంత్రి తుమ్మల అసంతృప్తి
- నిర్మాణ పనులపై సమీక్ష

ఈనాడు, హైదరాబాద్: "సంవత్సరం కిందట రహదారులను అప్పగించాం. ఇప్పటివరకు ఒక్క అడుగైనా ముందుకు పడలేదు. సమగ్ర అధ్యయన నివేదిక (డీపీఆర్)లు కూడా సిద్ధం కాలేదు. ఇలాగైతే, రహదారుల నిర్మాణం ఎప్పటికి కొలిక్కొస్తుంది? 15 రోజుల్లో భూసేకరణకు సంబంధించిన ప్రణాళిక సిద్ధం కావాలి" అని తెలంగాణ రహదారులు-భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఐఏ) అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సంస్థకు అప్పగించిన ఐదు మార్గాల పనులను శుక్రవారం అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు.

మంత్రి మాట్లాడుతూ... '460 కిలోమీటర్ల మేర ఐదు రాష్ట్ర రహదారులను నాలుగు వరుసలకు విస్తరించేందుకు ఎన్‌హెచ్ఐఏకు రాష్ట్ర ప్రభుత్వం పనులు అప్పగించింది. ఆరు నెలలైనా పురోగతి కనిపించడంలేదు. కొన్నిచోట్ల బైపాస్‌లను కూడా ఖరారు చేయలేదు. డీపీఆర్‌ల తయారీకి నెలల తరబడి కాలయాపన చేయటం సరికాదు. ప్రమాదాల విషయంలో మునుపటి పరిస్థితులు పునరావృతం కాకుండా రహదారి భద్రతాంశాలను పక్కాగా అమలుచేయాలి. భూసేకరణ షెడ్యూళ్లను సిద్ధంచేసిన జిల్లా కలెక్టర్లు ఆ ప్రక్రియను తక్షణం ప్రారంభించాలి. మిగిలిన జిల్లాల్లో భూసేకరణ షెడ్యూళ్లను వెంటనే ఖరారు చేయాలి. ఆరు మార్గాల్లో మొత్తం 496.28 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి 1,881.40 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. ఆ పనుల పూర్తికి కాలనియమావళిని రూపొందించాలి.



ఐదు రహదారులకు సంబంధించిన పనులను అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల

అలైన్‌మెంట్‌ను సిద్ధం చేయండి: వ్యయ పరిమితుల మేరకు పాత రహదారులను ఎక్కువగా వినియోగించుకోవాలి. బైపాస్‌ల నిర్మాణానికి ఎన్‌హెచ్ఐఏ విధానపరంగా వ్యతిరేకిస్తోంది. అందుకు తగ్గట్లు ఆయా మార్గాల అలైన్‌మెంట్‌ను సిద్ధం చేయండి. కట్టడాల కూల్చివేతల వంటివి లేకుండా భూసేకరణ ప్రణాళికలను రూపొందించండి. ప్రజల అభీష్టం మేరకు ఖమ్మం-సూర్యాపేట, ఖమ్మం-అశ్వారావుపేట మార్గాల్లో భూమిని సేకరించండి. అవకాశమున్న మేరకు బైపాస్‌లను ఏర్పాటు చేయాలి. రైల్వే, సింగరేణి, నీటిపారుదల అధికారులతో సమన్వయ సమావేశాలను ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టే జాతీయ రహదారుల పనులకు కూడా వేగమంతం చేయాలి' అని మంత్రి పేర్కొన్నారు.

నిత్య వివాదం.. విచ్చలవిడితనం..!

- బాసర ఆలయానికి గుదిబండగా వంశపారంపర్య అర్చకత్వం
- వివాదాస్పదమవుతున్న అర్చకుల తీరు
- శాపంగా పాలనపరమైన లోపాలు
- వరుస ఘటనలతో సరస్వతీ క్షేత్రానికి అప్రతిష్ఠ



బాసర సరస్వతీ ఆలయం

బాసర - న్యూస్‌టుడే:

'నిత్య కల్యాణం..పచ్చతోరణం' ఆలయాల శోభకు అద్దం పట్టే నానుడి ఇది. దక్షిణ భారతావనిలో సరస్వతీ మాత కొలువున్న ఏకైక ఆలయం బాసర జ్ఞాన సరస్వతీ క్షేత్రం మాత్రం అందుకు భిన్నంగా నిత్య వివాదాలకు, అపశ్రుతులకు ఆలవాలమైంది. ముఖ్యంగా ఆలయంలో అర్చకుల వ్యవహారశైలి ఇటీవలి కాలంలో అత్యంత వివాదాస్పదంగా మారింది. అమ్మవారికి నిర్వహించే పూజాధికాల్లో అనాదిగా వస్తున్న సంప్రదాయాలకు, ఆగమ నియమాలకూ వారు మంగళం పాడుతున్నారు. అమ్మవారికి నిర్వహించే అభిషేక సేవను నామమాత్రంగా మార్చారు. ఆలయం అనుసరించే శాక్తేయ సంప్రదాయానికి విరుద్ధంగా పూజలు నిర్వహిస్తున్నా అడ్డుకునే వారు కరవయ్యారు.

అయ్యారే.. నైవేద్యం మరిచారే

నెల రోజుల కిందట ఆలయానికి వచ్చిన ప్రజాప్రతినిధుల సేవలో మునిగితేలినఅర్చకులు..అమ్మవారికి నైవేద్యం సమర్పించడం మరిచిపోయారు. ఈ వివాదం చల్లారక ముందే ఉత్సవమూర్తినే తరలించి..మరో వివాదానికి ఆజ్యం పోశారు. అంతకుముందు అమ్మవారి మెడలోని బంగారుహారం మాయం కావటం, భక్తుడు సమర్పించిన ముక్కుపుడకను తస్కరించాలని ప్రయత్నించి పట్టుబడటం..ఇలా మరెన్నో ఘటనల్లో అర్చకుల ప్రమేయం కన్పించింది. సులభ దర్శనం, పూజలు చేయిస్తామంటూ భక్తులను నమ్మించి సొమ్ము చేసుకోవడం, ఆలయ మంటపాల్లో సెల్‌ఫోన్ల వినియోగం, ఆలయంవద్ద స్వంతంగా లాడ్జిలను నడపడంవంటి ఘటనలకూ అర్చకులు కారకులవుతున్నారు. ఇద్దరుఅర్చకులపై పిటా(ప్రివెన్షన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్ట్)లాంటి కఠిన కేసులు నమోదయ్యాయంటే వారివ్యవహారశైలి ఎలాఉందో అర్థమవుతుంది.

వంతుల వారీ దోపిడీ

ఆలయంలో అమ్మవారికి కైంకర్యాలు నిర్వహించే అర్చకులకు గతంలో ఆలయ ఆదాయంలో పావు వంతు(మిరాసీ వ్యవస్థ)చెల్లించే వారు. సర్వోన్నత న్యాయ స్థానం ఆదేశాల మేరకు బాసర ఆలయంలో వంశపారంపర్య పూజలను రద్దు చేసి, అర్చకులకు జీతాలు ఇస్తున్నారు. అయినప్పటికీ ఇక్కడ అర్చకులు అనధికారికంగా వంశపారంపర్య పూజలను కొనసాగిస్తుండగా..అధికారులు వారికి వంతపాడుతున్నారు. వంతుల వారీ పూజల పేరుతో ఆలయ ఆదాయానికి గండికొడుతున్నారు. అక్షరాభ్యాస మంటపాల్లో భక్తుల వద్ద కానుకలు స్వీకరిస్తూ భారీగా ఆదాయం గడిస్తున్నారు. సంవత్సరానికి అనధికారికంగా అర్చకులు పొందుతున్న ఆదాయం సుమారు రూ.10 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. రెండు, మూడు కుటుంబాల గుప్పిట్లోనే ఆలయ అర్చకత్వం బందీ అయిపోయిందన్న విమర్శలూ ఉన్నాయి. వంశపారంపర్య అర్చకత్వాన్ని రద్దు పరచాలని స్థానికులు పలుమార్లు ఆందోళనలు చేసినా అధికారుల్లో స్పందన కొరవడింది.

భద్రత కరవు

ఆలయంలో పేరుకు 28 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నా తరచూ ఎక్కడా చోట భద్రత ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి. గతేడు ఓ వ్యక్తి దోపిడీకి ప్రయత్నిస్తూ ఆలయ రాజగోపురంపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆలయంలో 20 సీసీ కెమెరాలున్నా తరచూ మొరాయించడం పరిపాటిగా మారింది. నాణ్యమైన విద్యుత్తు తీగలతో కెమెరాలను అనుసంధానించకపోవడంతో తరచూ సమస్యలు వస్తున్నాయి. అవినీతి బయటపడుతుందన్న భయంతో సిబ్బందే కెమెరాలు పనిచేయకుండా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రధాన ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్ల వినియోగం, తనిఖీలు అటకెక్కాయి. ముఖ్యంగా ఆలయానికి దక్షిణం వైపు ఉన్న ద్వారం అక్రమాలకు రాచమార్గంగా మారింది. గర్భగుడికి 20 మీటర్ల దూరంలో ఉన్న ఈ ద్వారం వరకు వాహనాలను అనుమతిస్తున్నా..అడ్డుకునే వారు కరవయ్యారు. ప్రధానార్చకుడు ఆ మార్గం గుండానే విగ్రహాన్ని తరలించి పక్కనే షెడ్డులో ఉన్న తన వాహనంలో అమ్మవారి ఉత్సవ మూర్తిని తరలించినా ఎవరూ గుర్తించకపోవడం ఇక్కడి భద్రతా లోపాలకు నిదర్శనం.



ఆలయ రాజగోపురాల వద్ద కానరాని భద్రత చర్యలు, సిబ్బంది

ఆపశ్రుతుల్లో అధికారుల వంతు

మరోవైపు పాలనపరమైన లోపాలు, అధికారుల అవినీతి, నిర్లక్ష్య వైఖరి ఆలయంలో తరచూ అపశ్రుతులు చోటుచేసుకునేందుకు ఆస్కారమిస్తోంది. దేవరకొండ అక్షరాభ్యాసాల ఘటనను పసిగట్టడంలో విఫలమైన అధికారులు..విషయం తెలిసిన తర్వాత కూడా నామమాత్రంగా తాఖీదులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఉన్నతాధికారుల ప్రమేయంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొందరిపై చర్యలకు ఉపక్రమించారు. తప్పు చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకపోవటం వల్లనే పదే పదే తప్పులు పునరావృతం అవుతున్నాయి. సిబ్బంది సైతం ఆలయంలో దశాబ్దాలుగా పాతుకుపోవటం అక్రమాలకు ఆస్కారం కలుగుతుందన్న విమర్శలున్నాయి. గత 12 ఏళ్లుగా ఆలయ అకౌంటెంట్‌గా ఒక్కరే విధులు నిర్వహించటం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతుంది.

విగ్రహం తరలింపుపై కేసు నమోదు

సరస్వతీమాత విగ్రహాన్ని తరలించి అక్షరాభ్యాసాలు చేసిన ఘటనలో బాసర పోలీసులు విచారణను ఆరంభించారు. ఆలయఈవో ఫిర్యాదుమేరకు అర్చకులు సంజీవ్‌కుమార్, సప్తశతి పారాయణదారు ప్రణవ్‌శర్మలపై ఐపీసీ 408,409 రెడ్‌విత్ 34సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

సైనిక పాఠశాలల్లో బాలికలకు ప్రవేశాలు!

ప్రతిపాదనను పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వం

దిల్లీ: సైనిక పాఠశాలల్లో, జాతీయ రక్షణ అకాడమీ(ఎన్డీయే)లో బాలికలకు ప్రవేశాలు కల్పించాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సుభాష్ రామ్‌రావ్ భామ్రే ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్రాల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో కొత్తగా 21 సైనిక పాఠశాలలను ఏర్పాటు చేసే ప్రతిపాదనలు తమ వద్ద పరిశీలనలో ఉన్నాయని రక్షణ శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ లిఖిత పూర్వకంగా ఇచ్చిన సమాధానంలో తెలిపారు. కుల, మత, ప్రాంతీయత ఆధారంగా సైనిక రెజిమెంట్‌లను ఏర్పాటు చేసే విధానం స్వాతంత్ర్యానంతరం నుంచి ప్రభుత్వానికి లేదని మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లకు సహకరించండి

మాజీ ప్రధాని దేవెగౌడకు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి సహకరించాలని మాజీ ప్రధాని దేవెగౌడకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. శుక్రవారం దిల్లీలో గుజ్జకృష్ణ, వెంకటేశ్, అనంతయ్యలతో కలసి ఆయన దేవెగౌడతో భేటీ అయ్యారు. అన్ని పార్టీలు బీసీలకు అన్యాయం చేస్తున్నాయని కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో జనాభా నిష్పత్తిలో వాటా ఇవ్వడానికి పార్టీలు ముందుకు రాకపోతే దేశంలో తిరుగుబాటు తప్పదని తెలిపారు. పలు రాజకీయ పార్టీలను కూడగట్టుకొని పోరాటం చేద్దామని దేవెగౌడ హామీ ఇచ్చినట్లు కృష్ణయ్య తెలిపారు. సెప్టెంబరు రెండోవారంలో దిల్లీలో ఫ్లోర్‌లీడర్ల సమావేశం నిర్వహించాలని, దీంతో ఏయే రాజకీయ పార్టీలు బీసీలకు మద్దతిస్తాయో తేలుతుందని దేవెగౌడ చెప్పారని ఆయన వివరించారు.

ఎస్సీ వర్గీకరణకు సహకరించొద్దు: మాలమహానాడు

తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీలను వర్గీకరించొద్దని కాంగ్రెస్ లోక్‌సభాపక్షనేత మల్లికార్జున ఖర్గేకు మాలమహానాడు విజ్ఞప్తి చేసింది. పార్లమెంటులో బిల్లు పెట్టకూడదని, పెట్టినా సహకరించొద్దని ఖర్గేకు మాలమహానాడు అధ్యక్షుడు జి.చెన్నయ్య విజ్ఞప్తి చేశారు. అనంతరం జాతీయ షెడ్యూలు కులాల కమిషన్ సభ్యుడు యోగేంద్ర పాసవాన్‌ను కలిసి ఎస్సీ వర్గీకరణ చేయొద్దని వినతిపత్రం అందజేసినట్లు చెన్నయ్య తెలిపారు.

వారసత్వ పశుజాతి సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయండి

కేంద్రమంత్రి హర్షవర్ధన్‌కు జోగు రామన్న వినతి

అటవీ ప్రాంతం అధికంగా ఉన్న ఆదిలాబాద్ జిల్లాలో వారసత్వ పశుజాతి సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని తెలంగాణ మంత్రి జోగు రామన్న కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి హర్షవనర్ధన్‌ను కోరారు. శుక్రవారం జోగు రామన్న కేంద్ర మంత్రితో సమావేశమయ్యారు. వారసత్వ సంపదగా వస్తున్న అరుదైన గోవులు, ఇతర పశుజాతులను కాపాడటానికి సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరినట్లు రామన్న తెలిపారు. సమైక్య రాష్ట్రంలో ఏర్పాటైన ఈ కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లినందునా తెలంగాణలో ప్రత్యేకంగా నెలకొల్పాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాలో జరీ, తూర్పు అనే అరుదైన పశుజాతులను గుర్తించామని, అందువల్ల ఆ ప్రాంతంలో హెరిటేజ్ ఫాం పెట్టాలని కోరామన్నారు. తమ వినతిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. రూ.190 కోట్ల ప్రాజెక్టుకు రూ.125కోట్లు కేంద్రం ఇస్తే, మిగతాది స్థానిక ఎన్‌జీవోలు, రాష్ట్రప్రభుత్వం సమకూర్చాల్సి ఉంటుందన్నారు. కంపా నిధులు రూ.1,100 కోట్లు విడుదల చేయాలని కోరామని, అతి త్వరలో తెలంగాణ వాటా విడుదల చేస్తామని కేంద్రమంత్రి చెప్పారన్నారు.

భాజపా ఎమ్మెల్యేకు జీవిత ఖైదు

అహ్మదాబాద్: హత్యకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న భాజపా శాసనసభ్యునికి గుజరాత్ హైకోర్టు జీవిత ఖైదు విధించింది. 2004లో భూ తగాదాలో ఓ వ్యక్తిని హత్య చేశారని దాఖలైన కేసులో రాజ్‌కోట్ జిల్లా గొండల్ ఎమ్మెల్యే జయరాజ్‌సిన్హ్ జడేజాతో పాటు మరో ఇద్దరిని న్యాయస్థానం దోషులుగా తేల్చింది. 2004లో నీలేశ్ రయానీని హత్య చేశారన్న ఆరోపణలతో జయరాజ్‌సిన్హ్‌తో పాటు మరో 15 మందిపై కేసు నమోదైంది.

అమ్మా.. అమ్మా.. లే.. అమ్మా



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో వానరం మృతి చెందింది. తల్లి చనిపోయిన విషయం తెలియని పిల్ల వానరం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల దాకా చనిపోయిన తల్లిని లేపేందుకు ప్రయత్నించింది. తల్లి పాలను తాగేందుకు చేసిన ప్రయత్నం స్థానికుల హృదయాలను కలచివేసింది. పిల్ల కోతి ఆకలిని గమనించిన స్థానికులు బిస్కెట్లు, పాలు అక్కడ పెట్టినా తినలేదు. పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో చనిపోయిన వానరాన్ని ఖననం చేసి పిల్ల కోతిని అడవిలో వదిలిపెట్టారు.

— కేసముద్రం, న్యూస్‌టుడే

అమరుల స్ఫూర్తియాత్రను అడ్డుకోవడం అప్రజాస్వామికం

వేర్వేరు ప్రకటనల్లో తమ్మినేని, చాడ

ఈనాడు, హైదరాబాద్: తెఐకాస ఆధ్వర్యంలో చేపట్టిన అమరుల స్ఫూర్తియాత్రను శుక్రవారం కామారెడ్డి జిల్లా బస్వాపూర్ వద్ద అడ్డుకోవడం అప్రజాస్వామికమని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డిలు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. యాత్రకు సంఘీభావం పలికిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జీ చేయడాన్ని వారు ఖండించారు. ఉద్యమాల పట్ల ప్రభుత్వం నిరంకుశవైఖరి విడనాడాలని పేర్కొన్నారు. హవాలా, మాదకద్రవ్యాలు, పబ్‌లు, విచ్చలవిడి మద్యం అమ్మకాలతో అసాంఘిక కార్యక్రమాలకు హైదరాబాద్ నగరం కేంద్రంగా మారుతోందని, అరాచక శక్తుల నుంచి హైదరాబాద్ నగర ప్రతిష్ఠను, సంస్కృతిని కాపాడాలని తమ్మినేని మరో ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. నేరెళ్ల సంఘటనలో దళితులను చిత్రహింసలకు గురిచేసిన పోలీసు ఉన్నతాధికారులపైనా చర్యలు చేపట్టాలని, కేవలం ఎస్సైని సస్పెండ్ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఆయన విమర్శించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి న్యాయం జరిగేవరకూ సీపీఎం పోరాడుతుందని తమ్మినేని తెలిపారు.

బ్లూవేల్ గేమ్ కోసం ఇంటినుంచి పారిపోయాడు

తొమ్మిదో తరగతి బాలుణ్ని పట్టుకున్న పోలీసులు

పుణె: సంచలనం సృష్టిస్తున్న రష్యా ఆన్‌లైన్ బ్లూవేల్ గేమ్ మరో విద్యార్థి జీవితంతో ఆటలాడుకుంది. ఇంటినుంచి పారిపోయేలా చేసింది. సకాలంలో స్పందించిన పోలీసులు అతణ్ని పట్టుకుని తల్లితండ్రులకి అప్పగించారు. సోలాపూర్‌కి పద్నాలుగేళ్ల బాలుడు ఇంట్లో అమ్మానాన్నలకు చెప్పకుండా వచ్చి పుణె బస్సు ఎక్కాడు. సమాచారం అందుకున్న పుణె జిల్లా పోలీసులు బాలుడు ప్రయాణిస్తున్న బస్సును బిగ్వాన్ ప్రాంతంలో అడ్డుకున్నారు. సోలాపూర్ పోలీసులు సమాచారం ఇవ్వడంతో, తాము బస్సును అడ్డుకుని, ఆటను పూర్తిచేయడానికి వెళ్తున్న అతణ్ని పట్టుకున్నామని పోలీసు అధికారి తెలిపారు. తొమ్మిదో తరగతి చదువుతున్న ఆ బాలుడు బ్లూవేల్ గేమ్‌కి బానిసయ్యాడన్నారు. కుమారుడు కనిపించకపోయేసరికి అతని తల్లితండ్రులు స్నేహితుల్ని విచారించగా బ్లూవేల్ గేమ్ ఆడుతున్నట్లు తెలిసిందన్నారు. వ్యాపారవేత్త అయిన బాలుడి తండ్రి పోలీస్టేషన్‌కు వచ్చి అతణ్ని తీసుకెళ్లారన్నారు.

నేటి నుంచి వైద్యవిద్య కన్వీనర్ కోటా రెండోదశ కౌన్సెలింగ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లో డిగ్రీలో ప్రవేశాలకు కన్వీనర్ కోటా కింద రెండోదశ కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. 12వ తేదీ ఉదయం 11 నుంచి, 14న సాయంత్రం 5 గంటల వరకూ అర్హులైన అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లను ఇవ్వవచ్చని కాళోజీ ఆరోగ్య వర్సిటీ ఉపకులపతి డాక్టర్ కరుణాకరరెడ్డి తెలిపారు. తొలివిడత ప్రవేశాల అనంతరం ఎంబీబీఎస్‌లో 216, బీడీఎస్‌లో 218 సీట్లు మిగిలాయన్నారు.

మిర్చి, పత్తి.. మధ్యలో గంజాయి

- సాగుచేస్తున్న అరుగురు అరెస్టు
- 101 కిలోల శుద్ధిచేసిన సరకు స్వాధీనం

వరంగల్‌క్రైం, మనూరు, న్యూస్‌టుడే: గంజాయి సాగుచేయడంతోపాటు..అక్రమంగా ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు వరంగల్ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు శుక్రవారం వెల్లడించారు. 'వరంగల్ రూరల్ జిల్లాలోని నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామానికి చెందిన బానోత్ సక్రూ, మెరుగు గణేష్ అలియాస్ గణపతి, నర్సంపేట మండలం ముత్తోజీపేటకు చెందిన ధరావత్ వీరన్న, దాసరిపల్లికి చెందిన ముద్దం చిన్నమల్లు, కూకట్ల అయిలయ్య, శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన బుచ్చిరెడ్డి గత కొంత కాలంగా గంజాయి సాగు చేస్తూ ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధి నార్కోటిక్ విభాగం వ్యవసాయ క్షేత్రాలలో తనిఖీలు నిర్వహించగా ఈ గుట్టు బయటపడింది. ఖరీఫ్‌లో మిర్చి, పత్తి పంటల మధ్యలో నిందితులు గంజాయి సాగు చేస్తున్నట్టు దర్యాప్తులో వెల్లడైంది. వీరి నుంచి 101 కిలోల శుద్ధిచేసిన గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేశాం'. అని వెల్లడించారు.

రూ.15 లక్షల గంజాయి మొక్కలు ధ్వంసం

మరోవైపు రంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండల పరిధిలోని ఇరక్‌పల్లి పంచాయతీ మేఘ్యానాయక్‌తండా శివారులో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్నారన్న సమాచారం మేరకు నారాయణఖేడ్ అబ్కారీ సీఐ మహేష్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఒకటిన్నర ఎకరా విస్తీర్ణంలో దాదాపు 7 వేల గంజాయి మొక్కలు సాగులో ఉన్నట్టు గుర్తించి దహనం చేశారు. వీటి విలువ రూ.15 లక్షల వరకు ఉంటుందని సీఐ పేర్కొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

రాజకీయ ప్రాధాన్యం తగ్గిస్తే పార్టీ పెడతాం

తెలంగాణ మాలమహానాడు

ఈనాడు, దిల్లీ: మాలలకు రాజకీయ ప్రాధాన్యం తగ్గించాలని చూస్తే పార్టీ పెడతామని తెలంగాణ మాలమహానాడు అధ్యక్షుడు పలసుల రామ్మూర్తి తెలిపారు. శుక్రవారం దిల్లీలో నిరహారదీక్ష, ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. వర్గీకరణ బిల్లు అడ్డుకోవడానికి ప్రాణాలైనా అర్పిస్తామని భాజపాను హెచ్చరించారు. దళితులపై దాడులు చేస్తూ దళితుల పార్టీలని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఎస్సీలను వర్గీకరించడం అగ్రవర్ణాల కుట్ర అని ఆరోపించారు. కార్యక్రమంలో గోళ్ల అరుణ్‌కుమార్, నర్సింగం, పాత్కుల శ్రీశైలం నర్సింహ్మయ్య, చెన్న కేశవులు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాపై ఉత్తర కొరియా విరుచుకుపడితే తటస్థంగా చైనా!

బీజింగ్: అమెరికాపై ఉత్తర కొరియా మొదటగా దాడి చేసే పరిస్థితి వస్తే చైనా తటస్థంగా ఉండాలని చైనా అధికారిక పత్రిక 'గ్లోబల్ టైమ్స్' పేర్కొంది. ఉత్తర కొరియాకు తమకు మధ్య రక్షణ ఒప్పందం ఉన్నప్పటికీ ఇదే విధానాన్ని అనుసరించాలని కోరింది. అమెరికా, ఉత్తర కొరియాలు 'దుందుడుకు ఆట' ఆడుతున్నాయని విమర్శించింది. ఇది అదుపుతప్పి, వ్యూహాత్మక యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరు దేశాలకు నచ్చజెప్పే పరిస్థితుల్లో చైనా లేదని వివరించింది. "చైనా తన వైఖరిని విస్పష్టంగా అన్ని పక్షాలకూ తెలియజేయాలి. ఒకవేళ ఆయా దేశాల చర్యల వల్ల చైనా ప్రయోజనాలకు భంగం వాటిల్లితే.. గట్టిగా స్పందిస్తామని తేల్చి చెప్పాలి" అని సూచించింది. అణు, క్షిపణి కార్యక్రమాలను కొనసాగిస్తే ప్రపంచం ఇంతకుముందెన్నడూ చూడని స్థాయిలో చర్యలు తప్పవని ఉత్తర కొరియాకు అమెరికా హెచ్చరిక చేసిన నేపథ్యంలో గ్లోబల్ టైమ్స్ ఈ మేరకు వ్యాఖ్యానం చేసింది. అమెరికా హెచ్చరికపై స్పందిస్తూ.. గువామ్ దీవిపై క్షిపణి దాడి చేస్తామని ఉత్తర కొరియా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ చిన్న దీవిలో అమెరికా వైమానిక, నౌకా దళ స్థావరాలు ఉన్నాయి. 1950-53 మధ్య జరిగిన కొరియన్ యుద్ధంలో ఉత్తర కొరియా పక్షాన చైనా పోరాడింది. రెండు దేశాల నడుమ 1961లో ఒక రక్షణ ఒప్పందం కుదిరింది.

పాక్ ఆక్రమిత కశ్మీరులోని 34 కంపెనీలపై నిషేధం

శ్రీనగర్: పాక్ ఆక్రమిత కశ్మీరులోని వాణిజ్యం నిర్వహిస్తున్న 34 కంపెనీలుపై ప్రభుత్వం నిషేధం విధించింది. సదరు కంపెనీలు శ్రీనగర్-ముజఫర్‌నగర్ మార్గంలో ఎలాంటి వాణిజ్య సరకు రవాణా కార్యకలాపాలు నిర్వహించరాదని పేర్కొంది. నిషేధిత జాబితాలో ఉంచిన 34 కంపెనీలతో ఎగుమతి, దిగుమతుల జరపేందుకు ఎవరూ ముందుకు రావద్దని సూచిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు వారాల క్రితం ఇస్లామాబాద్ వాణిజ్య కేంద్రానికి చెందిన ఒక ట్రక్‌ను పాక్ ఆక్రమిత కశ్మీరులో పోలీసులు తనిఖీలు చేయగా 66.5 కిలోల హెరాయిన్, బ్రౌన్‌షుగర్ పట్టుబడింది.

ఆలమట్టిలోకి పూర్తిగా తగ్గిన ప్రవాహం

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా, గోదావరి పరివాహకాల్లోని జలాశయాల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోంది. ఆగస్టు రెండో వారం పూర్తికావస్తున్నా కనీస ప్రవాహం లేదు. కృష్ణా బేసిన్‌లో ఆలమట్టి, నారాయణపూర్‌లు పూర్తిస్థాయిలో నిండినందున ఆగస్టు మొదటి లేక రెండో వారంలో తెలుగు రాష్ట్రాల్లోని రిజర్వాయర్లలోకి ప్రవాహం రావచ్చని నీటిపారుదలశాఖ అంచనా వేసింది. కానీ, ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఆలమట్టిలోకి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. కేవలం వెయ్యి క్యూసెక్కుల నీరే వస్తోంది. ఐదు రోజుల క్రితం ఆలమట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లలో పూర్తిస్థాయి నీటిమట్టానికి రెండు టీఎంసీల తేడా ఉండగా, ఇప్పుడది ఏడు టీఎంసీలకు పెరిగింది. వచ్చే నీటి కంటే, కాలువలకు వదులుతున్నది ఎక్కువగా ఉంది. రానున్న రోజుల్లో వరద వచ్చినా, దిగువకు వదిలే అవకాశంలేదు. భారీ వరదొస్తే తప్ప, నారాయణపూర్ దాటి కిందకు వచ్చే పరిస్థితి లేదు. జూరాలలోకి 5,625 క్యూసెక్కులు వస్తుండగా, 4,572 క్యూసెక్కులను కాలువలకు వదిలారు. దీనికి కూడా రోజురోజుకూ ప్రవాహం తగ్గుతోంది. తుంగభద్రలోకి వచ్చే ప్రవాహం 7,570 క్యూసెక్కులకు పడిపోయింది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతలకు అసలు వరదే లేదు. గోదావరిలో ఎల్లంపల్లి, సింగూరుకు నామమాత్రంగానే ఉంది. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద మాత్రమే 43 వేల క్యూసెక్కుల ప్రవాహముంది. ఆగస్టు రెండోవారం ముగుస్తున్నా ప్రవాహం లేకపోవడంతో ఖరీఫ్‌కు నీరందించే అవకాశం దాదాపు లేనట్లేనని నీటిపారుదలశాఖ వర్గాలు భావిస్తున్నాయి.

శరద్‌యాదవ్ ఏ నిర్ణయమైనా తీసుకోవచ్చు: నీతీశ్ కుమార్

దిల్లీ: జేడీ(యు) తిరుగుబాటు నేత శరద్‌యాదవ్, నీతీశ్‌కు మధ్య సయోధ్యకు దారులు మూసుకుపోయినట్లే కనిపిస్తోంది పరిస్థితి. శరద్‌యాదవ్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తమకు అభ్యంతరం లేదని బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యు) అధ్యక్షుడు నీతీశ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రధానితో సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భాజపాతో పొత్తుపై ఆయన మాట్లాడారు. పొత్తుకు పార్టీ అంగీకారం తెలిపిందని ఇది తన ఒక్కడి నిర్ణయం కాదని ఆయన పేర్కొన్నారు. శరద్‌యాదవ్‌కు భిన్నమైన ఆలోచన ఉంటే అది ఆయన ఇష్టమని పేర్కొన్నారు. శరద్‌యాదవ్ తిరుగుబాటుపై నీతీశ్ స్పందించడం ఇదే మొదటిసారి.

విదేశీయులెక్కడ?

- వారి వ్యాపార, పర్యాటక వీసాలపై పర్యవేక్షణ లేమి
- గోవా కేంద్రంగా నైజీరియన్ల మాదక ద్రవ్యాల సరఫరా

ఈనాడు, హైదరాబాద్: పెళ్లి పేరుతో మోసాలు... తక్కువ ధరకే క్యాన్సర్ మందులంటూ రూ.లక్షల్లో స్వాహా... బహుమతులు, తక్కువ ధరకే కార్లు అంటూ రూ.కోట్లలో జనం సొమ్మును దోచుకుంటున్న విదేశీయులు ఎక్కడుంటున్నారు? భారత్‌లో ప్రవేశించేటప్పుడు ఏ వీసాతో వచ్చారు? తిరుగు ప్రయాణం టిక్కెట్లున్నాయా? లేదా? అన్న లెక్కాపత్రాలు కేంద్ర హోంశాఖ, ప్రాంతీయ విదేశీ నమోదు కేంద్రాల వద్ద సక్రమంగా లేవు. పర్యాటక, వ్యాపార వీసాలపై వస్తున్న విదేశీయులు, ముఖ్యంగా ఆఫ్రికా దేశాలకు చెందిన కొందరు ఇక్కడికొచ్చాక ఎక్కడుంటున్నారో తెలీదు. వీరిలో కొందరు నేరాలుచేసి పోలీసులకు పట్టుబడినప్పుడు మాత్రమే పాస్‌పోర్టు, వీసాల వంటి వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. వైద్యం, ఉన్నత విద్యల కోసం వస్తున్న వారంతా మెట్రో నగరాల్లోనే ఎక్కువగా ఉంటున్నారు. అయితే.. దిల్లీ, ముంబయి, కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో ఉంటున్న విదేశీయులు, ముఖ్యంగా నైజీరియన్లలో కొందరు నేరాలు చేసేందుకే ఇక్కడికి వస్తున్నారు. గోవా కేంద్రంగా వీరు మాదక ద్రవ్యాలను దక్షిణాది రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. కేంద్ర హోం, విదేశీ మంత్రిత్వశాఖలు, రాష్ట్రాల్లోని ప్రత్యేక పోలీసు విభాగాలు సమన్వయంతో వ్యవహరిస్తే... నేరాలకు అడ్డుకట్ట పడే అవకాశాలున్నాయని పోలీసు అధికారులు అంటున్నారు.

అమెరికా, ఐరోపాల్లో కఠిన నిబంధనలు: అమెరికా, ఐరోపా సహా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కొన్ని అరబ్‌దేశాల్లో పర్యాటక, వ్యాపార వీసాలపై కఠిన నిబంధనలున్నాయి. ఈ వీసాలపై వచ్చే విదేశీయులు పాస్‌పోర్టుతో పాటు తప్పనిసరిగా తిరుగు ప్రయాణం టిక్కెట్టును జతచేస్తేనే వీసా మంజూరవుతుంది. ఇటీవల కొందరు నేరగాళ్లు, ఆయా దేశాల్లోకి ప్రవేశించిన తర్వాత తిరుగు ప్రయాణం టిక్కెట్లను రద్దు చేసుకుంటున్నారు. దీంతో వీటిని కూడా అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు ధ్రువీకరించుకుంటున్నారు. గడువు తీరినా అక్కడే ఉంటున్న వారి వివరాలను తెలుసుకునేందుకు ప్రత్యేక యంత్రాంగాలు కూడా ఉన్నాయి. సంబంధిత విదేశీయులను గుర్తించి వారికి ఫోన్ చేస్తున్నారు. లేదంటే అదుపులోకి తీసుకుని ఆయా దేశాల విమానాల్లో తిప్పి పంపుతున్నారు. మనదేశంలోనూ ఇలాంటి నిబంధనలే ఉన్నా, సక్రమంగా అమలు కావడంలేదు. తిరుగు ప్రయాణ టికెట్టు తీసుకున్నారా? లేదా? అన్నది మన అధికారులు సక్రమంగా పరిశీలించట్లేదు. విదేశీయులు ప్రాంతీయ నమోదు కేంద్రాల్లో... తామెక్కడికి వెళ్తున్నామన్న సమాచారం ఇవ్వడంలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఒక కేంద్రంలో పేరు నమోదు చేసుకుని, వేరే నగరాల్లో ఉంటున్నారు. చెన్నైలో తమ పేర్లను నమోదు చేసుకుని హైదరాబాద్‌లో ఉంటున్న నలుగురు నైజీరియన్లను హైదరాబాద్ పోలీసులు రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు.



పట్టుబడిన నైజీరియన్ నిందితులు

నేరాలకు పాల్పడినవారితోనే ఇబ్బందులు: వ్యాపార, పర్యాటక వీసాలపై వచ్చిన విదేశీయుల్లో. . నేరాలకు పాల్పడిన వారితోనే ఇబ్బందులు తలెత్తున్నాయి. కొందరు నైజీరియన్లు దిల్లీ కేంద్రంగా నేరాలు చేస్తున్నారు. 15 రోజుల్లో ఐదుగురు నైజీరియన్లను అరెస్ట్ చేశాం. తమ గుర్తింపు బహిర్గతం కాకుండా స్థానికులు, ఈశాన్య రాష్ట్రాలకు చెందినవారికి కమీషన్ ఇచ్చి బ్యాంకు ఖాతాలను తెరిపిస్తున్నట్లు తేలింది. భారత్‌లో ప్రవేశించేందుకు ఒక పాస్‌పోర్టు, వీసా... వెళ్లేందుకు మరో పాస్‌పోర్టు, వీసా ఉంటున్నాయి. నేరాలకు పాల్పడిన నైజీరియన్లపై పాస్‌పోర్టు చట్టం ప్రకారం అదనంగా సెక్షన్లను జోడించి కేసులు పెడతాం.

— అవినాష్ మొహంతి, డీసీపీ (నేర పరిశోధన)

ఆన్‌లైన్‌లో విదేశీ భాషలు నేర్పేందుకు ఇఫ్లూ కసరత్తు

ఈనాడు, హైదరాబాద్, ఓయూ, న్యూస్‌టుడే: ఇంట్లోనే ఉంటూ నచ్చిన విదేశీ భాషను ఉచితంగా నేర్చుకునే అవకాశాన్ని ఆంగ్లం, విదేశీ భాషల విశ్వవిద్యాలయం (ఇఫ్లూ) త్వరలోనే అందుబాటులోకి తీసుకురానుంది. ప్రస్తుతం చాలామంది అంతర్జాలంతో కూడిన స్మార్ట్‌ఫోన్లను ఉపయోగిస్తుండటంతో ఆన్‌లైన్ ద్వారా విదేశీ భాషలు నేర్పించే కోర్సులు ప్రారంభించేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే ఈ బాధ్యతలను వర్సిటీలో కొంత మందికి అప్పగించారు. విదేశీ భాషల్ని ఆన్‌లైన్‌లో నేర్పే ప్రయోగం ఫలిస్తే ఇఫ్లూ సేవలు ప్రపంచ వ్యాప్తం కానున్నాయి. ఇంట్లో ఉండేవారు, తరచూ వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు, విదేశాలు వెళ్లాలనుకునే వారు తదితరులందరి అవసరాలను దృష్టిలో పెట్టుకొని పాఠ్యాంశాలు రూపొందిస్తున్నారు. అరబిక్, ఫ్రెంచ్, ఇటాలియన్, చైనీస్, పార్శీ, కొరియన్, జర్మన్, రష్యన్, స్పానిష్, జపానీస్, టర్కిష్ భాషలను నేర్పనున్నారు.

వర్సిటీ సేవల్ని విస్తృతం చేస్తాం.. వీసీ: ప్రస్తుతం అందరూ ఏదో ఒక దేశం చదువు లేదా కొలువు కోసం వెళుతున్నారనీ, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని విదేశీ భాషలను అందించాలని నిర్ణయించామని ఇఫ్లూ వీసీ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. వర్సిటీకి వచ్చి నేర్చుకోవాలంటే చాలా మందికి కుదరదనీ, అందుకని వీటిని ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా నేర్పించాలని నిర్ణయించామన్నారు. త్వరలో కొన్ని విదేశీ భాషలను అందుబాటులోకి తెస్తామనీ, తర్వాత మరిన్ని భాషలను అందజేస్తామన్నారు. ఇఫ్లూ సేవలు మరింత విస్తృతం చేయడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు.



వీసీ సురేష్‌కుమార్



ఉపరాష్ట్రపతిగా ఎం.వెంకయ్యనాయుడితో ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్

పెద్ద గద్దెపై పెద్దాయన

- ఉపరాష్ట్రపతిగా వెంకయ్య ప్రమాణం
- దర్బార్ హాల్‌లో నిరాడంబరంగా కార్యక్రమం
- పాల్గొన్న అతిరథ మహారథులు

భిన్నత్వంలోని ఏకత్వాన్ని చూసి మనం గర్వపడాలి. మన ప్రజాస్వామ్య వ్యవస్థ సామాజిక, ఆర్థికాంశాల్లో విభిన్న ఆలోచనలను అనుమతిస్తుంది. నమ్మిన సిద్ధాంతాలకు అనుగుణంగా అందరమూ దేశ ప్రయోజనాల కోసం పనిచేస్తాం. మనం విభిన్న పార్టీలకు చెందినవారైనా ఉమ్మడి లక్ష్యం మాత్రం దేశ బలోపేతమే.. దేశాన్ని సుస్థిరంగా, సమున్నతంగా, సౌభాగ్యంగా తయారుచేయడమే.. అట్టడుగునున్న వారికీ అభివృద్ధి ఫలాలు అందేలా చూడటమే.. మనమంతా రాజకీయ ప్రత్యర్థులమే కాని శత్రువులం కాదు.

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



రాజ్యసభ ఛైర్మన్ సీటులో ఎం.వెంకయ్యనాయుడు కూర్చుని ఉండగా, సభను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రధాని మోదీ

ఈనాడు - దిల్లీ

దేశ 15వ ఉపరాష్ట్రపతిగా తెలుగుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడు శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్ హాల్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. నిరాడంబరంగా సాగిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, భాజపా అధ్యక్షుడు అమిత్‌షా, పార్టీ సీనియర్‌నేతలు ఆడ్వాణీ, మురళీ మనోహర్ జోషితోపాటు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, పార్లమెంటు ఉభయసభల్లోని అధికార, ప్రతిపక్షనేతలు పాల్గొన్నారు.

ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధికార లాంఛనాల మధ్య దర్బార్‌హాల్‌లోకి వచ్చి ఆశీనులయ్యారు. అనంతరం ఉపరాష్ట్రపతి ఎన్నికపై కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఉత్తర్వులను చదివి కేంద్రహోంశాఖ కార్యదర్శి రాజీవ్ మహర్షి చదివి వినిపించారు. ప్రస్తుత ఉపరాష్ట్రపతి హామీద్‌అన్సారీ పదవీకాలం ముగిసినందున ఆయన స్థానంలో వెంకయ్య నాయుడు ఎంపికైనట్లు చెప్పి ఆయనను ప్రమాణస్వీకారానికి ఆహ్వానించాలని కోరారు. ఇందుకు రాష్ట్రపతి సమ్మతించగానే.. హోంశాఖ కార్యదర్శి అధికారికంగా వెంకయ్యనాయుడిని ప్రమాణస్వీకారానికి ఆహ్వానించారు. అనంతరం ఆయనచేత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ హిందీలో పదవీ ప్రమాణం చేయించారు. తన ట్రేడ్‌మార్క్ తెలుపు చొక్కా, పంచె ధరించిన వెంకయ్య.. భగవంతుడి పేరిట ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమం అంతా పదినిమిషాల్లో పూర్తయింది. ప్రమాణస్వీకారానికి ముందు వెంకయ్యనాయుడు రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. అనంతరం మార్గమధ్యలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్, సర్దార్‌వల్లభాయ్‌పటేల్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించి రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్నారు. ప్రమాణస్వీకారం పూర్తయిన తర్వాత పార్లమెంటు ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ప్రమాణస్వీకారోత్సవానికి ఆయన సతీమణి ఉషతో కలిసి వచ్చారు. ఆయన కుటుంబసభ్యులతోపాటు, శ్రేయోభిలాషులు పెద్దఎత్తున తరలివచ్చారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ రాలేదు. కాంగ్రెస్ తరఫున మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ఉభయసభల నేతలు గులాంనబీ ఆజాద్, మల్లికార్జున ఖర్గే హాజరయ్యారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వసుంధర రాజే, శివరాజ్‌సింగ్ చౌహాన్, దేవేంద్ర ఫడణవీస్, రమణ్‌సింగ్, యోగి ఆదిత్యనాథ్, మనోహర్ పారికర్, తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం, కేంద్ర మంత్రులు అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరి, భాజపా రాష్ట్ర అధ్యక్షులు కంభంపాటి హరిబాబు, లక్ష్మణ్, ఏపీ మంత్రి కామినేని శ్రీనివాస్, ఎంపీలు సీఎం రమేష్, మాగంటి బాబు, శ్రీరాం మాల్యాద్రి, తెరాస ఉభయసభా పక్షనేతలు కె.కేశవరావు, జితేందర్‌రెడ్డి, వైకాపా ఎంపీలు మేకపాటి రాజమోహన్ రెడ్డి, విజయసాయిరెడ్డి, తెలంగాణ భాజపా నేత కిషన్‌రెడ్డి, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ, పారిశ్రామికవేత్తలు గ్రంధి మల్లికార్జునరావు, చిగురుపాటి కృష్ణప్రసాద్, ఉమా, టీవీ5 ఛైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు ఇందులో పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతి ఓఎస్డీగా సత్యకుమార్

ఉపరాష్ట్రపతి కార్యదర్శి వర్గంలో తొలి నియామకం జరిగింది. ఓఎస్డీగా వై.సత్యకుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏబీవీపీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేసిన ఈయన, గత 24 సంవత్సరాలుగా వెంకయ్యనాయుడు కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. వెంకయ్యనాయుడు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉండగా అదనపు కార్యదర్శిగా పనిచేశారు. పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో ఓఎస్డీగా బాధ్యతలు నిర్వహించారు. తాజాగా ఉపరాష్ట్రపతి కార్యవర్గంలో ప్రత్యేక అధికారిగా నియామకం పొందారు. తొలిసారిగా ఆలిండియా సర్వీసులకు చెందని వ్యక్తిని ఓఎస్డీగా నియమించారు.

పేదల గొంతు వినిపించాలి

సామాన్యుల ఆకాంక్షలను నెరవేర్చడమే మన ప్రథమ లక్ష్యం ◆ రాజ్యసభాధ్యక్షుడిగా వెంకయ్యనాయుడు తొలి ప్రసంగం

ఈనాడు - దిల్లీ

పార్లమెంటు నడుస్తున్న తీరును ప్రత్యక్ష ప్రసారాల ద్వారా చూస్తున్న సామాన్యుడు కొంత అసంతృప్తికి గురవుతున్నాడని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. వారి భావాలను అర్థం చేసుకొని మసలుకోవాలని ఎంపీలకు సూచించారు. అద్భుతమైన మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వైపు ప్రపంచదేశాలు కూడా చూస్తున్నాయన్న విషయాన్ని గుర్తుపెట్టుకొని పనిచేయాలని పేర్కొన్నారు. అధ్యక్ష హోదాలో శుక్రవారం ఆయన రాజ్యసభ కార్యకలాపాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులనుద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. "ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎవరు సహకరించారు, ఎవరు వ్యతిరేకించారన్నది ముగిసిన అధ్యాయం. ఇక మీదట నేను అన్ని పార్టీల వ్యక్తిని. నిష్పక్షపాతంగా పనిచేస్తా. ఈ సభను సజావుగా నడుపుతూ అందరికీ అవకాశం కల్పిస్తా. నిబంధనల ప్రకారం నడుచుకుంటే చిన్న, పెద్ద పార్టీలన్న వ్యత్యాసం లేకుండా అందరికీ అవకాశం వస్తుంది" అని పేర్కొన్నారు.

మనదే ముందడుగు..

"ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం నెలకొంది. భారత్ ఒక్కటే ముందడుగువేస్తోంది. మనకు మున్ముందు ఉజ్వల భవిష్యత్తు ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ల తర్వాత కూడా మనం ఇంకా పేదరికం, నిరక్షరాస్యత, అసమానతలు, వ్యవసాయ సమస్యలు, అధికార దుర్వినియోగం, ప్రాంతీయ, ఆర్థిక అసమానతలను ఎదుర్కొంటున్నాం. మనతోపాటు స్వాతంత్ర్యం పొందిన కొన్ని దేశాలు స్పష్టమైన దృక్పథంతో ముందుకెళ్తున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని మనం కలిసి పనిచేసి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి."

చర్చించి నిర్ణయించాలి..

"మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీని గురువారం కలిసినప్పుడు ఒక విషయం చెప్పారు. పార్లమెంటులో సంప్రదింపులు జరపాలి, చర్చించాలి, నిర్ణయించాలి, (డిస్కస్, డిబేట్, డిసైడ్) అంతరాయాలు (డిస్‌రప్ట్) ఉండకూడదు అని చెప్పారు. అ ఇది చెప్పడం చాలా సులభం. అదే సమయంలో అమలు అసాధ్యం కూడా కాదు. ప్రతి ఎన్నికా విజేతకు అనుకూలంగా తీర్పునిస్తుంది. నేను సుదీర్ఘకాలంగా ప్రతిపక్షంలో ఉన్నాను. అధికారపక్షం చేతిలో అధికారం ఉంటుంది. ప్రతిపక్షానికి చెప్పే అవకాశం ఉంటుంది. మనమంతా ప్రజా తీర్పును గౌరవించాలి. ప్రజాస్వామ్యం అంటే కేవలం సంఖ్యే కాదు. పరస్పరం అభిప్రాయాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం కూడా. సంఖ్యా క్రీడ.. ప్రభుత్వ ఏర్పాటు వరకే పరిమితం కావాలి. ఆ తర్వాత ప్రతిదీ లోతుగా చర్చించాలి. విషయాలను స్థాయీ సంఘాలకు నివేదించి, అక్కడ పార్టీలకు అతీతంగా చర్చించాలి. నేను హోంశాఖ స్థాయీ సంఘానికి అయిదేళ్లపాటు ఛైర్మన్‌గా చేశాను. అత్యంత సంక్లిష్ట విషయాలపైనా అక్కడ ఏకాభిప్రాయం సాధించగలిగాం. అక్కడ మీడియా దృష్టి ఉండదు కాబట్టి సభ్యులు మనఃపూర్వకంగా మాట్లాడటంతోపాటు ప్రతి ఒక్కరూ మరొకరి అభిప్రాయాన్ని గౌరవించి, అభినందించే వాతావరణం ఉంటుంది. అందుకే చారిత్రక భూసరిహద్దు ఒప్పందం, జీఎస్‌టీ బిల్లులకు ఆమోదం పొందగలిగాం. గత ప్రభుత్వాల హయాంలోనూ ఇలాంటి చారిత్రక ఘటనలు ఎన్నో ఉన్నాయి."

సమయం అమూల్యం..

"వ్యక్తి, సంస్థ, దేశ విజయంలో సమయ నిర్వహణ చాలా ముఖ్యం. కాలక్షేపానికి మనకు సమయం లేదు. దేశం తన శక్తి సామర్థ్యాలు, మానవ, సహజవనరుల బలాన్ని గుర్తించాలి. మనకు అతిగొప్ప మేధోసంపత్తి, సంస్కృతి, సంప్రదాయాల వారసత్వం ఉంది. ఈ సభ సంవత్సరానికి వంద రోజులు సమావేశమవుతోంది. ఈ సమయాన్ని దేశ ప్రయోజనాల కోసం సభ్యులంతా సద్వినియోగం చేసుకోవాలి. అన్నిపార్టీల సభ్యులకూ సమయం లభించేలా చూస్తా. వారు దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వృథాచేసుకుంటే చిన్న పార్టీల సమయం హరించుకుపోతుంది. సభ్యులు, ప్రభుత్వం ఒక అభిప్రాయానికి వచ్చి పార్లమెంటు సమావేశాలను పొడిగిస్తే స్వాగతిస్తా. ఉన్న సమయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకున్న తర్వాత కూడా ఇంకా అవసరం అనిపిస్తే సమావేశాలను పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరే అవకాశం ఉంటుంది. అలా కాకుండా సమయాన్ని వృథా చేసుకొని.. పొడిగింపును కోరడం సరికాదు. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అధికారపక్షంపై తీవ్ర విమర్శలు చేసేవాడిని. అయినా ఎప్పుడూ లక్ష్మణ రేఖ దాటలేదు. ప్రతిపక్షంలో సాగిన సమయమే నా జీవితంలో అత్యుత్తమ భాగం."

నిర్మాణాత్మక చర్చలపై దృష్టి పెట్టాలి

"సభలో జరిగే నిర్మాణాత్మక చర్చలకు ప్రసార మాధ్యమాల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలి. దురదృష్టవశాత్తు మీడియా కేవలం సంచలనాలు, వివాదాలు, నాటకీయతకు ప్రాధాన్యం ఇస్తోంది. నేను ఇదివరకు ఇదే సభలో వ్యవసాయంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి 52 నిమిషాలపాటు మాట్లాడితే సభలోని వారంతా నన్ను అభినందించారు. మరుసటి రోజు చూస్తే ఏ పేపర్‌లోనూ ఇది రాలేదు. ఒక్క పేపర్‌లో మాత్రం వెంకయ్యనాయుడు వ్యవసాయంపై మాట్లాడారు అని రాశారు. ఇలాంటి పద్ధతిని వీడి మీడియా తన పవిత్రమైన బాధ్యత నిర్వర్తించాలి."

ఆదర్శంగా ఉండాలి

"పెద్దల సభగా మనం దేశంలోని మిగతా సభలకు ఆదర్శంగా ఉండాలి. నిరుపేదల అవసరాలను గుర్తించాలి. వారి ఆవేదనను వినాలి. వారి ఆకాంక్షలను అర్థంచేసుకొని నెరవేర్చాలి. రాజ్యాంగబద్ధంగా వారికి రావాల్సిన హక్కులన్నీ దక్కేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలి. దేశం కోసం మహాత్మా గాంధీ, అంబేడ్కర్‌లు చేసిన త్యాగాలను గుర్తుపెట్టుకోవాలి. చట్టసభ సభ్యుడిగా నేను గ్రంథాలయానికి వెళ్లి గొప్ప నాయకులు చేసిన ప్రసంగాలను పరిశీలించేవాడిని. అదే నన్ను ఈ రోజు ఈ స్థితికి తీసుకొచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'టీం ఇండియా'లా పనిచేయాలన్న ప్రధాని పిలుపు సంతోషకరం. కేవలం కేంద్రరాష్ట్రాలే కాకుండా స్థానిక ప్రభుత్వాలు కూడా కలిసి పనిచేయాలి. వాటికి నిధులు, విధులు బదలాయించాలి. ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ ఛైర్మన్‌గా మీరంతా నామీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టడానికి శక్తి వంచనలేకుండా ప్రయత్నిస్తాను. ప్రశాంత వాతావరణంలో పూర్తిస్థాయిలో చర్చిస్తే గందరగోళంలో బిల్లులను ఆమోదించాల్సిన అవసరమే ఉండదు." అని వెంకయ్య పేర్కొన్నారు.

అంతకుముందు ప్రసంగించిన అన్ని పార్టీల సభ్యులు ఆయన నిబద్ధత, అనుభవం, వాక్చాతుర్యాలను ప్రశంసించారు. సభను సజావుగా నడిపి అందరికీ మాట్లాడే అవకాశాలు ఇవ్వాలని కోరారు. గందరగోళం నడుమ బిల్లులు ఆమోదించే పరిస్థితి ఉండకూడదని సూచించారు. సభ్యుల సూచనలకు సమాధానం ఇచ్చేలా వెంకయ్యనాయుడి ప్రసంగం కొనసాగింది.



అన్ని మెట్లూ ఎక్కి వచ్చారు: అరుణ్‌జైట్లీ

వెంకయ్యనాయుడిది అయిదు దశాబ్దాల ప్రయాణం. క్షేత్ర స్థాయి నుంచి రాజకీయ నిచ్చనలోని ప్రతిమెట్టూ ఎక్కి ఈ స్థాయికి చేరారు. విద్యార్థి నాయకుడిగా, పార్టీ పదాధికారిగా, ఎమ్మెల్యేగా, పార్టీ రాష్ట్ర, జాతీయ అధ్యక్షుడిగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా ఎంతో పనిచేశారు. 20ఏళ్లుగా ఈ సభలో సభ్యుడిగా కొనసాగి ఇప్పుడు అదే సభను నడిపేస్థాయికి ఎదిగారు. ఇక్కడి సంప్రదాయాలు, సంస్కృతి మీకు పూర్తి అవగాహన ఉంది. ఒక పార్టీ మెజార్టీని చూసుకొని.. ప్రతిపక్షం జైల్లో ఉన్నప్పుడు రాజ్యాంగ సవరణలు చేసుకున్న సందర్భాలున్నాయి. ప్రతి సందర్భం ఒక పాఠం నేర్పింది. ప్రతిపక్షం తన గొంతు వినిపించేందుకు ఎక్కువ అవకాశం కోరుకుంటుంది. అధికారపక్షం తన కార్యకలాపాలు పూర్తి చేసుకోవాలనుకుంటుంది. అంతిమంగా రెండింటి మధ్య సమతౌల్యం సాధించడం అవసరం. ప్రజాసమస్యలపై మాట్లాడే అవకాశం ప్రతి ఒక్కరికీ ఇవ్వాలి. బిల్లులను గందరగోళం మధ్య ఆమోదించకూడదని అంటున్నారు. 2014 తర్వాత ఎప్పుడూ అలా బిల్లులు ఆమోదించలేదు. అంతకు ముందు అలాంటివి జరిగాయి. ఏపీ విభజన చట్టాన్ని గందరగోళం మధ్య ఆమోదించారు.



ప్రమాణ స్వీకారోత్సవానికి బయలుదేరడానికి ముందు మహాత్మాగాంధీ సమాధి రాజ్‌ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఎం.వెంకయ్యనాయుడు



ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుకు పుష్పగుచ్ఛం ఇచ్చి దిల్లీలో శుభాకాంక్షలు చెబుతున్న ఏపీ, తెలంగాణ గవర్నరు నరసింహన్







రాష్ట్రపతిభవన్‌లోని దర్బార్‌హాల్‌లో జరిగిన ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్ర కార్మికమంత్రి బండారు దత్తాత్రేయ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ తదితరులు

అత్యున్నత పదవుల్లో అత్యంత సామాన్యులు

రాజ్యసభలో ప్రధాని నరేంద్రమోదీ

ఈనాడు - దిల్లీ

దేశంలోని అత్యున్నత రాజ్యాంగ పదవులన్నింటిలో నేడు సామాన్య కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన వారే ఉన్నారని, ఇది మన ప్రజాస్వామ్య గొప్పతనమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మహాపురుషులు ఇచ్చిన రాజ్యాంగ శక్తివల్లే సామాన్యుడికి అసమాన్య అవకాశాలు దక్కాయన్నారు. ఈ ఖ్యాతి 125 కోట్ల భారతీయులకు దక్కుతుందని వ్యాఖ్యానించారు. ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేసిన వెంకయ్యనాయుడు శుక్రవారం ఉదయం 11 గంటలకు రాజ్యసభాధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన వెంకయ్యనాయుడును స్వాగతిస్తూ మాట్లాడారు.

"ఆగస్టు 11వ తేదీ దేశ చరిత్రలో ఒక మహత్తర ఘట్టంతో ముడిపడి ఉంది. ఇదే రోజు బ్రిటీష్ పాలకులు స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన 18 ఏళ్ల యువ విప్లవకారుడు ఖుదీరాంబోస్‌ను ఉరితీశారు. దేశ స్వాతంత్రం కోసం జరిగిన సంఘర్షణ, బలిదానాల గురించి తెలుసుకోవడం మన విధి. వాటి ద్వారా మన బాధ్యత మరింత పెరుగుతుంది. అందుకే నేను ఆ ఘటనను స్మరించాల్సి వచ్చింది. మనం ఇక్కడ ఒక విషయాన్ని గుర్తించాలి. స్వతంత్ర భారత దేశంలో జన్మించి ఉపరాష్ట్రపతి పదవిని చేపట్టిన తొలి వ్యక్తిగా వెంకయ్యనాయుడు చరిత్రకెక్కారు. సుదీర్ఘ కాలం క్రియాశీల రాజకీయాల్లో ఉండటంతో పాటు ఇన్నాళ్లు మన లో ఒకరిగా తిరిగి ఉపరాష్ట్రపతి బాధ్యతలు చేపట్టిన తొలి వ్యక్తీ వెంకయ్యనాయుడే. ఇక్కడే ఆయన ఇంతింతై అన్నట్లు ఎదిగారు. ఎగువసభలోని ప్రతి అంశం గురించి తెలిసిన వ్యక్తి. సభాసభ్యుడిగా, స్థాయీసంఘాల ఛైర్మన్‌గా, మంత్రిగా అన్నింటిలో స్వయంగా భాగస్వామ్యం వహించిన తొలి ఉపరాష్ట్రపతి ఇప్పుడు దేశానికి లభించారు. ప్రజాజీవనంలో ఆయన జేపీ ఉద్యమాల నుంచి పుట్టుకొచ్చారు. నిజాయితీ, సుపరిపాలన కోసం దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యార్థినేత స్థాయి నుంచి ఈ స్థాయి వరకూ స్వయంగా ఎదుగుతూ వచ్చారు. అసెంబ్లీ, రాజ్యసభ ఏదైనా ఆయన తన వ్యక్తిత్వాన్ని చాటారు. తన కార్యక్షేత్రాన్ని విస్తరించుకుంటూ వచ్చారు. వెంకయ్యనాయుడు రైతుబిడ్డ. ఏళ్ల తరబడి ఆయనతో కలిసి పనిచేసే అదృష్టం నాకు లభించింది. ప్రతి అంశంపైనా పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి ఎంతో విలువైన సమాచారం ఇస్తూ ఉంటారు. కేబినెట్‌లో పట్టణాభివృద్ధి మంత్రిగా ఉన్నా మంత్రివర్గంలో చర్చ జరిగినప్పుడు తన శాఖ గురించి ఎంత మాట్లాడేవారో, అంతకుమించి గ్రామీణ, రైతుల అంశాలపై మాట్లాడేవారు. అవి ఆయన హృదయానికి దగ్గరగా ఉన్న అంశాలు. ఆయన కుటుంబ నేపథ్యమే అందుకు కారణం. వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి పదవిపై కూర్చునప్పుడు ప్రపంచానికి ఒకటి చెప్పాలనుకున్నాం. రాజకీయాలకు అతీతంగా దాని గురించి మాట్లాడాలి. భారత ప్రజాస్వామ్యం ఎంతో పరిణితి చెందింది. మహాపురుషులు ఇచ్చిన రాజ్యాంగానికి ఎంతో శక్తి ఉంది. దానివల్లే నేడు భారత రాజ్యాంగ పదవులపై పేదలు, సాధారణ కుటుంబాలు, గ్రామసీమల నుంచి వచ్చిన వారు ఆశీనులుకాగలిగారు. దేశంలో తొలిసారి అన్ని రాజ్యాంగపదవుల్లో ఇలాంటి నేపథ్యం నుంచి వచ్చిన వారు ఉండటం మన రాజ్యాంగం గొప్పతనం. మన పూర్వీకులు మనకు ఇచ్చిన విశిష్టవైభవం. అందుకే మరోసారి రాజ్యాంగ నిర్మాతలందరికీ నమస్కరిస్తున్నా. వెంకయ్యనాయుడికి వ్యక్తిత్వం, కర్తృత్వం, వక్తృత్వం ఉంది. వీటన్నింటిలో ఆయన ఘానాపాటి. ఆయన అప్పుడప్పుడు తెలుగులో మాట్లాడేటప్పుడు సూపర్‌ఫాస్ట్‌గా వెళ్తుంటారు. ఆలోచనల్లో స్పష్టత ఉన్నప్పుడే అది సాధ్యం. ప్రేక్షకులతో అనుసంధానం కావడం అంటే శబ్దాలతో ఆట కాదు. శబ్దాలతో ఆడుకోవడం వల్ల ఎవ్వరి మనస్సును గెలుచుకోలేం. కానీ శ్రద్ధాపూర్వకమైన మనసు, స్పష్టమైన విచారణధార, నిబద్ధత, దార్శనికతను ప్రదర్శించినప్పుడే మాటలతో మనసు గెలుచుకోవడం సాధ్యం అవుతుంది. వెంకయ్య అది జీవితంలో చూశారు.... సాధించారు. దేశంలోని గ్రామాలకు రహదారి అనుసంధానం కల్పించిన ఘనత వెంకయ్యనాయుడికే దక్కుతుంది. తను అధిష్ఠించిన పదవి గౌరవాన్ని మరింత పెంచేలా ఆయన శక్తిమేర కృషిచేస్తారని, విపక్ష సభ్యుల మనసులను కూడా గెలుచుకునేలా వ్యవహరించగలరని విశ్వసిస్తున్నాను" అంటూ ప్రధాని మోదీ ప్రసంగాన్ని ముగించారు.



ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ప్రధాని మోదీతో బృంద ఫొటో దిగిన ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



సభకు తన కుటుంబ నేపథ్యాన్ని వెంకయ్యనాయుడు వివరిస్తూ తాను వినయంగల వ్యవసాయదారుడినని చెప్పారు. వ్యవసాయమే భారత సంస్కృతి అన్న అర్థం వచ్చేలా కల్చర్ ఆఫ్ ఇండియా ఈజ్ అగ్రికల్చర్ అంటూ తనదైనశైలిలో చమత్కరించారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చానని, వంశ నేపథ్యం వంటి బలం లేదన్నారు. 'చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయాను. మా అమ్మ ముఖం కూడా నాకు గుర్తులేదు' అని అంటూ ఉద్వేగానికి గురవడంతో ఆయన గొంతులో చిన్న వణుకు కనిపించింది.

సంపన్నుల త్యాగాలనూ మరవొద్దు

- రాజ్యసభలో ప్రతిపక్షనేత గులాంనబీ ఆజాద్

ఈనాడు, దిల్లీ: దేశంలో అత్యంత సామాన్యులు సైతం అత్యున్నత స్థానానికి ఎదిగేందుకు అనువైన వాతావరణం కల్పించడానికి మహాత్మా గాంధీ, నెహ్రూలు చేసిన త్యాగాలను మరిచిపోవద్దని రాజ్యసభలో ప్రతిపక్షనేత గులాంనబీ ఆజాద్ అన్నారు. దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చి, సామాన్యుడికి శక్తిమంతమైన రాజ్యాంగం అందించడంలో ఆనాడు సంపన్నులు, జమిందార్లు కూడా తమ సంపదలను, కుటుంబాలను త్యాగం చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. వెంకయ్యనాయుడు రాజ్యసభ అధ్యక్షుడిగా పదవీబాధ్యతలు చేపట్టిన తర్వాత గులాంనబీ ఆజాద్ మాట్లాడారు.

"కొత్త ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం తర్వాత మా ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు. మీరిక్కడ కొత్తకాదు. ఎంపీగా, మంత్రిగా పనిచేశారు. అప్పుడు మీతో ప్రేమతో గొడవపడ్డాం. నిష్ఠతో పనిచేసే వారు ఉన్నతస్థాయికి ఎదుగుతారని చెప్పడానికి మీరు ప్రత్యక్ష ఉదాహరణ. ఈరోజు చాలా మంది పెద్ద పెద్ద పదవుల్లో ఉన్నారు. వారంతా జమిందార్లు, పెట్టుబడిదారులు కాకున్నా సొంత కష్టంతో ఈస్థాయికి వచ్చారు. దాని వెనుక మన ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఉన్నాయి. దీన్ని సంభవం చేసిన కోట్ల మంది పేదలు, కార్మికులకు సెల్యూట్ చేస్తున్నా. అందుకు దోహదం చేసిన కోటీశ్వరులు, పెట్టుబడిదారులు, జమిందార్లకూ సెల్యూట్ చేస్తున్నా. మోతీలాల్‌నెహ్రూ పెద్ద వకీల్. ఆయన సంపాదనను ఈ రోజులతో లెక్కిస్తే రోజుకు రూ.7, 8 కోట్ల వరకు ఆదాయం ఉండేది. మహాత్మా గాంధీ కూడా పెద్ద లాయర్ కాబట్టే దక్షిణాఫ్రికా వరకు వెళ్లారు. ఆయన, నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, సర్దార్‌పటేల్, మౌలానాఆజాద్, తిలక్ లాంటి వారంతా సంపన్నులైనా దేశం కోసం అన్నింటినీ త్యాగం చేశారు. గొప్ప రాజ్యాంగం ఇచ్చారు. అలాంటి వారిని మనం మరిచిపోవద్దు. మనిషికి మతం కేవలం మనసులో ఉండాలి. న్యాయం చేయాల్సిన సమయం వచ్చినప్పుడు నిష్పాక్షికంగా ఉండాలి. అలాంటి పదవిలో కూర్చొనే అవకాశాన్ని అల్లా మీకు కల్పించారు. ప్రతి పార్టీకి సభలో అవకాశం ఇవ్వాలి. గందరగోళంలో ఏ బిల్లూ ఆమోదంపొందకూడదు. ఆ పరంపరను ఇకపైనా కొనసాగించాలని కోరుకుంటున్నా" అని ఆజాద్ అన్నారు.

గురజాడ మాటలే గుర్తుకు రావాలి

మీకు స్వాగతం పలుకుతూ నేను చివరి ప్రసంగం చేస్తున్నా. మీరు 40 ఏళ్ల నుంచి తెలుసు. విద్యార్థి జీవితం నుంచి ఇప్పటివరకూ ఎదురుపడినప్పుడు భావజాలపరంగా మా మధ్య వాదవివాదాలు నడుస్తూ ఉంటాయి. వైరుధ్య భావాలున్న మీరు ఒకే దగ్గర ఎలా ఉండగలుగుతున్నారని ఓసారి విలేకర్లు అడిగారు. అందుకు వెంకయ్యనాయుడు బదులిస్తూ రైలులో ఎక్కిన తర్వాత బోగీలో సీతారాం కనిపిస్తే నేను దిగిపోవాలా అని చాలా సమయస్ఫూర్తితో చమత్కరించారు. మీరు రెండు అత్యున్నత చిహ్నాల కింద కూర్చున్నారు. అందులో ఒకటి సత్యమేవ జయతే అని రాసిన అశోక్‌చక్ర అయితే, రెండోది త్రాసు. అది విక్రమాదిత్యుని స్థానం. కాబట్టి ఈ సభలో లేవనెత్తిన అంశాలను బట్టి మీరు న్యాయం చేయాలి. ఆ పని మీరు చేస్తారని నమ్ముతున్నా. మన భావజాలాలు ఏవైనా దేశం అంటే మట్టికాదోయ్... దేశం అంటే మనుషులోయ్ అని గురజాడ అప్పారావుగారు చెప్పిన మాటలను గుర్తుపెట్టుకొని పనిచేస్తారని నమ్ముతున్నా. మీరు తీర్పు చెప్పేటప్పుడు దేశమంటే మట్టి కాదు... ప్రజలు అన్న సిద్ధాంతం చాలా ముఖ్యం. పార్లమెంటు సరిగా పని చేయలేకపోతే ప్రజల సార్వభౌమాధికారం దెబ్బతింటుంది.

- వెంకయ్యనాయుడిని ఉద్దేశించి సీపీఎం నేత సీతారాం ఏచూరి

అందరి బంధువయా

నాయుడు అంటే అందరికీ ఇష్టమైన అంపైర్

మీ హాస్యచతురతను అలాగే కొనసాగించాలని కోరుతున్నా. ప్రతిపక్షాల గొంతును ఎప్పుడూ వింటూ ఉండాలి. గందరగోళంలో బిల్లులు ఆమోదించకుండా చూడాలి. మీ అంత్యప్రాసలను కొనసాగించాలి. నాయుడు ..ఎన్ అంటే నౌ (ఇప్పుడు), ఏ అంటే ఆల్ (అఖిల), ఐ అంటే ఇండియాన్స్ (భారత), డి అంటే డియరెస్ట్ (ప్రియమైన), యు అంటే అంపైర్ అని అర్థం.

-డెరెక్ ఒబ్రెయిన్, తృణమూల్ కాంగ్రెస్

పదవికి వన్నె తెచ్చే శక్తి మీకుంది

మీరు భారత ప్రజాస్వామ్యంలో సువర్ణాధ్యాయంగా చెప్పే జేపీ ఉద్యమం నుంచి వచ్చారు. మూడు మలుపుల్లో విజయం సాధించిన మీరు ఇప్పుడు కూడా విజయం సాధిస్తారని ఆశిస్తున్నా. పదవిపై కూర్చున్న వ్యక్తి తన చేతల ద్వారా ప్రతిష్ఠ పెంచడం ప్రజాస్వామ్యానికి, ప్రజలకూ చాలా అవసరం. ఆ పని మీరు చేస్తారని నమ్ముతున్నా.

-వశిష్ట నారాయణ్ సింగ్, జేడీయూ

తెలుగుకు ప్రజలకు గర్వకారణం

ఈ రోజు మాకు ఒకవైపు సంతోషం, మరోవైపు బాధగా ఉంది. దేశ రెండో అత్యున్నతమైన ఉపరాష్ట్రపతి పదవిపై కూర్చున్నందుకు సంతోషం. ఇది తెలుగు ప్రజలు గర్వించదగ్గ విషయం. ఇన్నాళ్లు మాకు పెద్దన్నలా ఉన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే మీదగ్గరకు వచ్చి చెప్పుకొనేవాళ్లం. ఈరోజు అవకాశం లేకుండా పోతుందేమోనని బాధగా ఉంది. అయినా దేశ అభివృద్ధికి, ఏపీ అభివృద్ధికి తోడుగా ఉంటానని ప్రసారమాధ్యామాల ద్వారా చెప్పినందుకు ఆ బాధ తగ్గింది. మీరు ఈ స్థాయికి చేరేలా మీకు క్రమశిక్షణ నేర్పిన ఓ.దుర్గాప్రసాద్, సోమేపల్లి సోమయ్యలకు ఈ సందర్భంగా నేను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా. ఏపీ అసెంబ్లీలో మీ ప్రసంగాలు పత్రికల్లో చదివేవాళ్లం. మీరు, గౌతులచ్చన్న, జైపాల్‌రెడ్డిలాంటి వారి ప్రసంగాలు ఇప్పుడు చూడలేకపోతున్నాం. ఇక్కడ కూడా అందర్నీ ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నా. మిగతా నాయకుల్లా మీకు పెద్ద రాజకీయ నేపథ్యంలేదు. కనీసం మీ కుటుంబసభ్యుల్లో సర్పంచ్ కూడా లేరు. అలాంటి కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి నాలుగుసార్లు రాజ్యసభ్యుడిగా ప్రాతినిధ్యం వహిస్తూ రావడం మీరు చేసిన సేవల ఫలమే. మీ దగ్గర చాలా క్రమశిక్షణ నేర్చుకున్నాం. మిమ్మల్ని ప్రతిపక్షంలో, ప్రభుత్వంలో చూశాం. ఇప్పుడు సభాపతిగా అంతకంటే బాగా చేస్తారని ఆశిస్తున్నాం.

- సీఎం రమేష్, తెలుగుదేశం

ఆ ఉద్యమాలు మీ ధైర్యానికి నిదర్శనం

జేపీ ఉద్యమం ద్వారా విద్యార్థి జీవితాన్ని ప్రారంభించారన్న దాన్ని బట్టే మీరు ఎంత ధైర్యవంతులో అర్థం అవుతుంది. మీ ఆధ్వర్యంలో రాజ్యసభ చాలా బాగా పనిచేస్తుందని నమ్ముతున్నా. ప్రధాని సమక్షంలో తొలిసారిగా మాట్లాడే అవకాశం రావడంతో కొంచం భయమేస్తోంది.

-దిలీప్‌కుమార్ టిర్కే, బీజేడీ

అలాంటి రోజు మళ్లీ రానీయకండి

నేను మీ ఆరాధకుడిని. ఎన్నో అంశాల్లో మీ సలహాలు తీసుకొన్నాం. దళితులు, పేదల కోసం చర్చ వచ్చినప్పుడు ధైర్యంగా మాట్లాడమని చెప్పిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. జులై 18న దళితుల కోసం మా పార్టీ అధ్యక్షురాలు (మాయావతి) మాట్లాడాలనుకుంటే ఆ అవకాశం ఇవ్వలేదు. ఆరోజు అధికారపక్ష నేతలే కాకుండా మంత్రులు లేచి గందరగోళం సృష్టించారు. అలాంటి రోజు మళ్లీ రానీయకూడదు. ముందు సీట్లలో ఉన్నవారికే మాట్లాడే అవకాశం ఇస్తుంటారని చివరి బెంచ్‌లో కూర్చున్నవారు గుసగుసలాడుతుంటారు. ఇకముందు అలాంటి గుసగుసలు వినిపించకుండా చేస్తారని ఆశిస్తున్నా.

- సతీష్‌చంద్ర మిశ్రా, బీఎస్పీ

చతురోక్తులతో సభను నడపాలి

సభ బాగా నడవాలని అందరూ కోరుకుంటున్నారు. ఇన్నేళ్ల పార్లమెంటరీ జీవితంలో ఇంద్రజిత్‌గుప్తా, సోమ్‌నాథ్ ఛటర్జీ, అటల్‌జీ, చంద్రశేఖర్‌లాంటి ఉత్తమ పార్లమెంటేరియన్లను చూశాం. అంతటి చర్చల స్థాయి ఇప్పుడు కనిపించడంలేదు. సమయాభావం వల్ల మేం మా అభిప్రాయాలను చెప్పలేకపోతున్నాం. చతురోక్తులతో గంభీరమైన వాతావరణాన్ని చల్లబరిచి చాలా ప్రశాంత వాతావరణంలో సభను నడుపుతారని నమ్ముతున్నా.

-ప్రఫుల్‌భాయ్ పటేల్, ఎన్సీపీ

లిఫ్టు ద్వారా కాకుండా మెట్లెక్కి వచ్చారు

రాజ్యసభ సభ్యుడుగా ఉంటూనే వైస్‌ఛైర్మన్ అయిన తొలి వ్యక్తి మీరు. ఎలివేటర్ (లిఫ్టు) ద్వారా కాకుండా ప్రతి మెట్టూ ఎక్కి పైకి వచ్చారు. ఛైర్మన్‌గా ఇప్పుడు నిబంధనలను మరింత స్పష్టంగా అమలు చేస్తూ నిష్పక్షపాతంగా ఉంటారని ఆశిస్తున్నా. సభలో హిందీ, ఇంగ్లిష్‌లో మాట్లాడదలచుకుంటే వెంటనే మాట్లాటే అవకాశం ఉంది. ప్రాంతీయ భాషల్లో మాట్లాడాలంటే తగిన అనువాదకులు లేరు. ఎవరి మాతృభాషలో వారు మాట్లాడే వెసలుబాటు కల్పించాలి.

- తిరుచ్చి శివ, డీఎంకే

బాల్‌ఠాక్రే ఉంటే ఆశీర్వదించేవారు

బాల్‌ఠాక్రే ఈరోజు జీవించి ఉంటే మిమ్మల్ని ఆశీర్వదించేవారు. మిమ్మల్ని ఆయన చాలా ప్రేమించేవారు. అందరూ మిమ్మల్ని తెలుగుబిడ్డ అని చెబుతున్నారు. కానీ నేను మాత్రం మిమ్మల్ని దేశ సుపుత్రుడిగా భావిస్తున్నా. స్వతంత్ర హిందుస్థాన్‌లో జన్మించిన తొలి ఉపరాష్ట్రపతి అని చెప్పుకోవడం గర్వకారణం. జేపీ భావజాలంతో ప్రభావితమై రెండో స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. విద్యార్థి జీవితం నుంచి వచ్చిన మీరు ఇప్పుడు హెడ్‌మాస్టర్ కుర్చీలో కూర్చున్నారు. మేమంతా మీ విద్యార్థులం. అంతా మంచి పిల్లలమే. మీ బీపీ పెంచబోం. చిన్నచిన్న పార్టీలకూ మాట్లాడే అవకాశం ఇవ్వాలి. ప్రతి రాష్ట్ర భాషలో మాట్లాడే అవకాశం కల్పించాలి. అప్పుడే ప్రజల సమస్యలను సమర్థంగా సభకు వివరించగలుగుతారు.

-సంజయ్ రౌత్, శివసేన

మీ ఆశీర్వాదంతో ఎదిగాం

మీరు ఎంతో మంది యువకులను రాజకీయాల్లోకి ప్రోత్సహించారు. మీ ఆశీర్వాదంతో నాతో పాటు డజన్లకొద్దీ ఎదిగారు. మీరు ఎప్పుడూ ప్రతి పక్షానికి అభిప్రాయం చెప్పే అవకాశం ఉండాలి (అపోజిషన్ మస్ట్ హేవ్ సే), అధికార పక్షానికి పంథా ఉండాలి (ట్రెజరీబెంచ్ మస్ట్ హేవ్ వే) అని అంటుంటారు. ఇప్పుడు కూడా సభను అదే పద్ధతిలో కొనసాగించాలి.

-రవిశంకర్ ప్రసాద్, భాజపా



ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలి

మేం అసెంబ్లీలో కలిసి పనిచేశాం. మాటలతో మిమ్మల్ని ఎందుకు విమర్శిస్తున్నామో తెలుసుకోలేని పరిస్థితి కల్పిస్తారు. ఇప్పటివరకూ ఇక్కడ గంభీరమైన వాతావరణంలో చర్చలు జరుగుతూ వచ్చాయి. మీ హాస్యచతురతతో వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మారుస్తారని నమ్ముతున్నా. షెకావత్ అలాంటి చతురతతో ఆనందకర వాతావరణాన్ని సృష్టించారు. ఇప్పుడు మళ్లీ అలాంటిది వస్తుందని నమ్ముతున్నా. 50 ఏళ్లుగా మీరు తెలుసు. ఇప్పుడీ పాత్రకు పూర్తిస్థాయి న్యాయం చేస్తారని నమ్ముతున్నా.

- కె. కేశవరావు, తెరాస

మహిళలను ప్రోత్సహించాలి

కశ్మీర్ భాషలో చెప్పే అవకాశం ఉంటే చాలా మాట్లాడి ఉండేవాడిని. ప్రధాని బేటీ బచావో బేటీ పడావో అని నినదిస్తున్నారు. ఆ స్ఫూర్తిని అందుకొని సభలో మహిళలకు ఎక్కువగా మాట్లాడే అవకాశం ఇవ్వాలి.

-నజీర్ అమ్మద్ లవాయ్, పీడీపీ

అన్ని గొంతులూ వినబడాలి

సమాఖ్య వ్యవస్థకు పెద్దల సభ సంకేతం. ప్రజాస్వామ్యంలో బహుళ పార్టీ ప్రాధాన్యాన్ని గుర్తించి అసంతృప్త గొంతులను, విభిన్న అభిప్రాయాలను గౌరవించాలి. అన్ని విషయాల్లో అన్ని వేళలా ఏకాభిప్రాయం సాధ్యం కాదు కాబట్టి అన్ని గొంతులనూ వినిపించే అవకాశం కల్పించాలి.

-డి.రాజా, సీపీఐ

కష్టించేవారికి మీరే స్ఫూర్తి

ప్రతి మనిషీ తనలోని ప్రతిభను గుర్తించి పని చేస్తూ అందరూ మీ స్థాయికి వస్తారని నమ్ముతున్నా. ప్రతి ఒక్కరూ మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకొని నడుచుకుంటే మంచి పౌరులుగా ఎదుగుతారని విశ్వసిస్తున్నా.

-రాం కుమార్ కశ్యప్, ఐఎన్ఎల్‌డీ

మీలాంటి వారు చాలా అరుదు

మనం ఇద్దరూ నెల్లూరు జిల్లాలో ఒకే నియోజకవర్గ ప్రాంతం నుంచి రావడం సంతోషకరం. మీరు ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణం. అత్యవసర పరిస్థితుల్లో దేశం కోసం చేసిన పోరాటం అనిర్వచనీయం. ఎమ్మెల్యేగా మీ పనితీరు చారిత్రాత్మకం. ప్రజలు మిమ్మల్ని అసెంబ్లీ టైగర్ అనేవారు. విద్యార్థి దశ నుంచి ఇప్పటివరకూ ఒకే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. అతి కొద్దిమందే ఇలా ఉంటారు.

-విజయసాయిరెడ్డి, వైకాపా

క్రమశిక్షణగల ప్రిన్సిపల్ వచ్చారు

తెలుగు బిడ్డగా పుట్టిన మీరు ఈరోజు జాతీయ స్థాయికి ఎదిగారు. తెలుగువారి చరిత్రలో ఈరోజు చాలా గొప్పదినం. జాతి మొత్తం మిమ్మల్ని ప్రేమిస్తోంది. మీతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడే అవకాశం లేకుండా పోయింది. ఇప్పటి వరకూ మీదగ్గరికి వచ్చిన వారందరి సమస్యలను ఓపికతో విని మార్గదర్శనం చేసేవారు. మిమ్మల్ని ఎన్నో హోదాల్లో చూశాను. ఇప్పుడు ఉపరాష్ట్రపతిగా చూస్తున్నందుకు సంతోషంగా ఉంది. రాజ్యసభకు క్రమశిక్షణగల స్ట్రిక్ట్ ప్రిన్సిపల్ వచ్చారని కారిడార్లలో గుసగుసలు వినిపిస్తున్నాయి. సభను గొప్పగా నిర్వహిస్తారని నమ్ముతున్నా.

-వైఎస్ చౌదరి, తెలుగుదేశం

ప్రభుత్వం, ప్రతిపక్షం రెండు చక్రాలు

ఇదివరకు జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన శంకర్‌దయాళ్‌శర్మ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు మళ్లీ భాజపా అధ్యక్షుడిగా, మంత్రిగా పనిచేసిన మీరు ఆ స్థానంలోకి వచ్చారు. ఈ సభలో అధికార, ప్రతిపక్షాల్లో పనిచేసినందున మీకు అందులోని సమస్యలు తెలుసు. ఆలోచనల మార్పిడి, భిన్నాభిప్రాయాల వక్తీకరణే ప్రజాస్వామ్య బలం. ప్రజాస్వామ్యంలో భిన్న కోణాలు అనివార్యం. ఎన్ని కోణాలు ఎన్ని ఉన్నా అందరి లక్ష్యం దేశ శ్రేయస్సే. అధికార ప్రతిపక్షాలు నదికి రెండు గట్ల లాంటివారు. దేవతల రథమైనా ఒక చక్రంపై నడవదు. దానికీ రెండు చక్రాలు అవసరమే. ప్రజాస్వామ్య రథానికి ప్రభుత్వం, ప్రతిపక్షం రెండు చక్రాల్లాంటివి. ప్రతిపక్ష చక్రమూ బలంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత మీ మీద ఉంది.

- ఆనంద్‌శర్మ, కాంగ్రెస్

రాష్ట్రపతి పదవినీ అధిష్ఠించాలి

సాధారణ వ్యక్తి కూడా అత్యున్నత పదవులకు రాగలరని మీరు నిరూపించారు. గ్రామీణ అభివృద్ధి మంత్రిగా ఎంపీలకు మీరు చేసినంత సాయం ఎవ్వరూ చేయలేదు. చిన్నపార్టీ సభ్యుడికీ మాట్లాడే అవకాశం ఇవ్వాలి. రాజకీయాలతో సంబంధం ఉన్న వ్యక్తి ఈ పదవిలోకి రావడం సంతోషకరం. రాజకీయ నాయకుల మాదిరిగా ప్రజా సమస్యలను రాజకీయేతరులు అర్థం చేసుకోలేరు. మీరు తర్వాతి పదవి కూడా అధిష్ఠించాలని కోరుతున్నా.

-రాంగోపాల్ యాదవ్, సమాజ్‌వాదీపార్టీ

మా అమ్మకు ఆత్మీయుడు

వెంకయ్యనాయుడు మా అమ్మ (జయలలిత)కు చాలా సన్నిహితులు. ఆమె బతికి ఉంటే అందరికంటే ఎక్కువగా సంతోషించేవారు. ఆమె ఆశీర్వాదాలు ఎప్పుడూ ఉంటాయి. దేశంలోని ప్రతి ప్రాంతానికీ కావాల్సిన వ్యక్తి. తమిళులు ఆయన్ను తమిళుడిగా భావిస్తారు. ఆయన నేతృత్వంలో ప్రతి ఒక్కరికీ సభలో మాట్లాడే అవకాశం వస్తుందని నమ్ముతున్నా.

-నవనీత కృష్ణ, ఏఐఏడీఎంకె

అన్నీ తెలిసిన వ్యక్తి

పార్లమెంటులో మీరు సుదీర్ఘకాలంగా ఉన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ప్రతిపక్షం, అధికారపక్షాల్లో పని చేశారు. నిబంధనల గురించి మీకు పూర్తి అవగాహన ఉంది. మీ నాయకత్వంలో సభ సజావుగా నడుస్తుంది. అన్నివైపులా న్యాయం జరుగుతుంది. మీకు నావంతు పూర్తి సహకారం అందిస్తాను.

పీజే కురియన్, రాజ్యసభ ఉపాధ్యక్షుడు

ఇంకా పెద్ద పెద్దవి రావాలి


1998 నుంచి మిమ్మల్ని చూస్తున్నా. ఎదుటివారికి సమాధానం ఇవ్వడంలో మీకు మీరే సాటి. ఇక్కడకు అందరూ మాట్లాడటానికే వస్తారు కాబట్టి అందరికీ అవకాశం ఇవ్వాలి. సభ సజావుగా నడవడానికి కాంగ్రెస్ కూడా సహకరించాలి. భవిష్యత్తులో మీకు ఇంతకంటే పెద్ద పదవి లభించాలని కోరుతున్నా.

-రామ్‌దాస్ అథ్‌వాలే, ఆర్‌పీఐ

మాట్లాడే సమయం పెంచాలి

ఒకప్పుడు పార్లమెంటు అయిదు నెలలపాటు జరిగేది. ఇప్పుడు 20 రోజులకే పరిమితమైంది. ఈ సభలో ప్రతిఒక్కరికీ మాట్లాడే అవకాశం కల్పించాలి. 2, 3 నిమిషాల్లో ప్రజల సమస్యలపై ఎలా మాట్లాడగలుగుతాం. దీన్ని పెంచడానికి ప్రయత్నించాలి.

-సర్దార్ బల్వీందర్ సింగ్ బుందర్, శిరోమణి అకాలీదళ్



అబ్బో!

అద్దంలో అదిరే సెల్ఫీ!

సమయం... సందర్భంతో పని లేదు. మూడ్ ఏదైనా మాటి మాటికీ సెల్ఫీలు కొట్టేస్తున్న కుర్రకారుకి కిక్కెంచేలా ఓ అద్దం సందడి చేస్తోంది. ఇది సింగారానికి వాడే సాదా సీదా అద్దం కాదు. నేటి తరం నాటీగా సెల్ఫీలు తీసుకునేందుకు అనువైన అద్దం. పేరేంటో తెలుసా? 'రికి స్కిన్నీ'. బిల్ట్ఇన్ బ్లూటూత్ ఆప్షన్‌తో వాడుతున్న స్మార్ట్ ఫోన్‌కి కనెక్ట్ అయ్యి మేని ఛాయ మెరిసేలా మేకప్ చేసుకుంటూనే అద్దంలోకి చూస్తూ సెల్ఫీలు దిగొచ్చు. ముఖంపై మరింత కాంతితో మెరిసేలా సెల్ఫీలు రావానుకుంటే అద్దంపై లెడ్‌లైట్స్ ఆన్ చేయవచ్చు. 3ఎక్స్ మాగ్నిఫికేషన్‌తో కొంటెగా క్లోజ్అప్ సెల్ఫీలు క్లిక్‌మనిపించొచ్చు. ఫోన్‌ని అద్దంపైనే అమర్చుకుని మరింత అనువుగా సెల్ఫీలతో పాటు వీడియోలనూ షూట్ చేయడం చాలా ఈజీ. అవసరం మేరకు ప్రత్యేక స్టాండ్‌తో అద్దాన్ని ఎలాగైనా అమర్చుకునే వీలుంది. స్మార్ట్‌ఫోన్‌ల మాదిరిగానే రీఛార్జ్ చేసుకుని వాడుకోవచ్చు. వీడియో, ఇతర వివరాలకు http://goo.gl/gbxLN2

ఈతరం

మగాళ్లకో మనార్కలీ!



పెళ్లిలోనో... సంప్రదాయ వేడుకలకో అమ్మాయి అందంగా కనిపించడానికి కోరుకునే మొదటి ఛాయిస్ అనార్కలీ! ఇప్పుడే కాదు.. మొఘలుల కాలంలో రాజసం ఒలకబోసి... కథక్, కథాకళి నృత్యాల్లో చూపరుల కళ్లను కట్టిపడేసేలా మాయ చేసేదీ ఈ డ్రెస్సే... అతివల అందాలకి మెరుగులద్దే ఈ వస్త్ర సోయగం అబ్బాయిల దేహాన్నీ చుట్టేస్తోంది... కాకపోతే నేటి ఫ్యాషన్ ప్రపంచానికి కొత్తగా పరిచయం అయింది! ఆ ట్రెండ్ పేరేంటో తెలుసా? 'మనార్కలీ!'



పాత తరం హీరోయిన్ మధుబాల పేరు వినే ఉంటారుగా! సంప్రదాయబద్ధంగా నిండైన వస్త్రాలతో అనార్కలీ డ్రెస్‌లో అందర్నీ కట్టిపడేసింది. ఆనాటి నుంచి నేటి వరకూ పలు డిజైన్లలో మురిపిస్తూ ఇప్పుడు ఏకంగా జెండర్ హద్దుల్ని జంప్ చేసి అబ్బాయిలు మెచ్చే మోడ్రన్ డ్రెస్‌గా మనార్కలీ పేరుతో ముందుకొచ్చింది. ర్యాంప్‌వాక్‌ల్లో భిన్నమైన డిజైన్లతో కుర్రోళ్ల ఒంటిపై కొంటెగా ప్రదర్శిస్తోంది. ప్రముఖ డిజైనర్ల ద్వయం అబూజానీ, సందీప్ ఖోస్లా రూపొందించిన మనార్కలీ దుస్తుల్ని ఈమధ్యే దిల్లీ ఫ్యాషన్ షోలో పలువురు మగ మోడళ్లు ధరించి ఫ్యాషన్ ప్రపంచాన్ని ఆకట్టుకున్నారు. అంతకుముందు బాలీవుడ్ స్టార్‌లు రణ్‌వీర్ సింగ్, అనుపమ్‌ఖేర్, అలీ ఫజల్‌లు ఈ డిజైన్ ధరించి బాగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఆ ఊపుతో సామాన్య కుర్రకారు సైతం వీటిపై మోజు పడుతున్నారు. ముఖ్యంగా పెళ్లి వేడుకల్లో మనార్కలీ జోరు ఎక్కువగా కనువిందు చేస్తోంది. తమ శరీర సౌష్టవాన్ని ప్రదర్శించాలనుకునే మగరాయుళ్లు సైతం వీటిని దర్జాగా ధరించి తెగ ముచ్చటపడుతున్నారు. ఫ్యాషన్‌లో ఆడా, మగా హద్దులు చెరిపేసేలా ఇద్దరికీ నప్పే డిజైన్‌గా నిలవాలన్నదే మనార్కలీ రూపకర్తల లక్ష్యం. ఈతరం ఫ్యాషన్ ప్రియులకున్న స్వేచ్ఛాయుత ఆలోచనలే ఈ మగవారి అనార్కలీకి ఓటేసేలా చేస్తున్నాయని రూపకర్తలు చెబుతున్నారు.

దారి తప్పిన సావాసం...
చేజారింది జీవితం

స్నేహం గొప్పదే. కానీ అది రెండువైపులా పదునున్న కత్తిలాంటిది. ఒక మంచి స్నేహితుడు జీవితాన్ని నిలబెడితే... చెడు స్నేహం అధోపాతాళానికి నెట్టేస్తుంది. అందుకు నేనే సాక్ష్యం అంటున్నాడో యువకుడు.

ఇంటర్ దాకా నేను రాముడు మంచి బాలుడు టైపే. డిగ్రీలో ముగ్గురితో కుదిరిన దోస్తీ నన్ను పూర్తిగా మార్చేసింది. బైక్ షికార్లు.. సినిమాలు చూడ్డంతో మొదలై పూర్తిగా దిగజారిపోయా. సిగరెట్ తాగితేనే హీరో అనేవారు ఫ్రెండ్స్. మందు కొట్టపోతే మనిషే కాదన్నారు. రెడ్‌లైట్ ఏరియాలకు కూడా వెళ్లేవాళ్లం. చెడు స్నేహం మత్తులో మునిగిన నాకు ఆ చేష్టలన్నీ హీరోయిజంలా కనిపించేవి.

ఓరోజు చర్చ అమ్మాయిలపైకి మళ్లింది. ప్రేమించే పెళ్లి చేసుకుంటా అన్నాన్నేను. 'నీకంత సీన్ లేదురా? లవ్ మ్యారేజీ చేసుకోకపోతే మగాడివి కాదని ఒప్పుకుంటావా?' అని రెచ్చగొట్టారు ఆ ముగ్గురు. రోషం ముంచుకొచ్చింది. 'ఒకే డన్.. ఒప్పుకోవడమే కాదు అలా చేయలేకపోతే జీవితాంతం మీ బానిసలా ఉంటా' సవాల్ విసిరా.



మర్నాటి నుంచే నా టాస్క్ మొదలైంది. మాకు నాలుగిళ్ల ఆవల ఉండే అమ్మాయి టార్గెట్ అయింది. తన దృష్టిలో పడేలా పోజు కొట్టడం... పుట్టినరోజు, పండగలకి విష్ చేయడం... ప్రత్యేక సందర్భాల్లో చిన్నచిన్న బహుమతులివ్వడం... ఇదే నా దినచర్యగా మారింది. మొత్తానికి తొందర్లోనే ఆ అమ్మాయిని ముగ్గులోకి దింపేశా. చాటింగ్‌లు.. మీటింగ్‌లూ ఊపందుకున్నాయి. పందెం వేసి తనని ప్రేమలో పడేసినా తర్వాత సిన్సియర్‌గా ప్రేమించడం మొదలుపెట్టా. ఒకవైపు గాడితప్పిన అలవాట్లు... ఇప్పుడేమో కొత్తగా ప్రేమ మైకం.. చదువు సంగతే మర్చిపోయా. పరీక్షలపుడు చదువుదాంలే అని తేలిగ్గా తీసుకునేవాణ్ని.

పరీక్షలవగానే ప్రేమించిన అమ్మాయితో పెళ్లి సంగతి మాట్లాడాలనుకున్నా. కానీ ఈలోపే చెడు శకునం. 'మన పెళ్లికి మా ఇంట్లో ఒప్పుకునేలా లేరు' నేనడక్కముందే చెప్పేసింది. ఫ్రెండ్స్ దగ్గర బాధ వెళ్లగక్కా. 'మర్యాదగా అడిగితే పెద్దవాళ్లు ఒప్పుకోర్రా. లేచిపోయి పెళ్లి చేసుకోండి. ఏదైనా అయితే మేం చూసుకుంటాం. మీకోసం ప్రాణాలివ్వడానికీ మేం సిద్ధం' మిత్రత్రయం సలహా ఇచ్చారు. ఆ భరోసాతోనే మేం ఇంట్లోంచి బయటికెళ్లిపోవడానికి 'ముహూర్తం' కూడా పెట్టేసుకున్నాం. ఆ అమ్మాయి వచ్చి నా చేయందుకునే సమయం కోసం ఎదురుచూస్తున్నా. తను రాలేదు కదా టైంకి పోలీసులు వచ్చి నా చేయి పట్టుకున్నారు. స్టేషన్‌కి లాక్కెళ్లారు. ప్రాణం ఇస్తామన్న స్నేహితులు జంప్. అమ్మాయిని బలవంతంగా తీస్కెళ్తున్నాని ఆమె పేరెంట్స్ ఫిర్యాదు చేశారు. 'మేం ఒకరంటే ఒకరికిష్టం. ఇష్టంతోనే ఇద్దరం ఇంట్లోంచి వెళ్లిపోతున్నాం' పోలీసులతో వాదించా. అప్పుడు జరిగింది అసలు సీన్. నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించి.. నాతో కాలు బయటపెట్టడానికి సిద్ధపడ్డ అమ్మాయి అడ్డంగా మాట మార్చేసింది. నా చెంప ఛెళ్లుమనిపించి 'వీడే ప్రేమంటూ నా వెంటపడి మాయమాటలు చెప్పి నన్ను వేధిస్తున్నాడు. నాకిష్టం లేదని చెప్పినా నా వెనకాలే తిరుగుతున్నాడు' అంది. నా కళ్లకు కమ్మిన ప్రేమ మైకం ఒక్కసారిగా దిగిపోయింది. తను నన్ను ప్రేమించిందని నా మనసుకు తెలుసు. మేం తిరిగిన చెట్టూచేమకు తెలుసు. అది నా నిరూపించుకోవడానికి నా దగ్గర సాక్ష్యాలు లేవు. తన్నులు తిని.. అందరి కాళ్లావేళ్లా పడి అక్కణ్నుంచి బయటపడ్డా.

ఊళ్లో పరువుపోయింది. బంధువులు, తెల్సినవాళ్లు నన్నో పనికిమాలినోడిగా జమ కట్టారు. డిగ్రీ ఫెయిలయ్యాను. నాతోపాటు చదువుకున్నవాళ్లంతా మంచి ఉద్యోగాల్లో స్థిరపడితే.. నేనేమో పూట గడవడానికి కూలిగా మారాను. చెడు స్నేహాలు.. చదువుకునే వయసులో ప్రేమతోనే నాకీ గతి పట్టిందని తెలిసొచ్చింది. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. మీరూ నాలా కావొద్దనే మీ ముందుకొచ్చా.

– కృష్ణ

మనసులో మాట

బతికే అవకాశమున్న ఏ ప్రాణమూ పోకూడదు!




అప్పులు చేసి చదివి మరీ డాక్టరయ్యాడు... అతిచిన్న వయసులోనే ప్రత్యేక వైద్యవిభాగానికి అధిపతిగా మారాడు... ఆపై లక్షల్లో జీతమొచ్చే కొలువు దక్కింది... ఆడుతూపాడుతూ హాయిగా ఉద్యోగం చేసుకునే అవకాశం... బిందాస్ లైఫ్‌ని వదిలి సేవాదృక్పథంతో సరికొత్త సర్వీసు ప్రారంభించాడు... అతి తక్కువ రుసుముతో ప్రమాద బాధితులకు చేయూతనందిస్తున్నాడు... ఈ తరహా ప్రయోగం దేశంలోనే అరుదైనది... బతికించగలిగే అవకాశం ఉన్న ఏ ప్రమాద బాధితుడూ చనిపోవద్దనే ఉద్దేశంతోనే ఈ ప్రాజెక్టు ప్రారంభించానంటున్నాడు

ఆరోగ్య బీమా అంటే ప్రమాదాల్లో ఆదుకునే భరోసా. ఇదీ వ్యాపారమయ్యాక భారీ ప్రీమియాల మోత సామాన్యులకు భారమైపోతోంది. ఈ సమస్యకు చెక్ పెడుతూనే.. ప్రమాద సమయాల్లో బాధితుడి పక్కనే ఉంటూ చేదోడువాదోడుగా ఉండే వైద్య నిపుణులతో కూడిన సాధనా యూనిక్ అండ్ ఇన్నోవేటివ్ సర్వీసెస్ (సూట్స్) ప్రారంభించాడు సోమశేఖర్.

ఇదీ నేపథ్యం

ప్రకాశం జిల్లా చీమకుర్తి సోమశేఖర్ సొంతూరు. మొదట్లో ధనిక కుటుంబమే. అడిగినవాళ్లకి కాదనకుండా అప్పులిచ్చేవారు సోమశేఖర్ నాన్న. ఆస్తులు కరిగిపోయి చివరికి వాళ్లే అప్పుల పాలయ్యారు. 2010లో తనకి ఎంసెట్‌లో మంచి ర్యాంకొచ్చింది. రూ.70వేలు కడితే మెడిసిన్ సీటు. నావల్ల కాదని చేతులెత్తేశారు నాన్న. పట్టుపట్టి మళ్లీ చదివితే గుంటూరు ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో సీటొచ్చింది. వైద్యవిద్యార్థిగా ఎమర్జెన్సీ కేసులెన్నో చూశాడు. సరైన వైద్యం అందక.. సమయానికి డబ్బులు సర్దుబాటు చేయలేక.. పట్టించుకునే తోడు లేక ఎందరో ప్రాణాలు కోల్పోవడం గమనించాడు. ఈ దుస్థితి మార్చడానికి ఏదైనా చేయాలని ఆనాడే బలంగా అనుకున్నాడు. కేరళలోని మలబార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎమర్జెన్సీ ఫిజీషియన్ పీజీ కోర్సులో చేరాడు. బెస్ట్ ప్రెజెంటర్‌గా, బెస్ట్ ఔట్‌గోయింగ్ స్టూడెంట్‌గా బయటికొచ్చాడు. కొన్నాళ్లు ఒంగోలులో పనిచేసి ముప్పైఏళ్ల అతిచిన్న వయసులోనే డీఎం వేనాడ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అత్యవసరచికిత్స విభాగానికి అధిపతి అయ్యాడు. అక్కడే అత్యవసర చికిత్సల్లో ప్రోటోకాల్ బెస్ట్ ప్రాక్టీసెస్ ఏంటి? ఎమర్జెన్సీ కాన్సెప్టు.. ట్రామాకేర్ నిబంధనలు.. ప్రమాదం జరిగిన వ్యక్తిపట్ల తీసుకునే జాగ్రత్తల గురించి తెలుసుకున్నాడు. అనుభవజ్ఞుల అభిప్రాయాలు తెలుసుకున్నాడు.

> భారత్‌లో సగటున ప్రతి నాలుగు నిమిషాలకొకరు రోడ్డుప్రమాదంలో చనిపోతుండటం విషాదం. కొద్దిపాటి జాగ్రత్తలతోనే వీరిలో నలుగురిలో ముగ్గురిని బతికించొచ్చు



తొలి అడుగు

సోమశేఖర్ వైద్యవిద్యార్థిగా ఉన్నపుడే 2013లో ఒంగోలులో 'సాధన ఫౌండేషన్' పేరుతో ఒక స్వచ్ఛందసంస్థ ప్రారంభించాడు. వైద్యవిద్యార్థులైన మిత్రులతో కలిసి తెలుగు రాష్ట్రాల్లో పదులకొద్దీ హెల్త్‌క్యాంపులు నిర్వహించాడు. దీనికోసం తనకొచ్చే స్టైపెండ్‌ని సైతం వెచ్చించేవాడు. ఎమర్జెన్సీ ఫిజీషియన్‌గా ఉన్నపుడు అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు ఎలాంటి ప్రాథమిక చికిత్సలు చేయాలో వివరిస్తూ ఆర్‌టీవో కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాడు. ఇవన్నీ చేస్తున్నా తన మొట్టమొదటి లక్ష్యం మరవలేదు. దీనికోసం ఓ సంస్థ మొదలుపెడదామనుకుంటే చేతిలో చిల్లిగవ్వ లేదు. డబ్బులు కూడబెట్టడానికి అమెరికా వెళ్లి 'షిప్ కార్నివాల్ క్రూయిజ్‌లైన్స్'లో ఫిజీషియన్‌గా చేరాడు. పైసాపైసా పొదుపుచేశాడు. కొన్నాళ్లయ్యాక మిత్రులు డా.సుధాకర్‌రెడ్డి, డా.మొయినొద్దీన్‌ల సహకారంతో విశాఖపట్నంలో 2015 ఆగస్టులో 'సూట్స్' మొదలుపెట్టాడు.

ఏం చేస్తారంటే..

అనుకోని ప్రమాదాల నుంచి రక్షణ పొందడం కోసం సాధారణంగా మనం ఆరోగ్య బీమా పాలసీలు తీసుకుంటాం. ఈ మొత్తం ఒక్కోసారి భరించలేనంత అధికంగా ఉంటుంది. దీనికి ప్రత్యామ్నాయమే సూట్స్ కార్డు సభ్యత్వం. కేవలం ట్రామాకేర్ సేవలు అందించడానికే ఈ ప్రాజెక్టు రూపొందించారు. రూ.799 చెల్లించి ఇందులో సభ్యుడైతే రూ.రెండులక్షల వరకు నగదురహిత చికిత్స అందుకోవచ్చు. ఇందులో షరతులు, నిబంధనలు ఏం ఉండవు. 18 నుంచి 50ఏళ్ల వయసున్న ఎవరైనా సభ్యత్వం నమోదు చేసుకొని కార్డు తీసుకోవచ్చు. అంతకుమించి ప్రత్యేకత ఏమిటంటే ప్రమాదాల బారినపడ్డ సభ్యులకు మెరుగైన చికిత్స అందేలా దగ్గరుండి సూట్స్ కేర్ టీం సభ్యుడు జాగ్రత్తలు తీసుకుంటాడు. ఒకవేళ సూట్స్ సభ్యుడు ప్రమాదానికి గురైతే కాల్‌సెంటర్ ద్వారా వెంటనే కేర్ టీం సభ్యుడికి సమాచారం అందుతుంది. క్షతగాత్రుడిని చేర్పించిన ఆసుపత్రికి బయల్దేరతాడు. అవసరమైతే వేరొక ఆసుపత్రిలో చేర్చడం దగ్గర్నుంచి మెరుగైన వైద్యం అందించేలా చేయడం.. సంబంధీకులకు సమాచారం అందించడం.. అన్నీ ఈ సభ్యుడే చూసుకుంటారు. ఫిజియోథెరపిస్టులతో కూడిన ఇలాంటి కేర్ టీం సభ్యులు 200మంది సూట్స్ తరపున పనిచేస్తున్నారు. దేశంలో ఏ బీమా కంపెనీ కూడా ఇటువంటి సేవలు అందించడం లేదంటాడు సోమశేఖర్. సత్వర వైద్యం అందేలా దేశంలోని 5,500 ఆసుపత్రులతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

కష్టాలకోర్చి

లాభాపేక్ష లేకుండా.. బతికే అవకాశం ఉన్న ఏ ప్రాణం పోకూడదు అనే ఉద్దేశంతో ఈ కాన్సెప్టు మొదలుపెట్టానంటాడు సోమశేఖర్. దీనికోసం అతడు పడ్డ కష్టాలు తక్కువేం కాదు. ఈ కాన్సెప్టుకు ఒప్పించడానికి చాలా బీమా కంపెనీలు, ఆసుపత్రుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాడు. లాభదాయకంగా లేదని చాలా సంస్థలు తిరస్కరించాయి. అయినా పట్టువదలకుండా ప్రయత్నించి చివరికి నేషనల్ ఇన్సూరెన్స్, రెలిగేర్‌లను ఒప్పించగలిగాడు. ఇదేకాదు.. డబ్బులు కూడబెట్టడానికి క్రూయిజ్‌లైన్స్‌లో నెలలకొద్దీ సెలవుల్లేకుండా పనిచేశాడు. వ్యక్తిగత రుణం తీసుకున్నాడు. ఏం చేసినా తాను ఎంచుకున్న వైద్యవృత్తికి పూర్తి న్యాయం చేయడమే తన లక్ష్యం అంటున్నాడు సోమశేఖర్‌రెడ్డి.

పూర్తి వివరాలకు: suitseveryone.com

పంచ్ వీరుడి కబుర్లు

బాక్సింగ్ వీరుడు విజేందర్‌సింగ్ మళ్లీ కొట్టాడు. చైనా ప్రత్యర్థి జుల్ఫికర్ మైమైతియాలీ దిమ్మతిరిగేలా. ప్రొఫెషనల్ బాక్సర్‌గా మారాక అతడి పంచ్‌లకి ఎదురేలేకుండా పోతోంది. వరుసగా తొమ్మిది విజయాలు సాధించాడు. అందులో ఏడు నాకౌట్లే. ఆట, ఫేమ్‌తో అదరగొడుతున్న అతగాడు భారతీయ యువతకు రోల్‌మోడల్. తన వ్యక్తిగత కబుర్లు, ఆసక్తుల సంగతులివి.

హరియాణాలో పుట్టిన విజేందర్ భివానీ, రోహ్‌తక్‌ల్లో చదివాడు. నాన్న బస్‌డ్రైవర్. ఇంటర్లోనే జిమ్నాస్ట్‌గా మారాలనుకున్నాడు. అందులో గాయాలపాలయ్యే అవకాశం ఎక్కువని తెలిసి రూటు మార్చి బాక్సింగ్ బాట పట్టాడు. భివానీ బాక్సింగ్ క్లబ్‌లో చేరాడు. అక్కడే అతడిలోని ప్రతిభను గుర్తించి టెక్నిక్‌కి సానబెట్టాడు గురువు జగదీశ్‌సింగ్.

గెలుపు బాట: 1997లో సబ్‌జూనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ విజేందర్‌కి పెద్ద విజయం. ఆపై జాతీయ ఛాంపియన్‌గా గెలవడం.. ఆసియన్ గేమ్స్.. ఒలింపిక్ మెడల్.. అతడి పంచ్‌కి దక్కిన పతకాలెన్నో. ప్రొఫెషనల్‌గా మారాక ఓటమన్నదే లేకుండా ఇప్పటికి తొమ్మిది పోటీలు గెలిచాడు. అందులో ఏడూ నాకౌట్ విజయాలే. తాజాగా చైనా వీరుడు జుల్ఫికర్ మైమైతియాలీని మట్టికరిపించి వరల్డ్ బాక్సింగ్ ఆర్గనైజేషన్ సూపర్ మిడిల్‌వెయిట్ ఛాంపియన్ కిరీటం నిలబెట్టుకున్నాడు.

అవార్డులు: పంచ్‌లు విసిరి విజయాలు సాధించడంలోనే కాదు.. ప్రభుత్వం ఇచ్చే అవార్డులు అందుకోవడంలోనూ విజేందర్ ఛాంపియనే. క్రీడా విభాగంలో అత్యుత్తమ పురస్కారం రాజీవ్‌ఖేల్‌రత్న అందుకున్నాడు. పద్మశ్రీ.. అర్జున అవార్డులూ అతడి వశమయ్యాయి.

ఫాలోయింగ్: దేశంలో అత్యధిక ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న క్రీడాకారుల్లో విజేందర్ ఒకడు. ముఖ్యంగా పట్టణాలు, మెట్రో నగరాల్లోని అమ్మాయిలకు విజేందర్ అంటే చెప్పలేనంత క్రేజ్. ఆ ఊపుతోనే పలు వ్యాపారసంస్థల ఉత్పత్తులకు ప్రచారం చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. పదులసార్లు ఫ్యాషన్‌షోలు, ర్యాంప్ షోల్లో క్యాట్‌వాక్ చేశాడు. దస్ కా దమ్, నాచ్ బలియే, రోడీస్ ఎక్స్2.. రియాలిటీ షోల్లో మెరిశాడు. నేనేం చేసినా బాక్సింగ్‌కి ప్రాచుర్యం కల్పించే ఉద్దేశం మాత్రం మరవనంటాడు.



- **ఇష్టం:** సంగీతం అంటే ప్రాణం. హనీసింగ్ పాటల వినకుండా రోజు గడవదు. నచ్చిన నటుడు షారూఖ్‌ఖాన్. మెచ్చిన సినిమా దిల్‌వాలే దుల్హనియా లేజాయింగే.
- **డైట్:** ప్రొటీన్లు ఎక్కువగా.. కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండే ఆహారం. రెండు ముక్కలు వెన్న లేదా జామ్‌తో కలిపి తీసుకుంటాడు. నాలుగైదు ఉడికించిన గుడ్లు, అరటిపండ్లు, ఒక గ్లాసుడు పాలు.
- **సాధన:** రోజుకి నాలుగైదు గంటలు. పోటీకి ముందురోజుల్లో అయితే ఆరేడు గంటల సాధన తప్పనిసరి.
- **నటన:** పేరులో స్టార్ కావడంతో బాలీవుడ్ ఆహ్వానం పలికింది. ఫగ్లీ సినిమాతో తెరపై మెరిశాడు. అది బాగానే ఆడినా కెరీర్‌కి అడ్డొస్తుందనే ఉద్దేశంతో మళ్లీ సినిమాలు ఒప్పుకోలేదు.
- **స్ఫూర్తి:** ఫైవ్ డివిజన్ వరల్డ్ ఛాంపియన్ ఫ్లాయిడ్ మేవెదర్‌ని ఆరాధిస్తాడు. రోజర్ ఫెదరర్‌ని ఇష్టపడతాడు.
- **పెళ్లి:** కోట్లమంది అమ్మాయిలు విజేందర్ అంటే పడి చస్తున్నా వాళ్ల ఆశల్ని వమ్ముచేస్తూ చిన్ననాటి నేస్తం అర్చనకి మూడుముళ్లు వేశాడు. ఓ కొడుకు అరిబీర్.

ప్రేమలో పడటం చాలా తేలిక. కంటికి నచ్చినా.. మనసు స్పందించినా టపీమని ప్యార్‌లో పడిపోతాం. దాన్ని నిలబెట్టుకోవడమే మహా కష్టం గురూ. ఆ గాఢత కడదాకా నిలిచి ఉండాలంటే ఇంకా ఇంకా కష్టం. దానికోసం కష్టాలు ఎదుర్కోవాలి. త్యాగాలు చేయాలి. ప్రేమ కోసం మేం ఏమైనా చేస్తాం.. అవసరమైతే ప్రాణాలిస్తాం.. అని ముందు అన్నవాళ్లే తీరా సమయం వచ్చినపుడు చేతులెత్తేస్తారు. మలేసియన్ అమ్మాయి ఏంజెలిన్ మాత్రం ఆ బాపతు కాదు. తను ప్రేమ కోసం ఏకంగా వేల కోట్ల సంపదనే వదిలేసింది.

వేలకోట్లు వద్దు.. ప్రేమే ముద్దు!



ఏంజెలిన్ ఎవరంటే విలాసవంతమైన హోటళ్ల గ్రూప్ 'మలయన్ యునైటెడ్ ఇండస్ట్రీస్' ఛైర్మన్ ఖూ కే పెంగ్ ముద్దుల కూతురు. ఖూ ది మలేసియాలోని అత్యంత ధనవంతుల జాబితాలో నలభైనాలుగో స్థానం. అతగాడి సంపద వేల కోట్లల్లోనే ఉంటుంది. అతగాడి కూతురు ఏంజెలిన్ 2008లో చదువుల కోసం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి వెళ్లింది. అక్కడే డేటా సైంటిస్ట్‌గా పని చేస్తున్న జెడిదా ఫ్రాన్సిస్‌తో పరిచయమైంది. చూపులు కలుసుకున్నాయి. మనసులు గుసగులాడుకున్నాయి. అభిప్రాయాలూ జత కలిశాయి. ఇంకేం.. మనసులు ఇచ్చిపుచ్చుకున్నారు. పెళ్లితో ఒక్కటవ్వాలనుకున్నారు. ఇదే మాట తండ్రితో చెబితే 'ఠాఠ్.. పెళ్లికి ససేమిరా ఒప్పుకోను' అన్నాడు. అయినా ఏంజెలిన్ ఫ్రాన్సిస్‌ని తప్ప మరొకర్ని మనువాడబోనంది. 'అయితే నా సంపదలో నయాపైసా ఇవ్వన'ని చెప్పేశాడు ఖూ. అచ్చం సినిమాల్లో విలన్‌లా. తండ్రి తన అభీష్టాన్ని అంగీకరించరని అర్థమైన ఏంజెలిన్ ఇంట్లోంచి కాలు బయటపెట్టింది. ఇరవైమంది అతిథుల సమక్షంలో ఆ యువజంట పెళ్లితో ఒక్కటయ్యారు. ఫైవ్‌స్టార్ సౌకర్యాల మధ్య పుట్టిపెరిగిన ఏంజెలిన్ ఇప్పుడు ఫ్యాషన్ డిజైనర్‌గా పని చేస్తోంది. 'డబ్బు ఉన్నపుడు సకల సౌకర్యాలు అనుభవించిన మాట నిజం. అదేసమయంలో సమయం వచ్చినపుడు డబ్బు మనుషుల్ని చెడ్డవాళ్లుగా కూడా మార్చేస్తుందనే విషయం కూడా అర్థమైంది. నా దృష్టిలో వేలకోట్లు కేవలం చిత్తుకాగితాలతో సమానం' అంటోంది ఏంజెలిన్.

సిమెంట్ స్పీకర్లు!

విభిన్నం



ప్లాస్టిక్.. చెక్క... ఇతర ఘన పదార్థాలతో తయారైన స్పీకర్లు చూశాం... మ్యూజిక్ వింటూ మజా చేశాం. కానీ, మీరెప్పుడైనా సిమెంట్‌తో తయారు చేసిన స్పీకర్లను చూశారా? అదీ ఇన్‌బిల్ట్ బ్లూటూత్ సదుపాయంతో! 'ఉతోపియా టైటాన్ హ్యాండ్‌మేడ్ కాంక్రీట్' స్పీకర్ అలాంటిదే! పొరపాటున పడితే పగులుతాయనో... తొక్కితే విరుగుతాయనో బాధే లేదు! గదిలో అనువైన చోట పెట్టుకుని బ్లూటూత్ నెట్‌వర్క్‌తో కనెక్ట్ అయ్యి ఫోన్, ల్యాపీలోని పాటలు వినొచ్చు. స్పీకర్ కేబినెట్ మందం 10-20 ఎంఎం. 60 వాట్ పవర్‌తో పని చేస్తుంది.

పసిడితో ముగిస్తాడా..!



బోల్ట్

పరుగుల రారాజుకు వీడ్కోలు నేడే!

4×100 మీ. రిలే
హీట్స్: మధ్యాహ్నం 3.25కు
ఫైనల్: రాత్రి 2.20కి
స్టార్ స్పోర్ట్స్ సెలెక్ట్-2లో ప్రసారం

లండన్

మానవ చిరుత ఉసేన్ బోల్ట్.. బరిలో దిగితే స్వర్ణమే..! ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆరంభానికి ముందు వరకు దాదాపుగా ఇదే పరిస్థితి. టోర్నీ ఏదైనా, వేదిక ఎక్కడైనా, ప్రత్యర్థులు ఎవరున్నా.. బోల్ట్ పరుగెత్తితే మిగతావాళ్లు రజతం, కాంస్యం కోసం పోటీపడేవాళ్లు! కానీ అమెరికా స్ప్రింటర్లు జస్టిన్ గాట్లిన్, క్రిస్టియన్ కోల్‌మన్‌లు తొలిసారి.. కాంస్యం సాధించినప్పుడు బాధ ఎలాగుంటుందో బోల్ట్‌కు రుచి చూపించారు. 100 మీటర్ల విభాగంలో మూడుసార్లు ప్రపంచ రికార్డును బద్దలుకొట్టిన బోల్ట్.. తన చివరి రేసులో మూడో స్థానానికి పరిమితమయ్యేలా చేశారు. ఇప్పుడు వ్యక్తిగత విభాగంలో వారిని ఓడించే అవకాశమైతే బోల్ట్‌కు లేదు. కానీ ప్రతీకారం తీర్చుకునే అవకాశం అతడి ముందుంది. అంతేకాదు.. ఘనమైన కెరీర్‌కు పసిడితో ముగింపు పలికే అవకాశం జమైకా చిరుత ముందుంది. కానీ అతడొక్కడే రాణిస్తే సరిపోదు. జట్టంతా అతడికి మద్దతుగా నిలవాలి. అతడి విజయం కోసం పోరాడాలి. పురుషుల 4×100 మీటర్ల రిలే పోటీ జరిగేది శనివారమే. డిఫెండింగ్ ఛాంపియన్ జమైకానే ఫేవరెట్‌గా బరిలో దిగుతోంది. ఐతే 100 మీటర్ల పరుగులో ఫేవరెట్ బోల్ట్‌కు షాకిచ్చినట్లే.. ఈసారి అతడి జట్టును ఓడించాలని అమెరికా పట్టుదలగా ఉంది. మంచి ఫామ్‌లో ఉన్న గాట్లిన్, కోల్‌మన్‌లు ఆ జట్టుకు అతిపెద్ద బలం. "మిగతావాళ్లలానే మాకూ గెలిచే అవకాశముంది. ఈసారి గట్టి ప్రత్యర్థులం మేమే" అని కోల్‌మన్ విశ్వాసం వ్యక్తం చేశాడు. జమైకా జట్టులో బోల్ట్, యొహాన్ బ్లేక్ మినహా.. మిగతావాళ్లు కుర్రాళ్లే. మరి వాళ్లు ఎలా రాణిస్తారో చూడాలి. బోల్ట్ హీట్స్‌లో కూడా బరిలో దిగే అవకాశముంది. "100 మీటర్ల పరుగులో విఫలమైనందుకు బాధగా ఉంది. అప్పుడప్పుడు అలా జరుగుతుంది.. అంతే. ప్రస్తుతం మా దృష్టి రిలే స్వర్ణంపైనే" అని బోల్ట్ చెప్పాడు. రిలేలో ప్రపంచ రికార్డు జమైకా జట్టుదే. 2012 లండన్ ఒలింపిక్స్‌లో 36.84 సెకన్లలో ఆ జట్టు స్వర్ణం గెలిచింది. మరి జమైకా ఆ రికార్డును తిరగరాసి బోల్ట్‌కు ఘన వీడ్కోలు పలుకుతుందా..?

జట్లు: అమెరికా: జస్టిన్ గాట్లిన్, క్రిస్టియన్ కోల్‌మన్, జేలన్ బేకన్, క్రిస్టోఫర్ బెల్చర్, బీజే లీ, మైక్ రోడ్జర్స్ **జమైకా:** ఉసేన్ బోల్ట్, యొహాన్ బ్లేక్, మైకెల్ క్యాంప్‌బెల్, జులియన్ ఫోర్ట్, సెనోజె గివన్స్, టైక్వెండో ట్రేసీ

మహేశ్వరికి కాంస్యం



అస్తానా: ఆసియా షాట్‌గన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ మరో రెండు పతకాలు ఖాతాలో వేసుకుంది. మహిళల వ్యక్తిగత స్కీట్‌లో మహేశ్వరి చౌహాన్ కాంస్యం సొంతం చేసుకుంది. అర్హత రౌండ్లో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్ చేరిన ఆమె.. మూడో స్థానంతో పోటీని ముగించింది. అంతర్జాతీయ షూటింగ్‌లో మహిళల స్కీట్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు లభించిన తొలి పతకం ఇదే. స్కీట్ టీమ్ విభాగంలో మహేశ్వరి, రష్మీ, సానియా షేక్‌లతో కూడిన భారత జట్టు ఫైనల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రజతం సాధించింది.

ఛాంపియన్స్

కోహ్లి సేన చరిత్ర ముంగిట ఉందిపుడు.. మరో అడుగు పడితే చాలు.. సువర్ణాధ్యాయమే. శ్రీలంకను వారి సొంతగడ్డపై 3-0తో వైట్‌వాష్ చేస్తే.. ఈ ఘనత సాధించిన తొలి భారత జట్టుగా నిలుస్తుంది. ఇలా జరిగితే 85 ఏళ్ల మన టెస్టు చరిత్రలో ఏ కెప్టెన్‌కూ సాధ్యం కాని ఘనత విరాట్ దక్కించుకోనున్నాడు. శనివారం నుంచే లంకతో మూడో (చివరి) టెస్టు. అయితే క్యాండీ పిచ్ పేసర్లకు సహకరించేలా ఉండడం ఆసక్తిని రేపుతోంది.

ఉదయం 10 నుంచి సోని సిక్స్, టెన్-3లో

గెలిస్తే.. విరాట పర్వమే

- వైట్‌వాష్‌పై భారత్ కన్ను
- నేటి నుంచే లంకతో మూడో టెస్టు



- టెస్టుల్లో ఇప్పటిదాకా భారత్ నాలుగుసార్లు మాత్రమే సిరీస్ వైట్‌వాష్‌లు చేసింది. 1993లో మహ్మద్ అజహరుద్దీన్ కెప్టెన్సీలో సొంతగడ్డపై 3-0తో ఇంగ్లాండ్‌పై, అదే తేడాతో 1994లో లంకపై భారత్ సిరీస్‌లు గెలిచింది. 2013లో ధోని సారథ్యంలో 4-0తో ఆస్ట్రేలియాను, 2016లో కోహ్లి నేతృత్వంలో 3-0తో న్యూజిలాండ్‌ను ఓడించింది.

క్యాండీ

తొలి టెస్టులో 304 పరుగుల తేడాతో విజయం.. రెండో టెస్టులో ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో గెలుపు.. ప్రత్యర్థిపై సంపూర్ణ ఆధిపత్యం.. లోపాలు ఎంచలేని ఆట తీరు.. ఇలా సాగుతోంది లంకతో టెస్టు సిరీస్‌లో భారత్ జోరు. ఈ నేపథ్యంలో మరో విజయానికి సిద్ధమైంది కోహ్లి బృందం. శనివారం నుంచి ప్రారంభం కానున్న మూడో టెస్టులో భారత్ వైట్‌వాషే లక్ష్యంగా బరిలో దిగుతోంది.

పేస్.. పేస్: లంక పిచ్‌లు అనగానే బంతులు గిర్రున తిరుగుతాయి. ఇక్కడ పేస్ పిచ్‌లు చాలా తక్కువ. కానీ మూడో టెస్టు కోసం లంక అలాంటి పిచ్‌ను తయారు చేస్తోంది. యువ పేసర్లు తమ బలమని నమ్ముతున్న లంక.. ఇప్పుడు అదే అస్త్రాన్ని భారత్‌పై ప్రయోగించనుంది. గాయపడి తప్పుకున్న నువాన్ ప్రదీప్, రంగన హెరాత్ స్థానంలో యువ పేసర్లు చమీర, గమాగెలను జట్టులో చేర్చుకుంది. శుక్రవారం వర్షం పడడంతో పిచ్‌పై బంతి మరింత వేగంగా దూసుకొచ్చే అవకాశాలున్నాయి. పిచ్ పేస్ బౌలింగ్‌కు సహకరించే నేపథ్యంలో భారత్ కూడా భువనేశ్వర్ కుమార్ రూపంలో మూడో స్పెషలిస్ట్ పేసర్‌ను జట్టులోకి తీసుకోవచ్చని భావిస్తున్నారు. అతను ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య స్థానంలో జట్టులోకి రావొచ్చు. రవీంద్ర జడేజాపై సస్పెన్షన్ వేటు పడిన నేపథ్యంలో అశ్విన్‌తో పాటు చైనామన్ బౌలర్ కుల్‌దీప్ యాదవ్ రెండో స్పిన్నర్‌గా బరిలో దిగే అవకాశాలున్నాయి.

వరుణుడు వస్తాడేమో!

పల్లెకలె పిచ్ సాధారణంగా పేస్ బౌలర్లకు అనుకూలంగా ఉంటుంది. బౌన్స్, పేస్ రాబట్టొచ్చు. పచ్చికతో కళకళలాడుతున్న పిచ్‌పై కనీసం రెండు రోజులు పేసర్లకు పండగే. అయితే ఇక్కడ వరుణుడు తరుచు మ్యాచ్‌లకు అడ్డుపడుతుంటాడు. శుక్రవారం వర్షం కురియడంతో ఇరు జట్లు ప్రాక్టీస్ చేయలేకపోయాయి. శనివారం కూడా ఆటకు వర్షం ఆటంకం కలిగించే అవకాశాలను కొట్టి పారేయలేం.

వాళ్లు మెరిస్తే..: భారత బ్యాటింగ్ ఆర్డర్ ఊపు మీదుంది. లంక బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ తొలి రెండు టెస్టుల్లో తొలి ఇన్నింగ్స్‌లో 600పైన పరుగులు సాధించింది. ధావన్, రాహుల్, రహానె, పుజారా, కోహ్లితో పాటు లోయర్ ఆర్డర్ పరుగుల వరద పారిస్తోంది. ఈ సిరీస్‌లో రెండు సెంచరీలు చేసిన పుజారా మరోసారి పాతుకుపోతే భారీ స్కోరు ఖాయం. ఇక లంక ఆశలన్నీ ఆ జట్టు యువ కెరటం కుశాల్ మెండిస్‌పైనే పెట్టుకుంది. పల్లెకలె పిచ్‌పై అత్యధిక వ్యక్తిగత స్కోరు కుశాల్ (176) పేరిటే ఉంది.

జట్లు (అంచనా)

భారత్: ధావన్, రాహుల్, పుజారా, కోహ్లి (కెప్టెన్), రహానె, అశ్విన్, సాహా, పాండ్య, భువనేశ్వర్/ఉమేశ్ యాదవ్, కుల్‌దీప్ యాదవ్, షమి

శ్రీలంక: తరంగ, కరుణరత్నె, కుశాల్ మెండిస్, చండిమాల్ (కెప్టెన్), మాథ్యూస్, డిక్వెలా, ధనుంజయ డిసిల్వా, దిల్రువాన్ పెరీరా, చమీరా/సందకన్, విశ్వ ఫెర్నాండో, లహిరు కుమార.


విశ్రాంతా.. ఎవరు చెప్పారు

శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్ ఆడడానికి తనకు ఎటువంటి సమస్యా లేదని విరాట్ కోహ్లి అన్నాడు. తనకు విశ్రాంతి ఇవ్వనున్నారంటూ వస్తున్న వార్తలను ఖండించాడు. "ఎవరు చెప్పారు నేను ఆడడం లేదని. ఈ వార్తలు ఎక్కడి నుంచి వచ్చాయో నాకు తెలియదు. నాకైతే ఆడడానికి ఎలాంటి సమస్యా లేదు" అని కోహ్లి చెప్పాడు.

మూడో సెంచరీ చేస్తాడేమో!

సౌరభ్ గంగూలీ

అందమైన పల్లెకలె స్టేడియంలో మూడో టెస్టు జరగనుంది. ఈ మైదానంలో ఆడడం భారత్‌కు ఇదే తొలిసారి. సిరీస్ ఏకపక్షంగా సాగుతోంది. లంక నుంచి పోటీయే లేదు. విరాట్‌సేనను అభినందించాలి. రెండు టెస్టుల్లో ఎక్కడా ప్రత్యర్థికి అవకాశం ఇవ్వలేదు. కొలంబోలో టాస్ నెగ్గడం భారత్‌కు కలిసొచ్చింది. ఇక్కడ బంతి విపరీతంగా తిరిగింది. గమనించాల్సిన విషయమేంటంటే ఇలాంటి పరిస్థితులను అనుకూలంగా మలచుకోగల బౌలింగ్ వనరులు భారత్ దగ్గర ఉన్నాయి. ప్రస్తుతం లంక క్రికెట్ సంక్షోభంలో ఉంది. ఇలాంటి సమయంలో ఆ జట్టులోని యువ ఆటగాళ్లు బాధ్యత తీసుకోవాలి. దేశం కోసం పోరాడాలి. భారత్ కూడా ఇలాంటి దశను ఎదుర్కొంది. అయితే తక్కువ సమయంలోనే సంక్షోభాన్ని దాటింది. దీనికి కారణం విరాట్, రహానె, అశ్విన్, జడేజా, పుజారా లాంటి క్రికెటర్లు బాధ్యత తీసుకోవడం. దేశానికి ప్రాతినిధ్యం వహించడాన్ని గర్వంగా భావించారు. ఈ సిరీస్‌లో పుజారా బ్యాటింగ్ అద్భుతం. బహుశా ఈ సిరీస్‌లో అతడు మూడో సెంచరీ కూడా పూర్తిచేస్తాడేమో. భారత జట్టులో నాణ్యతకు కొదవలేదు.. పుజారా ఒక్కడే కాదు.. సాహా, పాండ్యలాంటి ఆటగాళ్లు జట్టును మరింత బలోపేతం చేశారు. పాండ్యలో నైపుణ్యం ఉంది. షాట్ల ఎంపికపై అతడు దృష్టి పెట్టాలి. ఈ స్థాయిలో తాను నిలకడగా రాణించగలనని నిరూపించుకోవాలి. జడేజాపై వేటు కులదీప్‌కు అవకాశం కల్పించనుంది. పరిస్థితులు కూడా కుల్‌దీప్ బౌలింగ్‌కు అనుకూలంగానే ఉన్నాయి. కాబట్టి ఈ యువ స్పిన్నర్‌తో లంకకు ఇబ్బందే.



దవీందర్ సింగ్ కంగా

చోప్రా కాదు కంగా

పంజాబ్ త్రోయర్ సంచలనం ● జావెలిన్ త్రో ఫైనల్లో ప్రవేశం

లండన్: ప్రపంచ అథ్లెటిక్స్‌లో పురుషుల జావెలిన్ త్రో పోటీ. భారత్‌లో అందరి దృష్టి యువ సంచలనం నీరజ్ చోప్రాపైనే! ప్రపంచ జూనియర్ అథ్లెటిక్స్‌లో ప్రపంచ రికార్డుతో పాటు స్వర్ణం ఎగరేసుకుపోయిన అతడు సీనియర్ విభాగంలోనూ సంచలనం సృష్టిస్తాడేమోనని అంతా ఎదురుచూశారు. ఐతే సత్తా మేరకు రాణించలేకపోయిన అతడు అర్హత మార్క్‌కు కొద్ది దూరంలోనే నిలిచిపోయాడు. క్వాలిఫయింగ్ దశలోనే ఇంటి ముఖం పట్టాడు. 19 ఏళ్ల నీరజ్ విఫలమైనా.. భారత్ పతక రేసులో ఇంకా ఉంది. అంచనాలే లేని పంజాబ్ జావెలిన్ త్రోయర్ దవీందర్ సింగ్ కంగా సంచలనం సృష్టించాడు. అసాధారణ ప్రదర్శనతో తుదిపోరుకు అర్హత పొందాడు. ఈ ఘనత సాధించిన తొలి భారత జావెలిన్ త్రోయర్‌గా ఘనత సాధించాడు. గ్రూప్-బి క్వాలిఫయింగ్‌లో బరిలో దిగిన 26 ఏళ్ల దవీందర్ జావెలిన్‌ను 84.22 మీటర్ల దూరం విసిరి ఏడో స్థానంతో ఫైనల్లో ప్రవేశించాడు. తొలి ప్రయత్నంలో 82.22 మీ., రెండో ప్రయత్నంలో 82.16 మీ. దూరం విసిరిన కంగా తన మూడో ప్రయత్నంలో అర్హత మార్క్ (83 మీటర్లు)ను అధిగమించాడు. అంతకు ముందు గ్రూప్-ఎ క్వాలిఫయింగ్‌లో నీరజ్ చోప్రా అత్యుత్తమంగా 82.26 మీటర్లు మాత్రమే విసరగలిగాడు.

వెళ్తాడో లేదో అనుకుంటే..

ప్రపంచ అథ్లెటిక్స్‌కు అసలు వెళ్తాడో లేదో అనుకున్న కంగా. . వెళ్లడంతో పాటు ఏకంగా ఫైనల్ చేరడం ఆశ్చర్యమే! జూన్‌లో నిర్వహించిన డోప్ పరీక్షల్లో కంగా మారిజువానా తీసుకున్నట్లు తేలింది. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) నియమావళి ప్రకారం మారిజువానా నిషేధిత ఉత్ప్రేరకం కాదు. ఉద్దేశపూర్వకంగా మారిజువానా తీసుకున్నట్లు తేలితే శిక్ష పడుతుంది. ఐతే విచారణ తర్వాత అథ్లెట్‌పై నిర్ణయం తీసుకుంటారు. అందుకే డోప్ పరీక్షలో విఫలమైనా కంగాను భారత జట్టులో చేర్చారు. భారత్ జావెలిన్ త్రో క్రీడాకారులకు కోచ్ లేడు. దీంతో కంగా పోరుకు ముందు స్నేహితుడైన శ్రీలంక అథ్లెట్ సాయం తీసుకున్నాడు. "చివరి త్రోకు ముందు భుజాలు పట్టేశాయి. స్ట్రెచింగ్స్‌లో అతడు సాయపడటంతో కోలుకోగలిగాను" అని కంగా చెప్పాడు.



మక్వాలా గులియెవ్

జాన్సన్‌ను అందుకోలేకపోయాడు

- 200మీ.ఫైనల్లో నీకెర్క్‌కు షాక్
- గులియెవ్‌కు స్వర్ణం

లండన్: స్ప్రింట్‌లో ఒకేసారి 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందేల్లో స్వర్ణం గెలవడమంటే మాటలు కాదు..! అమెరికా దిగ్గజం మైకెల్ జాన్సన్ ఎప్పుడో 22 ఏళ్ల కిందట ఈ ఘనత సాధించాడు. అప్పటినుంచి మరొకరు ప్రపంచ అథ్లెటిక్స్‌లో ఆ రికార్డు అందుకోలేకపోయారు. ఈసారి ఎలాగైనా మైకెల్ సరసన చేరాలని కలలుగన్న దక్షిణాఫ్రికా యువ సంచలనం వేడ్ వాన్ నీకెర్క్‌కు నిరాశ తప్పలేదు. 400 మీటర్ల పరుగులో స్వర్ణం గెలిచిన అతడికి.. 200 మీటర్ల విభాగంలో టర్కీ అథ్లెట్ రమిల్ గులియెవ్ షాకిచ్చాడు. గురువారం రాత్రి నువ్వానేనా అన్నట్టుగా సాగిన రేసులో అంచనాలకు మించి రాణించిన గులియెవ్.. 20.09 సెకన్లలో లక్ష్యాన్ని చేరి పసిడి సొంతం చేసుకున్నాడు. రజత పతక విజేతను ఫొటో ఫినిష్‌లో తేల్చాల్సి వచ్చింది. వేడ్ వాన్ నీకెర్క్, జెరెమ్ రిచర్డ్స్ (ట్రినిడాడ్ అండ్ టొబాగో) 20.11 సెకన్లలో రేసు ముగించారు. ఫొటో ఫినిష్‌లో నీకెర్క్ ముందొచ్చినట్లు తేలడంతో అతడికి రజతం దక్కింది. రిచర్డ్స్ కాంస్యానికి పరిమితమయ్యాడు. పసిడి నెగ్గిన 27 ఏళ్ల గులియెవ్ అజర్‌బైజాన్‌లో జన్మించాడు. ఐతే 2011లో టర్కీ పౌరసత్వం పొందాడు. నోరోవైరస్ కారణంగా 400 మీటర్ల పరుగు ఫైనల్‌కు దూరమై.. ఐఏఏఎఫ్ ప్రత్యేక అనుమతితో 200 మీటర్ల పరుగులో పోటీపడే అవకాశం దక్కించుకున్న బోట్స్‌వానా అథ్లెట్ ఐజాక్ మక్వాలాకు నిరాశ తప్పలేదు. 20.44 సెకన్లలో రేసు పూర్తి చేసిన అతడు ఏడో స్థానంలో నిలిచాడు.

గుజరాత్ టాప్ లేపింది


- అగ్రస్థానానికి కొత్త జట్టు
- యూ ముంబాపై గెలుపు



ప్రొ కబడ్డీలో ఈనాడు
తెలుగు టైటాన్స్ × యూపీ యోధ రాత్రి 8 నుంచి
గుజరాత్ × దిల్లీ దబాంగ్ రాత్రి 9 నుంచి
ప్రసారం స్టార్ స్పోర్ట్స్-2లో; వేదిక అహ్మదాబాద్

అహ్మదాబాద్: ప్రొకబడ్డీలో కొత్త జట్టు గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ అదరగొడుతోంది. శుక్రవారం సొంతగడ్డపై జరిగిన పోరులో గుజరాత్ 39-21తో యూ ముంబాను చిత్తుగా ఓడించింది. డిఫెన్స్‌లో ఘోరంగా విఫలమైన ముంబా ఏ దశలోనూ గుజరాత్‌కు పోటీ ఇవ్వలేకపోయింది. ప్రథమార్ధం ముగిసేసరికి 20-6తో తిరుగులేని ఆధిక్యం సంపాదించిన జెయింట్స్ ద్వితీయార్ధంలోనూ జోరు కొనసాగించింది. ఐతే ముంబా కూడా గట్టిగానే పోరాడింది కానీ అప్పటికే తిరుగులేని ఆధిక్యం సాధించిన గుజరాత్‌ను ఓడించడం ఆ జట్టు తరం కాలేదు. రెయిడ్‌ల ద్వారా 19 పాయింట్లు గెలిచిన గుజరాత్ 13 ట్యాకిల్ పాయింట్లు సొంతం చేసుకుంది. ఆ జట్టులో రోహిత్ గులియా (9), సచిన్ (8) పోటీపడి పాయింట్లు సాధించారు. ముంబా డిఫెన్స్‌లో 5 పాయింట్లకే పరిమితమైంది. ఈ విజయంతో గుజరాత్ (13) జోన్-ఎలో పుణెరి పల్టాన్ (11)ను వెనక్కినెట్టి అగ్రస్థానానికి చేరుకుంది.

నాదల్‌కు షాక్



షపోవలోవ్

మాంట్రియల్: ఏటీపీ మాంట్రియల్ మాస్టర్స్ టెన్నిస్ టోర్నీ (కెనడా)లో స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్‌కు షాక్ తగిలింది. ఈ టోర్నీ గెలిచి తిరిగి టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకుందామనుకున్న అతని ఆశలకు గండి పడింది. వైల్డ్‌కార్డు ద్వారా టోర్నీలో అడుగుపెట్టిన కెనడా యువ ఆటగాడు డెనిస్ షపోవలోవ్ శుక్రవారం ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో 3-6, 6-4, 7-6 (7/4)తేడాతో నాదల్‌ను ఓడించాడు. మరో స్టార్ ఆటగాడు రోజర్ ఫెదరర్ క్వార్టర్ ఫైనల్ చేరాడు. ప్రిక్వార్టర్స్‌లో 4-6, 6-4, 6-2తో డేవిడ్ ఫెర్రర్ (స్పెయిన్)పై విజయం సాధించాడు.

ఆనంద్ డ్రా

సెయింట్ లూయిస్ (యుఎస్ఏ): సింక్వఫీల్డ్ చెస్ టోర్నీలో ఎనిమిది రౌండ్లు ముగిసేసరికి ఆనంద్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. శుక్రవారం మాగ్జిమ్ వాచేయిర్ (ఫ్రాన్స్)తో మ్యాచ్‌ను డ్రా చేసుకున్న ఆనంద్.. 5 పాయింట్లతో అరోనియన్, మాగ్జిమ్‌లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉన్నాడు. తెల్లపావులతో ఆడిన ఆనంద్ 30 ఎత్తుల తర్వాత డ్రాకు అంగీకరించాడు. మరో రౌండు మిగిలి ఉన్న ఈ టోర్నీలో ఆనంద్ వెస్లీసో (అమెరికా)తో తలపడనున్నాడు.

దేవుడు కంటే ఎక్కువ కాదు

బీసీసీఐపై శ్రీశాంత్ ఆగ్రహం



దిల్లీ: తనపై విధించిన జీవిత కాల నిషేధాన్ని ఎత్తివేస్తూ కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేయాలని బీసీసీఐ నిర్ణయించడంపై టీమ్ ఇండియా మాజీ పేసర్ శ్రీశాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. "నేను అడుక్కోవడం లేదు. నా జీవనోపాధి నాకు తిరిగివ్వమని అడుగుతున్నా. మీరు(బీసీసీఐ) దేవుడు కంటే ఎక్కువ కాదు. మళ్లీ కచ్చితంగా ఆడతాను. ఒకసారి కాదు.. చాలా సార్లు నిరపరాధినని నిరూపించుకున్నా.. అయినా బీసీసీఐ నీచంగా వ్యవహరిస్తోంది. ఎందుకో అర్థం కావడం లేదు" అని ట్విట్టర్లో శ్రీశాంత్ అన్నాడు. ఎట్టి పరిస్థితుల్లో శ్రీశాంత్‌ను మళ్లీ క్రికెట్ మైదానంలోకి అడుగుపెట్టనీయకూడదని బీసీసీఐ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేయాలని నిర్ణయించింది.

బీసీ విదేశీ విద్యకు 15 నుంచి దరఖాస్తులు

ఈనాడు, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి కింద 2017-18 విద్యాసంవత్సరానికి అర్హులైన బీసీ విద్యార్థులు ఈ నెల 15 నుంచి సెప్టెంబరు 30 వరకు ఈ-పాస్ వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. అభ్యర్థుల వయసు 30 ఏళ్లలోపు, కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు, పట్టణాల్లో రూ.1.5 లక్ష ఉండాలని పేర్కొన్నారు. డిగ్రీలో 60 శాతానికి పైగా మార్కులు సాధించి ఉండాలని సూచించారు.

కాలుష్య నియంత్రణ మండలి పోస్టులకు 23న ధ్రువపత్రాల పరిశీలన

తెలంగాణ కాలుష్యనియంత్రణ మండలిలో స్టెనో-టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్-టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్, టెక్నీషియన్ పోస్టులకు ప్రాథమిక జాబితాను సిద్ధం చేశామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణి ప్రసాద్ తెలిపారు. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఈ నెల 23న ఉదయం 10 గంటల నుంచి మొదలవుతుందని పేర్కొన్నారు. వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపారు.

కిసాన్ మోర్చా జాతీయ కార్యనిర్వాహక సభ్యురాలిగా విజయలక్ష్మి

ఈనాడు, దిల్లీ: భాజపా కిసాన్‌మోర్చా కార్యనిర్వాహక సభ్యురాలిగా ఆకుల విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈమేరకు భాజపా కిసాన్‌మోర్చా జాతీయాధ్యక్షుడు వీరేంద్రసింగ్ మస్త్ శుక్రవారమిక్కడ ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం విజయలక్ష్మిని కేంద్రమంత్రి దత్తాత్రేయ శాలువాతో సత్కరించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ విద్యార్థి దశనుంచి ఏబీవీపీలో పనిచేశానన్నారు. భాజపాలో మహిళలకు గుర్తింపు ఉంటుందని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, వీరేంద్రసింగ్ మస్త్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

పసివారిని చిదిమేసిన కాఠిన్యం

గోరఖ్‌పూర్ (యూపీ): మానవత్వం మంటగలిసిన క్షణమది.. సర్కారీ దవాఖానాల దయనీయ స్థితికి అద్దంపట్టే ఉదంతమిది.. బకాయిలు చెల్లించలేదంటూ గుత్తేదారు సంస్థ ఓ ప్రభుత్వ ఆసుపత్రిలోని అత్యవసర విభాగానికి ఆక్సిజన్ సరఫరా నిలిపివేయడంతో 30 మంది చిన్నారులు పిట్టల్లా రాలిపోయారు. ఇంకా పూర్తిగా కళ్లు తెరవని పసికందులు ప్రాణవాయువు అందక ఉక్కిరిబిక్కిరై కన్నుమూసిన దారుణ సంఘటన ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్‌లోని 'బాబా రాఘవ్ దాస్' (బీఆర్‌డీ) ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రిలో జరిగింది. మెదడు వాపు వ్యాధికి చికిత్స నిమిత్తం ఈ ఆసుపత్రిలో చేరిన సుమారు 30 మంది చిన్నారులు ప్రాణవాయువు సరఫరా ఆగిపోయి ఊపిరందక మరణించినట్లు వార్తలు వెల్లువెత్తగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అలాంటిదేమీ లేదంటూ ఖండిస్తోంది. జిల్లా కలెక్టరు కొంత జరిగిందంటూనే మరికొంత నిజం కాదని దాటవేస్తుండగా ప్రతిపక్షాలు మాత్రం ఈ దురంతాన్ని తీవ్రంగా దుయ్యబడుతున్నాయి.



గోరఖ్‌పూర్‌లోని బీఆర్డీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు ★ కన్నీరుమున్నీరవుతున్న చిన్నారుల బంధువులు

ఇంతకీ ఏం జరిగింది?

ఆక్సిజన్‌ను సరఫరా చేసే సంస్థకు ఈ ఆసుపత్రి రూ.70 లక్షల మేరకు బకాయి పడింది. వాటిని చెల్లించకపోవడంతో, ఆ సంస్థ కాస్తా ఆక్సిజన్ సరఫరాను నిలిపివేసిందని ఒక వార్తాసంస్థ వెల్లడించింది. గత 48 గంటల్లో ఆక్సిజన్ సరఫరా లేకపోవడంతో దాదాపు 30 మంది చిన్నారులు మరణించినట్లు వార్తలు వెల్లువెత్తాయి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ లోక్‌సభ నియోజకవర్గమైన గోరఖ్‌పూర్‌లోనే ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం ఒక విశేషమైతే.. ఆయన గోరఖ్‌పూర్ సందర్శన సందర్భంగా రెండురోజుల క్రితం ఇదే ఆసుపత్రిలో ఆయన తనిఖీలు నిర్వహించి వెళ్లడం మరో విశేషం.

నవజాత శిశువుల వార్డులో 17 మంది, మెదడువాపు వ్యాధిగ్రస్తుల వార్డులో 5గురు, సాధారణ వార్డులో 8 మంది మృతి చెందినట్లు జిల్లా కలెక్టరు రాజీవ్ రౌటెలా ప్రకటించారు. ఇంతటి దారుణానికి దారితీసిన పరిస్థితులపై విచారణకు ఒక సంఘాన్ని నియమించినట్లు తెలిపారు. నివేదిక రాగానే బాధ్యులపై కఠిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత మొదట ఏడుగురు మరణించినట్లు సమాచారం అందిందని, మిగిలిన 23 మంది చనిపోయిన వార్తలు మాత్రం 9వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచి అందాయన్నారు. ఆక్సిజన్ సరఫరాలో కొరత మూలంగానే ఈ దారుణం జరిగిందా అన్న ప్రశ్నకు ఆయన నేరుగా సమాధానం ఇవ్వలేదు. ప్రాణవాయువు అందక పోవడం వల్ల ఎవరూ మరణించలేదని వైద్యులు చెప్పారన్నారు. పొరుగునే ఉన్న సంత్ కబీర్‌నగర్ జిల్లా నుంచి ఆక్సిజన్ సరఫరా జరిగేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని కూడా ఆయనే చెప్పడం విశేషం. ప్రస్తుతం ఆసుపత్రిలో 50 ఆక్సిజన్ సిలిండర్లు ఉన్నాయని, త్వరలో మరికొన్నింటిని తెప్పిస్తున్నామని తెలిపారు. బకాయిలు చెల్లించలేదని ఆక్సిజన్ సరఫరా చేస్తున్న సంస్థ దానిని నిలిపివేసిన మాట నిజమేనా అన్న ప్రశ్నకు ఆయన కొంతమొత్తం చెల్లింపులు జరిగాయని మాత్రం జవాబిచ్చారు.

21 మందే చనిపోయారు: కేంద్రహోంశాఖ

ఆక్సిజన్ సరఫరాలో కొరత వల్ల 21 మంది చిన్నారులు మరణించినట్లు గోరఖ్‌పూర్ ఎస్పీని ఉటంకిస్తూ కేంద్రహోం మంత్రిత్వశాఖ శుక్రవారం ప్రకటించింది. ఈ సంఘటనకు కారణమేమిటనే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారంటూ కేంద్రహోంశాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు.

ఆక్సిజన్ కొరత వట్టిమాట: రాష్ట్ర ప్రభుత్వం

ఈ ఆసుపత్రిలో ఆక్సిజన్ కొరత ఉందన్న వార్తలను యూపీ ప్రభుత్వం కొట్టిపారేసింది. చిన్నారులు మరణించడం అత్యంత దురదృష్టకరమైన విషయమంటూ యూపీ ఆరోగ్యశాఖ మంత్రి సిదార్థ్‌నాథ్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. విచారణకు ఆదేశించామనీ, బాధ్యులను వదిలే ప్రసక్తే లేదని చెప్పారు. వాస్తవానికి వివిధరకాల ఆరోగ్యకారణాలతో ఆగస్టు 7వ తేదీ నుంచీ ఇప్పటిదాకా ఇక్కడ 60 మంది చిన్నారులు మృతి చెందారని ఆయన చెప్పారు.. తాజాగా 30 మంది మరణించిన వార్తలను ప్రస్తావిస్తూ.. ఇందుకు ఆక్సిజన్ కొరత కారణం కానేకాదని స్పష్టం చేశారు.

నిరసనల వెల్లువ

ఈ దయనీయ ఘటనపై ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. యూపీ ఆరోగ్యశాఖ మంత్రి తక్షణం రాజీనామా చేయాలంటూ సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లు గట్టిగా డిమాండ్ చేశాయి.

వితంతువుల సమస్యలపై కార్యాచరణ ప్రణాళిక

- రూపకల్పనకు ఆరుగురు సభ్యుల సంఘం ఏర్పాటుకు సుప్రీం ఆదేశాలు

దిల్లీ: నిస్సహాయ వితంతువులను ఆదుకునే విషయమై ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి సుప్రీంకోర్టు ఆరుగురు సభ్యుల సంఘాన్ని ఏర్పాటు చేసింది. బృందావన్, ఇతర ఆశ్రమాల్లో వితంతువుల దుస్థితిపై అందిన నివేదికలను అధ్యయనం చేసి నవంబరు 30వ తేదీలోగా ప్రణాళిక తయారు చేసి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ మేరకు శుక్రవారం జస్టిస్ మదన్ బి లోకుర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. వితంతువులు గౌరవంతో జీవించేలా చూడడానికే న్యాయస్థానం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుంటోందని చెప్పారు. వితంతువుల పునర్వివాహం గురించి ఏ నివేదికలోనూ ప్రస్తావన లేనప్పటికీ, దీనినీ పరిశీలించాలని ఆదేశించింది. రాజ్యాంగంలోని 21వ అధికరణం ప్రసాదించే జీవించే హక్కు వీరికి వర్తించదన్నట్టుగా సమాజం వితంతువుల పట్ల వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించింది. ఈ కమిటీలో జాగోరి స్వచ్ఛంద సంస్థకు చెందిన సునీత ధర్, మీరా ఖన్నా (గిల్డ్ ఫర్ సర్వీస్), అభా సింఘాల్ (సామాజిక కార్యకర్త, న్యాయవాది), అపరాజిత సింగ్ (న్యాయవాది), హెల్ప్ ఏజ్ ఇండియా, సులభ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఉంటారు. ఈ కమిటీ పనిచేయడానికి వీలుగా కార్యాలయం, తగిన గౌరవ భృతి కల్పించాలని జాతీయ మహిళా కమిషన్‌ను ఆదేశించింది.

మద్రాసు హైకోర్టు స్టే ఉత్తర్వుపై జోక్యానికి నిరాకరణ: వధశాలల కోసం జరిపే పశువుల వ్యాపారంపై ఆంక్షలు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల అమలుపై మద్రాసు హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులపై జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. పశువులపై క్రూరత్వం నిషేధం ఉత్తర్వులకు సంబంధించి గతంలో ఇచ్చిన ఆదేశాల్లో మార్పులు చేసి స్టేను ఎత్తివేసింది. అయితే ఈ ఉత్తర్వుల అమలులో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే కోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది.

సమాచారం ఇచ్చి సహకరించండి

- రాష్ట్రానికి కేంద్ర జలవనరుల నిపుణుల సంఘం లేఖ

ఈనాడు, హైదరాబాద్: నిర్ణీత వ్యవధిలోగా తాము నివేదిక సమర్పించేందుకు వీలుగా... అవసరమైన సమాచారమిచ్చి సహకరించాలని కేంద్ర జలవనరులశాఖ ఎ.కె.బజాజ్ నేతృత్వంలో నియమించిన నిపుణుల సంఘం తెలంగాణను కోరింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషికి బజాజ్ లేఖ రాశారు. గతంలో కమిటీ సభ్య కార్యదర్శి లేఖలు రాయగా, ఇప్పుడు స్వయంగా కమిటీ ఛైర్మనే రాయడం విశేషం. 'ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించి, మీరు చెప్పిన విషయాలు విన్నాం. అయితే, మేమడిగిన ప్రాథమిక సమాచారం రాకపోవడంతో పని ఆగిపోయింది' అని లేఖలో పేర్కొన్నారు. 'కమిటీ విధివిధానాలపై కేంద్ర జలవనరులశాఖ ఏప్రిల్ 4న వివరణ ఇచ్చింది. మీ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని వర్కింగ్ టేబుల్‌ను తయారుచేస్తాం' అని అందులో వివరించారు. పట్టిసీమ ద్వారా మళ్లించే నీటిలో గోదావరి జలవివాద ట్రైబ్యునల్ చెప్పిన ప్రకారం తమకు వాటా ఇవ్వాలని తెలంగాణ కోరగా... నీటి వాటాలను తేల్చే అధికారం కమిటీకి లేదని, పట్టిసీమ ద్వారా గోదావరి నుంచి కృష్ణాకు మళ్లించే నీటి అంశం కమిటీ పరిధిలోకి రాదని ఆంధ్రప్రదేశ్ పేర్కొంది. దీనిపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో కమిటీ జలవనరులశాఖను వివరణ కోరగా, రెండు రాష్ట్రాల పరస్పర అంగీకారంతో ఈ సమస్యను పరిష్కరించాలని సూచించింది. ఆ ప్రకారం కమిటీ బాధ్యతల్లో 'గోదావరి నుంచి కృష్ణాలోకి మళ్లించే నీటిలో వాటా అంశం' ఉన్నట్లేనని తేలింది. ఈ నేపథ్యంలో, వర్కింగ్ మాన్యువల్ తయారీ సమయంలో ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుంటామని కమిటీ ఛైర్మన్ లేఖలో పేర్కొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, కమిటీ గడువును ఏప్రిల్ 4 నుంచి 6 నెలలపాటు పొడిగించారు. ఆలోగా నివేదిక సమర్పించేందుకు వీలుగా తాము అడిగిన ప్రాజెక్టుల సమాచారం ఇవ్వాలనీ.. జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతలకు సంబంధించి వెంటనే సమాచారం పంపాలని బజాజ్ కోరారు.

సెన్సార్ బోర్డు ఛైర్మన్ పహ్లాజ్ తొలగింపు

నూతన కమిటీ నియామకం

దిల్లీ: సెన్సార్ బోర్డు ఛైర్మన్ పదవి నుంచి పహ్లాజ్ నిహలానిని కేంద్ర ప్రభుత్వం తొలగించింది. ఆయన స్థానంలో కవి, గేయ రచయిత, పద్మశ్రీ ప్రసూన్ జోషి(45)ని నియమించింది. వచ్చే మూడేళ్ల కాలానికి ప్రసూన్ ఈ పదవిలో కొనసాగుతారని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2015 జనవరిలో పహ్లాజ్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయన్ను పలు వివాదాలు చుట్టుముట్టాయి. బోర్డు నూతన సభ్యులుగా విద్యాబాలన్, గౌతమి తడిమళ్ల, నరేంద్ర కోహ్లి, నరేష్‌చంద్ర లాల్, నీల్‌హర్బర్ట్ నాంగ్రి, వివేక్‌అగ్నిహోత్రి, వామన్ కేంద్రే, టీఎస్ నాగాభరణ, రమేష్ పతంగే, వాణి త్రిపాఠి తీకూ, జీవితారాజశేఖర్, మిహిర్ భూటాను నియమించారు.

పార్లమెంటు ఉభయసభల నిరవధిక వాయిదా

దిల్లీ: పార్లమెంటు ఉభయ సభలూ శుక్రవారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ 14 శాసనాలను ఆమోదించింది. 71 గంటల వ్యవధిపాటు లోక్‌సభ సమావేశాలు జరిగినట్లు స్పీకర్ సుమిత్రా మహాజన్ చెప్పారు. ఈ సమావేశాల్లోనే అత్యంత కీలకమైన రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతుల ఎన్నికలు జరిగిన విషయం గమనార్హం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ రాయబారిగా మిల్కా సింగ్

దిల్లీ: నాటితరం పరుగుల వీరుడు మిల్కా సింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) సౌహార్ద రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి డబ్ల్యుహెచ్ఓ ఆయనను ఎంపిక చేసింది. ఈ ప్రాంతంలో 2025 నాటికి శారీరక శ్రమ 90 శాతం ఉండేలా, అంటువ్యాధులు కాని రోగాల విస్తృతిని 25 శాతానికి పరిమితం చేసేలా కార్యాచరణ రూపొందించామని, ఈ లక్ష్యసాధనకు మిల్కా సింగ్ కృషి చేస్తారని ఆ సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ పూనం ఖేత్రపాల్ సింగ్ శుక్రవారం తెలిపారు.

దిల్లీకి చేరిన అన్నాడీఎంకే 'విలీన' అంశం

చెన్నై: తమిళనాడులో ఉత్కంఠ రేపుతున్న అన్నాడీఎంకే వర్గాల విలీనం అంశం తాజాగా దిల్లీకి చేరింది. గురువారం రాష్ట్రంలో అనేక పరిణామాలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. విలీనాన్ని తుది అంకానికి చేర్చేందుకు సీఎం పళనిస్వామి, మాజీ సీఎం పన్నీర్‌సెల్వం శుక్రవారం నుంచి దిల్లీలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఉపరాష్ట్రపతిగా ఎం.వెంకయ్యనాయుడు ప్రమాణస్వీకారోత్సవంలో వారిద్దరూ పాల్గొన్నారు. అనంతరం ప్రధానితో పళనిస్వామి భేటీ అయ్యారు. తర్వాత విలేకర్లతోమాట్లాడుతూ... జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) నుంచి రాష్ట్రానికి మినహాయింపు అంశంపై ప్రధానితో చర్చించానని చెప్పారు. లోక్‌సభ ఉపసభాపతి తంబిదురై తదితరులు కూడా సీఎం వెంటఉన్నారు. మాజీ సీఎం పన్నీర్‌సెల్వం కూడా దిల్లీలోనే ఉన్నారు. ప్రధానిని కలిసేందుకు ఆయన కూడా ఏర్పాట్లు చేసుకున్నారు.

కాకతీయ జౌళి పార్కుకు 16న శంకుస్థాపన

- ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం
- భారీఎత్తున ఏర్పాట్లు: కడియం

ఈనాడు, హైదరాబాద్: వరంగల్ గ్రామీణ జిల్లా సంగెం మండలం చింతలపల్లి, గీసుకొండ మండలం శాయంపేటల మధ్య ఏర్పాటు చేయనున్న కాకతీయ అంతర్జాతీయ జౌళి పార్కుకు ఈ నెల 16న శంకుస్థాపన చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. ప్రపంచంలో తొలిసారిగా సమస్త వస్త్రాలు ఒకేచోట తయారయ్యేలా రూపొందనున్న ఈ పార్కును రూ. 1150 కోట్లతో నిర్మించనున్నారు. పార్కు శంకుస్థాపన కోసం భారీఎత్తున ఏర్పాట్లు చేయనున్నట్లు ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. 1200 ఎకరాల్లో రూ. 20 వేల కోట్ల మేరకు పెట్టుబడులను సమీకరించి, 1.13 లక్షల మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో దీనిని తెలంగాణ ప్రభుత్వం చేపడుతోంది. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి.. సూరత్, భివాండి తదితర ప్రాంతాలను పర్యటించి సీఎంకు నివేదిక ఇవ్వగా, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ వివిధ దేశాల్లో, రాష్ట్రాల్లో అధ్యయనం చేసి దీనికి తుది రూపు తెచ్చారు. పార్కుకు భూసేకరణ పూర్తయింది. చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం చేపట్టారు. పార్కు నుంచి నర్సంపేట రోడ్డు వరకు 4 వరుసల రహదారిని నిర్మించనున్నారు. దీంతో పాటు చింతలపల్లి రైల్వే స్టేషన్‌ను భారీగా విస్తరించనున్నారు. వరంగల్-హైదరాబాద్‌ల మధ్య నడుస్తున్న పుష్‌పుల్ రైలును ఇక్కడి వరకు పొడగించనున్నారు. పార్కులో అత్యుత్తమ మౌలిక వసతులను కల్పిస్తారు. ప్రాజెక్టు సమగ్ర ప్రణాళిక పూర్తయింది. కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు లభించాయి. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ పార్కు శంకుస్థాపనకు అనుమతించారు. మంత్రి కేటీఆర్ పార్కు శంకుస్థాపనకు కేంద్ర చేనేత జౌళి శాఖల మంత్రి స్మృతిఇరానీని ఆహ్వానించారు.

తొలిరోజే ఒప్పందాలు: శంకుస్థాపనరోజున పార్కులో పరిశ్రమల స్థాపనకు ప్రసిద్ధ కంపెనీలతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకోనున్నారు. ఇప్పటికే 10 సంస్థలు ఒప్పందాలకు ఆమోదం తెలిపాయి. జౌళి పార్కు ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా చరిత్ర మారుతుందని కడియంతెలిపారు. వలస వెళ్లిన చేనేత కార్మికులు తిరిగి స్వరాష్ట్రానికి వస్తారని, స్థానికంగా ఉండే ప్రతిఒక్కరికీ పని దొరుకుతుందన్నారు. శంకుస్థాపన చేసిన వెంటనే పనులు ప్రారంభించి నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. పెట్టుబడులకు పెద్దఎత్తున సంస్థలు ముందుకొస్తున్నాయని పేర్కొన్నారు. జౌళిపార్కుకు భూములు ఇచ్చిన రైతులు, చొరవ చూపిన అధికారులు, ప్రజాప్రతినిధులకు కడియం కృతజ్ఞతలు తెలిపారు. శంకుస్థాపన ఏర్పాట్లపై ఆయన శనివారం వరంగల్ గ్రామీణ జిల్లా ప్రజాప్రతినిధులతో, ఆప్కో మాజీ ఛైర్మన్ మండల శ్రీరాములు చేనేత నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నారు.

రైలు పట్టాలపై కలెక్టర్ మృతదేహం

- బిహార్ ఐఏఎస్ అధికారి ఆత్మహత్య!

ఘజియాబాద్, పట్నా: బిహార్‌లో పనిచేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి ముఖేశ్ పాండే దిల్లీకి సమీపంలోని ఘజియాబాద్(యూపీ)లో రైలు పట్టాలపై శవమై కనిపించారు. ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఘటనస్థలి వద్ద ఆత్మహత్య నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో తాను భవనం పైనుంచి దూకి చనిపోతున్నట్లు పేర్కొనగా.. మృతదేహం మాత్రం గురువారం పొద్దుపోయిన తర్వాత రైలుపట్టాలపై కనుగొన్నారు. 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన పాండే బిహార్‌లోని బక్సర్ జిల్లా మేజిస్ట్రేట్ (కలెక్టర్)గా పనిచేస్తున్నారు. సొంత రాష్ట్రం అసోం. ఆత్మహత్య నోట్‌లో - "నేను పశ్చిమ దిల్లీలోని జానక్‌పురి ప్రాంతంలో.. భవనం పదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నాను. జీవితం పట్ల అసంతృప్తితో ఉన్న నాకు మానవ మనుగడ మీద నమ్మకం పోయింది. నన్ను మన్నించండి." అని ఉంది. పూర్తి వివరాలతో ఉన్న మరో ఆత్మహత్య నోట్ దిల్లీలోని ఓ ఐదు నక్షత్రాల హోటల్ గదిలోని బ్యాగ్‌లో ఉంచినట్లు అందులో పేర్కొన్నారు. హోటల్ గది తదితర వివరాలు తమకు లభించిన నోట్‌లో ఉన్నట్లు సీనియర్ ఎస్పీ హెచ్.ఎన్. సింగ్ తెలిపారు. అయితే పాండే ఏ సమయానికి, ఎలా ఆత్మహత్యకు పాల్పడిందీ ఇప్పటికిప్పుడు చెప్పలేమని పేర్కొన్నారు.



ముఖేశ్ పాండే (పాతచిత్రం)

అంతకు ముందు పాండే ఆత్మహత్య చేసుకోవడానికి పశ్చిమ దిల్లీలోని ఓ మాల్‌కు వెళ్లారంటూ.. ఆయన మిత్రుల నుంచి తమకు సమాచారం అందినట్లు దిల్లీ సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. వెంటనే తాము ఆ మాల్‌కు వెళ్లగా.. పాండే కనిపించలేదని పేర్కొన్నారు. సీసీ టీవీ ఫుటేజిని పరిశీలించగా ఆయన మాల్ నుంచి సమీపంలోని మెట్రో స్టేషన్‌కు వెళుతున్నట్లు కనుగొన్నామన్నారు. అనంతరం ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందని వివరించారు.

రామజన్మభూమి-బాబ్రీ వివాదంపై డిసెంబరు 5 నుంచి తుది విచారణ షురూ!

దిల్లీ: రామజన్మభూమి- బాబ్రీ మసీదు స్థల వివాదంపై డిసెంబరు అయిదో తేదీ నుంచీ తుది విచారణను చేపట్టాలని సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం నిర్ణయించింది. ఇక, ఈ కేసులో ఎట్టిపరిస్థితుల్లోనూ వాయిదాలు ఇచ్చే ప్రసక్తే లేదని కూడా స్పష్టం చేసింది. అలహాబాద్ హైకోర్టు 2010లో వెలువరించిన తీర్పునకు వ్యతిరేకంగా దాఖలైన అప్పీళ్ల విచారణను ఎప్పటి నుంచీ మొదలు పెట్టాలనే అంశంపై సుప్రీంకోర్టు దాఆదాపు గంటన్నరకు పైగా తీవ్రంగా చర్చలు జరిపింది. డిసెంబరు అయిదోతేదీ నుంచీ విచారణను ప్రారంభించాలనే అంశంపై అనంతరం ఏకాభిప్రాయానికి వచ్చింది. అయోధ్యలోని 'వివాదాస్పద స్థలమైన' 2.77 ఎకరాలను సున్నీ వక్ఫ్‌బోర్డు, 'నిర్మోహి అఖారా', 'రామ్ లల్లా' ల మధ్య మూడుగా విభజించాలని అలహాబాద్ హైకోర్టు 2010లో తీర్పు చెప్పిన విషయం ఈ సందర్భంగా గమనార్హం.

హిందు మహాసముద్రంపై ఉమ్మడిగా గస్తీ

- భారత్‌కు చైనా ప్రతిపాదన

బీజింగ్: హిందు మహాసముద్రంలో భద్రతను పరిరక్షించడానికి తాము భారత్‌తో చేయి కలపడానికి సిద్ధమని చైనా నౌకాదళం తెలిపింది. వ్యూహాత్మకంగా తనకు అత్యంత కీలకమైన ఈ ప్రదేశంలో చైనా కదలికలు పెరుగుతుండటంపై ఇప్పటికే భారత్ ఆందోళన వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో 'డ్రాగన్' నుంచి ఇలాంటి ప్రకటన వెలువడటం గమనార్హం. చైనాలో పర్యటిస్తున్న భారత విలేఖరులను తొలిసారిగా ఝూంగ్‌జియాంగ్ నగరంలోని వ్యూహాత్మక దక్షిణ సముద్ర ఫ్లీట్ (ఎస్ఎస్ఎఫ్) స్థావరానికి అక్కడి అధికారులు తీసుకెళ్లారు. అక్కడ చైనా నౌకా దళానికి చెందిన యులిన్ అనే యుద్ధనౌకను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎఫ్ ఉన్నతాధికారి కెప్టెన్ లియాంగ్ తియాన్‌జున్ మాట్లాడుతూ.. హిందు మహాసముద్రం అనేది అంతర్జాతీయ సమాజానికి ఒక ఉమ్మడి ప్రదేశమని పేర్కొన్నారు. ఒకవైపు దక్షిణ చైనా సముద్రం మొత్తం తమదేనని పేచీ పెడుతున్న చైనా హిందు మహాసముద్రం మాత్రం ఉమ్మడి ప్రదేశం అనడం ఆ దేశం వితండవాదానికి నిదర్శనం.

అత్యంత అప్రమత్తత స్థితిలో భారత సైన్యం

దిల్లీ: డోక్లామ్ వద్ద చైనాతో సైనిక ప్రతిష్టంభన నేపథ్యంలో భారత సైన్యం.. సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌లో అదనపు బలగాలను దించుతోంది. పరిస్థితిని ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తున్నట్లు అధికారవర్గాలు వివరించాయి. చైనా వైపు నుంచి యుద్ధోన్మాద వ్యాఖ్యలు పెరిగిన నేపథ్యంలో దీన్ని చేపట్టాయి.

చైనాలోని ఝూజియాంగ్ నగర తీరప్రాంతంలో లంగరు వేసిన ఆ దేశ నావికాదళానికి చెందిన యులిన్ యుద్ధనౌక



నవంబరు 8 నుంచి అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలు

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలు హైదరాబాద్‌లో నవంబరు 8 నుంచి 14 వరకు జరుగుతాయని పౌర సంబంధాల శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. శిల్పకళావేదికలో ప్రారంభ, ముగింపు కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సినిమా అభివృద్ధి సంస్థ, బాలల సినిమా సొసైటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో 12 థియేటర్లను ముందుగానే బుక్ చేయాలని, ఈ మేరకు అధికారులు తనిఖీలు చేయాలని సూచించారు. తెలంగాణలోని 31 జిల్లాల్లో బాలల చలన చిత్ర పండగను నిర్వహించాలని, జవహర్ బాల భవన్‌లో సదస్సులు జరుగుతాయని తెలిపారు.

సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్

సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్‌ను 3 నుంచి 5 శాతానికి ప్రభుత్వం పెంచింది. దివ్యాంగుల హక్కుల చట్టం మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.జగదీశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ విభాగాలు, స్థానిక సంస్థలు అమలు చేసే పథకాల్లో రిజర్వేషన్‌ను కచ్చితంగా పాటించాలని అందులో సూచించారు. విభాగాధిపతులు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

13, 14న న్యాయవాదులకు శిక్షణ తరగతులు

కాప్రా, న్యూస్‌టుడే: న్యాయవాదులకు ఈనెల 13, 14న వృత్తిపరమైన శిక్షణను ఇవ్వనున్నట్లు అఖిల భారత న్యాయవాదుల సంఘం(ఐలూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లి సత్యనారాయణ తెలిపారు. కొత్త చట్టాలు, కేసులు, ఫైలింగ్ తదితర అంశాల్లో ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఎల్‌బీనగర్‌లో ఉదయం 10 గంటలకు శిక్షణ తరగతులను ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

త్వరలో మహిళకు '181' భరోసా

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో బాలికలు, మహిళలకు భరోసానిచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక సమీకృత హెల్ప్‌లైన్ ప్రారంభించనుంది. పోలీసు కంట్రోల్ నెంబరుతో అనుసంధానం చేస్తూ ప్రత్యేకంగా '181'ను ప్రవేశపెట్టనుంది. ఈమేరకు అవసరమైన సాంకేతిక ఏర్పాట్లు పూర్తిచేసింది. త్వరలోనే అధికారికంగా సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. తెలంగాణవ్యాప్తంగా ఎక్కడైనా మహిళలు, బాలికలు బహిరంగ ప్రదేశాలు, ప్రైవేటు స్థలాల్లో వేధింపులకు గురైనా, గృహహింస బాధితులైనా, అత్యవసర సాయం అవసరమైనా, అపహరణ జరిగినట్లు అనుమానం వచ్చినా ఈ నెంబరుకు ఫోన్ చేయవచ్చు. తమకు జరిగిన అన్యాయాన్ని ఫోన్‌ద్వారా తెలియజేసేందుకు వీలు కలుగుతుంది. ఈ వివరాలు సంబంధిత కాల్ సెంటర్ నిర్వాహకులు డాక్యుమెంట్ చేస్తూ ప్రభుత్వ సిబ్బందికి సమాచారాన్ని అందిస్తారు. ప్రభుత్వ పథకాల్లోనూ ఏమైనా సందేహాలున్నా, లబ్ధి విషయంలో అన్యాయం జరిగినా, ఆరోగ్య సమస్యలకు సమాధానాన్ని ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చు. 24గంటలూ ఈ సహాయ కేంద్రం అందుబాటులో ఉండేలా అవసరమైన సాంకేతిక ఏర్పాట్లను హైదరాబాద్ కొంపల్లిలో పూర్తయ్యాయి.

నిరుద్యోగులకు పంద్రాగస్టు కానుక..!

అటవీ, వైద్య శాఖల్లో 2,300 ఉద్యోగాల భర్తీకి ప్రకటనలు జారీఅయ్యే అవకాశం

పంద్రాగస్టు కానుకగా ప్రభుత్వం అటవీశాఖ, వైద్యశాఖలో దాదాపు 2,300 ఉద్యోగాల భర్తీకి ప్రకటన జారీ చేయనుంది. ఒక్క అటవీ శాఖలోనే దాదాపు 2 వేల వరకు పోస్టులు ఉండే అవకాశమున్నట్లు సమాచారం. వైద్యారోగ్య శాఖలో వైద్యుల ఉద్యోగాల భర్తీకి ప్రకటన జారీ చేసేందుకు టీఎస్‌పీఎస్సీ సిద్ధమైంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ (వైద్య) పోస్టులకు ఇంకా అర్హతలు ఖరారు కాలేదు. ఎంసీఐ నిబంధనల మేరకు అర్హతలు ఖరారుపై స్పష్టత వచ్చిన తరువాత ఆ పోస్టులకు ప్రత్యేకంగా ప్రకటన జారీకానున్నట్లు తెలిసింది. అటవీశాఖలో భర్తీచేసే ఉద్యోగాలకు సంబంధించిన అర్హతలను ఆ శాఖ వేగంగా ఖరారు చేసింది. టీఎస్‌పీఎస్సీ అభ్యంతరాలు, సూచనలు ఎప్పటికప్పుడు పరిగణనలోకి తీసుకుని యుద్ధప్రాతిపదికన ఆ ప్రక్రియ పూర్తిచేసిన నేపథ్యంలో ఆశాఖలో ఉద్యోగాల భర్తీప్రకటన జారీ చేసేందుకు మార్గం సుగమమయింది.

త్వరలో గ్రామ రైతు సంఘాల ఏర్పాటు: పోచారం

త్వరలో గ్రామ రైతు సంఘాలు ఏర్పాటు చేస్తామని, గ్రామంలోని రైతులంతా ఈ సంఘంలో సభ్యులవుతారని వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. విత్తనోత్పత్తిపై శుక్రవారం ఆయన సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి, విత్తనాభివృద్ధి ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఎండీ ఎం. జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు. దేశానికి తెలంగాణను విత్తన భాండాగారంగా మార్చాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులకు పిలుపునిచ్చారు. వ్యవసాయశాఖకు త్వరలో ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెడతామన్నారు.

'తప్పనిసరి' వైద్యుల వేతనాలు పెంపు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో తప్పనిసరి సేవల్లో భాగంగా సీనియర్ రెసిడెంట్లుగా పనిచేస్తున్న పీజీ వైద్యులకు తెలంగాణ ప్రభుత్వం వేతనాలను పెంచింది. ప్రస్తుత వేతనాలకు నెలకు 15 శాతం చొప్పున పెంచుతూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. పెరిగిన వేతనాలు ఈ ఏడాది జనవరి 1 నుంచి వర్తిస్తాయని వెల్లడించింది. ప్రస్తుతం పీజీ డిప్లొమా వైద్యులకు నెలకు రూ.38 వేలు, పీజీ డిగ్రీ వైద్యులకు నెలకు రూ.40 వేలు, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు నెలకు రూ.45 వేలు చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. వేతనాల పెంపుపై తెలంగాణ జూడాల ప్రతినిధి శ్రీనివాస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారి లైసెన్సులు రద్దు

మోతాదుకు మించి మద్యం తాగి పోలీసులకు పట్టుబడ్డ 8మంది డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేస్తూ ఎర్రమంజిల్ ప్రత్యేక కోర్టులు శుక్రవారం తీర్పు ప్రకటించాయి. నాలుగురోజుల వ్యవధిలో పట్టుబడిన 71మందిని పోలీసులు న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టారు. ఇందులో సి.అమరేశం డ్రైవింగ్ లైసెన్సును ఏడాది పాటు రద్దుచేశారు. పి.సురేందర్‌రావు, ఎస్.సునీల్, మనీష్‌కుమార్ అగర్వాల్, టి.వివేక్‌సింగ్, ఎ.చంద్రహాస్, షేక్ మెహరాజ్, మహ్మద్ దస్తగిరిల డ్రైవింగ్ లైసెన్సులను ఆర్నెల్లపాటు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. లైసెన్సు రద్దుతో పాటు ఇద్దరు వ్యక్తులకు 20రోజులు జైలు శిక్ష అనుభవించాలని, మిగిలిన 69 మంది రెండు రోజుల నుంచి 12రోజుల శిక్ష అనుభవించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏళ్లు గడుస్తున్నాయి కానీ... మార్గదర్శకాల జాడేలేదు!

పాఠశాలల్లో విపత్తు నిర్వహణ చర్యలపై కేంద్రాన్ని మందలించిన సుప్రీంకోర్టు

దిల్లీ: అనుకోని విపత్తులు సంభవించిన తరుణంలో పాఠశాలల్లో ఆ పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొనడానికి తగిన మార్గదర్శకాలను రూపొందించనందుకు సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్రప్రభుత్వాన్ని మందలించింది. ఏళ్లు గడిచిపోతున్నాయి.... అయినా సరే మార్గదర్శకాలన్నవే లేవు అంటూ చీఫ్ జస్టిస్.జేఎస్.ఖేహర్, జస్టిస్.డీవీ.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ఇంతకీ అసలు మార్గదర్శకాల రూపకల్పన చేస్తారా! లేదా! అనే విషయాన్ని కేంద్రం స్పష్టంగా తేల్చి చెప్పాలంది. గత ఏడాది తాము ఈ దిశగా ఉత్తర్వులు జారీచేసినప్పటికీ... కేంద్రం పట్టించుకోలేదంటూ సుప్రీంకోర్టు విమర్శించింది.

భాజపాను ఎలా ఎదుర్కొందాం?

సోనియా అధ్యక్షతన ఉమ్మడి వ్యూహంపై 16 విపక్షాల చర్చ

దిల్లీ: భాజపాను, ప్రధాని మోదీని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహంపై 16 విపక్షాలు చర్చించాయి. కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీ అధ్యక్షతన శుక్రవారమిక్కడ ఈ పార్టీల నాయకుల సమావేశం జరిగింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొన్నారు. అహ్మద్ పటేల్, ఏకే ఆంటోనీ(కాంగ్రెస్), అజిత్ సింగ్(ఆర్ఎల్‌డీ), తిరుచ్చి శివ(డీఎంకే), డి.రాజా(సీపీఐ), సతీశ్ మిశ్ర(బీఎస్పీ), నరేశ్ అగర్వాల్(ఎస్పీ), ఒమర్ అబ్దుల్లా(ఎన్‌సీ), సంజీవ్ కుమార్(జేఎంఎం), భాజపాతో తమ పార్టీ జట్టు కట్టడాన్ని వ్యతిరేకిస్తున్న జేడీయూ అసమ్మతి ఎంపీ అలీ అన్వర్ అన్సారీ, పలు ఇతర పార్టీల నేతలు హాజరయ్యారు. జ్వరం ఉండటంతో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ రాలేకపోయారు. ఎన్సీపీ నేతలెవరూ హాజరు కాలేదు.

జేడీ(యు) నుంచి అలీ అన్వర్ అన్సారీ సస్పెన్షన్: సోనియా నేతృత్వంలో జరిగిన ప్రతిపక్షాల సమావేశానికి హాజరైనందుకు జేడీ(యు) రాజ్యసభ సభ్యుడు అలీ అన్వర్ అన్సారీని ఆ పార్టీ సస్పెండ్ చేసింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. L/RN/KAR/48/2015-17 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00